


ఈనాడు



హైదరాబాద్ 28-1-2018 ఆదివారం సిటీ సంపుటి 44 . సంచిక 168
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-00 పేజీలు 16+32+32 www.eenadu.net
Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



తెలంగాణ సత్తా విశ్వవ్యాప్తం

- మన విధానాలకు విశేష ఆదరణ
- ప్రఖ్యాత సంస్థల అధినేతల ప్రశంసలు
- పరిశ్రమల స్థాపన, విస్తరణకు ఆసక్తి
- ఈ పర్యటన గొప్ప ఉత్సాహాన్నిచ్చింది
- దావోస్ నుంచి 'ఈనాడు'తో మంత్రి కేటీఆర్ ప్రత్యేక ముఖాముఖి

ఈనాడు, హైదరాబాద్: ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సుతో మనమేంటో ప్రపంచానికి తెలిసిందని తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. పెట్టుబడుల సాధనతోపాటు ఉద్యోగాలు, ఉపాధి కల్పన లక్ష్యంగా సాగిన దావోస్ పర్యటన విజయవంతమైందని.. తనకు గొప్ప సంతృప్తినిచ్చిందన్నారు. ఈ ఉత్సాహంతో మరింత ముందుకు సాగుతామని చెప్పారు. దావోస్ పర్యటన ముగింపు సందర్భంగా కేటీఆర్ శనివారం అక్కడి నుంచి 'ఈనాడు'కు ఫోన్‌లో ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. విదేశీ పర్యటన.. ఫలితాలు.. అనంతర కార్యాచరణ తదితర అంశాలను సమగ్రంగా వివరించారు.

- పూర్తి వివరాలు 2లో

వైమానిక రంగంలో లాకిడ్ మార్టిన్, ఏయిర్ ఆసియా, ఔషధ రంగంలో నొవార్టిస్, ఫైజర్.. ఐటీలో హెచ్‌పీ, సేల్స్ ఫోర్స్ వంటి సంస్థలు, హిటాచి, మిత్సుబిషి, ఎరిక్‌సన్ వంటి వాహన, ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల సంస్థలు ఇక్కడ పెట్టుబడులకు ఆసక్తి చూపాయి.



స్టోక్స్ రూ.12.5 కోట్లు

ఐపీఎల్ వేలంలో అత్యధిక ధర

- రాజస్థాన్ సొంతమైన ఇంగ్లాండ్ క్రికెటర్
- రాహుల్, మనీష్‌లకు రూ. 11 కోట్లు

కోల్‌కతా నైట్‌రైడర్స్ కెప్టెన్ గౌతం గంభీర్ దిల్లీకి మారిపోయాడు.. చెన్నై సూపర్ కింగ్స్ స్టార్ రవిచంద్రన్ అశ్విన్ పంజాబ్ సొంతమయ్యాడు.. భారీ ఇన్నింగ్స్‌కు పెట్టింది పేరైన క్రిస్ గేల్ ఆశ్చర్యకరంగా అసలు అమ్ముడుపోనేలేదు.. అనూహ్యాలకు కేరాఫ్ అడ్రస్ అయిన ఐపీఎల్ వేలంలో ఓ అనామక క్రికెటర్ రూ. 7 కోట్లకు పైగా పలికాడు.. ఐతే అత్యధిక ధర మాత్రం ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్‌దే. నిరుడు రూ. 14.5 కోట్ల రికార్డు ధరతో పూణె సొంతమైన స్టోక్స్‌ను ఈసారి రాజస్థాన్ రాయల్స్ రూ. 12.5 కోట్లకు దక్కించుకుంది. భారత యువ ఆటగాళ్లు కేఎల్ రాహుల్‌ను పంజాబ్, మనీష్ పాండేను హైదరాబాద్ రూ. 11 కోట్లు పోసి కొనుక్కొన్నాయి. శనివారం బెంగళూరులో జరిగిన వేలంలో ఇలాంటి ఆశ్చర్యాలు ఇంకెన్నో..!


- పూర్తి వివరాలు ఛాంపియన్‌లో



సంపూర్ణ ఆరోగ్యానికి మత్స్య మంత్రం

వారానికి రెండుమూడు సార్లయినా ఒమేగా-3 ఆమ్లాలున్న చేపలు తినడం ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరం. కొన్ని రకాల చేపలు క్యాన్సర్‌ను నియంత్రించడంలో, కణితుల పెరుగుదలను తగ్గించడంలో బాగా ఉపయోగపడతాయని పరిశోధకులు చెబుతున్నారు.

2లో



ఉద్యోగం తర్వాత... సద్యోగం

ఉద్యోగ జీవిత సమయంలో విద్య, నైపుణ్యాలు పెంచుకుంటే మలి సంధ్యలో జీవన నాణ్యత మెరుగ్గా ఉంటుందట. పదవీ విరమణ తర్వాత కూడా వారు ఖాళీగా ఉండరట. కుటుంబానికి సాయపడుతూనో, స్వచ్ఛంద సేవలు చేస్తూనో ఉల్లాసంగా ఉంటారని ఓ సర్వే చెబుతోంది.

2లో

పునర్జన్మ ప్రదాయిని



ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రి ఘనత

- క్యాన్సర్ బాధితులకు విశేష సేవలు
- అవయవాల పునఃసృష్టి చేసి పూర్వరూపం
- రూ.6-10 లక్షల ఖర్చయ్యే చికిత్సలన్నీ ఉచితం

-5లో

బాసర అక్రమాలపై విచారణ

- ముగ్గురు సభ్యులతో విచారణ కమిటీ ఏర్పాటు
- నివేదికకు వారం గడువు
- 'ఈనాడు-ఈటీవీ' కథనంతో స్పందించిన ప్రభుత్వం

ఈనాడు, హైదరాబాద్: జ్ఞాన సరస్వతి కొలువుదీరిన నిర్మల్ జిల్లా బాసరలో వెలుగులోకి వచ్చిన ఆలయ భూములు, ఇతర అక్రమాలపై ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. శనివారం 'ఈనాడు-ఈటీవీ'లో 'అక్రమాల చెరలో చదువులమ్మ' శీర్షికన ప్రచురితమైన కథనంతో అమ్మవారి ఆలయ భూముల్లో కబ్జాలు, కౌలు పక్కదారి పట్టడం, భూముల పర్యవేక్షణను గాలి కొదిలేసిన దుస్థితిపై ప్రభుత్వం దృష్టి సారించింది. బాసర సరస్వతి అమ్మవారి ప్రభను (మిగతా 2లో)

కాబూల్‌లో అంబులెన్స్ బాంబు పేలుడు

95 మంది బలి..
158 మందికి గాయాలు

- వారం వ్యవధిలో రెండోసారి పేట్రేగిపోయిన ఉగ్రవాదులు

16లో

చదువులమ్మ కంట చెమ్మ

- బాసరలో ఓ పూజారి ప్రైవేట్ పూజలు
- పాతుకుపోయిన అధికారి మాటే వేదం
- పట్టించుకునేవారు లేక బాసరలో ఇష్టారాజ్యం

-13లో





తెలంగాణ సత్తా విశ్వవ్యాప్తం

- మరిన్ని పెట్టుబడులు, ఉపాధి కల్పనకు అవకాశం
- పర్యటన విజయవంతం..
- దావోస్ నుంచి 'ఈనాడు'తో మంత్రి కేటీఆర్ ప్రత్యేక ముఖాముఖి

ఈనాడు - హైదరాబాద్

ఆర్థిక వేదిక సదస్సుతో పెట్టుబడులకు మరింత ఊతమిచ్చిందని తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. దావోస్ నుంచి 'ఈనాడు'కు ఆయన ఫోన్‌లో ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూ విశేషాలు..

దావోస్ పర్యటన ఎలా సాగింది?

ప్రపంచంలోని ప్రముఖ పారిశ్రామిక, ఐటీ సంస్థల ఛైర్మన్లు, సీఈవోలు, ఇతర ప్రముఖులను ఒకేసారి కలిసే అవకాశం దక్కింది. అయిదు రోజుల్లోనే సాధ్యమైనంత ఎక్కువ మందితో భేటీ అయ్యాం. నొవార్టిస్, ఫైజర్, సీఏ, లాకిడ్ మార్టిన్, హ్యుందాయ్, హిటాచి, మిత్సుబిషి, పెప్సికో, సుజుకి, ఎయిర్ ఆసియా వంటి ప్రసిద్ధి చెందిన సంస్థల అధినేతలను, సీఈవోలకు తెలంగాణ పారిశ్రామిక విధానం, ఇక్కడ వనరులు, మౌలిక వసతులు, ప్రత్యేకతలను కళ్లకు కట్టినట్లు తెలియజేశాం. మన విధానాలకు విశేష ఆదరణ కనిపించింది. చర్చల్లో వక్తగా మాట్లాడడంతోపాటు తెలంగాణకు ఉపయుక్తమైన అంశాలకు సంబంధించిన ఇతర సెషన్లలోనూ పాల్గొన్నా.

ఈ సందర్భంగా మీ అనుభవాలు..?

దావోస్ పర్యటన సంతృప్తిని మిగిల్చింది. ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్, పలు దేశాల ఉపాధ్యక్షులు, ఉప ప్రధానులు, కేంద్ర మంత్రులు పాల్గొన్న సదస్సులో నేను పాల్గొనడం మంచి అవకాశం. కేంద్ర మంత్రులు, పరిశ్రమల శాఖ అధికారులతో వివిధ విషయాలను చర్చించా.

తెలంగాణను ప్రపంచానికి పరిచయం చేస్తామన్న లక్ష్యాన్ని ఏ మేరకు సాధించారు?



ప్రపంచ ఆర్థిక సదస్సు ముగింపు సందర్భంగా శనివారం దావోస్‌లో రాష్ట్రప్రతినిధి బృందం, నిర్వాహకులతో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్

మనది వినూత్నమైన పారిశ్రామిక విధానం. ఎన్నో వసతులు, భారీగా మానవ వనరులున్నాయి. ఈ అంశాలకు విస్తృత ప్రచారం లభించడం ద్వారా ఫలాలు పొందే వీలుంటుంది. ఇదే భావనతో దావోస్‌కు పయనమయ్యా. వినూత్నమైన తెలంగాణ పారిశ్రామిక విధానాన్ని ప్రపంచానికి తెలియజేశా. పక్షం రోజుల్లో అనుమతులు, రంగాలవారీగా రాయితీలు, ప్రోత్సాహకాల గురించి వివరించా. ప్రభుత్వపరంగా చూపుతున్న చొరవతోపాటు భూముల లభ్యత, నీటి వసతులు.. విమానాశ్రయం, రహదారులు ఇతర సానుకూలతలను వివరించాం. రాజధాని హైదరాబాద్ ప్రపంచంలోని అన్ని అనుకూలతలు గల నగరాల్లో ఒకటిగా సదస్సులో ఆవిష్కరించగలిగాం. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోనూ వివిధ రంగాల్లో అవకాశాల గురించి వెల్లడించాం.

ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు నిర్వహణ తీరు ఎలా ఉంది?

సదస్సు నిర్వహణ తీరు చాలా బాగుంది. పెట్టుబడులు, వ్యాపారాభివృద్ధి మాత్రమే కాకుండా సమ్మిళిత అభివృద్ధి, వాటి ఫలాలను ప్రజల వద్దకు తీసుకెళ్లడంలో ఎదురవుతున్న సవాళ్లు.. పరిష్కారాల గురించి విస్తృత స్థాయి చర్చ జరిగింది. సాంకేతిక పరంగా ఆటోమేషన్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, డిజిటల్ మాధ్యమాలు, పరిశోధనలు, అంకుర పరిశ్రమల ప్రాధాన్యతల గురించి చర్చలు జరిగాయి. ఈ సదస్సులో ఎన్నో విషయాలు తెలుసుకున్నాం. ఇందులో భాగస్వామ్య అనుభవం తెలంగాణలో మున్ముందు జరిగే ప్రపంచ స్థాయి సదస్సుల నిర్వహణకు ఉపయుక్తంగా ఉంటుంది.

ఈ పర్యటన వల్ల తెలంగాణకు ప్రయోజనాలు?

తెలంగాణలో వైమానిక, జౌళి, ఐటీ, ఔషధ తదితర రంగాల్లో పెట్టుబడుల సమీకరణతోపాటు విస్తరణకు అవకాశం ఉంది. కొత్త సంస్థలు పరిశ్రమలను స్థాపించనున్నాయి. ఇప్పటికే హైదరాబాద్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న పలు సంస్థలు విస్తరణ కోసం ముందుకొచ్చాయి. వైమానిక రంగంలో లాకిడ్ మార్టిన్, ఏయిర్ ఆసియా, ఔషధ రంగంలో నొవార్టిస్, ఫైజర్.. ఐటీలో హెచ్‌పీ, సేల్స్ ఫోర్స్ వంటి సంస్థలు, హిటాచి, మిత్సుబిషి, ఎరిక్ సన్ వంటి వాహన, ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల సంస్థలు పెట్టుబడులకు ఆసక్తి చూపాయి. ఇండోరమా వెంచర్స్ అనే జౌళి ఉత్పత్తుల సంస్థ వరంగల్‌లోని కాకతీయ మెగా జౌళి పార్కులో పరిశ్రమ ఏర్పాటుకు సమ్మతి తెలిపింది. టెక్ మహీంద్రా సంస్థ వరంగల్‌లో 500 మందితో ఐటీ కేంద్రాన్ని నెలకొల్పేందుకు అంగీకరించింది. దీని ద్వారా విశేష ఫలితాలు వస్తాయని విశ్వసిస్తున్నాం

మీ తదుపరి కార్యాచరణ ఏమిటి?

ఆసక్తి వ్యక్తీకరించిన సంస్థలతో మా శాఖ ద్వారా నిరంతర సంప్రదింపులను కొనసాగిస్తాం. పెట్టుబడుల సాధన మా లక్ష్యం. అభివృద్ధితో పాటు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించడానికి కృషి చేస్తాం.

వైమానిక, ఐటీ, జౌళి, ఆహార శుద్ధి లాంటి రంగాల్లో మరింత ప్రగతికి కృషి చేస్తాం. మౌలిక వసతులతో పాటు రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు శిక్షణ ఇప్పించి మానవ వనరులు కల్పిస్తామని కొత్త సంస్థలకు హామీ ఇచ్చాం. ఇందు కోసం టాస్క్ లాంటి సంస్థలను ఉపయోగిస్తాం.

తెలంగాణ విధానాలపై పారిశ్రామికవేత్తల నుంచి ఎలాంటి స్పందన వచ్చింది?

ప్రసిద్ధ సంస్థలతోపాటు పలు దేశాల పారిశ్రామికవేత్తలను మన విధానం ఎంతగానో ఆకర్షించింది. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో చేపట్టిన విధానాల ద్వారా తెలంగాణ ప్రతిష్ఠ ఇనుమడిస్తోంది. నిరంతర విద్యుత్, సత్వర అనుమతులపై పరిశ్రమల ప్రతినిధులు ఆనందం వ్యక్తంచేశారు. గతంలో అనుమతుల్లో జాప్యం, విద్యుత్ కోత సమస్యలుండేవని.. వాటిని సత్వరమే అధిగమించి, గొప్ప ప్రగతిని సాధించారంటూ అభినందించారు. సీఏ వంటి పెద్ద సంస్థల ప్రతినిధులు హైదరాబాద్ గురించి గొప్పగా పొగిడారు. వారి ప్రశంసలు కొత్త ఉత్సాహాన్నిచ్చాయి.

కృత్రిమ మేధతో సత్ఫలితాలు

- దావోస్‌లో చర్చాగోష్ఠిలో మంత్రి కేటీఆర్

ఈనాడు, హైదరాబాద్: కృత్రిమ మేధ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్)తో చక్కటి ఫలితాలు వస్తాయని తెలంగాణ ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో శనివారం 'స్థానిక సమస్యలకు ప్రపంచ స్థాయి పరిజ్ఞాన వినియోగం' అంశంపై జరిగిన చివరి చర్చాగోష్ఠిలో ఆయన పాల్గొని ప్రసంగించారు. వ్యక్తులు, సమాజం, ప్రభుత్వాల సమస్యలను పరిష్కరించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ఇందులో సార్వత్రిక గణాంకాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం 2016లో సార్వత్రిక గణాంక విధానాన్ని అమల్లోకి తెచ్చిందని.. ఇప్పటి వరకు ప్రజాసంబంధమైన 50 పత్రాలను విడుదల చేసిందని చెప్పారు. ఈ గణాంకాల ద్వారా సామాజిక సమస్యలను గుర్తించి, పరిష్కరించొచ్చని చెప్పారు.

నిర్వాహకులకు కేటీఆర్ కృతజ్ఞతలు: ఈ నెల 23 నుంచి జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు శనివారం రాత్రి ముగిసింది. మంత్రి కేటీఆర్ ఈ సందర్భంగా నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. అయిదురోజుల పాటు జరిగిన సదస్సులో కేటీఆర్ ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రభుత్వ బృందం పాల్గొంది. కేటీఆర్ మూడు గోష్ఠుల్లో పాల్గొన్నారు. పలువురు పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యారు. పలు ఒప్పందాలు కుదుర్చుకున్నారు.



జుమ్మాకు ఇమామ్‌గా తొలి మహిళ!

మలప్పురం(కేరళ): ముస్లిం సోదరులు ప్రతి శుక్రవారం జరిపే సామూహిక ప్రార్థన- 'జుమ్మా'కు ఓ మహిళ ఇమామ్‌గా వ్యవహరించడం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశమైంది. కేరళలోని ఖురాన్ సున్నత్ సంఘానికి జమిత(34) ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. ముస్లింలు అధికంగా నివసించే మలప్పురంలోని సంఘం కార్యాలయంలో శుక్రవారం ఆమె ఆధ్వర్యాన జుమ్మా జరిగింది. జుమ్మాకు పురుషులే ఇమామ్‌లుగా వ్యవహరించడం ఆనవాయితీ. పవిత్ర ఖురాన్ ప్రకారం స్త్రీ, పురుషులు సమానులేనని, ఇమామ్‌గా మహిళలు వ్యవహరించరాదని అందులో లేదని జమిత అంటున్నారు. ఒక మహిళ ఆధ్వర్యంలో జుమ్మా జరగడం మన దేశంలో ఇదే మొదటిసారి అని ఆమె తెలిపారు. ప్రతి శుక్రవారం మా సంఘం కేంద్ర కమిటీ కార్యాలయంలో సామూహిక ప్రార్థనలు జరుపుతున్నామన్నారు. ఇకపై జుమ్మాకు తనే ఇమామ్‌గా వ్యవహరించనున్నట్లు చెప్పారు. దీనిపై సామాజిక మాధ్యమాల్లో కొందరు హర్షం వ్యక్తం చేస్తుండగా, మరికొందరు విపరీత వ్యాఖ్యానాలు చేస్తున్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికి మత్స్య మంత్రం

చేపలు తింటే.. క్యాన్సర్ దూరం

వీలైతే రోజూ, లేదంటే వారానికి రెండు, మూడు సార్లు అయినా ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు ఉండే చేపలు తింటే మంచిది. ముఖ్యంగా సముద్రంలో ఎక్కువగా దొరికే సాల్మొన్, సావర్డీన్ రకాల చేపలు క్యాన్సర్‌ను నియంత్రించడంలో, కణితుల పెరుగుదలను తగ్గించడంలో విశేషంగా ఉపయోగపడతాయని తేలింది. 'న్యూట్రిషనల్ బయోకెమిస్ట్రీ' అనే జర్నల్‌లో ఈ మేరకు వ్యాసం ప్రచురితమైంది. అవిసెగింజల నూనెతో పాటు ఇతర నూనెలను ఆహారంలో వాడటం కంటే ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు ఉన్న చేపలు తినడం వల్ల క్యాన్సర్ కణితుల అభివృద్ధిని, పెరుగుదలను ఎనిమిదిరెట్లు సమర్థవంతంగా అడ్డుకుంటాయని వెల్లడైంది. రొమ్ము క్యాన్సర్ ఉన్న ఎలుకలపై జరిపిన పరిశోధనల్లో కణితుల పరిమాణం 60 నుంచి 70 శాతం, వాటి సంఖ్య 30 శాతం వరకు తగ్గడంలో ఒమేగా-3 ఆమ్లాలు విజయవంతంగా పనిచేశాయని రుజువైంది. రోగనిరోధక వ్యవస్థ, కణితులు వృద్ధి చెందడానికి కారణమవుతున్న జన్యువులపై ఈ ఆమ్లాలు పనిచేయడం ద్వారా క్యాన్సర్‌ను నిరోధిస్తున్నట్లు విశ్లేషించారు. చేపలు తినడం ఇష్టంలేనివారు ఈ ఆమ్లాలు గల గుడ్లు, డీహెచ్‌ఏ పాలు తీసుకున్నా ఇవే ఫలితాలు వచ్చాయి.

మేనరికాలతో ముప్పు

- బంధువుల మధ్య పెళ్లిళ్లతో వ్యాధులు
- 4-6 శాతం మందిలో కారక జన్యువులు గుర్తింపు
- వరంగల్ ప్రాంతంలో ఐజేహెచ్‌జేడీ అధ్యయనం
- ఆయా తెగల్లో చైతన్యం కల్పించే ప్రయత్నం

ఈనాడు - హైదరాబాద్

దగ్గరి బంధువులు, మేనరిక వివాహాలతో జన్యుపరమైన వ్యాధుల ముప్పు పొంచి ఉందని ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జెనెటిక్స్ అండ్ హాస్పిటల్ ఫర్ జెనెటిక్ డిసీజెస్(ఐజేహెచ్‌జేడీ) అధ్యయనంలో మరోసారి తేటతెల్లమైంది. తెలంగాణలోని కొన్ని గిరిజన తెగల్లో ఈ ముప్పు ఎక్కువగా కనిపిస్తోందని గుర్తించింది. ఇటీవల వరంగల్ ప్రాంతంలోని కొన్ని తెగల గిరిజన కుటుంబాలపై అధ్యయనం చేయగా జన్యుకారక వ్యాధుల ముప్పు ఉన్నట్లు ప్రాథమికంగా తేలింది. ఒకే గ్రామంలో 70 కుటుంబాల్లో మహిళలు, పురుషులకు పరీక్షలు చేయగా.. 4-5శాతం మందిలో తలసీమియా, సికెల్‌సెల్ అనీమియా కారక జన్యువులున్నట్లు వైద్యులు తెలిపారు. ఆయా తెగల్లోని మహిళలు, పురుషులను పెళ్లికి ముందు పరీక్షలతో పాటు కౌన్సిలింగ్ చేయనున్నట్లు ఐజేహెచ్‌జేడీ ఇన్‌ఛార్జి డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వరి తెలిపారు.

తలసీమియా ఎక్కువ: తాజాగా తలసీమియాకు వ్యాధి ఎక్కువశాతం మేనరికం, దగ్గరి బంధువులను పెళ్లిళ్లు చేసుకోవడం వల్ల వచ్చే ప్రమాదం ఉంది. ఇది పూర్తిగా రక్త సంబంధ వ్యాధి. ఆరోగ్యవంతమైన వ్యక్తిలో 11-16 శాతం వరకు హిమోగ్లోబిన్ ఉంటుంది. అదే తలసీమియా రోగుల్లో శరీరానికి కావాల్సినంత హిమోగ్లోబిన్ ఉత్పత్తి జరగదు. ఫలితంగా బాధితులకు తరచూ రక్తమార్పిడి చేయాలి. రక్తహీనత, నీరసం, బరువు తగ్గడం, కామెర్లు, కాలేయం, ప్లీహం వ్యాకోచిస్తాయి. కొందరిలో తలసీమియా సంబంధిత జన్యువులు రెండు క్రోమోజోముల్లో ఉండటం వల్ల అధిక రక్తహీనతకు(తలసీమియా మేజర్) దారితీస్తుంది.

వ్యాధి జన్యువుల తీవ్రత ఇలా

తల్లిదండ్రులలో ఒకరు సాధారణ జన్యువును, తలసీమియా కారక జన్యువును కలిగి ఉన్నట్లైతే వారికి పుట్టేపిల్లల్లో 50శాతం తలసీమియా మైనర్ వచ్చే ముప్పు ఉంది. ఇక ఇద్దరిలో తలసీమియా కారక జన్యువు ఉంటే... వారికి పుట్టే పిల్లల్లో 25శాతం తలసీమియా మేజర్ వ్యాధి ఉప్పు, 50శాతం తక్కువ తలసీమియా మైనర్ వ్యాధి, 25శాతం మేర ఎలాంటి సమస్య లేకుండా పుడతారు. ఇక తల్లిదండ్రుల్లో ఒకరు తలసీమియా కారక జన్యువు, మరొకరు తలసీమియా వ్యాధిని కలిగి ఉన్నట్లైతే 50శాతం తలసీమియా మేజర్, మరో 50శాతం మేర తలసీమియా మైనర్‌తో పిల్లలు పుట్టే ప్రమాదం పొంచి ఉంది. పెళ్లికి ముందు, సంతానం కోసం వేచిచూసే దంపతులు, వ్యాధి లక్షణాలు కనిపించిన సముదాయాల్లో పరీక్షలు చేయించుకోవడం మంచిదని వైద్యులు తెలిపారు.



ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జెనెటిక్స్ అండ్ హాస్పిటల్ ఫర్ జెనెటిక్ డిసీజెస్

అదే జన్యువు ఒక క్రోమోజోములో రక్తహీనత తక్కువగా ఉంటే(తలసీమియా మైనర్). సాధారణ జీవితాన్ని గడపగలరని వైద్యులు పేర్కొంటున్నారు. దేశవ్యాప్తంగా ఏటా 10వేల మంది పిల్లలు తలసీమియాతో జన్మిస్తున్నట్లు సమాచారం. ఉత్తరాది రాష్ట్రాల్లోని కొన్ని తెగల్లో ఈవ్యాధి తీవ్రత అధికంగా ఉన్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. తెలంగాణలోని కొన్ని గిరిజన తెగల్లో ఈవ్యాధి కారక జన్యువులు కనిపిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. ఆయా తెగల్లో పెళ్లికి ముందు జన్యు పరీక్షలు చేయించుకుంటే వ్యాధి ముప్పును తప్పించుకోవచ్చని డాక్టర్ వెంకటేశ్వరి తెలిపారు. ఆ దిశగా అక్కడ అవగాహన సదస్సులు ఏర్పాటుచేసి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

గ్రహం అనుగ్రహం

28-1-2018 ఆదివారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
శిశిర రుతువు; మాఘ మాసం; శుక్ల పక్షం
ద్వాదశి: రా. 2-46 తదుపరి త్రయోదశి
మృగశిర నక్షత్రం: రా. 11-29 తదుపరి ఆర్ద్ర
అమృత ఘడియలు: మ. 3-15 నుంచి 4-45 వరకు
వర్జ్యం: ఉ.శే. 7-47 వరకు
దుర్ముహూర్తం: సా. 4-18 నుంచి 5-03 వరకు
రాహుకాలం: సా. 4-30 నుంచి 6-00 వరకు
సూర్యోదయం: ఉ.6-38; సూర్యాస్తమయం: సా.5-48

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	4.7	31.4
మెదక్	9.9	33.3
రామగుండం	11.4	30.8
హన్మకొండ	12.5	31.5
హైదరాబాద్	13.8	30.5
నిజామాబాద్	14.0	30.0
కరీంనగర్	15.0	30.0
అనంతపురం	16.6	31.9
మహబూబ్‌నగర్	17.0	32.0
తిరుపతి	17.5	32.0
తాడేపల్లిగూడెం	18.8	29.5
సూర్యాపేట	20.0	34.0
ఖమ్మం	22.0	32.0

విద్య, నిపుణతల ఆధారంగానే మలిసంధ్యలో జీవన నాణ్యత

- వృత్తి నిపుణులు ఉద్యోగ విరమణ తర్వాతా పని చేస్తుంటారు
- చాలామంది రిటైర్మెంట్‌ను మంచి అవకాశంగా భావిస్తున్నారు
- బర్మింగ్‌హాం విశ్వవిద్యాలయం అధ్యయనం

లండన్: ఉద్యోగ జీవిత సమయంలో విద్య, నైపుణ్యాలు పెంచుకునే స్థాయిని బట్టి ఎవరికైనా మలిసంధ్యలో జీవన నాణ్యత ఆధారపడి ఉంటుందని ఒక పరిశోధనలో తేలింది. వివిధ వృత్తి, విద్యార్హతల నుంచి వచ్చిన 50 మంది విశ్రాంత ఉద్యోగుల నుంచి వివరాలు సేకరించిన బర్మింగ్‌హాం విశ్వవిద్యాలయం వాటి ఫలితాలను వెల్లడించింది. వృత్తి, లింగం, వర్గం, విద్యార్హతలు ఆధారంగా ఉద్యోగ విరమణానంతర జీవితం ఉంటోందని తెలిపింది. 'వృత్తి నిపుణులు ఉద్యోగ విరమణ అనంతరం కూడా ఏదో ఒక పనిలో కొనసాగే అవకాశాలు ఎక్కువగా ఉంటున్నాయి. అది ఆర్థిక ప్రయోజనాల కోసం మాత్రం కాదు. మధ్యలో ఉద్యోగాన్ని మానేసేవారు ఆ తర్వాత మళ్లీ ఉపాధి పొందాలంటే... పదవీ విరమణ అవసరం లేని స్వయంఉపాధి వైపు దృష్టి మళ్లించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. పరిపాలన రంగంలో ఉన్నవారు ఉద్యోగ విరమణ తర్వాత కూడా ఖాళీగా మాత్రం ఉండబోరు. కుటుంబానికి సాయపడుతూనో, స్వచ్ఛంద సేవలు అందిస్తూనో వారు బిజీగా ఉంటారు. ఉద్యోగ స్వభావం, కుటుంబ సంరక్షణ చరిత్ర, వనరుల అందుబాటు, సామాజిక సంబంధాలు, శారీరక-మానసిక ఆరోగ్యం వంటివి మలి సంధ్యలో జీవితంపై ప్రభావం చూపిస్తాయి. ఉద్యోగ విరమణను ఓ మంచి అవకాశంగా చాలా మంది పరిగణిస్తున్నారు' అని అధ్యయనం తెలిపింది.

వారిలో మాత్రం ఆర్థిక అభద్రత

వివిధ కారణాల వల్ల ఆలస్యంగా ఉద్యోగ జీవితంలోకి వచ్చినవారు ఉద్యోగ విరమణ తర్వాత పనిపరమైన గుర్తింపును కోల్పోవాల్సి వస్తుందనే ఆందోళనతో ఉంటారనీ, ఆర్థికంగా అభద్రతకు లోనవుతారనీ అధ్యయనకర్తలు వివరించారు. పరిపాలన విధుల్లో ఉండే మహిళలు మాత్రం ఉద్యోగ విరమణ తర్వాత తమ కుటుంబంతో, బంధుమిత్రులతో గడిపే సమయం దొరుకుతుందనే సంబరంలో ఉంటారని తెలిపారు. పెద్దగా నైపుణ్యం అవసరం లేని విధులు నిర్వర్తించే పురుషులు మాత్రం రిటైరయ్యాక ఖాళీగా ఉండాల్సి వస్తుందనే కలవరపాటుకు గురవుతుంటారని చెప్పారు. అనారోగ్యం, కుటుంబ బాధ్యతలు, నేర్చుకోవడంపై తీసుకునే నిర్ణయాలు... ఇవి ఒకరి జీవిత గమనాలను ఏ విధంగానైనా మార్చవచ్చన్నారు.

అరువుపై రైతులకు ట్రాక్టర్లు!

- రాయితీపై రాష్ట్రమంతా పంపిణీ
- తెలంగాణ వ్యవసాయశాఖ ప్రణాళిక
- ఫిబ్రవరి 17 నుంచి పంపకాలు
- ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో శ్రీకారం
- ప్రతి 300 ఎకరాలకు ఒక ట్రాక్టరు
- రూ.565 కోట్లు కావాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు

ఈనాడు - హైదరాబాద్

వ్యవసాయాభివృద్ధి పేరుతో రైతులకు లక్షలాది రూపాయల రాయితీపై ఇచ్చే ట్రాక్టర్ల కోసం నేతలు, ప్రజాప్రతినిధులు బారులు తీరుతున్నారు. రాష్ట్రంలో సగటున ప్రతి 300 ఎకరాలకొక ట్రాక్టర్ ఉండేలా రాయితీపై పంపిణీకి వ్యవసాయశాఖ ప్రణాళిక సిద్ధం చేస్తోంది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి వ్యవసాయ యంత్రాల రాయితీకి రూ.565 కోట్లు ఇవ్వాలని రాష్ట్రప్రభుత్వానికి వ్యవసాయశాఖ ప్రతిపాదనలిచ్చింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఇచ్చిన రూ.333 కోట్లకన్నా 60 శాతం పెంచాలని కోరింది. ఈ యంత్రాల కోటాలో ట్రాక్టర్ల రాయితీకే భారీగా నిధులు కేటాయిస్తున్నారు. వచ్చే రెండు నెలల్లో 5 వేల ట్రాక్టర్లను అరువుపై రైతులకు అమ్మడానికి ప్రైవేటు కంపెనీలను ఒప్పించింది. గతేడాది ఇచ్చిన ట్రాక్టర్ల రాయితీ నిధులివ్వకుండా ప్రభుత్వం జాప్యం చేయడంతో ఈఏడాది ట్రాక్టర్లను రైతులకు అమ్మడానికి కంపెనీలు ముందుకు రాలేదు. నిధులు వీలైనంత త్వరగా ఇస్తామని అరువుపై ఈఏడాదివి కూడా పంపిణీ చేయాలని కంపెనీలను వ్యవసాయశాఖ ఒప్పించింది. వచ్చే ఏప్రిల్ నుంచి కొత్త ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రమంతా ట్రాక్టర్ల పంపిణీ కొత్త ప్రతిపాదనలు తయారుచేయాలని జిల్లా వ్యవసాయాధికారు(డీఏఓ)లకు మౌఖిక ఆదేశాలిచ్చింది.

చాలినన్ని ట్రాక్టర్లు లేవు

రాష్ట్రంలో వ్యవసాయావసరాలకు 1.32 లక్షల ట్రాక్టర్లు ఉన్నాయి. ప్రతి సీజన్‌లో ఒక ట్రాక్టర్‌తో సగటు 200 ఎకరాల వరకే దుక్కులు దున్ని సాగుకు సిద్ధం చేయగలరని వ్యవసాయాధికారులు



రైతుకు రాయితీపై విక్రయించే ట్రాక్టర్

నివేదించారు. ఈలెక్కన 1.62 లక్షల ఎకరాల వ్యవసాయ భూములకు సరిపోయినన్ని ట్రాక్టర్లు దుక్కుల సమయంలో దొరక్క రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి 5 వేల ఎకరాలకొక 'వ్యవసాయ విస్తరణ అధికారి'(ఏఈఓ) ఉన్నారు. వీరి పరిధిలో ప్రస్తుతమున్న ట్రాక్టర్లు ఎన్ని, వాటిలో ఎన్నింటికి కేజ్‌వీల్స్(ఇనుప చక్రాలు) దుక్కులకు, భూముల చదునుకు వాడుతున్నారనే వివరాలు పంపాలని డీఏఓలకు సూచించారు. ప్రతి 200 నుంచి 300 ఎకరాలకొక ట్రాక్టర్ ఉండేలా రైతులను సంఘాలుగా ఏర్పాటుచేసి లేదా వ్యక్తిగతంగానైనా రాయితీపై ఇవ్వాలని నిర్ణయించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 5 వేల ట్రాక్టర్లను రాయితీపై ఇవ్వాల్సి ఉండగా ఒక్కటీ పంపిణీ కాలేదు. వచ్చేనెల 17న తొలుత కొత్త ఖమ్మం జిల్లాకు 580, భద్రాద్రిలో 170 వాహనాలు పంపిణీ చేయనున్నారు. మిగతా జిల్లాల్లో ఒకేరోజు పంపిణీ చేయాలని ఎమ్మెల్యేలు, మంత్రులకు వ్యవసాయశాఖ తెలిపింది.

ఎగబడుతున్న నేతలు

ఒక్కో ట్రాక్టర్‌పై గరిష్ఠంగా రూ.4.50 లక్షల వరకూ రాయితీ ఇస్తున్నందున వీటిని సొంతం చేసుకోవడానికి మంత్రులు, ఎమ్మెల్యేల ద్వారా పైరవీలు, ఒత్తిడి చేస్తూ మండలస్థాయి నేతలు ఎగబడుతున్నారు. దీంతో కలెక్టర్లు, డీఏఓలు తలలు పట్టుకుంటున్నారు. నల్గొండ జిల్లాలో మంత్రి ద్వారా నేతలే కాకుండా ఇతరులు కూడా తమకూ భూములున్నాయని లబ్ధిదారుల జాబితాలో రైతుల కోటాలో పేర్లు రాయించినట్లు సమాచారం.


బాసర అక్రమాలపై విచారణ

(మొదటి పేజీ తరువాయి)

మసకబార్చేందుకు జరుగుతున్న ప్రయత్నాలపై ఇప్పటికే భక్తులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో యాదాద్రి, వేములవాడ, భద్రాచలం తర్వాత అంతటి ప్రాముఖ్యం ఉన్న ఆలయం అభివృద్ధిలో వెనుకబడిపోతుండటాన్ని భక్తులు, స్థానికులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఆలయంలో తిష్టవేసిన కొంతమంది చేస్తున్న రాజకీయంతో ఈ పరిస్థితి నెలకొందని బహిరంగంగానే చెప్పుకుంటుండటం విశేషం.

ప్రతి అంశాన్నీ క్షుణ్ణంగా విచారించండి: బాసర జ్ఞాన సరస్వతి ఆలయ భూములు, ఆలయంలో జరుగుతున్న నిర్లక్ష్యం, కొంతమంది సాగిస్తున్న దందాపై 'ఈనాడు' ప్రచురించిన అంశాల వారీగా విచారణ నిర్వహించాలని దేవాదాయ శాఖ కమిషనర్ ఎన్.శివశంకర్ ఉత్తర్వులు జారీ చేశారు. ముగ్గురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దేవాదాయ, విజిలెన్స్ సంయుక్త కమిషనర్, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్, పర్యవేక్షక ఇంజినీరును కమిటీలో నియమించారు. భూములకు సంబంధించిన అంశంలో కమిటీకి సహకరించేందుకు రెవెన్యూ డివిజనల్ అధికారిని నియమించాలని నిర్మల్ కలెక్టర్‌ను కమిషనర్ కోరారు. వారం రోజుల్లో నివేదికను సమర్పించాలని కమిటీని ఆదేశించారు.

ఇదీ సంగతి!



కోట్లల్లో, లక్షల్లో కాకున్నా వేలల్లోనైనా తనను ఎవరైనా కొంటారేమోనని ప్రాక్టీస్ చేస్తున్నాడు!

మాది మిత్ర ధర్మం

- అందుకే మాట్లాడటం లేదు
- మా వాళ్లను ఆపుతున్నా
- వారు వద్దనుకుంటే నమస్కారం పెట్టి అప్పుడు మాట్లాడతాం
- భాజపా నేతల విమర్శలపై వారి నాయకత్వమే ఆలోచించాలి
- ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యలు

ఈనాడు - అమరావతి

'భాజపా నేతలు కొందరు చేస్తున్న విమర్శలపై నేను స్పందించను. మిత్ర ధర్మానికి కట్టుబడి ఉన్నా. దీనిపై వాళ్ల నాయకత్వమే (లీడర్‌షిప్) ఆలోచించుకోవాలి. మిత్ర ధర్మంవల్లే మా వాళ్లను ఆపుతున్నా. శుక్రవారమూ విమానాశ్రయంలో తాడేపల్లిగూడెంకు చెందిన మా నాయకుడు కనపడితే గట్టిగా మందలించా. మాట్లాడొద్దని చెప్పా. ఒకవేళ వాళ్లు (భాజపా) వద్దనుకుంటే నమస్కారంపెట్టి అప్పుడు మాట్లాడుకుందాం' అని ముఖ్యమంత్రి, తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. దావోస్ పర్యటన విశేషాలను వివరించడానికి శనివారం సచివాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనీ వ్యాఖ్యలు చేశారు. వైకాపా రాజకీయ ప్రయోజనాలే పరమావధిగా కుయుక్తులకు పాల్పడుతోందని, ప్రజలు బాగుపడటం చూసి ఓర్వలేకపోతోందని తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తే భాజపాతో కలిసి పని చేస్తామని జగన్ ప్రకటించడం గురించి ప్రస్తావించగా... 'ఇది మొదటిసారా? ఎప్పటి నుంచో రాయబారాలు సాగడం లేదా? రాష్ట్రపతి ఎన్నికల్లో మద్దతిచ్చినప్పుడు ప్రత్యేక హోదా అడిగారా? ఎంపీలతో రాజీనామా చేయిస్తానని ఎందుకు వాయిదా వేసుకున్నారు? నిమిషానికో మాట మాట్లాడి ప్రజల్ని మోసగించడం, మభ్యపెట్టడమే తప్ప వాళ్లలో చిత్తశుద్ధి ఉందా? ప్రత్యేక హోదా కోసం పోరాడుతున్నామని చెప్పడానికే ఇదంతా. అతడికి కావాల్సింది కేసుల నుంచి గట్టెక్కడమే' అని స్పందించారు.

> 'కేంద్ర ప్రభుత్వాన్ని అడుగుతున్నా. అతడివే (జగన్‌ను ఉద్దేశించి) కాదు.. అక్రమంగా ఎవరు ఆస్తులు సంపాదించినా స్వాధీనం చేసుకుని ప్రజల కోసం ఖర్చుపెట్టాలి. బిహార్, ఒడిశాలో అదే చేశారు. ఈ భయం లేకపోతే కొన్ని రోజులు జైలుకు వెళ్లి వచ్చినా ఫర్వాలేదు.. అస్తులుంటే బాగుపడతామని అనుకుంటున్నారు. అగ్రిగోల్డ్ ఆస్తుల్ని, ఎర్రచందనం అక్రమ రవాణాతో సంపాదించిన వారి ఆస్తుల్ని, అవినీతితో రూ.కోట్లలో కూడబెట్టినవారి ఆస్తుల్ని స్వాధీనం చేసుకోవాలి. అదే వారికి విధించే నిజమైన శిక్ష. సంపాదించిన ఆస్తులన్నీ పోయి జీరోకి వస్తేనే భయముంటుంది'

గవర్నరుపై విమర్శలు చేయను..

గవర్నరు వంటి రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్న వారిపై విమర్శలు చేయబోనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గవర్నరును మార్చాలన్న డిమాండ్లు వస్తున్నాయి కదా? అన్న ప్రశ్నకు...'దానిపై వివాదం అవసరం లేదు. కొన్ని వ్యవస్థల గురించి మాట్లాడకూడదు. కొందరు రాజకీయాల కోసం మాట్లాడతారు. నా పద్ధతి అది కాదు. గౌరవప్రదమైన పదవుల్లో ఉన్న వారిపై విమర్శలు చేయడం, బజారులో మాట్లాడటం మంచిది కాదు' అని బదులిచ్చారు.

తీవ్రమైన చేతి నొప్పితోనే దావోస్ వెళ్లా..

ఒకపక్క రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడానికి ఎంతో శ్రమపడుతూ, మరోపక్క అభివృద్ధికి అడ్డుతగులుతున్న విపక్షాలతోనూ పోరాటం చేయాల్సి వస్తోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అనారోగ్య సమస్యలు వేధిస్తున్నా తాను దావోస్‌కి వెళ్లానని చెప్పారు. 'ఇటీవల నేను ఎక్కువ సమయం మైకు పట్టుకుని మాట్లాడా. సమావేశాల్లో పాల్గొన్నప్పుడు ప్రతి విషయాన్నీ రాస్తూ ఉంటా. గంటలకొద్దీ మైకు పట్టుకుని మాట్లాడటం, పెన్నుతో రాయడంవల్ల నా కుడి చేయి పది రోజుల నుంచి విపరీతంగా నొప్పి పుడుతోంది. పది రోజుల్లో 11 సార్లు ఫిజియోథెరపీ చేసినా నొప్పి తగ్గలేదు. దావోస్‌కి వెళ్లవద్దని కొందరు సూచించినా రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని వెళ్లే తీరాలని నిర్ణయించుకున్నా. తీరా దావోస్ బయల్దేరే రోజు నా పొట్టలో ఇబ్బంది ఏర్పడింది. విమానంలో నిద్ర లేదు. దావోస్ వెళ్లాక రెండు రోజులు ఇబ్బంది పడ్డా. పెరుగన్నం, టాబ్లెట్‌లతోనే గడిపా. దావోస్ నుంచి తిరిగి వచ్చే రోజే ఆరోగ్యం కొంత కుదుటపడింది' అని ముఖ్యమంత్రి వివరించారు.



చెయ్యి నొప్పి బాధిస్తున్నా దావోస్‌లో జరిగిన సమావేశాలకు వెళ్లివచ్చానంటూ విలేకరుల సమావేశంలో చెబుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

'రైతు జన' సేనానిని

- వారికి అండగా నిలిచే వారికే అనుకూలం
- అనంత కరవు తీరేవరకూ మద్దతు
- నేను ఎవరికీ ఏజెంటును కాదు
- పవన్ కల్యాణ్ స్పష్టీకరణ



అనంత రైతన్నల వేదనను పవన్‌కు వివరిస్తున్న కర్షకులు

ఈనాడు, అనంతపురం: 'రైతులకు వెన్నుదన్నుగా నిలిచే వారికి, అనంతపురం జిల్లా రైతుల కన్నీరు తుడిచే వారికే 2019 ఎన్నికల్లో జనసేన మద్దతిస్తుందని, అది జాతీయ పార్టీ అయినా, ప్రాంతీయ పార్టీ అయినా ఇబ్బందేమీ లేదని జనసేన అధినేత పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. 'నేను కుల, మత, ఓటు బ్యాంకు రాజకీయాలు చేయను. ప్రజా రాజకీయం చేస్తా. నేను ప్రజల పక్షం. రైతులు, అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ల పక్షం. నేను నమ్మేది ఈ యువ ఉడుకు రక్తాన్నే... వచ్చే ఎన్నికల్లో ఈ యువత ఏం మార్పు తేబోతోందో బలంగా తెలియజేద్దాం' అని పిలుపునిచ్చారు. 'నేను కొందరి తొత్తునని, ఏజెంటునని కొందరు విమర్శిస్తున్నారు. కొన్ని సమస్యలు పరిష్కారం కావాలంటే కొంత తగ్గాల్సి ఉంటుంది. అవసరమైతే బతిమాలాలి. తప్పనిసరైతేనే రోడ్డెక్కాలి. ప్రతి దానికీ ధర్నాలు, నిరసనలని రోడ్డెక్కితే నష్టపోయేది యువత, విద్యార్థులు, ప్రజలే' అని పేర్కొన్నారు. 'ఛలోరె.. ఛలోరె.. ఛల్' కార్యక్రమంలో భాగంగా అనంతపురం జిల్లాలో పవన్ మూడు రోజుల పర్యటన శనివారం ప్రారంభమైంది. తొలుత గుత్తి రోడ్డులోని జనసేన పార్టీ కార్యాలయానికి ఆయన భూమి పూజ చేశారు. మధ్యాహ్నం ఓ కల్యాణ మండపంలో నిర్వహించిన 'సీమ కరవుకు పరిష్కారాలు' కార్యక్రమంలో రైతులు, నీటి పారుదల, వ్యవసాయ నిపుణుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. 'నేను నమ్ముతున్న దాని కోసం ముందుకు సాగుతా. జనసేనకు ఓటేయాలని అడగను. నేను పని చేసుకుంటూ పోతా. నచ్చితే మీరే బలంగా ఓటేయండి. గెలిచినా, ఓడిపోయినా మీ కోసమే పని చేస్తా' అని పేర్కొన్నారు.

మరో సాంకేతిక విప్లవం

- త్రీడీ ప్రింటింగ్‌తో సుసాధ్యం
- ఆధునిక సాంకేతికతకో వర్సిటీ
- ఇన్నోవేషన్ వ్యాలీగా ఏపీ
- దావోస్ పర్యటన విజయవంతం
- ఎవరినోట విన్నా ఆంధ్రప్రదేశ్ మాటే
- ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి

ఈనాడు, అమరావతి: బ్లాక్‌చెయిన్, ఫిన్‌టెక్, త్రీడీ ప్రింటింగ్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలకు సంబంధించిన కోర్సుల కోసం రాష్ట్రంలో ప్రత్యేక విశ్వవిద్యాలయాన్నిగానీ, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎక్సలెన్సీని గానీ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. త్రీడీ ప్రింటింగ్‌తో మరో సాంకేతిక విప్లవం రాబోతోందని పేర్కొన్నారు. విశాఖలో వెయ్యి నుంచి రెండు వేల ఎకరాల్లో మెడ్‌టెక్ ఇన్నోవేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని, ఆంధ్రప్రదేశ్‌ను ఇన్నోవేషన్ వ్యాలీగా తీర్చిదిద్దుతామని తెలిపారు. తన దావోస్ పర్యటన విశేషాలను ముఖ్యమంత్రి శనివారం సచివాలయంలో విలేకరుల సమావేశంలో వెల్లడించారు. రాష్ట్రానికి పెట్టుబడుల్ని ఆకర్షించేందుకు, పరిశ్రమల్ని రప్పించేందుకే దావోస్ వెళ్లినట్లు చెప్పారు. '1995లో ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రిగా మొదటిసారి ప్రపంచ ఆర్థిక వేదికలో పాల్గొనేందుకు దావోస్ వెళ్లా. అప్పట్లో భారత్ నుంచి ఎవరూ వచ్చేవారు కాదు. ఈసారి డబ్ల్యూఈఎఫ్ మనకు చాలా ప్రత్యేకం. ఈ సంవత్సరం దావోస్‌ను 'ఇండియా దావోస్'గా ప్రకటించారు. ప్లీనరీలో ప్రధాని మోదీ ప్రసంగించారు. ప్రతి రోజూ యోగా సాధన చేయించారు. ప్రపంచం మొత్తం భారత్ ప్రాధాన్యాన్ని గుర్తించింది. మన దేశంవైపు చూస్తోంది' అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

- టెక్నాలజీలో స్విట్జర్లాండ్ ముందంజలో ఉంది. జ్యూరిక్‌తో పరస్పర సహకారానికి సోదర రాష్ట్ర ఒప్పందం చేసుకున్నాం. హిటాచితో మరో ఎంవోయూ చేసుకున్నాం. ప్రపంచంలో ఎక్కడా లేని రియల్‌టైమ్ గవర్నెన్స్ సెంటర్ మన సొంతం. దీన్ని మరింత అభివృద్ధి చేసేందుకు హిటాచి సహకరిస్తుంది. అన్ని ప్రభుత్వ శాఖల్నీ ఆన్‌లైన్‌లో అనుసంధానం చేస్తున్నాం.
- దావోస్‌లో 25 ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించాం.
- మెడ్‌టెక్ ఇన్నోవేషన్ సెంటర్‌తో ఎల్‌వోఐ కుదుర్చుకున్నాం. మొత్తం 150 కంపెనీలు లక్ష్యంగా పెట్టుకున్నాం. 50 కంపెనీలు ముందే వచ్చాయి. విశాఖలో మొదట మెడ్‌టెక్ జోన్‌లో కార్యకలాపాలు ప్రారంభిస్తాయి. తర్వాత ఇన్నోవేషన్ సెంటర్ ఏర్పాటవుతుంది. దానిలో శాస్త్ర నిపుణలకే 45వేల నుంచి 50వేల ఉద్యోగాలొస్తాయి.
- దావోస్‌లో ఆంధ్రప్రదేశ్ పెవిలియన్ బాగా ఆకట్టుకుంది. ఆంధ్రా వంటలు అందరికీ నచ్చాయి. ప్రత్యేక ఆకర్షణ మనమే. ఎవరి నోట విన్నా భారత్, ఆంధ్రప్రదేశ్ మాటే వినిపించింది.
- ఆంధ్రప్రదేశ్‌లో ఇన్నోవేషన్ వ్యాలీ ఏర్పాటు చేస్తాం. సీఐఐ ముందుకొచ్చింది. శ్రీకాకుళం నుంచి కర్నూలు వరకూ ఈ వ్యాలీ ఏర్పాటవుతుంది.
- అలీబాబా చాలా పెద్ద కంపెనీ. వాళ్ల టెక్నికల్ డైరెక్టరుతో సమావేశమయ్యా. వారి డేటా సెంటర్‌ను ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసేందుకు అంగీకరించారు.
- ఎయిర్‌బస్ సీఈవోను కలిశా. ఆంధ్రప్రదేశ్‌కు రావడానికి సానుకూలంగా ఉన్నారు.
- మన దగ్గర నాలుగైదు వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ టౌన్‌షిప్ ఏర్పాటు చేస్తామని ఆనంద్ మహీంద్రా హామీ ఇచ్చారు.
- శాప్ గ్లోబల్ హెడ్‌తో సమావేశమయ్యా. రాష్ట్రంలోని అన్ని వర్సిటీల్లో కోర్సులు ప్రారంభించాలని నిర్ణయించాం.
- యూపీఎల్ సంస్థ వ్యవసాయంలో వినూత్న టెక్నాలజీలు రూపొందించింది. వారం రోజుల్లోనే వాళ్లను రమ్మన్నా. ఆ టెక్నాలజీలతో అద్భుతాలు చేయొచ్చు. ముఖ్యంగా రాయలసీమలో చాలా ఉపయోగపడుతుంది.
- కాకినాడలో రూ.6వేల నుంచి రూ.7వేల కోట్లతో స్మెల్టర్ యూనిట్ ఏర్పాటుకు వేదాంత సంస్థ ముందుకొచ్చింది. భూమి ఇస్తున్నాం. విశాఖలో వారికి 350 ఎకరాల భూమి ఉంది. అక్కడ రెండు భారీ టవర్లు, కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నారు.

కులమతాలకు అతీతంగా సూర్య ఆరాధన

అంతా సూర్య నమస్కారాలు చేయాలి: చంద్రబాబు

ఈనాడు అమరావతి: మానవజాతికి సుఖ సంతోషాల్ని, ఆరోగాన్ని ప్రసాదిస్తున్న సూర్యభగవానుడికి కృతజ్ఞతలు తెలిపేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం ఉదయం సూర్య ఆరాధన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. కుల మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. దేవాలయాలు, మసీదులు, చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేయాలన్నారు. ఉదయం 7 గంటలకు విజయవాడలో మున్సిపల్ స్టేడియంలో జరిగే కార్యక్రమంలో తాను పాల్గొంటానన్నారు. ప్రజలంతా ఉదయమే లేచి, స్నానం చేసి, నిర్మలమైన మనస్సుతో సూర్య నమస్కారాలు చేయాలని సూచించారు. "ప్రకృతితో మమేకమైతే, ఆరాధిస్తే చాలా సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. జీవితం ఆనందంగా మారుతుంది. అందుకే రాష్ట్ర ప్రభుత్వం ఏరువాక, జలసిరికి హారతి, వనం-మనం, వంటి కార్యక్రమాల్ని శ్రద్ధతో నిర్వహిస్తోంది. ఆ కోవలోనే సూర్య ఆరాధన చేపడుతున్నాం. భూమిని ఆరాధించే కార్యక్రమం కూడా చేపడతాం. ఈ కార్యక్రమాలన్నీ ఏటా రాష్ట్ర పండుగలుగా నిర్వహిస్తాం" అని ఆయన శనివారం సచివాలయంలో విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. సూర్య ఆరాధన కోసం ప్రత్యేకంగా రూపొందించిన గీతాన్ని ఆవిష్కరించారు. ఇకపై ఏటా రథసప్తమి రోజునే సూర్యారాధన చేస్తామని, ఆ రోజున వీలుకాకపోతే రథసప్తమి తర్వాత వచ్చే ఆదివారం కార్యక్రమం చేపడతామన్నారు.

అర్హులందరికీ రూ.2 వేలు పింఛను: జగన్

గుర్రంకొండ, ఆర్మేనుపాడు, న్యూస్‌టుడే: వైకాపా అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులైన ప్రతిఒక్కరికీ రూ.2 వేలు పింఛను ఇస్తామని ఏపీలో ప్రతిపక్షనేత వైఎస్ జగన్ హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీకి చెందిన వారికే పింఛన్‌లు ఇచ్చి.. అర్హులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా శనివారం నెల్లూరు జిల్లా ఓజిలి మండలంలో పాదయాత్ర కొనసాగింది. తెదేపా అధికారంలోకి వచ్చి నాలుగేళ్లవుతున్నా నూతన ప్రాజెక్టులు, కంపెనీలను స్థాపించకపోవడంతో నిరుద్యోగ సమస్య మరింత పెరుగుతోందన్నారు. రాజన్న రాజ్యం తిరిగి రావాలంటే వైకాపా అధికారంలోకి రావాలన్నారు.

మైనారిటీ విద్యార్థులకు ఆస్ట్రేలియాలో ఉచితవిద్య

- విక్టోరియన్ సాంకేతిక విద్యాసంస్థ సంసిద్ధత
- హోం మంత్రి నాయినితో భేటీ

ఈనాడు, హైదరాబాద్: ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ కేంద్రంగా నడుస్తున్న విక్టోరియన్ సాంకేతిక విద్యాసంస్థ (వీఐటీ) తెలంగాణ మైనారిటీ విద్యార్థులకు ఉచితంగా విద్య అందించేందుకు ముందుకొచ్చింది. శనివారం సచివాలయంలో హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి సమక్షంలో జరిగిన సమావేశంలో వీఐటీ ప్రతినిధులు అర్జున్ సూరపనేని, నిశిధర్‌రెడ్డిలు ఈ నిర్ణయం తీసుకున్నారు. నాయిని ఇటీవల ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లినప్పుడు వీఐటీని సందర్శించి, రాష్ట్ర విద్యార్థులకు ఏదైనా ప్రయోజనం చేకూర్చాలని సూచించారు. దీనికి అనుగుణంగా వీఐటీ ప్రతినిధులు శనివారం హైదరాబాద్‌కు వచ్చి మంత్రితో భేటీ అయ్యారు. సమావేశంలో జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, అంజుమన్ సంస్థ అధ్యక్షుడు అక్తర్ అలీ, కార్యదర్శి వాహెబ్ తదితరులు పాల్గొన్నారు. మంత్రి సూచన మేరకు మైనారిటీ విద్యార్థులకు తమ సంస్థల్లో ఉచిత విద్యను అందించేందుకు అంగీకరించారు. ప్రస్తుతం తాము మెల్‌బోర్న్, సిడ్నీల్లో విద్యాసంస్థలను నిర్వహిస్తున్నామని, త్వరలో దుబాయ్‌లోనూ శాఖను ఏర్పాటు చేస్తామన్నారు. డిగ్రీ, పీజీల్లో రూ.25 లక్షల వరకు ఖర్చవుతుందని, దానిని తామే భరిస్తామని తెలిపారు. మంత్రి నాయిని మాట్లాడుతూ.. ఆస్ట్రేలియాలో ఉచిత విద్య కోసం అర్హులైన మైనారిటీ విద్యార్థుల పేర్లను ప్రతిపాదించాలని అంజుమన్ ప్రతినిధులకు సూచించారు.



విక్టోరియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రతినిధులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాయిని నర్సింహారెడ్డి

జేఎన్‌టీయూకే ఆచార్యుని లైంగిక వేధింపులు

- 20మంది విద్యార్థినుల పట్ల అసభ్య ప్రవర్తన
- విచారణకు కమిటీ ఏర్పాటు

కాకినాడ, ఈనాడు: కాకినాడ జేఎన్‌టీయూలో ఓ ఆచార్యుడి లైంగిక వేధింపులతో విసిగిపోయిన విద్యార్థినులు ఆయన బారి నుంచి కాపాడాలంటూ రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేశారు. దీనిని తీవ్రంగా పరిగణించిన విశ్వవిద్యాలయం ఉపకులపతి వీఎస్ఎస్ కుమార్ తక్షణం విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని అయిదుగురు సభ్యులతో కమిటీని నియమించారు. ఎంటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్న (సీఅండ్ సీఈ, వీఎల్ఎస్ఐ అండ్ ఈఎస్ కోర్సు)చేస్తున్న విద్యార్థులకు ఈనెల 23, 24, 25 తేదీల్లో ల్యాబ్ పరీక్షలు నిర్వహించారు. ల్యాబులో నిర్వహించాల్సిన వైవాను వ్యక్తిగత క్యాబిన్‌లో నిర్వహించారు. దీనికి ఎగ్జామినర్‌గా వ్యవహరించిన కె.బాబులు అనే ఆచార్యుడు తమ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినట్లు, కావాలని పలుమార్లు శరీరాన్ని తాకినట్లు, వ్యక్తిగత ఫోన్ నంబర్లు కావాలని తీసుకున్నారని విద్యార్థినులు ఫిర్యాదులో పేర్కొన్నారు. 20 మంది విద్యార్థినులకు ఈ అనుభవం ఎదురైనట్లు తెలిపారు. వైవా విషయంలో బాలురను వెంటనే బయటకు పంపిన ఆచార్యుడు విద్యార్థినులను చాలా సేపు తన క్యాబిన్‌లో ఉంచారని..కఠినమైన ప్రశ్నలు అడిగి వాటిపై ఆలోచిస్తున్న సమయంలో అసభ్యకరంగా ప్రవర్తించారని పేర్కొన్నారు. శనివారం ఉపకులపతి కుమార్ అందుబాటులో లేకపోవడంతో రిజిస్ట్రార్ సుబ్బారావును కలిసి విద్యార్థినులు తమ గోడు వినిపించారు. బాధ్యుడైన ఆచార్యుడిని కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ వ్యవహారంపై జేఎన్‌టీయూకే రిజిస్ట్రార్ సుబ్బారావు 'ఈనాడు-ఈటీవీ'తో మాట్లాడుతూ ప్రొఫెసర్ లైంగిక వేధింపులకు పాల్పడ్డారని విద్యార్థినుల నుంచి ఫిర్యాదు అందిందన్నారు. ఉపకులపతి కుమార్ ఆదేశాల మేరకు దీనిపై విచారణకు అయిదుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశామన్నారు.

ఏపీలో టెట్ వాయిదా

ఈనాడు, అమరావతి: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)ను ప్రభుత్వం మరోమారు వచ్చేనెల 21వ తేదీకి వాయిదా వేసింది. మొదట ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 5వ తేదీ నుంచి ప్రారంభం కావాల్సి ఉండగా.. దీన్ని 16రోజులు వాయిదా వేశారు. పరీక్ష సన్నద్ధతకు మరింత సమయం కావాలని అభ్యర్థుల నుంచి వస్తున్న వినతుల మేరకు వాయిదా నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. విద్యార్థుల ప్రయోజనాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని, వారు మరింత చదువుకునేందుకు ఈ నిర్ణయం దోహదం చేస్తుందన్నారు. టెట్‌కు మొత్తం 4,46,833మంది దరఖాస్తు చేశారు. వీరిలో పేపర్-1(ఎస్జీటీ)కి 1,80,749మంది, పేపర్-2(ఎస్ఏ)కి 2,12,794మంది, పేపర్-3(భాషాపండితులు)కు 53,290మంది దరఖాస్తు చేశారు.

ఈనాడు అమ్మకు వందనం

అపరిచితురాలిని ఆత్మీయంగా పలకరించాలంటే తెలుగువారి నోట తొసుకొచ్చే మాట- అమ్మా! అని. జనక మహారాజు తన కూతురికి 'సీత' అని పేరు పెట్టాడు. అయినా ఆమెను 'సీతమ్మా' అని నోరారా పిలిస్తేగాని మనకు తనివి తీరదు. చెల్లెల్ని చెల్లెమ్మా అని, అత్తను అత్తమ్మా అని, ఆఖరికి గోపికలను 'గోపెమ్మలని' అనడం ఈ జాతి సంస్కారం. దేశాన్ని, ఆవును, భూమిని- అమ్మతో పోల్చడం దాని అనుబంధ సుగంధం. అమ్మ అనే రెండక్షరాల విలువ అమూల్యం. ఈ విషయం పోతనకు బాగా తెలుసు. 'అమ్మలగన్న యమ్మ ముగురమ్మల మూలపుటమ్మ చాల పెద్దమ్మ' అంటూ నిండుగా తాను పిలవడమే కాదు, 'నమ్మితి నా మనంబున' పద్యంలో యశోదమ్మ నోరారా అమ్మా అని అయిదుమార్లు పలికించాడు. బాలకృష్ణుడి గురించి పిర్యాదు చేద్దామని కోపంతో వచ్చిన గోపకాంతల నోట సైతం 'ఓయమ్మ! నీ కుమారుడు మా యిండ్లను పాలు పెరుగు మననీడమ్మా' అంటూ యశోదమ్మను రెండుసార్లు అమ్మను చేశాడు. 'అమ్మ ఒడి మాధుర్యాన్ని ఒదులుకోలేక కుమారస్వామి, గణపతి ఎల్లకాలం చంటిపిల్లలుగా ఉండిపోయారు' అని సౌందర్యలహరిలో శంకర భగవత్పాదులు భావన చేశారు. కృష్ణుడు ఆ తీపిదనాన్ని మరిగే తాను దేవుడినన్నమాట అమ్మకు తెలియకుండా మాయ చేశాడు. అమ్మ తన భక్తురాలు కాకుండా చూశాడు. 'తల్లిని తూచగా గలుగు ధాన్య ధనమ్ములు లేనే లేవు' అన్నారొక అవధాని. 'తల్లి పదమ్ములన్ తులసి దామమునై తులతూగుచుండ, నా యుల్లము పుల్ల నీరజ మృదూజ్జ్వలమై వెలిగించు కన్నులన్' అంటూ అను భూతి చెందారు. ఈ లోక రీతి అవగతం అయ్యాక 'పాలు ద్రావెడి శక్తి చాలదే నా తల్లి, వేదు ద్రింగగ నేర్తు చిత్రమమ్మ!' అన్నును అబ్బురించారు. నిజానికి అమ్మ ప్రత్యక్ష దైవం. 'తనకు బదులుగా అమ్మలను ఈ లోకంలో సృష్టించాడు దేవుడు' అన్నారు కవులు. 'అమ్మ ఒకవైపు దేవతలంతా ఒకవైపు, సరితూచమంటే నేను ఒరిగేను అమ్మవైపు' అని సినారె తేల్చి చెప్పారు.

ఇంతకీ, అమ్మదనం అనేది అప్పనంగా వచ్చిపడే ధనమేమీ కాదు. నిలువునా చీలుతూ పంటినిచ్చే విత్తనంలా, నేలకు ఒరుగుతూ గెలను వేతికిచ్చే అరటి చెట్టులా, అమ్మ తన ప్రాణాల్లోంచి మరీ బిడ్డను కంటుంది. ప్రసవం- బిడ్డకు జన్మ, అమ్మకు పునర్జన్మ. 'గర్భమందున నేను కదుపు చుమ్ములు చుట్ట సుడిసుడి గుండాల సోలినావా' అన్న కవి ఆవేదన అమ్మలందరికీ అనుభవమే. 'కొన్ని సుఖానుభూతులవి కూడిన జీవితమౌను దీనియందెన్ని వ్యథాను భూతులు, మరెన్ని పరాభవ హేతువుల్' అని మనిషి చింతిస్తాడు. కాని ఒక స్త్రీ ప్రసవంతో పోలిస్తే అవి చాలా చిన్న విషయం అనిపిస్తుంది. తన కష్టాలను దుఃఖాలను తానే దిగమింగి పిల్లలు తనను చేరవచ్చే సమయానికి 'చల్లని మాట తోడ కడు చల్లని చూపులతోడ ఇంకను చల్లని స్పర్శ తోడ...' బిడ్డలను అక్కున చేర్చుకొనే మహోన్నత మాతృమూర్తిత్వాన్ని ఏ కవి వర్ణించగలడు? అమ్మ గురించి చెప్పడానికి ఏ భాష సరితూగుతుంది? ఆ కళ ఎవరికి సాధ్యమవుతుంది? పెద్దయ్యాక కూడా 'సంతతి తను బిడ్డ చిన సంతయు శోషించు బోక నుదురిన దయతో...' ఆదరించడం అమ్మతత్వం. అది మనిషికే సొంతం కాదన్నారు నండూరి రామకృష్ణమాచార్యులు. 'మాతృ హృదయమెపుడు మకుటాయమానమే, జీవకోటి సకల సృష్టియందు, మనుజ జాతియందు మాత్రమే అనరేలా పశువులందు మరియు పక్షులందు' అన్నారాయన. అమ్మలందరి సహజ లక్షణం వాత్సల్యం. 'త్యాగ యోగమునకు యావ జ్జగత్తులో మాతకన్న గొప్ప మాట లేదు' అనేదందుకే. సృష్టికర్తకు మాతృ హృదయము లేకుంటే సృష్టే సాధ్యం కాదు. కనుక ఆ ప్రత్యేకతకే నా అభివందనం- 'సృష్టి చేసె మాతృ హృదయమ్ము కాబట్టి అతని ప్రతిబింబేంచి అభినుతింతు' అని కవులన్నారు. 'అమ్మపాలు త్రాగి ఆయురారోగ్యముల్ బడయ వలయు బిడ్డ బ్రతుకునందు' అని దీవించారు. అమ్మదనానికి అంజలిరాచారు.

'లోకంలో విజేతలను పరిశీలిస్తే చాలామంది తమ తల్లుల జీవలక్షణాలను పుణికి పుచ్చుకొన్నవారే' అన్నారొక తత్వవేత్త. అమ్మ కష్టాలను కట్టడి చేయలేకపోయినా, వాటిని ఎదుర్కొనే ధైర్యాన్ని ఇస్తుంది. భారతంలో కుంతి దానికి గట్టి సాక్ష్యం. 'రాజులకు ఎందును అరయ పరాక్రమ జీవన వృత్తి దక్క...' ప్రభువులకు శౌర్యం తప్ప మరో వృత్తి పనికిరాదని తన బిడ్డలకు చెప్పింది. ఆ మాట తీవ్రత ఎంతటిదో భీష్మ ద్రోణులు గ్రహించారు. 'దర్శజుడనే సముద్రానికి చెలియలికట్ట- ఆ మాటతో తెగిపోయింది. కౌరవులకు చావు దగ్గరపడింది' అనుకొన్నారు. పాండవులు తల్లిని అంతగా గౌరవించారు. ఆ విషయం ద్రౌపదికి బాగా తెలుసు. 'మా అత్త పృథ్వీసమాన' అంటూ అత్తలను ఎలా చూసుకోవాలో లోకానికి నేర్పింది. 'అమ్మను ప్రేమించలేనివాణ్ని నమ్మకూడదు. నా భర్తకు అందుకే వేదాకలిన్నరాను' అని ఇటీవల ఒక సౌదీ మహిళ కోర్టుకెక్కింది. 'అమ్మనే గౌరవించలేనివాడు నన్నేం గౌరవించ గలడు' అని ప్రశ్నించింది. 'తల్లిదండ్రి మీద దయలేని పుత్రుండు పుట్టనేమి వాడు గిట్టనేమి?' అని ప్రశ్నించాడు వేమన. దయ, ప్రేమ, గౌరవం వంటివన్నీ మొదట అమ్మపట్ల మొదలు కావాలి. 'అమ్మ అరచేతి స్పర్శ అన్నమయ్యో... అమ్మ హృదయమ్ము పొంగి క్షీరన్నమయ్యె' అని బిడ్డ గుర్తించాలి. 'ఈ లోకమునే గుడి చేరగ తొలివాకిలి అమ్మ...' కాబట్టి, ఆజన్మాంతం కృతజ్ఞతగా ఉండాలి. ఆ లక్షణాలు అమ్మపట్ల చూపడం లేదంటే- స్వభావసిద్ధంగా అవి తనకు లేవని అర్థం. ఈ ధోరణిలో వాదించిన సౌదీ మహిళ విడాకులు సాధించగలిగింది. ఒక స్త్రీ హృదయాన్ని మరో స్త్రీయే బాగా గ్రహించగలదనడానికి పురాణ పాత్రలే అక్కరలేదు, ఆధునిక మహిళలూ సమర్థులే అని నిరూపించింది.



తిను 'బండారం' బయటపడేదెలా?

పసలేని ప్రాధికార సంస్థ పెచ్చరిల్లుతున్న నాణ్యత లోపాలు

చదువులు, వృత్తిఉద్యోగాల కోసం ఉన్న ఊళ్లను వదలి పట్టణాలు, నగరాలకు వలస వెళ్తున్న భారతీయుల జీవనంలో వేగం పెరుగుతోంది. ఉమ్మడి కుటుంబాలు అదృశ్యమవుతున్నాయి. దంపతుల విడికాపురాలు, బ్రహ్మచారుల ఒంటరి జీవితాలు సర్వసాధారణమయ్యాయి. బయటి తిళ్లకు, సిద్ధాహారాలకు గిరాకీ పెరుగుతోంది. గిరాకీ అందుకోవడానికి వ్యాపారులు కల్తీకి పాల్పడటమూ పెచ్చరిల్లింది. ఈ నేపథ్యంలో ఆహార ప్రమాణాలకు భరోసా ఇవ్వడానికి, ప్రజలకు భద్రమైన ఆహారం అందేలా చూడటానికి భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ)ని 2011లో స్థాపించారు. చాలాకాలంపాటు దాని ఊసు ప్రజలకు తెలియదు. నెస్లే సంస్థ తయారుచేసే మ్యాగీ ఇన్‌స్టెంట్ నూడుల్స్‌లో విషతుల్య మోనోసోడియం గ్లుటామేట్ (ఎంఎస్‌జీ), సీసం పాళ్లు అధికంగా ఉన్నాయంటూ ప్రాధికార సంస్థ 2015 జూన్‌లో ఆ ఉత్పత్తిని నిషేధించింది. అప్పటినుంచి వినియోగదారులు ఆహార పదార్థాల పొట్లాల మీద ప్రాధికార సంస్థ ముద్ర ఉందా లేదా అని సరిచూసుకోవడం మొదలుపెట్టారు. 2015 జూన్ నుంచి ఆరు నెలలపాటు నెస్లేకి, ప్రాధికార సంస్థకు మధ్య న్యాయపోరాటం నడిచింది. అప్పట్లో ఈ ప్రాధికార సంస్థ ప్రధాన కార్యనిర్వహణాధికారి (సీఈఓ)గా ఉన్న యుద్ధవీర్ సింగ్ మాలిక్ ఆహార సంస్థలపై నియంత్రణలను కఠినంగా అమలు చేసేవారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని 2015 జులైలో కేంద్ర ఆహార శుద్ధి శాఖమంత్రి హర్ సిమ్రత్ కౌర్ బాదల్, వ్యాపార సంస్థల్లో ప్రాధికార సంస్థ భయవాతావరణం సృష్టిస్తూ ఆహార శుద్ధి రంగంలోకి విదేశీ పెట్టుబడులు రాకుండా అడ్డుకుంటోందని ఆరోపించారు. అప్పట్లో ఆమె మామగారు ప్రకాశ్ సింగ్ బాదల్ పంజాబ్ ముఖ్యమంత్రిగా ఉండేవారు. భారత దేశంలో నెస్లే స్థాపించిన మొట్టమొదటి కర్మాగారం పంజాబ్‌లోనే ఉంది. 2015 ఆగస్టులో సుప్రీంకోర్టు మ్యాగీ నూడుల్స్ కేసును కొట్టేయడంతో మాలిక్‌ను నీతి ఆయోగ్‌కు బదిలీ చేశారు. అదే ఏడాది డిసెంబరులో కొత్త సీఈఓగా పవన్ కుమార్ అగర్వాల్ పదవీ స్వీకారం చేసిన తరవాత పరిస్థితిలో మార్పు వచ్చింది. కంపెనీల పట్ల వైరభావన వీడి ఆహార భద్రత కోసం వాటితో చేతులు కలిపి పనిచేయాలన్నది అగర్వాల్ సిద్ధాంతం. ఆ మేరకు నెస్లేతో కలిసి ఆహార భద్రతా పరిరక్షణ సంస్థ నెలకొల్పాలని నిరుడు సెప్టెంబరులో ప్రాధికార సంస్థ నిర్ణయించింది. ప్రైవేటు సంస్థలతో కలిసి భారత్‌లో అధునాతన ఆహార నాణ్యతా పరిరక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయడంలో ఈ సంస్థ ఏర్పాటు తొలి అడుగని అగర్వాల్ అభివర్ణించారు. నెస్లే తదితర విదేశీ సంస్థలతోపాటు బాబా రామ్‌దేవ్ పతంజలి ఆయుర్వేద లిమిటెడ్ సంస్థ ఉత్పత్తులకూ వంతపాడుతోందనే విమర్శ ప్రాధికార సంస్థ ఉంది. కానీ పతంజలి ఉత్పత్తుల్లో అత్యధికం ప్రాధికార సంస్థ పరిధిలోకి రావని అగర్వాల్ చెబుతున్నారు.

కాగ్ అక్షింతలు

ఆహార నాణ్యత, భద్రతా ప్రమాణాలను సవరించడానికి ఆహార సంస్థల సలహాలు, సూచనలను ప్రాధికార సంస్థ తీసుకోవడాన్ని భారత కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్ (కాగ్) తప్పు పట్టింది. ఆహార శుద్ధి సంస్థలు తప్పుదోవ పట్టకుండా నియంత్రించాల్సిన ప్రాధికార సంస్థ సరిగ్గా వాటితోనే చేతులు కలపడం సమర్థనీయం కాదని వ్యాఖ్యానించింది. కట్టుదిట్టమైన ఆహార నాణ్యతా ప్రమాణాలను విధించి అమలు చేయడంలో ప్రాధికార సంస్థ విఫలమైందని నిరుడు డిసెంబరు 19న పార్లమెంటుకు సమర్పించిన నివేదికలో కాగ్ విమర్శించింది. 2011 ఆగస్టు-2016 మార్చి వరకు 53 జిల్లాలు, 20 రాష్ట్రాల్లో ప్రాధికార సంస్థ ప్రయోగశాలల పనితీరును సమీక్షించి సమర్పించిన నివేదిక అది. వివిధ ఆహారోత్పత్తులకు అనుమతి ఇస్తున్న తీరు సరిగ్గా లేదని, అనుబంధ ప్రయోగశాలల్లో పరికరాలకు, సిబ్బందికి కొరత ఉన్నా వాటిని అధిగమించడానికి శ్రద్ధ తీసుకోవడం లేదని కాగ్ విమర్శించింది. నాణ్యత పరీక్ష కోసం సేకరించిన ఆహార నమూనాలను భద్రపరచడానికి సరైన లాకర్లు, ఫ్రీజర్లు తదితరాలు లేకపోవడాన్ని కాగ్ బయటపెట్టింది. సేకరించిన నమూనాలను బీరువాల్లో పడేస్తున్నారు. ప్రయోగశాలకు పంపడానికి ముందే అవి చెడిపోతున్నాయి.

ప్రాధికార సంస్థ లైసెన్సులిచ్చిన ఆహార వ్యాపార సంస్థల్లో సగం సంబంధిత పత్రాలు సమర్పించనే లేదు. లైసెన్సు ఫీజు, తనిఖీ, రుసుములు, ప్రయోగశాల ఛార్జీల రూపంలో సేకరించిన రూ.100 కోట్ల నిధులను ప్రాధికార సంస్థ సరిగ్గా వినియోగించలేకపోయింది. మొదట్లో ప్రాధికార సంస్థ సిబ్బంది, టెక్నాలజీ కొరత వల్ల ప్రాసెస్ చేసి ప్యాకెట్లలో విక్రయించే ఆహారంపై పర్యవేక్షణ చేపట్టలేకపోయేది. దాంతో కేంద్ర, రాష్ట్రాల్లో పాలు, పాల ఉత్పత్తులు, వంటనూనెలు, తాగునీటి నాణ్యత పరీక్షకే పరిమితమయ్యేది. మ్యాగీ వివాదం తరవాత తొలిసారిగా ప్యాకేజీ ఆహారాల తనిఖీకి ప్రాధికార సంస్థ సిద్ధమైంది. నిజానికి పలు రాష్ట్రాలు మ్యాగీ నూడుల్స్‌లో నాణ్యతా లోపాలు కనిపెట్టిన తరవాతనే ప్రాధికార సంస్థ రంగంలోకి దిగింది. ఇప్పటికీ ప్రాధికార సంస్థ కాని, అది గుర్తించిన 200 ఆహార పరీక్షశాలలుకాని కట్టుదిట్టంగా తమ విధులు నిర్వహించలేకపోయాయని కాగ్ నివేదిక పేర్కొంది. సరిగ్గా పరీక్షించకుండానే అనేక ఉత్పత్తులకు ప్రాధికార సంస్థ అనుమతులిచ్చేసింది. అభద్రమైనవిగా శాస్త్రీయ వర్గాలు నిర్ధారించిన ఎనర్జీ పానీయాలు, న్యూట్రాస్యూటికల్స్ వంటి ఉత్పత్తులను నిషేధించనే



లేదు. ఇలాంటి ఎనర్జీ పానీయాల అనుమతులను వెంటనే ఉపసంహరించకుండా 15 నెలలు ఆలస్యం చేసిందని కాగ్ అక్షింతలు వేసింది.

కాగ్ నివేదిక వెలువడిన మరుసటి రోజే ప్రాధికార సంస్థ సవివర సమాధానం ఇచ్చింది. 130 కోట్ల భారతీయుల అవసరాలను తీర్చడానికి ఏర్పడిన తనకు తగినన్ని వనరులు లేవని, సిబ్బంది లేరని తెలిపింది. ఉన్న పరిమితుల్లోనే సమర్థంగా విధులు నిర్వహించడానికి కృషి చేస్తున్నానని వివరించింది. ఆహార పరీక్ష వసతులకు సంబంధించి సరైన పరికరాలు లేవని అంగీకరించింది. ఈ లోపాన్ని సరిదిద్దడానికి కేంద్రం 2016లో రూ.480 కోట్ల నిధులిచ్చిందని వెల్లడించింది. ఈ నిధులతో దేశమంతటా 45 ఆహార పరీక్షా కేంద్రాలను ఏర్పరుస్తారు. 14 రిఫరల్ ఆహార పరీక్షా కేంద్రాలను పటిష్ఠపరుస్తారు. వీటికి తోడు 62 సంచార పరీక్షా కేంద్రాలను ప్రారంభించనున్నారు. ఇప్పటికే పంజాబ్, గుజరాత్, కేరళ, తమిళనాడుల్లో పనిచేస్తున్న నాలుగు సంచార కేంద్రాలకు ఇవి అదనం. తినడానికి పనికిరాని ఆహార పదార్థాల అమ్మకాలను అనుమతిస్తోందని, కొన్నింటిపై అసలు నియంత్రణే లేదన్న కాగ్ విమర్శలకు స్పందిస్తూ, వివిధ రకాల ఆహారాల్లో కలిపే 400 దినుసులు, రంగుల వినియోగానికి సంబంధించి 9,000 నియమాలను ప్రకటించామని ప్రాధికార సంస్థ వివరించింది.

పని విధానాలు అధ్వానం

వివిధ రాష్ట్రాల్లో ఆహార సంస్థల పనితీరును నిరంతరం తనిఖీ చేయడంలో ప్రాధికార సంస్థ విఫలమైందని కాగ్ తూర్పారబట్టింది. అందుకు సమాధానంగా, కొన్ని రాష్ట్రాల్లో ఆహార సంస్థల వ్యాపారాలపై సర్వే జరిగినా సిబ్బంది కొరత వల్ల మిగతా రాష్ట్రాలు ఆ పనిచేయలేకపోయాయని ఒప్పుకొంది. ఈ లోటును తీర్చడానికి కొత్త సిబ్బంది నియామకానికి రంగం సిద్ధం చేస్తున్నామని వెల్లడించింది. దేశవ్యాప్తంగా ప్రాధికార సంస్థ యంత్రాంగాన్ని పటిష్ఠపరచడానికి 600 కొత్త ఉద్యోగాలను సృష్టించడానికి కేంద్ర అనుమతి కోరామని తెలిపింది. ప్రజలకు సురక్షిత ఆహారం అందించడానికి అమెరికాలో అనుసరిస్తున్న ప్రమాణాలు, నియమ నియంత్రణలను తానూ పాటించాలని ప్రాధికార సంస్థ చూస్తోంది. ఈ విషయంలో ప్రపంచ బ్యాంకుకు అనుబంధంగా పనిచేసే అంతర్జాతీయ ఆహార భద్రత భాగస్వామ్య సంస్థ (జీఎఫ్ఎస్‌పీ) సలహా సంప్రతింపులు కోరగా- అమెరికా, కెనడాల అనుభవం భారత్‌కు పనికిరాదని ఆ సంస్థ తెలిపింది. అమెరికాలో 18,000 మంది, కెనడాలో 6,000 మంది ఆహార భద్రత అధికారులు ఉన్నారని, వారు ఆయా కేంద్ర ప్రభుత్వాల కింద పనిచేస్తారని గుర్తుచేసింది. అంత భారీ యంత్రాంగాన్ని ఏర్పరచడం భారత్‌కు సాధ్యంకాని పని. దానికి బదులు న్యూజిలాండ్, వియత్నాం, చైనా, బ్రిటన్, నెదర్లాండ్స్ దేశాల నుంచి నేర్చుకోవడం ఉత్తమమైన పని అని జీఎఫ్ఎస్‌పీ సూచించింది. పల్లెల్లో ఆహార నాణ్యతా పరీక్ష విధానాలను అన్నది వియత్నాం నుంచి, 130 కోట్లమందికి ఆహార భద్రతా ప్రమాణాలను వర్తింపజేయడాన్ని చైనా నుంచి నేర్చుకోవచ్చునన్నది. జరిమానాల వసూలు ద్వారా ఆదాయం పెంచుకోవడం కన్నా ప్రజలకు భద్రమైన పోషకాహారం అందించడంపైనే ప్రాధికార సంస్థ దృష్టి పెట్టాలని సలహా ఇచ్చింది. మొత్తం మీద ప్రాధికార సంస్థ చురుగ్గా కార్యాచరణ ప్రారంభించడం హర్షణీయం. దేశమంతటా 15 ఆహార పరీక్షాకేంద్రాలకు అధునాతన పరికరాలు, సౌకర్యాలను అందించాలని నిర్ణయించింది. ప్రభుత్వ ప్రయోగశాలలను ఆధునికీకరించడంతోపాటు ఘజియాబాద్, ముంబయి, కోల్‌కతా, చెన్నైలలో కొత్త ప్రయోగశాలలను నెలకొల్పనుంది. ఇవి పాలు, కోడి మాంసం, కూరగాయలు తదితరాలను కూడా పరీక్షించి ధ్రువీకరణ పత్రాలు ఇస్తాయి. భారతదేశంలో నేడు 250 ఆహార పరీక్షా కేంద్రాలు ఉన్నాయి. వాటిలో 150 కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్వహణలో పనిచేస్తున్నాయి. మరిన్ని కేంద్రాల స్థాపనకు ప్రాధికార సంస్థ నడుంకట్టింది. 21వ శతాబ్దానికి ఉన్నత ప్రమాణాలతో నడిచే సంస్థగా తననుతాను తీర్చిదిద్దుకోవడం ప్రాధికార సంస్థ మీదున్న గురుతర బాధ్యత!

- వరప్రసాద్

చిరుతిళ్ల వీధివ్యాపారులకు శిక్షణ

ప్రతిపాదిత ఆహార భద్రత పరిరక్షణ సంస్థ, ఎఫ్ఎస్ఎస్ఏఐ అధికారులతోపాటు ఇతర కంపెనీల ప్రతినిధులకూ ఆహార భద్రత, నాణ్యతల తనిఖీలో శిక్షణ ఇస్తుంది. ఈ ఏడాది మార్చిలో ప్రాధికార సంస్థ కోకకోలా సంస్థతోనూ భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఆహారాన్ని శుచిగా తయారు చేయడం, వ్యర్థాల తగ్గింపు వంటి అంశాల్లో 50 వేల వీధి తిళ్ల వర్తకులకు కోకకోలా మూడేళ్లపాటు శిక్షణ ఇస్తుంది. గోవాలో ఏడువేల వీధి తిళ్ల వర్తకులకు ఇదే మాదిరి శిక్షణ ఇవ్వడానికి నెస్లేతో మరో ఒప్పందం కుదిరింది. ఆహార భద్రత, పౌష్టికాహారానికి సంబంధించి ఐటీసీ, మాండెలీజ్ ఇండియా, టెట్రా ప్యాక్, జూబిలెంట్ ఫుడ్ వర్క్స్, యమ్ తదితర బ్రాండ్లతో ప్రాధికార సంస్థ ఒప్పందాలు కుదుర్చుకుంది. వీటిలో ఐటీసీ, మాండెలీజ్ కంపెనీలు కోల్‌కతా, దిల్లీల్లో వేలాది పాఠశాలలకు పౌష్టికాహారం అందించడానికి తోడ్పడుతున్నాయి. తాజాగా నెస్లే సహకారంతో ఆహార భద్రత సంస్థ ఏర్పాటుకు ప్రాధికార సంస్థ సిద్ధమైంది.



అవినీతి రాజకీయ ఊడలమఱ్ఱి

'ఏ సినిమా స్టార్ కంటే తక్కువ నటుణ్ని నేను? నా జీవిత చరిత్రపై ఏదైనా సినిమా తీస్తే అందులో ప్రధానపాత్ర నేనే పోషిస్తాను'- ఇంత ధీమా ఒలకబోసిన వ్యక్తి సాదాసీదా నాయకుడు కాదు. సమకాలీన రాజకీయాల్లో తాను విదూషకుడిలా కనిపించినా, తిమ్మిని బమ్మి చేసి రాజ్యాంగ వ్యవస్థనే నవ్వులపాలు చెయ్యడంలో మహా ఘటికుడు శ్రీమాన్ లాలు! 'జబ్ తక్ రహేగా సమోసా మే ఆలూ, తబ్ తక్ రహేగా బిహార్ మే లాలు' (సమోసాలో ఆలూ ఉన్నంతకాలం బిహార్లో లాలు ఉంటాడు) అని ఘనంగా చాటిన మహా చాలూ- పాతికేళ్ల క్రితమే కడు బీద రాష్ట్రమైన బిహార్లో వెయ్యి కోట్ల రూపాయల దాణా కుంభకోణానికి దారులు పరచిన ఆర్థిక నేరగాడు! అందుకు సంబంధించిన రెండు కేసుల్లో ఈ నెలలోనే కేదస (సీబీఐ) ప్రత్యేక కోర్టుల నుంచి రెండు వేర్వేరు జైలుశిక్షలు పడినా- ఏ మాత్రం తొణకకుండా పైకోర్టులో చూసుకొందామన్న ధీమాతో ఉన్నవాడు! కారాగారంలోనూ స్వీయసౌకర్యాలు, మర్యాదలకు లోటురాకుండా చూసుకొనే మానవీయ వ్యవస్థల సాక్షిగా- మాయావి రాజకీయంతో కేసుల జంజాటాన్ని వదిలించుకోలేక పోతానా అన్న అతిశయం నిలువెల్లా నిండినవాడు. కాబట్టే, 'శ్రీకృష్ణ పరమాత్ముడి అపర అవతారం లాలు' అన్న పోస్టర్లు వెలుస్తున్నాయి. నేరశిక్షాస్మృతిలోని పలు బలహీనతల్నే తమ బలిమిగా మలచుకొంటున్న లాలు, రాజా, మాయావతి ప్రభృత రాజకీయ నేతల ఒరవడి- దేశ ప్రజాస్వామిక వ్యవస్థల్నే అపహసిస్తోంది. అదెలాగో చిత్తగించండి!

చిల్లర దొంగతనాలకు పాల్పడ్డవాళ్లను ఏ మాత్రం ఉపేక్షించకుండా చీకటి కొట్టాల్లోకి నెట్టి ప్రత్యక్ష నరకం చూపించడంలో రక్షక భటుల అవిక్ర పరాక్రమం మాటల కందనిది. అదే, బడానేరగాళ్ల దగ్గరకొచ్చేసరికి చట్టబద్ధ పాలన అర్థతాత్పర్యాలు పూర్తిగా మారిపోవడం- ఇండియా విలక్షణతను ఎలుగెత్తి చాటుతోంది. ఈ నెల మొదటివారంలో రాంచీలోని సీబీఐ ప్రత్యేక కోర్టుకు నిందితుడిగా హాజరైన లాలు అన్న మాటల్ని గుర్తుచేసుకోవాలి. '2జి స్పెక్ట్రమ్ కేసు తరహాలోనే నాకూ న్యాయం జరుగుతుంది' అని ఆయన ప్రబలంగా ఆకాంక్షించారు. 2జి కేసులో మాదిరిగానే దాణా కుట్రనూ దర్యాప్తు చేసింది కేదస కావడం, విచారిస్తున్నది ప్రత్యేక కోర్టు అయినందువల్ల- సాక్ష్యాలు వీగిపోయి తాను పరిశుద్ధుడిగా బయటపడగలననుకొన్నారు. గజం మిథ్య పలాయనం మిథ్య అన్నట్లుగా- దేశ ఖజానాకు ఏకాయెకి లక్షా 76 వేలకోట్ల రూపాయల రాబడి నష్టం తెచ్చిన 2జి కేసు తెమిలిపోవడాన్ని జాతి జనం దిగ్భ్రాంతితో పరికించారు. కలైజ్ఞర్ టీవీకి అప్పనంగా రూ.200 కోట్లు ఎలా వచ్చిందీ సరిగ్గా కూపీ లాగలేని కేదస, కొరగాని దస్త్రాలతో కుస్తీపట్టి కోర్టులో తెల్లమొగం వేసిందని విశ్లేషణలు చాటుతున్నాయి. మరోవంక, నిన్నామొన్నటి దాకా కీలక నిందితుడిగా ఉన్న కేంద్ర మాజీ మంత్రి అండిముత్తు రాజా- 2జి కేసు సరళిపై ఓ పుస్తకాన్నే ప్రచురించి 'కాగ్' సహా పలు వ్యవస్థల వివేచననే ప్రశ్నిస్తున్నారు. కేదస 'పని సామర్థ్యం' పూర్తిస్థాయిలో తనకు ఎరుకే కాబట్టి- వలకు చిక్కని చేపలా తానూ తప్పించుకోగలనని లాలు తలపోశారు. అసలు కేసు పూర్వాపరాలను పరికిస్తే సామాన్యుల మెదడును తొలిచే మౌలిక ప్రశ్న- రెండు దశాబ్దాలపాటు దాణా దర్యాప్తు ఎందుకు దేకినట్లు?



లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ నేతృత్వంలో సాగిన అవినీతి వ్యతిరేకోద్యమం నుంచి పుట్టుకొచ్చి, కుల రాజకీయాల ఒడుపులతో ఎదిగొచ్చిన నేతగా లాలు- బిహారీలకు ఆత్మబంధువునంటూ బులిపించారు. పశుగ్రాస కుంభకోణాన్ని సాధ్యమైనంతగా తొక్కిపట్టడానికి శతథా విఫలయత్నం చేసిన లాలు ఉన్నత న్యాయస్థానాల కళ్లకు గంతలు కట్టేందుకు కేదస అధికారుల్నే వాడుకొన్న ఘనుడు! పట్నా హైకోర్టు పర్యవేక్షణలో దాణా కుంభకోణంపై రెండు దశాబ్దాల క్రితం కేదస దర్యాప్తు జరుగుతున్నప్పుడు- గుట్టుమట్లను ఆది నుంచీ శ్రద్ధగా శోధిస్తున్న సీబీఐ సంయుక్త సంచాలకులు బిశ్వాస్, సాక్ష్యాధారాల్ని బట్టి అప్పటి ముఖ్యమంత్రి లాలునూ విచారించాలని ప్రతిపాదించారు. దానితో రంజిత్ సిన్హా అనే మరో అధికారి తీవ్రంగా విభేదించారు. కీలక స్థానం నుంచి బదిలీ తథ్యమన్న దశలో చక్రం అడ్డువేసి తనను ఆదుకొన్నందుకు లాలు పట్ల రంజిత్ సిన్హా నాడు కనబరచిన కృతజ్ఞత అది. అప్పటి కేదస సంచాలకుడు జోగిందర్ సింగ్- బిశ్వాస్ సవివర నివేదికను పక్కనపెట్టి, రంజిత్ సిన్హా వండివార్చిన దాన్ని పట్నా హైకోర్టుకు సమర్పించి చీవాట్లు తినడం అప్పట్లో సంచలనం సృష్టించింది. సాక్షాత్తు సర్వోన్నత న్యాయస్థానం జోక్యం చేసుకొన్నాకగాని లాలు ప్రాసిక్యూషన్‌కు మార్గం సుగమం కాలేదంటే- వ్యవస్థలతో లాలు ఏ స్థాయిలో చెడుగుడు ఆడారో బోధపడుతుంది. సుప్రీంకోర్టు పర్యవేక్షణలోనే 2జి కేసు దర్యాప్తు మొదలైనా, కేసు నివేదికల్ని తారుమారు చెయ్యడంలో కేదస సంచాలకుడిగా ఎదిగొచ్చిన రంజిత్ సిన్హా చేతివాటం కొన్నేళ్ల క్రితం నివ్వెరపరచింది. కేదస ప్రత్యేక కోర్టులో ఆ కేసు ఎందుకూ కొరగాకుండా పోవడానికి రంజిత్ సిన్హా కూడా పుణ్యం కట్టుకొన్నాడన్న విశ్లేషణల వెలుగులో- ఆ పెద్దమనిషే దాణా కుంభకోణంలోనూ హస్తలాఘవం ప్రదర్శించి తనను ఒడ్డున పడేస్తారన్నది లాలు మహాశయుడి దూరాలోచన అయి ఉండాలి! వరసగా శిక్షల మీద శిక్షలు పడితేనేం- రాంచీలోని బిర్సా ముండా కారాగారంలో తన రాజభోగానికి ఏ లోటూ రాకుండా చూసుకోవడంలో లాలు రాటుతేలిపోయారు!

పశుదాణా కుంభకోణంలో లాలుకు మొదటిసారి 2013 అక్టోబరులో అయిదేళ్ల జైలుశిక్ష పడింది. రెండో కేసులో మూడున్నరేళ్లు, మూడో కేసులో తాజాగా అయిదేళ్ల కారాగార శిక్ష పడినా, మరో రెండు కేసులు ఈ ఏడాదే తుది తీర్పునకు సిద్ధంగా ఉన్నాయి. 1996లో ప్రాథమిక సమాచార నివేదిక నమోదు చేసింది లగాయతు 'పశుదాణా' తలా కొంత భోంచేసిన నిందితుల్లో అనేకమంది తనువు చాలించారు. పశుసంవర్ధక శాఖలో మహా కుంభకోణానికి తెరతీసేలా వ్యవస్థీకృత అవినీతి మాఫియాను లాలు ఎలా పెంచి పోషించిందీ వివరించిన న్యాయస్థానం- దోషులకు గల అనుభవం దృష్ట్యా హజారీ బాగ్‌లోని ఓపెన్ జైలుకు తరలించి పశువుల పెంపకం పని అప్పగించాలని ప్రత్యేకంగా సూచించింది. కారాగారంలోనూ 'పెద్దసారు'కు ఏ కష్టం రాకుండా చూసుకోవడానికి ఇద్దరు ఆర్‌జేడీ కార్యకర్తలు తప్పుడు కేసులు తమపై వేసుకొని అయ్యవారి రాకకుముందే జైలుకెళ్లి స్వామి సేవకు సిద్ధంగా ఉండటం- అవినీతి వ్యవస్థ విశ్వరూపాన్నే సాక్షాత్కరింపజేస్తోంది. ఒకనాడు జైల్లో ఉండీ రాష్ట్రాన్ని పరిపాలిస్తానంటూ రబ్రీదేవికి అధికారం కట్టబెట్టి అన్నంత పనీ చేసిన లాలు- వచ్చే ఎన్నికల్లో రాజకీయ పవనాలు తనకు అనుకూలమైతే కేసులన్నీ కొట్టుకుపోతాయని బలంగా విశ్వసిస్తున్నారు. ఇదీ భారతావని దుర్విధి.

నేరగాళ్లకు రాజకీయం రక్షాకవచంగా మారబట్టే లాలు సహా దేశవ్యాప్తంగా ఆర్థిక నేరగాళ్లంతా బోరవిరుచుకొని తిరగగలుగుతున్నారు. అన్ని స్థాయుల్లో రాజ్యాంగ వ్యవస్థల్ని పునరుత్తేజితం చేసి, చట్టం ముందు అందరూ సమానులేనన్న మౌలిక సూత్రాన్ని నిక్కచ్చిగా ఆచరణలోకి తెస్తే- ఎంతటి నేరగాళ్లయినా కచ్చితంగా తోక ముడుస్తారు. కాదంటారా?

- పర్వతం మూర్తి

పూజ

సర్వ ప్రాణుల్లోనూ కదిలే చైతన్యం శివం. దివ్య ఆలోచనల ఏకరూపమే దైవం. చరాచర జీవ ప్రపంచంలోని దైవత్వ భావనా రూపమే ప్రతీక (అక్షరాలు, గుర్తులు, బొమ్మలు). ప్రతీకపై మనసు లగ్నం చేసి, కొన్ని విధానాలు పాటించి, ఉన్నతమైన సంస్కారాన్ని ఆత్మశక్తిని పెంపొందించుకోవాలి మనిషి. సదాచారాన్ని పాటించేందుకు తన మనసును సిద్ధపరచే ప్రయత్నమే పూజ. సద్భావన పెంపొందించుకోగలనా లేదా అనే సందేహం నుంచి బయటపడి, సంస్కారాన్ని అందుకోవడానికి అతడు ఆచరించి ఆనందించే యత్నమే అది.

మనిషికి సమాజం ఎంతో ఇచ్చింది, ఇస్తూనే ఉంది. అతడు వృద్ధిలోకి వచ్చాక సమాజానికి కృతజ్ఞతగా, సమర్పణభావ సూచకంగా, సవినయంగా బలాన్ని తిరిగి అందించడమే పూజ. రుణం తీర్చేసుకోవడంగా భావించినా, ధనవంతుడినని దర్పంతో వ్యవహరించినా అది నిరుపయోగమవుతుంది. ఆడంబరాలకు, కళ్లు చెదిరే కాంతికిరణాల తోరణాలకు, మతిపోగొట్టి దిగ్భ్రమ కలిగించే శబ్దాలకు మానవుడు దూరం కావాలి. అలా ప్రశాంత చిత్తంతో అతడు చేయదగిన ఆధ్యాత్మిక సాధనే పూజ.

నివేదన పేరుతో వృథా చేయడం సరికాదు. సంస్కారాన్ని త్యజించడం అసలే కూడదు. గ్రామ, వీధి, సంఘ పూజల్లో కలిసొచ్చినవారిని ప్రశంసించడం; ఆర్థిక బలం లేక ముందుకు రానివారిని నిందించడం తగని పని. అందరూ కలిసి చేసే పూజ వల్ల సమైక్య భావన కలగాలి. వ్యక్తిగత శ్రద్ధను సమాజం పట్ల అనురక్తిగా మార్చుకునే సుగుణాన్ని అలవరచుకోవాలి.

మాట, మనసు, చేతలు- ఆత్మీయతను, అభిమానాన్ని చాటాలి. అప్పుడు అందరూ ఒకటవుతారు. పూజ పరిణామం ప్రమోదం (ఆనందం) కావాలి. ఊరంతా కలిసి చేసుకునే పూజ ఉత్తమం. కొందర్ని మాత్రం కూడగట్టి చేసేది మధ్యమం. ఒక్కరే చేసే పూజ సామాన్యం. దైవం ముందు మోకరిల్లి, సాష్టాంగ నమస్కారం చేసి, క్షమాప్రార్థన సాగించేవారు సంఘంలోకి నడవాలి గాని- ఒంటరితనం వైపు కాదు.

'స్వీయమోక్షం నా ఆదర్శం కాదు. ఈ సమస్త ప్రాణి జగత్తుకూ సేవ చేయడమే పరమార్థం' అంటారు స్వామి వివేకానంద. మదర్ థెరిసా ఆలోచనా సరళీ ఇదే! తమ శక్తుల్ని, సంపదల్ని మానవాళికి ధారపోస్తున్న మహానుభావుల ఆంతర్యమూ ఇదేవిధంగా ఉంటుంది. దైవానికి నిజమైన నివేదన ఇది. ఆనందాన్ని అందరితో పంచుకోవడమే ప్రసాదం. ప్రతి అవకాశాన్నీ అందిపుచ్చుకొని, లోకహితం కోసం అడుగు ముందుకు వేస్తే అదే యజ్ఞం. స్వార్థానికి దూరం కావడమే మోక్షం. అందరి సంక్షేమం కళ్లారా చూసి ఆనందించడమే స్వర్గం. 'అందరూ తింటే నేనూ తిన్నట్లే' అనేది- రామకృష్ణ పరమహంస ఆధ్యాత్మిక భావధార.



చిత్రపటాలు మొదలుకొని విగ్రహాలు, గుడులు, గోపురాలు, సందర్శనలు తదితరాల నుంచి మనిషి మనసు మళ్లాలి. అది ముందుకు కదిలి, విశ్వమానవాళి సుఖదుఃఖాలకు స్పందించగలగాలి. అసహాయులకు చేయూతనివ్వడమే నిజమైన పూజ. దీనికి బాహ్య వస్తుసామగ్రి కంటే, అంతశ్శక్తి వినియోగమే అత్యవసరం. ఇది అష్టాదశ పురాణాలు, రామాయణ భారత భాగవతాలు, వివిధ మత గ్రంథాలు బోధించే పరమ సత్యం.

కేవలం బాహ్యపూజలకే పరిమితమై, లోక దృష్టిని వీడే ప్రయత్నం పరమ వ్యర్థం. లోకహితమే జీవిత సాఫల్యమని భావించేవారే ధన్యులు. మానవసేవే మాధవ సేవ. పూజ అంటే సమర్పణ భావం!

పత్రం, పుష్పం, ఫలం, తోయం- ఇవి చాలు భగవంతుడికి! ధన కనక వస్తు వాహనాలు సమర్పించాల్సిన అవసరం లేదు. ఆకలితో ఉన్నవారికి పట్టెడన్నం పెట్టడం, రోగగ్రస్తులైన వారికి ఔషధాలిచ్చి ఆదుకోవడం, అసహాయులకు ధైర్యమిచ్చి అక్కున చేర్చుకోవడం- ఇవన్నీ దైవారాధనలో భాగాలు. భగవంతుడు ఎన్ని అవతారాలు ధరించినా, అవన్నీ మనిషి కోసమే! ఈ నిత్యసత్యాన్ని గుర్తించినప్పుడు, తోటివారి కోసం అతడు అహరహం పరిశ్రమించినప్పుడు- చేసే పూజ గౌరవం పొందుతుంది. అది అందరికీ వన్నెతెస్తుంది.

- కాకర్ల హనుమంతరావు

రైతులకు టోకు ధర చెల్లించాలి

'మన కూరగాయలు' పథకానికి మార్గదర్శకాలు జారీ

ఈనాడు, హైదరాబాద్: 'మన కూరగాయలు' పథకం కింద రైతుల నుంచి కొనే కూరగాయలకు బోయిన్‌పల్లి లేదా ఇతర ఏదైనా టోకు మార్కెట్‌లో పలికే గరిష్ఠ ధరను గ్రామాల్లో చెల్లించాలని మార్కెటింగ్ శాఖ ఆదేశించింది. ఈ పథకం కింద కూరగాయల విక్రయ కేంద్రాల ఏర్పాటు, కొనుగోలు, సరఫరా, చిల్లర ధరలను నిర్ణయించడానికి అనుసరించాల్సిన విధానాలను వివరిస్తూ శనివారం మార్గదర్శకాలను జారీచేసింది. టోకు ధరను చెల్లించడమే కాకుండా దానిపై 30 శాతం వరకూ పెంచి చిల్లర విక్రయ ధరను నిర్ణయించవచ్చని తెలిపింది. గ్రేడింగ్, రవాణాలో నష్టాలను ఇందులో భరించాలి. కూరగాయల ధరలు బాగా పడిపోయి రైతులు నష్టపోతుంటే గిట్టుబాటు ధర ఇచ్చి ఆదుకునేందుకు రూ.20 కోట్లతో ప్రత్యేక నిధి (రివాల్వింగ్ ఫండ్) ఏర్పాటుచేస్తారు. ప్రభుత్వం ఈ నిధిని కేటాయించింది. ఆ తరవాత ప్రతీ మార్కెట్ వసూలు చేసే రుసుంలో 2 శాతం సొమ్మును ఈ నిధికి జమచేయాలి. పాత రంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల పరిధిలో ఈ పథకం అమల్లో ఉంటుంది. గ్రేటర్ హైదరాబాద్‌లో 'మన కూరగాయలు' విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయాలి. మార్కెటింగ్ శాఖ ముఖ్యకార్యదర్శి అధ్యక్షతన నలుగురు సభ్యులతో రాష్ట్రస్థాయి కమిటీ ఈ పథకం అమలును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంది.

మానవీయ విలువల పరీక్షకు 97 శాతం హాజరు

రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు శనివారం నిర్వహించిన నైతికత, మానవీయ విలువల పరీక్షకు 97 శాతం మంది హాజరయ్యారు. మొత్తం 4,61,748 మందికిగాను 4,47,091 మంది పరీక్ష రాశారు. 14,657(3.17 శాతం) మంది విద్యార్థులు గైర్హాజరయినట్లు తెలంగాణ ఇంటర్‌బోర్డు తెలిపింది.

'పుర్రె కథ' చెప్పేస్తుంది

డిజిటల్ వ్యవస్థను రూపొందిస్తున్న భారత పరిశోధకులు

దిల్లీ: పుర్రె ఆకృతికి సరిపోలే ముఖాన్ని గుర్తించే డిజిటల్ వ్యవస్థను రూపొందించడంపై భారత పరిశోధకులు కృషిచేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా భద్రత సంస్థలు, ఫోరెన్సిక్ నిపుణులకు ఇది ఎంతగానో ఉపయోగపడే అవకాశాలున్నాయి. 'ఐడెంటిఫైమీ' పేరుతో దిల్లీలోని ఇంద్రప్రస్థ సమాచార సాంకేతిక కేంద్రం ఈ వ్యవస్థను రూపొందిస్తోంది. పుర్రె చిత్రాలను బట్టి ముఖాకృతిని అంచనా వేసి... వాటిని తప్పిపోయిన వ్యక్తుల చిత్రాలతో 'ఐడెంటిఫైమీ' సరిపోల్చుతుందని ప్రొఫెసర్ రిచాసింగ్ తెలిపారు. ఇందుకోసం అల్గారిథమ్‌ను రూపొందించినట్లు పేర్కొన్నారు. పుర్రెను బట్టి ముఖాన్ని అంచనావేసే ప్రక్రియను మనుషులు చెయ్యాలంటే వారం పడుతుందన్నారు. కంప్యూటర్లను ఉపయోగించినా... తదనంతర ప్రక్రియలూ సుదీర్ఘంగా ఉంటాయన్నారు. వెస్ట్ వర్జీనియా విశ్వవిద్యాలయంతో కలిసి తాము ఈ ప్రాజెక్టును చేపట్టినట్లు తెలిపారు. తాము సృష్టించే ఐడెంటిఫైమీ డేటాబేస్... అందరికీ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

ఒక్కమాట మౌఖిక ఆదేశంతో పలికే 'ఆకాశవాణి'

అమెజాన్ ఎకో సర్వీసుతో ఏఐఆర్ ఒప్పందం

దిల్లీ: ప్రపంచంలో మీరు ఏ మూల ఉన్నాసరే మౌఖిక ఆదేశం(వాయిస్ కమాండ్)తో చక్కగా 'ఆకాశవాణి'(ఆల్ ఇండియా రేడియో) కార్యక్రమాలను వినవచ్చు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం సాయంతో తన కార్యక్రమాలను మరింత మందికి చేరువయ్యేలా చూడాలన్నదే ఏఐఆర్ లక్ష్యంగా ఉంది. ఆకాశవాణికి...అమెజాన్ ఎకో సర్వీసుకు మధ్య కుదిరిన ఒప్పందం మూలంగా ఇప్పుడీ మౌఖిక ఆదేశం వెసులుబాటు అందుబాటులోకి వచ్చింది. దీనికి 'వాయిస్ ఆన్ డిమాండ్ సర్వీసు'గా పేర్కొంటున్నారు. ఇలా ఓ మౌఖిక ఆదేశం ఇవ్వడంతోనే అలా 'ఆకాశవాణి' కార్యక్రమాలు అందుబాటులోకి రావాలంటే...శ్రోతలు అమెజాన్‌కు చెందిన 'ఈ కామర్స్ ప్లాట్‌ఫామ్' నుంచి 'ఎకో' అనే పరికరాన్ని కొనుగోలు చేయాల్సి ఉంటుంది. కేవలం పది రోజుల క్రితమే అమెజాన్‌తో తాము ఈ మేరకు ఒక ఒప్పందాన్ని చేసుకున్నట్లు ఏఐఆర్ డైరెక్టర్ జనరల్ ఎఫ్.షెహర్యార్ వెల్లడించారు. పది రోజుల్లో పూర్తిస్థాయిలో సేవలు అందుబాటులోకి వస్తాయి. వివిధ భారతి వంటి 17 స్థానిక సర్వీసులతో.. 27 గ్లోబల్ సర్వీసులను ఏఐఆర్ అందిస్తోంది. ఈ 44 సర్వీసులనూ 'ఎకో' ద్వారా శ్రోతలు వినవచ్చునన్నారు.

9న పాలస్తీనా పర్యటనకు నరేంద్ర మోదీ

దిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ పర్యటన ఫిబ్రవరి 9వ తేదీన ప్రారంభం కానుంది. ఆయన పాలస్తీనా, ఒమన్, యూఏఈలను సందర్శించనున్నారు. ఈ సందర్భంగా ఆయా దేశాల నేతలతో ద్వైపాక్షిక అంశాలపై చర్చిస్తారని కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. పాలస్తీనాలో కాలుమోపుతున్న తొలి భారత ప్రధాన మంత్రి మోదీయే. ప్రధాని ఒమన్‌కు వెళ్లటం ఇదే ప్రథమం. యూఏఈను ఇదివరకు ఒకసారి సందర్శించారు.

పునర్జన్మ ప్రదాయిని



ఎంఎన్‌జే ఆసుపత్రిలో మైక్రోస్కోప్‌లో చూస్తూ అతిసూక్ష్మ శస్త్రచికిత్స చేస్తున్న వైద్యులు

నల్గొండ జిల్లాకు చెందిన యువకుడి (35)కి దవడ లోపలి భాగంలో క్యాన్సర్ సోకింది. హైదరాబాద్‌లో ఓ ప్రముఖ కార్పొరేట్ ఆసుపత్రికెళ్తారు. దవడ మొత్తం తీయాల్సి వస్తుందన్నారు. శస్త్రచికిత్స, రేడియో థెరపీ, ఆసుపత్రి ఖర్చులన్నీ కలిపి రూ.5 లక్షలవుతుందన్నారు. పైగా తొలగించిన దవడను తిరిగి ఇక్కడ సరిచేయడం సాధ్యం కాదని చెప్పారు. చివరకు ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రిలో క్యాన్సర్‌ను తొలగించే శస్త్రచికిత్సతో పాటు తిరిగి దవడను పునర్నిర్మించే శస్త్రచికిత్సనూ ఉచితంగా చేశారు. ఆ యువకుడి అవకరం తొలగిపోవడమే కాదు.. ఆహారాన్ని తీసుకోవడానికి మార్గం సులభమైంది.

వరంగల్ గ్రామీణ జిల్లా వర్ధన్నపేటకు చెందిన విశ్రాంత ప్రభుత్వ ఉపాధ్యాయుడి (75)కి సైనస్ క్యాన్సర్ ఉండటంతో హైదరాబాద్‌లోని పేరున్న కార్పొరేట్ ఆసుపత్రిలో క్యాన్సర్ కణితిని తొలగించారు. శస్త్రచికిత్సలో నోటి లోపల అంగిలికి రంధ్రం పడింది. దాన్ని పూడ్చకుండానే చికిత్స చేసి పంపించారు. దీంతో ఏడాది పాటు నోటి ద్వారా తినలేక ఆయన ఇబ్బందిపడ్డారు. పూర్తి స్థాయి వైద్యం అందించకపోవడంతో క్యాన్సర్ కంటికి పాకింది. ఈ దశలో ఏమీ చేయలేమని ఆ కార్పొరేట్ ఆసుపత్రి వైద్యులు చేతులెత్తేశారు. ఎంఎన్‌జే ఆసుపత్రి వైద్యులు చికిత్స చేసి అంగిలికి ఏర్పడిన రంధ్రాన్ని పూడ్చడంతో ఇప్పుడాయన నోటి ద్వారా తినగలుగుతున్నారు.

ఈనాడు – హైదరాబాద్

అతి క్లిష్టమైన క్యాన్సర్ పునర్నిర్మాణ శస్త్రచికిత్సలు కూడా సమర్థమంతంగా నిర్వహిస్తూ క్యాన్సర్ రోగులకు పునర్జన్మ ప్రసాదిస్తోంది హైదరాబాద్‌లోని ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రి. పేరుమోసిన కార్పొరేట్ ఆసుపత్రులు కూడా చేయలేని క్యాన్సర్ పునర్నిర్మాణ శస్త్రచికిత్సలను కూడా ఈ ఆసుపత్రి వైద్యనిపుణులు సాధ్యం చేసి చూపిస్తున్నారు. తల నుంచి పాదం వరకూ శరీరంలోని ఏ అవయవానికి క్యాన్సర్ సోకి భాగాన్ని తొలగించాల్సి వచ్చినా అన్నింటినీ తిరిగి అమర్చడంలో అద్భుతాలు సృష్టిస్తున్నారు. అవయవ భాగాలను తొలగించడంతో ఏర్పడిన అవకరాన్ని తమ అతి సూక్ష్మ శస్త్రచికిత్స నైపుణ్యంతో చక్కదిద్దుతున్నారు. అవయవాలు కోల్పోయిన క్యాన్సర్ రోగుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపడమే కాదు వాటిని పునఃసృష్టి చేసి పూర్వరూపాన్ని అందిస్తున్నారు. క్యాన్సర్ కారణంగా తొలగించిన అవయవాలను పునర్నిర్మించే చికిత్సలకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో రూ.6-10 లక్షల వరకూ ఖర్చవుతుండగా ఎంఎన్‌జేలో ఉచితంగానే చేస్తున్నారు. గత పదేళ్లలో నాలుగువేలకు పైగా పునర్నిర్మాణ శస్త్రచికిత్సలు చేయగా అందులో 90 శాతం మంది నిరుపేదలే కావడం ఆసుపత్రి అందిస్తోన్న విశిష్ట సేవలకు నిదర్శనం.



దవడకు క్యాన్సర్ సోకిన రోగి, క్యాన్సర్ శస్త్రచికిత్స చేసి కాలి ఎముకతో దవడ ఎముకను పునర్నిర్మించిన అనంతరం పూర్వరూపానికి వచ్చిన బాధితురాలు

అతి క్లిష్టం.. అయినా ప్రత్యేకం

- ప్లాస్టిక్ సర్జరీల్లో ఏ అవయవానికి శస్త్రచికిత్స అవసరమైతే దానికి సమీపంలోని కండరాన్నే తీసుకుంటారు. కానీ క్యాన్సర్ చికిత్సల్లో సమీపంలోని భాగాలన్నింటినీ తొలగిస్తారు. ఉదాహరణకు నోటి క్యాన్సర్‌లో పెదవులు, నాలుక, దవడ, ముక్కు కూడా తొలగించాల్సి వస్తుంది.
- దీంతో శరీరంలోని ఇతర భాగాల నుంచి అవసరమైన కండరాన్ని, ఎముకను వాటి రక్తనాళాలతో సహా తీసుకుని తొలగించిన అవయవ స్థానంలో అమరుస్తారు.
- గుండెకు బైపాస్ సర్జరీ చేసేటప్పుడు బృహద్ధమని (కరోనరీ ఆర్టరీ) పరిమాణం 3 మి.మీ. వరకూ ఉంటుంది. ఈ అవయవాల రక్తనాళాల పరిమాణం 2-2.5 మి.మీ. మాత్రమే. అందుకే వీటిని అతి సూక్ష్మ రక్తనాళాల శస్త్రచికిత్స (మైక్రో వ్యాస్కులర్ సర్జరీ)గా పిలుస్తారు.
- క్యాన్సర్లలో అధిక శాతం శస్త్రచికిత్సలు అతి సూక్ష్మమైనవే. వీటిని అత్యాధునిక మైక్రోస్కోప్ సాయంతో పూర్తి చేస్తారు.
- దేశం మొత్తమ్మీద ముంబయిలోని టాటా స్మారక క్యాన్సర్ ఆసుపత్రిలో ఈ తరహాలో ప్రత్యేక పునర్నిర్మాణ వైద్య బృందం ఉంది. రాష్ట్ర ప్రభుత్వ వైద్యంలో తెలంగాణలో మాత్రమే పునర్నిర్మాణ వైద్య బృందం సేవలందిస్తోందని వైద్యవర్గాలు తెలిపాయి.
- ఇతర రాష్ట్రాల్లోని క్యాన్సర్ ఆసుపత్రుల్లో, కొన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో అవయవ పునర్నిర్మాణ శస్త్రచికిత్సలు చేస్తున్నా వాటి సంఖ్య చాలా తక్కువ.

బలోపేతం చేయాలి

- ప్రస్తుతం ఎంఎన్‌జేలో ఒక ఆచార్యులు, ఒక సహ ఆచార్యులు, ఒక సహాయ ఆచార్యులు, ఆరుగురు పీజీ వైద్యవిద్యార్థులు.. ఒక యూనిట్‌గా సేవలందిస్తున్నారు.
- రోజూ కనీసం ఒక అవయవ పునర్నిర్మాణ శస్త్రచికిత్స అయినా చేయాల్సి వస్తోంది. దీంతో రోగులు వారాల తరబడి వేచిఉండాల్సి వస్తోంది.
- కనీసం మరో యూనిట్‌ను ఏర్పాటు చేస్తే ఎక్కువ మంది రోగులకు త్వరితగతిన సేవ లందించవచ్చు.
- శస్త్రచికిత్స గదులు మూడే ఉన్నాయి. కనీసం 10కి పెంచాలి.
- వైద్యులు, నర్సులు, సహాయకుల సంఖ్యనూ రెట్టింపు చేయాలి.
- ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, ఆక్యుపంక్చర్, కృత్రిమ అవయవాల తయారీ విభాగాలను కొత్తగా నెలకొల్పాలి.
- అత్యంత నైపుణ్యంతో కూడిన ఈ శస్త్రచికిత్సలపై ప్లాస్టిక్ సర్జరీ పీజీ వైద్యవిద్యార్థులు తప్పనిసరిగా శిక్షణ పొందాలని నిపుణులు సూచిస్తున్నారు.

95 శాతం విజయవంతం



క్యాన్సర్ శస్త్రచికిత్స చేయడానికి ముందే ఎంత భాగం తొలగించాల్సి వస్తుంది? దాన్ని పూడ్చడానికి ఎంత పరిమాణంలో కండరం, ఎముక అవసరమవుతుంది? ఎక్కడి నుంచి తీసుకోవాలనేది కసరత్తు చేస్తారు. రక్తనాళంతో పాటు ఎముక, కండరాన్ని తీసుకొచ్చి అతికించకపోతే వాటికి రక్తప్రసరణ జరగక చనిపోతాయి. శస్త్రచికిత్స తీవ్రత, అవయవాన్ని బట్టి 3-10 గంటల పాటు సమయం పడుతుంది. కండరాలు, ఎముకల్లో కొన్నింటిని తొలగించినా సాధారణ జీవనానికి ఎలాంటి ఆటంకాలుండవు. ఈ తరహా శస్త్రచికిత్సల్లో 95 శాతానికి పైగా విజయవంతమే.

– డాక్టర్ మణికుమారి బసవ, ప్లాస్టిక్, పునర్నిర్మాణ శస్త్రచికిత్స విభాగాధిపతి, ఎంఎన్‌జే

లోటును పూడ్చడం ముఖ్యం



క్యాన్సర్‌ను తొలి దశలో గుర్తిస్తే కొద్ది భాగాన్ని మాత్రమే తొలగించాల్సి వస్తుంది. ముదిరాక వస్తే క్యాన్సర్ సోకిన భాగంతో పాటు చుట్టూ ఉన్న భాగాలను కూడా తొలగించాలి. అవయవాన్ని తొలగించి తిరిగి పూడ్చకపోతే అది పెద్ద లోటే. ఉదాహరణకు దవడను తీసేస్తే మాట్లాడడం, మింగడం, నమలడం కష్టమవుతాయి. ఇలాంటప్పుడు పునర్నిర్మాణ శస్త్రచికిత్స అవసరం. దేశం మొత్తమ్మీద ప్రభుత్వ వైద్యంలో ఇలా ప్రత్యేక వ్యవస్థ ఎంఎన్‌జేలో మాత్రమే ఉంది.

– డాక్టర్ ముక్తా శ్రీనివాసులు, సర్జికల్ ఆంకాలజీ విభాగాధిపతి, ఎంఎన్‌జే

అందరికీ ఓటు హక్కు మన ఘనతే

- **విదేశాల పాత్ర ఏమీ లేదు**
- **ఐదుగురు అధికారుల కృషితో సాధ్యమైంది**
- **ఆధునిక భారత చరిత్ర పరిశోధకురాలు ఓర్నితి షానీ**

ఈనాడు, హైదరాబాద్: స్వాతంత్ర్యం వచ్చాక వయోజనులందరికీ ఓటుహక్కు కల్పించినా నేటికీ దళితులు, పేదలు, మహిళలపై వివక్ష తొలగిపోలేదని ఆధునిక భారత చరిత్ర పరిశోధకురాలు, రచయిత ఓర్నితి షానీ తెలిపారు. పేద, ధనిక, దళిత, గిరిజన, ఉన్నతవర్గాలనే భేదం లేకుండా వయోజనులందరికీ ఓటు హక్కు కల్పించడం అసాధ్యమని బ్రిటిష్ నాయకత్వం భావించిందన్నారు. మన రాజ్యాంగ సలహాదారు ఆధ్వర్యంలోని ఐదుగురు అధికారుల బృందం దీన్ని సుసాధ్యం చేసిందన్నారు. భారతదేశం తీసుకున్న ఈ నిర్ణయం వెనుక విదేశాల పాత్ర ఏమీ లేదన్నారు. తొలి ఎన్నికల నాటికి 21 ఏళ్లు నిండి ఓటు హక్కు పొందినవారు 17.3 కోట్ల మంది నమోదయ్యారని, జనాభాలో వీరి వాటా 41 శాతమని చెప్పారు. 'వయోజనులందరికీ ఓటు హక్కు - భారతదేశం ప్రజాస్వామ్యంగా ఎలా మారింది?'' అనే పుస్తకంపై శనివారమిక్కడ లామకాన్‌లో హెచ్‌సీయూ ప్రొఫెసర్ జ్యోతిర్మయి శర్మతో కలిసి రచయిత ఓర్నితి షానీ మాట్లాడారు. 'వయోజనులందరికీ ఓటు హక్కు కల్పించాలని 1947 నవంబరులోనే రాజ్యాంగ మండలి నిర్ణయించింది. కోట్లాది మంది వయోజనుల పేర్లను ఓటర్ల జాబితాలో చేర్చడం పెద్ద సవాల్. 1.8 కోట్ల మంది శరణార్థులు, 85 శాతం మంది నిరక్షరాస్యులు. ఎవరిని చేర్చాలి? ఎవరిని చేర్చకూడదన్న సందేహాలు తలెత్తాయి. ప్రజలు, ప్రజాసంఘాల వినతుల్ని పరిగణనలోకి తీసుకుని ఓటర్ల తొలి ముసాయిదా తయారుచేశారు. రాజ్యాంగం, ఎన్నికల చట్టం అమల్లోకి రాక ముందే ఇది సిద్ధమైంది. ఓటరు నమోదుకు మద్రాస్‌లో రెండు రోజులు సెలవు ప్రకటించారు. అక్కడి పారిశ్రామిక సంఘం కార్మికులకు సెలవు ఇవ్వకపోవడంతో ఆందోళన జరిగింది. ఉత్తరప్రదేశ్, అసోంలోని మహిళలు పేర్లు చెప్పకుండా ఫలానా వ్యక్తి భార్య, కూతురు అని నమోదు చేయాలని కోరారు. వారిని చైతన్యపరిచి ముసాయిదా జాబితాకు ముందుగానే 28 లక్షల మంది పేర్లను చేర్చారు' అని వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న రచయిత ఓర్నితిషానీ. చిత్రంలో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆచార్యుడు జ్యోతిర్మయి శర్మ

శ్రీవారి నిత్య నైవేద్య ప్రసాదం తయారీకి బెల్లం కొరత



శ్రీవారి బెల్లం పొంగలి

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి నిత్య నైవేద్య ప్రసాదం తయారీలో బెల్లం కొరత ఏర్పడింది. తితిదే మార్కెటింగ్ గోదాముల విభాగం అధికారుల నిర్లక్ష్యం కారణంగా సమస్య తలెత్తింది. శ్రీవారికి వివిధ రకాల ప్రసాదాలను నిత్యం నైవేద్యం సమయంలో నివేదిస్తారు. అనంతరం భక్తులకు ఉచితంగా పంపిణీ చేస్తుంటారు. ఇందులో బెల్లం పొంగలికి విశేష ప్రాధాన్యం ఉంది. బెల్లం నిల్వలు నిండుకోవడంతో ఆఖరుకు భక్తులు తులాభారం రూపంలో సమర్పించిన బెల్లాన్ని ప్రసాదం తయారీకి వినియోగించారు. అన్నప్రసాదంవద్దా నిత్యం సుమారు 650 కిలోల బెల్లంతో పొంగలి తయారు చేసి భక్తులకు వడ్డిస్తుంటారు. ఇక్కడా బెల్లం కొరత కారణంగా మూడు రోజులుగా చక్కెర పొంగలి తయారు చేసి వడ్డిస్తున్నారు. స్వామివారి ప్రసాదం తయారీకి సమస్య తలెత్తిన విషయం బహిరంగం కావడంతో తితిదే అధికారులు యుద్ధప్రాతిపదికన తిరుపతి నుంచి తిరుమలకు శనివారం సాయంత్రం 2వేల కిలోల బెల్లం తీసుకొచ్చారు. తిరుపతి గోదాములో 20వేల కిలోల బెల్లం ఉన్నా నాణ్యత పరీక్షల్లో ఆలస్యం కారణంగా దానిని వినియోగించుకోలేని పరిస్థితి తలెత్తింది.

31న శ్రీవారి ప్రత్యేక దర్శనాలు నిలిపివేత

చంద్రగ్రహణం కారణంగా శ్రీవేంకటేశ్వర స్వామి వారి ప్రత్యేక దర్శనాలన్నీ ఈనెల 31న రద్దుచేస్తున్నట్లు తిరుమల జేఈవో శ్రీనివాసరాజు వెల్లడించారు. ఉదయం 11 నుంచి రాత్రి 9.30 గంటల వరకు శ్రీవారి ఆలయ ద్వారాలు మూసివేయనున్నట్లు తెలిపారు. తిరుమలలో శనివారం జేఈవో విలేకరులతో మాట్లాడారు. గ్రహణానంతరం రాత్రి 9.30 గంటలకు ఆలయం తలుపులు తెరచి శుద్ధి, పుణ్యాహవచనం, రాత్రి కైంకర్యాలు నిర్వహిస్తామని, రాత్రి 10.30 నుంచి 12 గంటల వరకు భక్తులకు సర్వదర్శనం ఉంటుందన్నారు. గ్రహణం కారణంగా ప్రత్యేక ప్రవేశ దర్శనాలు, దివ్యదర్శనం టోకెన్ల జారీ తదితరాలన్నీ రద్దుచేస్తున్నట్లు వెల్లడించారు. ఉదయం వీఐపీ బ్రేక్ దర్శనం ప్రొటోకాల్ పరిధిలోని ప్రముఖులకే పరిమితం చేశారు.

కార్గిల్‌లో –15 డిగ్రీల ఉష్ణోగ్రత

దిల్లీ: ఉత్తర భారతాన్ని చలిపులి వణికిస్తోంది. కశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్‌లలో ఉష్ణోగ్రతలు సున్నా డిగ్రీల కంటే దిగువకు పడిపోగా.. దిల్లీ, పంజాబ్, హరియాణాల్లో చలి తీవ్రంగా ఉంది. గడ్డకట్టుకుపోయేలా జమ్మూ-కశ్మీర్‌లోని కార్గిల్‌లో -15, లేహ్‌లో -11.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మిగతా ప్రాంతాల్లోనూ కనిష్ఠ ఉష్ణోగ్రతలు -5.2 నుంచి -8.3 డిగ్రీల మధ్య ఉన్నాయి.

రాయితీ పత్రాల్లో 'దివ్యాంగ'పదమే వాడాలి

దిల్లీ: దివ్యాంగులకు జారీ చేసే రాయితీ పత్రాల్లో.. ఇకపై 'వికలాంగ'కు బదులుగా 'దివ్యాంగ' పదాన్నే పేర్కొనాలని రైల్వే నిర్ణయం తీసుకుంది. దాదాపు రెండేళ్ల క్రితం ప్రధాని మోదీ.. దివ్యాంగులకు గౌరవకరంగా ఉండేలా ఈ కొత్త పదం వాడాలని సూచన చేసిన సంగతి తెలిసిందే. దీనికి అనుగుణంగా మార్పులు చేయాలని రైల్వే తాజాగా నిర్ణయించింది. 'అంధుల'కు బదులుగా 'దృశ్యపరమైన వైకల్యం ఉన్నవారు', 'బధిరుల'కు బదులుగా 'వినికిడి, శ్రవణపరమైన వైకల్యం ఉన్నవారు'గా పేర్కొనాలని అన్ని విభాగాలకు రైల్వే మంత్రిత్వశాఖ ఆదేశాలు జారీచేసింది. ఫిబ్రవరి 1 నుంచి వీటిని అమలు చేయనున్నారు.

ఐ1 కార్ రేసింగ్ పేరుతో రూ.7.5 కోట్ల స్వాహా

- **మజ్‌దార్ స్పోర్ట్స్ ఎండీ దర్శన్ ఊతప్ప అరెస్ట్**



దర్శన్ ఊతప్ప

ఈనాడు, హైదరాబాద్: ఫార్ములా వన్ కారు రేసుల తరహాలో భారతదేశంలో ఐ1కార్ రేసుల పోటీల నిర్వహణ హక్కులు ఇస్తామంటూ రూ.7.5కోట్లు స్వాహా చేసిన బెంగళూరు వాసి మజ్‌దార్ స్పోర్ట్స్ ఎండీ దర్శన్ ఊతప్పను సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త కె.రఘురామ కృష్ణంరాజుకు చెందిన ఇండ్-భారత్ స్పోర్ట్స్ కంపెనీ నుంచి మజ్‌దార్ స్పోర్ట్స్ కంపెనీ ప్రతినిధులు ఆ మొత్తాన్ని తీసుకున్నారు. ఐ1 కార్ రేసుల పోటీలను నిర్వహించకపోవడంతో ఇండ్-భారత్ కంపెనీ కోర్టును ఆశ్రయించింది. కోర్టు ఆదేశాల మేరకు గతేడాది కేసు నమోదు చేసుకున్న పోలీసులు మజ్‌దార్ స్పోర్ట్స్ కంపెనీ ప్రతినిధులకు సమన్లు జారీ చేశారు. విచారణకు హాజరుకాకపోవడంతో సీసీఎస్ పోలీస్ అధికారులు బెంగళూరుకు శుక్రవారం వెళ్లి దర్శన్ ఊతప్పను అదుపులోకి తీసుకున్నారు. నాంపల్లి కోర్టులో శనివారం హాజరు పరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. అజ్ఞాతంలో ఉన్న ముగ్గురు నిందితుల కోసం గాలిస్తున్నామని డీసీపీ (నేర పరిశోధన) అవినాష్ మహంతి తెలిపారు. భారతదేశంలో కార్ల రేసుల పోటీలు నిర్వహించేందుకు ఏడేళ్ల క్రితం బెంగళూరుకు చెందిన మజ్‌దార్ మోటో స్పోర్ట్స్ లిమిటెడ్ ప్రణాళికను రూపొందించింది. కంపెనీ ప్రతినిధులైన దక్కన్ క్రానికల్ ఎండీ వినాయక రెడ్డి కుమార్తె అంజనా రెడ్డి, కర్ణాటక రాష్ట్రానికి చెందిన వినోద్, సుధీంద్ర మేనన్, దర్శన్ ఊతప్పలు ముంబయి, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌లో ఐ1 కార్ రేసింగ్ ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. చెన్నై ఫ్రాంఛైజీగా హక్కులు ఇస్తామంటూ ఇండ్-భారత్ స్పోర్ట్స్‌తో 2011లో ఒప్పందం కుదుర్చుకున్నారు. దీంతో ఇండ్-భారత్ స్పోర్ట్స్ రూ.7.5కోట్లను మజ్‌దార్ స్పోర్ట్స్‌కు చెల్లించింది.

బడ్జెట్‌లో నీటిపారుదలకు 25 శాతం కేటాయింపులు

- **విదేశీ ప్రతినిధుల సమావేశంలో ప్రత్యేక సీఎస్ ఎస్కే జోషి**



విదేశీ ప్రతినిధుల సమావేశంలో జోషి, మల్సూర్

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులు, మిషన్ కాకతీయ పథకం అమలు నీటిపారుదల రంగంలోనే వినూత్న విజయాలని నీటిపారుదలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి తెలిపారు. రాష్ట్ర బడ్జెట్‌లో నీటిపారుదల రంగానికి 25 శాతం కేటాయిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ సంక్షేమ పథకాలపై అధ్యయనానికి వచ్చిన 19 దేశాలకు చెందిన ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గొలుసుకట్టు చెరువుల పునరుద్ధరణకు సీఎం మిషన్ కాకతీయకు రూపకల్పన చేసినట్లు చెప్పారు. ఈ పథకంలో గ్రామీణ ఆర్థిక, సామాజిక స్థితిగతుల్లో అనూహ్య మార్పులొస్తున్నాయన్నారు. పలువర్గాల ప్రజలకు చెరువులు తిరిగి పునరుజ్జీవాన్ని ఇస్తున్నాయని తెలిపారు. రూ.80 వేల కోట్లతో చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కింద 90 రోజులపాటు 2టీఎంసీల చొప్పున ఎత్తిపోయనున్నట్లు వివరించారు. 18.26 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు, మరో 18.82 లక్షల ఎకరాల స్థిరీకరణ ఈ ప్రాజెక్టు లక్ష్యమన్నారు. తెలంగాణను కోటి ఎకరాల మాగాణంగా మార్చాలన్న దీర్ఘకాలిక వ్యూహంతో సీఎం ఈ ప్రాజెక్టు చేపట్టారని జోషి ప్రతినిధులకు వివరించారు. కార్యక్రమంలో కాడా కమిషనర్ మల్సూర్, వివిధ దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరించిన మంత్రి

హైదరాబాద్ ఇంజినీర్స్ అసోసియేషన్ డైరీని నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు టి.వెంకటేశం, అధ్యక్షుడు సి.మహేందర్, ప్రధాన కార్యదర్శి చక్రధర్, ప్రతినిధులు నరహరి, హరిరాం, వేణు, రాజశేఖర్ పాల్గొన్నారు. మరో కార్యక్రమంలో కల్వకుర్తి ప్రాజెక్టు పనులను మంత్రి సమీక్షించారు. నాగర్‌కర్నూలు ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఇటీవల నిర్వహించిన జలవిజయ యాత్రలో ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



వధువు కావలెను

Kapu 26 5'10" B.E (NIT) MNC 22LPA ★ 27 6' B.E(Bits) 20LPA 50Cr ★ 29 5'9" MD (Pedie) 40Cr ★ 28 5'10" BE (Bits) MS 170K ★ 24 5'7" M.Tech (IIT) ★ 9989019945 (A)

Sc: 27/ 5'8"/ MBBS/MS/ ఆర్థో చేసిన సెటిల్డ్ వరునికి తగిన వధువు కావలెను. 9494038701 (A)

విశ్వబ్రాహ్మిన్: 28/ 5'9"/ MBBS, MS/ ఆర్థో చేసిన మంచి సాంప్రదాయమైన వెల్‌సెటిల్డ్ వరునికి తగిన వధువు కావలెను. 8125210356 (A)

కమ్మ: 27/ 5'10"/ MBBS, MD, జనరల్ మెడిసిన్ చేసిన వెరీవెల్ సెటిల్డ్ వరునికి తగిన వధువు కావలెను. Ph: 9494038601 (A)

కమ్మ 28Y, 5'11" Fair BE, 35L P/A Job in బెంగుళూర్, ★ రెంటల్ 20L P/A, 12 Cr ప్రాపర్టీ తగిన కమ్మ వధువు కావలెను. ✆ 73863 38574. (B)

కాపు/ 28 సం॥/ 5'7"/ B.Tech/ BITS Pilani/ USA బిజినెస్ వీసా కల్గిన వరునికి తగిన అందమైన వధువు కావలెను. ✆ 88855 04555. (B)

క్షత్రియ రాజులు, ఆంధ్రాబ్యాంకులో జాబ్, సొంత ప్లాటు, 44Y వరుడునకు పేద, మధ్యతరగతికి చెంది, హౌస్‌వైఫ్‌గా స్థిరపడిన వధువు కావలెను. ✆ 79894 46987. (B)

కాపు (డైవర్సీ)/ 33 సం॥/ 5'5"/ గల వరునికి తగిన వధువు కావలెను. ✆ 88855 04555. (B)

రెడ్డి, డైవర్సీ / 38, 5'6"/ సొంత బిజినెస్ 80k pm,/ 3Cr ఆస్తిగల/ వెల్‌సెటిల్డ్ వరుడికి/ వధువు కావలెను. కుల, ఆస్తి, పట్టింపులేదు./ 8519914020/ 8519914060 (A)

యాదవ వధువు / కావలెను. MBA,/ 34 PVT జాబ్, 50k, pm/ 5'6" (ఆస్తి గల) విజయవాడ 9948041936/ 9912490167/ gsubumba@gmail.com (A)

కమ్మప్రత్యేకం / 40Cr,/ B.Tech, Ind/ B.Tech/ MS,/ USA,/ 2వ, పెళ్ళి వరులకు/ వధువు కావలెను./ శారద:- 9849413031 (A)

విశ్వబ్రాహ్మణ / 38, 5'8"/ 20,000 విడోయర్ Hyd/ 60L స్వంత ఇల్లు (9-8సం॥ మగ పిల్లలు) గల వరునికి/ అందమైన వధువు కావలెను. (డైరెక్ట్)/ 9059397210 (A)

CNB 45Years Rly Employee Salary 70K pm Legal Divorcee No. Children 5'7" Height Hyderabad Ph: No. 9676564376. (A)

బ్రాహ్మణ వైదిక కేశిక 31, ఇంటర్మీడియట్ పురోహిత క్రిష్ణాజిల్లా నెలకు 25,000 కట్నప్రసక్తిలేదు. డైరెక్ట్ సంప్ర: ✆ 9966247252 (A)

రెడ్డి 27/5' 10" B.Tech (IIT)/ MS/ SWE 2 Lakhs P.M, 15Cr ప్రాపర్టీగల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. (కట్నం ముఖ్యం కాదు) ✆ 8019864386 (A)

విశ్వబ్రాహ్మణ 27/ 5'8", B.Tech SWE, MNC 90,000 PM వరునికి సాంప్రదాయక కుటుంబానికి చెందిన తగిన వధువు కావలెను. 9959961341 (A)

Kamma/ B.Tech, IIT, MS/ 5'11"/ 25/ 120K/ 5 Cr ★ B.Tech, BITS, MS/ 5'11"/ 27/ 140K/ 10 Cr ★ BEMS/ 5'11"/ 26/ 160K/ 10 Cr ★ తుమ్మల సుజాత: 98482 17771, 0866 - 2433788. (B)

Kamma/ M.Tech/ 5'9"/ 29/ AEE, Govt/ 25 Cr ★ Group-1/ 5'8"/ 28/ 10 Cr ★ B.Tech/ 26/ AE, Govt/ 5 Cr ★ B.Tech/ 5'11"/ 26/ Bank PO/ 13 Cr. తుమ్మల సుజాత: 99632 32758. (B)

Kamma/ MS, Genl/ 5'9"/ 26/ 10 Cr ★ MD, Genl/ 6'/ 26/ 15 Cr ★ DM/ 5'11"/ 28/ 3 Cr ★ DM/ 6'/ 28/ 15 Cr ★ MD Radio/ 27/ 200 Cr. తుమ్మల సుజాత: 81217 95786. (B)

Kamma/ B.Tech, BITS, MBA, IIM/ 6'/ 26/ 35/ LPA/ 5 Cr ★ B.Tech, IIT, MBA, IIM/ 6'/ 29/ 24 LPA/ 60 Cr ★ B.Tech/ IIT/ 27/ 48 LPA. తుమ్మల సుజాత: 81217 95786. (B)

బెస్త/ M.Tech/ C.Govt Asst. మేనేజర్ (కెనరా బ్యాంక్)/ 55000/-PM/ 5'9" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 7288048678 (A)

> 'పెళ్ళిపందిరి' ప్రకటనలు పాఠకులకు అనుకూలంగా వర్గీకరించి ప్రచురింపబడతాయి. ఈ విషయంలో ఎట్టి కంప్లయింట్లకు ఆస్కారం లేదు.

SC మాల/ M.Tech/ C.Govt A.E (R&B)/ 70,000/-PM/ 5'10" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9581317506 (A)

విశ్వబ్రాహ్మణ/ M.Tech/ C.Govt టెక్నికల్ Asst. (ECIL)/ 68000/-PM/ 5'10" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను ✆ 8886512010 (A)

మాదిగ/ M.Tech/ C.Govt A.E (BPCL)/ 80,000/-PM/ 5'10" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 8886512010. (A)

మాల/ B.Tech, MBA/ C.Govt డిప్యూటీ మేనేజర్ (SBI)/ 11 Lakhs P.A/ 5'11" ఎత్తు/ 29 సం॥ల వరునికి తగిన వధువు కావలెను ✆ 9703794175 (A)

క్రిస్టియన్ మాదిగ/ M.Tech/ Govt.సివిల్ కస్టమ్స్ ఎక్సైజ్ ఆఫీసర్/ 9 Lakhs. P.A/ 5'10" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9985395014 (A)

గౌడ/ M.Tech/ C.Govt క్వాలిటి కంట్రోల్ ఆఫీసర్ (FCI)/ 10 Lakhs. P.A/ 5'10" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9885299854 (A)

బ్రాహ్మణ హరితస 36Y, 5'10" Fair డిగ్రీ ప్రైవేటు జాబ్ వరుడునకు సాంప్రదాయమైన వధువు కావలెను. నోబ్రోకర్స్ ✆ 9030413412 (A)

గంగపుత్ర, బెస్త: B.Tech/ C.Govt. ఎలక్ట్రికల్ ఇంజనీర్/ BHEL/ 62,000/- PM 6' ఎత్తు, 29 సం॥ల V.Fair వరునికి వధువు కావలెను. ✆ 9618007823 (A)

వడ్డెర: CA/ చార్టర్డ్ అకౌంటెంట్/ 1 Lack PM, 5'10" ఎత్తు, 29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. ✆ 9618007823 (A)

వాల్మీకిబోయ: B.Tech/ C.Govt. ఎలక్ట్రికల్ ఇంజనీర్/ రైల్వేస్/ 60,000/- PM 5'11" ఎత్తు 29 సం॥ల V.Fair వరునికి వధువు కావలెను. ✆ 9618007823 (A)

రజక: B.Tech/ C.Govt సైంటిస్ట్/ DRDO/ 60,000/- PM, 5'10" ఎత్తు, 28 సం॥ల V.Fair వరునికి వధువు కావలెను. ✆ 9618008271 (A)

కమ్మ: B.Tech/ C.Govt, JTO/ BSNL/ 55,000/- PM 6' ఎత్తు, 27 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. ✆ 8297439565 (A)

క్రిష్టియన్ మాల: B.Tech/ C.Govt. ACIO/ ఇంటలిజెన్స్ బ్యూరో/ 70,000/- PM, 5'11" ఎత్తు, 29 సం॥ల V.Fair వరునికి వధువు కావలెను. ✆ 9618009352 (A)

పద్మశాలి: B.Tech/ C.Govt సైంటిస్ట్/ ISRO/ 85,000/- PM, 5'10" ఎత్తు, 28 సం॥ల V.Fair వరునికి వధువు కావలెను. ✆ 9908222406 (A)

క్షత్రియ/ 31/ 5'9"/ Fr/ కుల, కట్న ప్రసక్తిలేని/ PG/ Sr. SWE/ Hyd/ 50,000/- PM చాలా వెల్‌సెటిల్డ్ వరుడికి/ తగిన/ సాంప్రదాయ కుటుంబపు వధువు కావలెను. ✆ 8374883874. అర్జంట్. (A)

పద్మశాలి/ కుల/ కట్న ప్రసక్తిలేని / విడోవర్ / 40/ 5'7"/ Fr/ PG/ C.Govt. Job/ Hyd/ 60,000/- PM చాలావెల్‌సెటిల్డ్ వరునికి/ తగిన వధువు కావలెను. ✆ 9966538381 అర్జంట్. (A)

Kapu Naidu-30/6'/ MBA (UK) Job UK 40 L, P.A & 33/5'8" MCA, HYd, 50,000/- P.M. వరుడికి P.G/Proffe. వధువు కావలెను. Ph. 7032252439. (A)

కమ్మ/ 36 Y/ 5.10/ Late Marriage Property - 80 లక్షలు వరునికి మొదటి లేదా రెండవ వధువు కావలెను. డైరెక్ట్ ✆ 70956 02210 (J)

SC హిందూమాల (కట్నప్రసక్తిలేదు) 27/5'10" B.Tech/ SWE/ IBM 85,000/- PM అందమైన వెల్‌సెటిల్డ్ వరుడికి తగిన వధువు కావలెను. ✆ 9246151501 (A)

కమ్మ: లేట్ మ్యారేజ్/ B.Tech/ 39 Y/ 5'11" 10 కోట్ల ఆస్తి కలిగి, జాబ్ + బిజినెస్ చేస్తూ నెలకు లక్ష రూ॥ల పైబడి ఆదాయం కలిగిన వరునికై (అర్జంట్)గా సంప్ర॥ 8885592890 (A)

రజక 27/5'10" B.Tech IIT S/W/E IBM 85,000/-PM అందమైన వెల్ సెటిల్డ్ వరుడికి తగిన వధువు కావలెను. ✆ 9246333320 (కట్న ప్రసక్తిలేదు) (A)

వైశ్య 29 5'11" ఫెయిర్ M.Tech P.hd Asst మేనేజర్ HCL C.Govt 75 వేలు P/M వెల్‌సెటిల్డ్ వరుడికి అందమైన వధువు కావలెను. అర్జెంట్ ✆ 9948005247 (A)

గౌడ (కట్న ప్రసక్తిలేదు) 27/ 5'10" B.Tech/ SWE/ TCS 80,000/- PM అందమైన వెల్‌సెటిల్డ్ వరుడికి తగిన వధువు కావలెను. ✆ 9246964555 (A)

కమ్మ 10 కోట్ల ప్రాపర్టీ 29 5'11" M.Tech SWE Well Program 15 లక్షలు P/A వెల్‌సెటిల్డ్ వరుడికి అందమైన వధువు కావలెను. ✆ 9666148352 (A)

ముదిరాజ్ (కట్నప్రసక్తిలేదు) 27/ 5'10" B.Tech/ SWE/ SIEMENS 1 Lac P.M. అందమైన వెల్‌సెటిల్డ్ వరుడికి తగిన వధువు కావలెను. ✆ 9246555529 (A)

యాదవ 27/5'10" M.Tech IIT S/W/E IBM 85,000/-PM అందమైన వెల్ సెటిల్డ్ వరుడికి తగిన వధువు కావలెను. (కట్నప్రసక్తిలేదు) ✆ 9246171703 (A)


ఈ ఆచారం చాలా వింత గురూ!!

ప్రపంచంలోనే కాదు, భారతదేశంలో కూడా ఎన్నోరకాల తెగల ప్రజలున్నారు. సామాజిక, వాతావరణ పరిస్థితులను అనుసరించి ఒక్కో తెగ ఒక్కోరకమైన జీవన విధానాన్ని, సంప్రదాయాన్ని ఏర్పరచుకుంటుంది. ఆ సంప్రదాయాలు సరిగ్గా అమలు జరిగేలా ఆయా తెగల పెద్దలు ఎప్పుడూ మార్గనిర్దేశం చేస్తుంటారు. కొన్ని తెగల్లో కట్టుబాట్లు, ఆచారాలు భిన్నంగానూ, వింతగానూ, కష్టంగా కూడా ఉంటాయి. ముఖ్యంగా పెళ్లి విషయంలో ఈ ఆచారాలు మరీ వింతగా ఉంటాయి. దాదాపు అన్ని తెగల్లో ఆచారాల ప్రకారం ముందు పెళ్ళి, ఆ తర్వాత శోభనం, సంసారం, పిల్లలు.. ఇలా ఉంటుంది వివాహ క్రమం. కానీ తమిళనాడులోని నీలగిరి అడవుల్లో నివసిస్తున్న 'టోడ' అనే ఒక తెగ సంప్రదాయం మాత్రం ఇందుకు భిన్నంగా ఉంటుంది. ప్రపంచంలో ఎన్నో వింత వివాహ పద్ధతులు ఉన్నా.. ఈ టోడల వివాహ పద్ధతి మాత్రం విడ్డూరమే! అదేంటో చూద్దాం..!!

కొన్ని వందల సంవత్సరాలుగా టోడ తెగవారు ఈ వింత పెళ్లి ఆచారాన్ని పాటిస్తున్నారు. ఆచారం ప్రకారం ఇరువైపుల పెద్దవారు కలిసి కూర్చుని పెళ్ళిని కుదుర్చుకుంటారు. వారు అనుకున్న సమయానికి అమ్మాయికి, అబ్బాయికి పెళ్లి చేస్తారు. తర్వాత వారిద్దరినీ ఓ నెల రోజుల పాటు ఒకే ఇంట్లో ఉంచేస్తారు. నెల రోజులు కాపురం చేసిన తర్వాత ఆమె తన తల్లిదండ్రుల వద్దకు వెళ్ళిపోతుంది. అక్కడకు వెళ్లిన కొన్నిరోజులకు ఆమె గర్భవతి అని తేలాలి. లేదంటే ఆ పెళ్లి రద్దయిపోయినట్లే! తర్వాత ఆ అమ్మాయికి మరొకరితో పెళ్లి చేస్తారు. అతనితో కూడా ఆ అమ్మాయి ఓ నెలరోజులు కాపురం చేసి తల్లిదండ్రుల వద్దకు వెళ్లిపోతుంది. రెండు, మూడుసార్లు పెళ్లి చేసుకున్నా కూడా ఆమె గర్భవతి కాకుంటే ఇక ఆమె జీవితాంతం పుట్టింట్లో ఉండిపోవాల్సిందే!

ఒకవేళ తల్లిదండ్రుల వద్దకు వెళ్ళిన తర్వాత ఆ అమ్మాయి గర్భవతి అయితే పుట్టింట్లోనే ఆమె ఏడు నెలలపాటు ఉంటుంది. ఏడు నెలలు పూర్తిచేసుకున్న తర్వాత ఆమె భర్త అడవిలోకి వెళ్లి టోడ జాతి అతిపవిత్రంగా భావించే ఓ చెట్టు కొమ్మను నరికి దానితో విల్లును, బాణాన్ని తయారుచేసి భార్యకు ఇస్తాడు. ఆ బాణం, విల్లు ఆ అమ్మాయికి నచ్చినట్లయితే ఆమె అతడ్ని తన భర్తగా ఒప్పుకుంటుంది. అలాగే పుట్టబోయే బిడ్డకు అతను తండ్రి అని అంగీకరిస్తుంది.

తరువాత పెద్దల అంగీకారంతో వారిద్దరూ భార్యాభర్తలుగా మారిపోతారు. ఒకవేళ అతను తెచ్చిన విల్లు, బాణం ఆమెకు నచ్చనట్లయితే అతను మళ్ళీ మళ్ళీ ప్రయత్నం చేయాలి. అలా ఆమెకు నచ్చే వరకు అతను ప్రయత్నాలు చేస్తూనే ఉండాలి. ఎప్పుడైతే ఆమెకు విల్లు, బాణం నచ్చుతుందో అప్పుడు ఆ జాతి పెద్దలు ఘనంగా పండుగ చేసి వారిద్దరినీ ఏకం చేసి భార్యాభర్తలుగా నిర్ణయిస్తారు.



అప్పటివరకు వారిద్దరూ ఒకరికొకరు తెలియనివారిలా ఉండాలి. పెళ్లి అయిన తర్వాత శృంగారంలో పాల్గొన్నప్పటికీ పూర్తిస్థాయిలో భార్యాభర్తలు అయ్యేది కేవలం తల్లిదండ్రులు అయినప్పుడే! ఈ వివాహ సంప్రదాయం కొన్ని వందల సంవత్సరాలుగా వస్తోందని టోడ జాతి పెద్దలు చెబుతున్నారు. ఇప్పటివారిలో కొందరు తమ జాతి వివాహపద్ధతిని వ్యతిరేకించారని, వారిని తమ జాతి నుంచి బహిష్కరించామని ఆ జాతి పెద్దలు చెప్పుకుంటున్నారు.

"ఈ పద్ధతిని వెనుకబాటుతనం అని కొంతమంది సామాజిక కార్యకర్తలు అంటున్నారు. మాది వెనుకబాటుతనం కాదు. మేం చేసేదాంట్లో ఎటువంటి తప్పూ లేదు. మేం మా జాతి సంప్రదాయాన్ని కాపాడుకుంటూ వస్తున్నాం అంతే! అయినా మా దేవుడు ఎప్పుడు కూడా భార్యాభర్తలను విడదీయలేదు. కాస్త ఆలస్యంగా అయినా వారిని కచ్చితంగా కలుపుతాడు" అని చెబుతున్నాడు టోడలజాతి నాయకుడు. ఇప్పుడిప్పుడే ఈ టోడ జాతివారు సాధారణ జీవనానికి అలవాటు పడుతున్నా.. వివాహ సంప్రదాయాలు మాత్రం మార్చుకోవడానికి వారు ఇష్టపడటం లేదు.

- ఉమామహేశ్వరి

ఈ కథనాలపై మీ అభిప్రాయాలు, సూచనలు **pelli@eenadu.net** కు మెయిల్ చేయండి.

బ్రాహ్మణ: 35yrs, 5'6"/ Deg/ Own House, Well Settled అందమైన వరునికి తగిన వధువు కావలెను. ✆ 9347584743, Any Caste ఆసక్తి కలవారు నేరుగా సంప్రదించండి. (A).

Caste No Bar Brahmin 38yrs height 5'3" M.C.A, PGDCA, 60,000 per month required any Degree or PG Birde ✆ 9959003965 Direct (A).

బ్రాహ్మణ 39, 5'7" కౌండిన్యస, MNC (Asst. Manager) లో పనిచేయుటకు వరునికి తగిన వధువు కావలెను. Ph: 040-27640842/ 7095968579 (A).

Kamma 30yrs, 5'7" Fair, B.Tech, Sr Software Engineer (PEGA) Cognizant USA. Same Caste Bride from Good Family. Cell: 7075082115, Sreedevi (Sister) (A).

కాపు 48Y, IInd 5'10" Job, 45K PM, వరునకు 44Y, లోపు FC/ BC, 1st or IInd (పిల్లలు లేని విడో/ డైవర్సీ) వధువు కావలెను. డైరెక్టు ✆ 8297753527 (A).

వెలమ/ బి.టెక్/ MBA/ 6'/ ఫెయిర్/ 39Y/ US రిటర్న్ వెల్‌సెటిల్డ్ హైద్రాబాద్‌లో స్వంత ఇండస్ట్రీ గల వరునికి తగిన చదువు, అందము, ఎత్తుగల 33 సం॥లోపు మొదటి సంబంధము వధువు కావలెను. డైరెక్ట్ సంప్ర: ✆ 9492148252 (A)

పద్మశాలి: 28Y/ 5'8"/ B.Tech (ECE), MBA (IIM), S/W in Alshaya/ 36 Lakhs P/A/ One Crore property ఉన్న వరునికి తగిన వధువు కావలెను. 93938 63645 (D)

Kamma/ 28/6'/ IIM/ MBA/ 10L PA/ 20Cr ★ 30/5'11"/ IIT/ B.Tech/ MS 15L PA 6Cr for Quick Marriage ★ Shyam ✆ 9949233422/ Blue Trend Matrimonial (P) Ltd. (A)

కాపు 40సం॥ 6 ఫీట్స్ 20 కోట్లు ప్రాపర్టి వెల్‌సెటిల్డ్ రెండవ వరుడికి రెండవ వధువు కావలెను. ✆ 8341936665 (A)

CNB, ANB, 44 Yr, ఫెయిర్, 5'.6" హిందు C. Govt. Mgr. 1 Lac PM; 2 Kids; నో ప్రోపర్టీస్ 2వ మేరేజ్/ తోడు వరుడుకు సపోర్టు చేయగల వధువు కావలెను. నో బ్రోకర్స్: savethe5goddess@gmail.com (C)

గవర్నమెంట్ M.S. డాక్టరు 32 సం॥లు SC Caste అబ్బాయికి డాక్టరు చదివిన అమ్మాయి కావలెను. Caste Nobar. సంప్ర:- ✆ 9603005634 (నోబ్రోకర్స్) (C)

బ్రాహ్మణ 28, B.Tech MBA 16L ★ 31, 5'10" B.Tech (IIT) 20L ★ 24 BE (BITS) 12L ★ 26, B.Tech MS (US) $ 80K ★ 27, MD ✆ 9494096081 (A).

★ ★ ★

మదిరాజ్ 29/ 5'8". B.Tech (SWE) TCS 19-L PA. 1C. ఆస్తిగల వెల్ సెటిల్డ్ వరుడికి తగిన వధువు కావలెను No-బ్రోకర్స్ ✆ 8897091964 (A)

రెడ్డి Age 31 ఒక కోటి ఆస్తి గల 1 సం. డైవర్స్ అయిన ఏకైక అబ్బాయికి పెళ్లికాని అందమైన పేద/ మధ్యతరగతి అమ్మాయి కావలెను. OC/ BC, జాబ్ మేనేజర్, జీ॥ 26 వేలు. 9494463016 (Whapp) (N)

క్రిస్టియన్ BC, 38 సం. డైవర్సీ వరుడికి వధువు కావలెను. నో ప్రాపర్టీ. ఇల్లరికం ఐనా OK. కుల పట్టింపు లేదు. డైరెక్ట్ సం॥ 8686894862. (N)

CNB 50, 5'5" BE Working in MNC Hyderabad seeks suitable bride mail to nayigroom@yahoo.com or ✆ 7981947669 (A)

★ ★ ★

హిందుమాల: 25Yrs 5'9" B.Com Computers, 36,000PM వరునికి వధువు కావలెను. Ph: 9246960888 (A)

Kamma 28Yrs, 5'10" B.Tech, MS, SWE, USA, 135K.PA, 2.5 Crores Property గల వరుడికి తగిన వధువు కావలెను. Ph: 7207930999 (A)

కమ్మ 26, 6" M.Tech, Ph.D, అసిస్టెంట్ ప్రొఫెసర్ 87 వేలు జీతం 4 కోట్లు వరునకు B.Tech, MCA, MBA, B.Sc, M.Sc వధువు కావలెను. ✆ 93476 35086, తెనాలి. (I)

మున్నూరుకాపు / 26సం॥/ 5'10" ఎత్తు/ B.Tech/ S.W.E/ 50K PM/ 10Cr/ V.Fair/ వెల్‌సెటిల్డ్ వరుడికి తగిన వధువు కావలెను. ✆ 9949877738. (A)

కుల పట్టింపులేదు మొదటిపెళ్లి 39సం॥ 5' 7 Inch MBA మంచి ఉద్యోగం సొంత ఇల్లు కల్గిన వరుడికి వధువు కావలెను. డైరెక్ట్ ✆ 9603710493 (A)

వైదిక బ్రాహ్మణ 5'7", 31yrs/ MCA, SWE జాబ్ PA: 12 Lakhs గల అందమైన వరుడికి మధ్యతరగతి కుటుంబం నుండి డిగ్రీ/ PG చదివిన వధువు కావలెను. (నో బ్రోకర్స్) ✆ 7095366570 (A).



వరుడు కావలెను

Kapu 22 5'4" B.E(NIT) MBA (IIM) 5Cr ★ 23 5'5" B.E MBA 15Cr ★ 23 5'4" B.E MNC 20Cr ★ 24 5'5" B.E MS 90K 10Cr ★ 25 5'5" MBBS MS(GS) 10Cr ★ 8790017711 (A)

పద్మశాలి: 25/ 5'4"/ MBBS, MS, DGO గైనిక్ చేస్తున్న మంచి సాంప్రదాయంగల వధువుకు తగిన వరుడు కావలెను. 7675984352 (A)

క్షత్రియ: 26/ 5'3"/ MBBS, MD, పీడియాట్రిక్స్ చేస్తున్న అందమైన సెటిల్డ్ వధువుకి తగిన వరుడు కావలెను. Ph: 9885173902 (A)

యాదవ: 25/ 5'4"/ MBBS, MD చేస్తున్న మంచి ప్రాపర్టిగల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. 8125210344 (A)

బలిజ, 33, 5'5", MS IT ఆస్ట్రేలియా PR ఉన్న అందమైన వధువుకి MS చదివి ఆస్ట్రేలియాలో జాబ్ చేస్తున్న వరుడు కావలెను. OC క్యాస్ట్‌వారు కావలెను. నో బ్రోకర్స్. ✆ 9959565575 (A)

కమ్మ 28Y, 5'5" Fair B.Tech డిజైన్ ఇంజనీర్ Hyd, 6L P/A, 2.5 Cr తగిన కమ్మ వరుడు కావలెను. ✆ 73863 38574. (B)

రెడ్డి విడో, 35, 5'5" ఫేర్, సొంత బిజినెస్ 40k రెంట్స్ 30k, 2Cr ఆస్తి గల ఒంటరి వధువుకు వరుడు కావలెను. కుల, ఆస్తి పట్టింపు లేదు. 9951619273/ 9666376030 (A)

రెడ్డి, విడో, / 35, 5'5"/ ఫేర్ గౌట్‌జాబ్/ 60k, రెంట్స్ 30k/ గల ఒంటరి వధువుకు/ వరుడు కావలెను./ కుల, ఆస్తి/ పట్టింపులేదు. 9505437430/ 9966871719 (A)

కమ్మ, 26Y 5'5"/ B.Com, పెళ్ళి/ అయిన వారానికి విడో,/ ఆస్తి, గల వధువుకి/ వరుడు కావలెను. కులప్రసక్తి లేదు. (బిజినెస్ or జాబ్) 040-48529711/ 9100634922 (A)

కాపు, 24,/ 5'4", B.Tech/ SWE/ 40K, వెల్‌సెటిల్డ్/ ఫ్యామీలి కలిగిన/ అందమైన వధువుకు (SWE or బిజినెస్) వరుడు కావలెను. 9705345003/ 7673939882. (A)

SC, 25,/ 5'4", B.Tech/ SWE, 40K వెల్‌సెటిల్డ్/ ఫ్యామిలీ కలిగిన/ అందమైన వధువుకు/ తగిన వరుడు/ కావలెను./ 9676968974/ 9951049449. (A)

కమ్మ, 24/ 5'5" B.Tech/ SWE, 50K వెల్‌సెటిల్డ్ ఫ్యామిలి కలిగిన అందమైన/ వధువుకు తగిన వరుడు/ కావలెను. 8790246602/ 7702274416 (A)

క్రిష్టియన్ మాదిగ 26Y, 5'4", MBA, Andhra Bank Asst Mng. 50,000/- PM (2 Cr ప్రాపర్టీ) వెల్‌సెటిల్డ్ అయిన వధువుకి వరుడు కావలెను. ✆ 8142220475 (A)

కాపు 22, 5'5" Fr B.Tech SWE Amazon 30,000 Pm సాంప్రదాయక కుటుంబానికి చెందిన వధువుకు తగిన వరుడు కావలెను. 9618483383 (A)

వైశ్య 23, 5'3" Fr B.Tech SWE IBM 40,000 Pm అందమైన సాంప్రదాయక కుటుంబానికి చెందిన వధువుకు తగిన వరుడు కావలెను. 9866158793 (A)

Kamma/ B.Tech, VIT/ 5'5"/ 22/ 25 Cr ★ B.Tech, IIT, MBA, IIM, 5'7"/ 25/ 14 LPA/ 20 Cr ★ M.Tech/ IIT/ 5'5"/ 25 ★ 12 LP/ 5 Cr. తుమ్మల సుజాత: 98482 17771, 0866 - 2433788. (B)

Kamma/ MD, Genl/ 5'4"/ 25/ 10 Cr ★ MD, Gynec/ 5'7"/ 25/ 25 Cr ★ BDS/ 5'5"/ 23/ 20 Cr ★ MD, Gynec/ 5'7"/ 25/ 15 Cr ★ MS, Genl/ 5'4"/ 25/ 10 Cr. తుమ్మల సుజాత: 99632 32758. (B)

Kamma/ BEMS/ 5'4"/ 24/ 50 Cr ★ B.Tech, IIT, MS/ 5'5"/ 24/ 120K/ 20 Cr ★ B.Tech, BITS, MS/ 5'7"/ 24/ 140K/ 5 Cr ★ B.Tech, Ph.D/ 5'5"/ 24/ 15 Cr. తుమ్మల సుజాత: 81217 95786. (B)

పద్మశాలి/ B.Tech Bits/ C.Govt. A.E (రైల్వే)/ 30,000/-PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 8886957298 (A)

రెడ్డి/ B.Tech NIT/ C.Govt మెకానికల్ ఇంజనీర్ (BHEL)/ 38000/-PM/ 5'5" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9985395014 (A)

కుమ్మరి/ B.Tech/ C.Govt. క్యాషియర్ (SBI)/ 18000/-PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను ✆ 9885299854 (A)

కాపు/ B.Tech. JNTU/ C.Govt.Asst మేనేజర్ (SBI)/ 38000/-PM/ 5'5" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 8886957298 (A)

మాల/ B.Tech, MBA/ C.Govt సైంటిఫిక్ ఇంజనీర్ (NFC)/ 38000/- PM/ 5'5" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9703794175 (A)

పద్మశాలి/ B.Tech/ Govt బ్యాంక్ P.O (ఆంధ్రాబ్యాంక్)/ 35000/- PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 7288048678 (A)

రజక/ ఏకైక కుమార్తె/ B.Tech/ Govt. బ్యాంక్ క్యాషియర్ (IOB)/ 22000/- PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9581317506 (A)

గౌడ/ B.Tech/ C.Govt స్టెనోగ్రాఫర్ (రైల్వే)/ 32000/- PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరడు కావలెను. ✆ 9052296834 (A)

మాదిగ/ ఏకైక కుమార్తె/ B.Tech (NIT)/ C.Govt ఇన్‌కమ్‌టాక్స్ ఆఫీసర్/ 60,000/- PM 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9642459724 (A)

యాదవ/ M.Tech (IIT)/ C.Govt ఇంజనీర్ (BHEL)/ 60,000/- PM/ 5'4" ఎత్తు/ 26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9885055185 (A)

క్రిష్టియన్ మాదిగ: B.Tech/ C.Govt. Asst. ఇంజనీర్/ జెన్‌కో/ 55,000/- PM 5'4" ఎత్తు, 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9618009352 (A)

కుమ్మరి: 20 లక్షల ఆస్తి/ B.Tech/ SWE/ 40,000/- PM, 5'4" ఎత్తు, 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9618008271 (A)

కాపునాయుడు: B.Tech/ C.Govt. Asst. మేనేజర్/ ఆంధ్రాబ్యాంక్/ 50,000/- PM, 5'5" ఎత్తు, 26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 8297439565 (A)

గంగపుత్ర, బెస్త: B.Tech/ Govt. Asst. ఇంజనీర్/ ఇరిగేషన్ Dept/ 42,000/- PM, 5'4" ఎత్తు, 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9618007823 (A)

యాదవ: B.Tech/ C.Govt P.O/ కెనరాబ్యాంక్/ 45,000/- PM, 5'5" ఎత్తు 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9618007652 (A)

కులపట్టింపు లేదు రెండవ సంబంధం 28Y, 5'4" MA, B.Ed, Govt Teacher 40,000/-PM (5Cr ప్రాపర్టి ఏకైకపుత్రిక, ఇల్లరికం) వెల్‌సెటిల్ అయిన వధువుకు వరుడు కావలెను. ✆ 8142220817 (A)

ఆర్యవైశ్య/ 21/ 5'3"/ 10th ★ 19/5'4"/ 8th ★ 23/ 5'4"/ ఇంటర్ వధువులకు వరులు కావలెను. బిజినెస్ అయినా OK. ✆ 7674078296/ 8106446865 (A)

బ్రాహ్మణ/ 19/ 5'3"/ 9th ★ 22/ 5'4"/ 10th ★ 25/ 5'3"/ 7th వధువులకు మంచి కుటుంబపు వరుడు కావలెను. పూజారి అయినా OK. ✆ 7674078296/ 8106446865 (A)

విశ్వబ్రాహ్మణ / 24/ 5'4"/ M.Tech/ Govt జాబ్/ 30,000/-PM చాలా అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 9676812525 (A)

కమ్మ: డైవర్సీ, 49 Y, 5'.6", 60K, VJA. Govt. టీచర్, వెల్ సెటిల్డ్‌కు డైవర్సీ విడో Govt/ Pvt పెన్షనర్ మ్యారేజ్ కొరకు. నో బ్రోకర్స్. ✆ 83330 85989. (B)

కమ్మ: డైవర్సీ, 27, 5'.8", M.Tech, 1 Cr P/A, 150 Cr ఆస్తి కలిగిన వధువుకు BE, MBA (IIT) చదివిన, ఇండస్ట్రీ కలిగిన సంపన్న కుటుంబానికి చెందిన కమ్మ వరుడు మాత్రమే కావలెను. ✆ 91339 94567. (B)

SC హిందూమాదిగ 24/ 5'5" B.Tech/ SWE/ IBM 35,000/-PM V.Fair అందమైన వెల్‌సెటిల్డ్ వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 9246151501 (A)

SC మాదిగ 23 5'5" B.Tech CBIT Income Tax ఆఫీసర్ 35,000/-PM వెల్‌సెటిల్డ్ వధువుకు అందమైన వరుడు కావలెను అర్జెంటు ✆ 9533855373 (A)

కమ్మ 34 155cms Very Fair B.Tech, MS 30L P.a. 30 కోట్లు డైవర్సీ (పిల్లలు లేరు) వధువుకు వెల్‌సెటిల్డ్ వరుడు కావలెను. ✆ 95422 44627.(I)

కమ్మ 26 5'7" M.S కోటి USA నుండి ఇండియా వచ్చి ఉన్న వధువుకు USA, ఆస్ట్రేలియా, కెనడా వరుడు కావలెను. ✆ 93476 35086, తెనాలి. nagallarkm@gmail.com. (I)

నాయుడు/ డైవర్సీ/ 30Y/ 5'4"/ AIR ఇండియా జాబ్ 20Cr ప్రాపర్టిగల అందమైన వధువుకి కులపట్టింపులేని వరుడు కావలెను. Ph: 8897900922 (A)

రెడ్డి/ లేట్‌మ్యారేజ్/ 27/5'4" రైల్వే ఎంప్లాయి, 12 కోట్ల ప్రాపర్టిగల అందమైన వధువుకు కులపట్టింపులేని వరుడు కావలెను. ✆ 9010168909 (A)

SC మాదిగ హిందూ, 27/ 5'2" M.Tech/ TCSలో SWE, 50,000/-PM/ V.V.ఫెయిర్, వెల్‌సెటిల్డ్ వధువుకి Govt/ SWE వరుడు కావలెను. ✆ 8712865419 (A)

కాపు, 24, 5'4" B.Tech, SWE, విప్రో, Hyd నెలకు, 50,000/- జీతం గల చాలాఅందమైన V.ఫేర్ వధువుకు తగిన వరుడు కావలెను. (అర్జెంట్) 8978799956 (A).

క్షత్రియులు (రాజులు) 24, 5'4" B.Tech, SWE విప్రో Hyd నెలకు 50,000/- జీతం గల చాలా అందమైన ఫేర్ వధువుకు తగిన వరుడు కావలెను. (అర్జెంట్) 9059098156 (A).

గాండ్ల, 25, 5'4", వైట్, బి.టెక్, SWE, TCS, 30 KPM వధువుకి వరుడు కావలెను. 0877-2230289, 76610 24447 (D)

Hindu Mala/ 33/ 5'2"/ Govt Job/ (Gaz. Off) చేస్తున్న వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 80748 36482 (D)

కాపు/ బలిజ: 24Y/ 5'2"/ V.Fair/ B.Tech (CSE), S/W in "PTW", Banglore/ 40,000 P/M/ 1 Cr. property ఉన్న వధువుకి తగిన వరుడు కాలెను. 93909 14215 (D)

రెడ్డి: 24Y/ 5'4"/ V.Fair/ B.Tech (CSE), S/W in Hyderabad/ 50,000 P/M/ Well Settled family ఉన్న వధువుకి తగిన వరుడు కావలెను. 97041 88499 (D)

క్షత్రియ 26/ 5'6"/ V.Fair/ M.Tech, IIT, MS/ SWE, USA/ $100 K/ 10 Crores property ఉన్న వధువుకు తగిన వరుడు కావలెను. సం॥ 93944 66119 (D)

బలిజ/కాపు 25/ 5'4"/ V.Fair/ B.Tech/ Dellotie, B'lore/ 8.5 Lakhs PA/ 1 Crore property ఉన్న వధువుకు వరుడు కావలెను. సం॥ 91005 59970 (D)

రెడ్డి 24/ 5'5"/ V.Fair/ B.Tech, MS/ SWE, USA/ $ 120 K/ 20 Crores property / only daughter వధువుకు వరుడు కావలెను. సం॥ 93966 55166 (D)

రాజులు/ 24Y/ 5'.5"/ ఫెయిర్/ డిగ్రీ/ Hydలో వెల్‌సెటిల్డ్ గల తండ్రిలేని వధువుకు సాంప్రదాయం గల మధ్యతరగతి వరుడు కావలెను. ఇల్లరికం Ok. ఫోన్: 7386488433. (C)

Kamma 25/5'6"/ B.Tech Software/ 5L PA, ★ 26/5'5"/ Fair/ M.Tech Professor/ 4L PA ★ 27/5'2" Fair/ MBA 3L PA ✆ 9949233422/ Blue Trend Matrimonial (P) Ltd. (A)

కమ్మ *విడో *30 Years * B.Tech *20 కోట్ల ప్రోపర్టీ కల్గి పిల్లలు లేని అందమైన ఒంటరి వధువుకి వరుడు కావలెను. (ఆస్తి, కుల, వయస్సు ప్రసక్తిలేదు) మీ ఫొటో Details Whatsappలో Send చేయండి. ✆ 9030916673. (C)

కాపు *23 Years *5'.4" * B.Tech *17 కోట్ల ప్రోపర్టీ కలిగి యాక్సిడెంట్‌లో పేరెంట్స్‌ను కోల్పోయిన అందమైన ఏకైక వధువుకి వరుడు కావలెను. (ఆస్తి, కుల ప్రసక్తిలేదు) Contact: Whatsapp: 8121113493. (C)

బ్రాహ్మణ 26, 5'4" BA ★ 24, B.Tech, SWE, 4L ★ 30 MBA, 4L ★ 26, B.Tech, MS (US) ★ 25, M.Pharm Wkg ★ 27, 5'4" MBBS ✆ 8555024711 (A).

★ ★ ★

గంగపుత్ర 5'3" 33 years, చదువు: 10th, డైవర్సీ రెండోపెళ్ళి, అయినా OK. కూకట్‌పల్లి, హైద్రాబాద్. సంప్రదించండి: 9392098664/ 8328209984 (A)

Vishwabramin 31/ 5'4" B.Tech Fair Divorcee Seeks Pvt/ Govt/ MNC Groom Contact: 9948766300, 8142616500 No Brokers (A)

ఆస్థి, కుల ప్రసక్తి లేదు. 2వ పెళ్ళి, 35Y, H:5'4", డిగ్రీ, BSNLలో జాబ్ in 35 వేలు, Hydలో ఇల్లు వధువుకు వరుడు అలాగే అందమైన వధువుకు వరుడు కావాలి. ✆ 77290 98545.

ఆర్యవైశ్య అందమైన అమ్మాయి వెరీవెరీ ఫెయిర్ 20Y, 5'4", డిగ్రీ, మంచి కుటుంబానికి చెందిన జాబ్/ బిజినెస్ తగిన వరుడు కావలెను, డైరెక్ట్ సంప్ర ✆ 8019503798 (A).

★ ★ ★

26Yrs 5'4", B.Tech, Managing Director, Property 30 Crores వధువుకు Caste no bar వరుడు కావలెను. Ph: 9248064777 (A)

రెడ్డి చాలాఅందమైన, 2వ పెళ్ళి 24/ 5'3", Fair/ B.Tech/ 2కోట్లు, స్వంత ఇల్లు, గుడ్‌ఫ్యామిలి వెల్‌సెటిల్డ్, పిల్లలులేని వధువుకు వరుడు కావలెను. ✆ 8886249529 (A)

రెడ్డి /Govt. జాబ్/25సం॥/ 5'5" ఎత్తు/ B.Tech/ 80K. PM/ V.Fair/ వెల్‌సిటిల్డ్ "వధువుకు" తగిన "వరుడు" కావలెను. ✆ 9949877734 (A)

గౌడ్ 27/ 5'2", B.Tech/ MBA, 2కోట్లు ఆస్తిగల Fair, అందమైన వధువుకి తగిన వరుడు కావలెను. గౌడ్ మ్యారేజ్ బ్యూరో ✆ 9440454842 (A)



వివాహ వేదిక

బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదిక 11-02-2018న జ్యోతిగార్డేన్స్ ECIL Hydలో జరుగును. Time: 1Pm to 6Pm. ✆ 9704656103/ 9533608887 (A)

20 సం॥ల అనుభవం కల్గిన బ్రాహ్మణ వివాహ వేదిక శ్రీ సత్యసాయి వివాహవేదిక ✆ 9849414098/ 040-66317515 satyasaivivahavedika.com (A)

ఉచిత వివాహ సంబంధాల సమాచార వెబ్‌సైట్ jeelakarrabellam.comలో ఫ్రీగా రిజిస్టర్ చేసుకొని మీకు నచ్చిన సంబంధాల ఫోన్ నెంబర్లను ఫ్రీగా చూసుకోండి. ✆ 98497 44707. (I)

అన్నికులాల వారికి: డాక్టర్స్/సాఫ్ట్‌వేర్స్/ బిజినెస్/ హైరిచెర్స్/ కన్వర్టెడ్ ఆల్ 1వ/2వ/ విడో దేశ/విదేశీ సంబంధాలు ఫాస్ట్‌గా కుదుర్చబడను. ✆ 99593 05599 (A)

ఓన్లీడాక్టర్స్, డాక్టర్స్ (ఆల్‌క్యాస్ట్స్) MBBS/ MD/ MS/ MCH/ DM/ BDS & బిజినెస్ మ్యాన్స్‌కి 1వ/2వ/ విడో దేశ/విదేశీ సంబంధాలు ఫాస్ట్‌గా కుదుర్చబడను. ✆ 99668 08059 (A)

రజక కులస్థులకు మాత్రమే "శుభోదయ మ్యారేజ్ లింక్స్" సాఫ్ట్‌వేర్/ డాక్టర్స్/ టీచర్స్/ Govt జాబ్స్ విడో/ డైవర్స్/ లేట్, దేశ/ విదేశీ సంబంధాలకై ★ కేశవరావు. ✆ 92464 71354. (B)

క్షత్రియ, సూర్యవంశం, చంద్రవంశం, భట్రాజులు, MBBS, MD, B.Tech, MS, Govt. హైరేంజ్, జాబ్స్, వెల్‌సెటిల్డ్ ఫ్యామిలీస్, 1st 2nd, అబ్బాయిలు, అమ్మాయిలు సంప్ర: M. ధనలక్ష్మి 8374514056 (A)

P.Supriyareddy, Rich Reddy Boys & Girls. India & Abroad Matches, All Emp/ Govt/ Pvt/ SWE/ Doc's/ Business/ Divorcees from all regions. Contact: Srinagar Colony, Hyd. Ph: 040-23544820, 23545762, Email: palletisupriyareddy@gmail.com (A)

Spl.Doct (3000 ప్రొఫైల్స్), MBBS, MD, MS, BDS, MDS & డాక్టర్స్‌కి మాత్రమే. 1వ, 2వ/ లేటు దేశ/ విదేశ సంబంధాలు అన్ని కులాలకు కదుర్చబడును. ✆ 9963632698 (A)

ఓన్లీ కమ్మ చౌదరి: కమ్మ కన్వర్టెడ్ డాక్టర్స్, సాఫ్ట్‌వేర్స్, MBA, Govts, హైరిచర్స్, బిజినెస్‌మెన్స్ & All 1వ/2వ/ విడో, దేశ/విదేశ సంబంధాలు ఫాస్ట్‌గా కుదుర్చబడును. ✆ 9121010959 (A)

ఓన్లి Govt. ఎంప్లాయిస్ ★ పెన్షనర్స్ కొరకు అన్ని మతాల, కులాల 1వ, 2వ, లేట్, వీడో/డైవర్స్‌లకై వివాహాలు & Govt ఎంప్లాయిస్ సంబంధాలు కొరకు వెరిఫాస్ట్ సెటిల్‌కై ✆ 9000185415 (A)

బ్రాహ్మణ వధువు, వరుల సంబంధాలకై సంప్రదించండి. S.N. శర్మ Hyd. ✆ 9248600342/ 8019207503. brahmininformationmatri@gmail.com (A)

> **గమనిక**
>
> పెళ్ళిపందిరి ప్రకటనలకు ప్రతిస్పందించేముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. వధువు/వరుడి హోదా, వయస్సు, ఆదాయం గురించిన వివరాలకు సంబంధించి ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిమ్‌లతో మరియు మీరు చేసుకునే ఆర్థిక లావాదేవీలతో (వధువు/వరుడు పూర్తి వివరాల కోసం డబ్బు డిపాజిట్ చేయడం/ట్రాన్స్‌ఫర్ చేయడం వగైరా) ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధంలేదు. "భవిష్యత్‌లో కలగబోయే సంతానానికి ఎలాంటి జన్యుపరమైన వైకల్యాలు లేకుండా నివారించుకునేందుకు జీవిత భాగస్వామిని ఎంచుకునే ముందు ఆరోగ్యపరీక్ష చేయించవలసినదిగా కూడా సూచించడమైనది". పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Wish N Bless: for Confidential, High Profile & Genuine Mariage Alliances India- Abroad all Categories/ Castes Ph: 7036459403/ 040-23312332. Somajiguda, Hyd, Free Registration, www.wishnbless.com (A)

కాపు, రెడ్డి, కమ్మ, మున్నూరుకాపు మరియు ఆల్ క్యాస్ట్ IIT, IIM, BITS, M.Tech, MS, NRI's, Govt, బిజినెస్, Hi ప్రొఫైల్స్, శ్రీప్రియదర్శిని మ్యారేజెస్. Since 18 Yrs. ప్రత్యేక శ్రద్ధతో చూడబడును. 9346344474/ 7702346670 (A)

Since 1989 శ్రీకన్య వివాహ వేదిక, Hyd. అన్ని కులాల & కులాంతర 1వ, 2వ, లేట్ మ్యారేజెస్. ఇండియా/ అబ్రాడ్. వేల్పుల బిక్షపతి- 27619998/ 9849027778. వాట్సప్- 9347009998 (A)

కేవలం యాదవ, కుర్మ వివాహ సంబంధాలకై గోకుల్ మ్యారేజెస్, పద్మజాయాదవ్ www.gokulmarriage.com Hyd. 9440831748, Gunt. ✆ 9440759945, VSP. 9441735157 (A)

WhatsApp Your Photo & Biodata to 9347262769. We will Send the Suitable Matches. www.pellisandadi.com. Estd.1991. Ph: 9290287458 (A)

సుజిత మ్యారేజ్‌బ్యూరో అన్నికులాల వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా వ్యక్తిగత శ్రద్ధతో సర్వీస్‌చేస్తూ 1 నెలలో సంబంధం కుదుర్చబడును స్త్రీ॥కు ఫ్రీ, పు॥కు సర్వీస్ చార్జ్ ✆ 7893688248 (A)

కమ్మ V.Urgent దేశ, విదేశీ సంబంధాలకు/ లేట్/ డైవర్సీ సంబంధాలకు అన్ని స్టేటస్‌ల వారు సంప్ర: శుభసమయం మ్యాట్రిమోని ✆ 9848673231/ 8074442351 (A)

పద్మశాలి వధువు, వరుల సంబంధాలకై సంప్ర॥ For Quick Marriage ★ Shyam ✆ 9000487865/ Blue Trend Martimonial (P) Ltd (A)

కులపట్టింపులేని వారికి 2 వ లేట్ సంబంధాలకు ప్రతి ఆదివారం 2pm - 5pm పరిచయ వేదిక జరుగును. 1000 మంది వధూవరుల లిస్ట్ ఇవ్వబడును, కుదుర్చబడును. Hyd ✆ 9440937900.

★ ★ ★

పద్మశాలి కులబాంధవులకు శుభవార్త!!! గత కొన్ని దశాబ్దాలుగా నామమాత్రపు ఫీజుతో సేవలందిస్తున్న వీవర్స్ వెల్ఫేర్ ట్రస్టువారి ఆధ్వర్యములో పద్మశాలి పరిణయ పరిచయ వేదికను తేది 18.02.2018 ఆదివారం రోజున 1Pm to 5Pm వరకు నిర్వహిస్తున్నాము సంప్ర॥ పద్మశాలి భవన్. నారాయణగూడ హైద్రాబాద్ ఫోన్: 040-24765557/ 8/ 9 (A)

శుభం గౌడ్స్ మ్యాట్రిమోని గౌడ్స్ వధువరులకై దేశ, విదేశ, 1వ, 2వ, డా॥ ఇంజనీర్, P.G, డిగ్రీ సం॥లకై సంప్ర॥ B.S.గౌడ్ హైద్రాబాద్ ✆ 9246214511 (A)

ముదిరాజ్ వధూవరులకు గత 15సం॥ల నుండి మేము పెళ్ళి సంబంధాలను చూస్తున్నాము. SWE/ Govt- Jobs/ Abroad/ B.Tech/ PG/ Degree ✆ 9848239706 (A)

గౌడ్ మ్యారేజ్ బ్యూరో Hyd only for Gouds 10 సం॥ అనుభవం దేశ/విదేశ 1వ, 2వ, డాక్టర్స్/ ఇంజనీర్స్/ NRI/ Govt, Pvt ఎంప్లాయిస్ బిజినెస్ సం॥లకై ✆ 9440454842. (A)

ఆర్యవైశ్య వధువరులకు సంబంధాలు చూడబడును. శ్రీ కృష్ణ మ్యారేజ్ బ్యూరో, ఉపేందర్, Hyd. సంప్ర॥ సెల్ నెంబర్: 98660 28265.

★ ★ ★

"భావన వివాహవేదిక" Hyd వారి ఆధ్వర్యంలో 4/2/18 ఆదివారం ఉ. 11గం. లకు "కమ్మ" మరియు సా. 3గం॥లకు కాపు వధూవరుల పరిచయవేదిక జరుగును. ✆ 9885444980/ 8008106262 (A)

ఆర్యవైశ్యులకు మాత్రమే వివాహ సంబంధ సమాచారము కొరకు సంప్ర॥ లక్ష్మీశ్రీనివాస మ్యారేజ్‌బ్యూరో Hyd. N.C.H రాధిక సంప్ర: 9246904666/ 9912153053 (A)

ఈనాడు
హైదరాబాద్
ఆదివారం
జనవరి 28, 2018
hai@eenadu.in

హాయ్

- 70 ఏళ్లలో దేశం ఎదగాల్సినంతగా ఎదగలేదు
- మన రాజ్యాంగ నిర్మాణంలోనే లోపాలున్నాయ్
- మనకంటే చైనాలో ప్రజాస్వామ్యం ఎక్కువ
- లోక్‌సత్తా విఫలప్రయోగం కాదు

డాక్టర్‌గా నాడి పట్టారు... కలెక్టర్‌గా కొత్త ఒరవడి తెచ్చారు... లోక్‌సత్తా అంటూ రాజకీయాల్లోకి దిగి... ప్రజల నాడి పట్టుకోవాలని చూశారు! ఎన్నికల ఫలితం నిరాశ మిగిల్చినా తనలో ఆశయంపై ఇంకా ఆశ తగ్గ లేదంటున్నారు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ! దేశ స్థితిగతులపై... లోక్‌సత్తా భవిష్యత్‌పై తన తప్పిదాలపై... 'హాయ్'తో అంతరంగాన్ని ఆవిష్కరించారాయన!



పదవి లేకున్నా...
ప్రధానులకంటే ఎక్కువ సాధించా

చాలాకాలంగా ఎక్కడా వినిపించటం లేదు. రాజకీయాలకు దూరమయ్యారా? లేక విసుగెత్తిందా?

పక్షపాత రాజకీయం, ఎన్నికల రాజకీయానికి దూరంగా ఉన్నా! మార్పు కోరుకుంటున్న రాజకీయంలో మాత్రం ఇప్పటికీ పూర్తిగా మిళితమై ఉన్నా! రాజకీయమనేది ఎన్నికల్లో పోటీ చేసేవాళ్ల గురించీ, ఓట్లు వేసేవారి గురించీ కాదు. మన గురించి, మన బిడ్డల బతుకుల గురించి! అలాంటి రాజకీయానికి నేనెప్పుడూ దగ్గరే!

ఎన్నికలకు మీరు ఇక గుడ్‌బై చెప్పినట్లేనా?

ఎన్నికల ద్వారా మార్పు వస్తుందనే నమ్మకంతోనే ఎన్నో కష్టనిష్ఠూరాలకు ఓర్చి రాజకీయ పార్టీ పెట్టాం! కానీ ఆ మార్పునకు ఇంకా సమయం పట్టేలా ఉంది. దేశంలోని నగర ప్రాంతాల్లో ముఖ్యంగా మహానగరాల్లో కొన్నిచోట్ల తప్ప మిగిలిన చోట్ల ప్రజల్లో మార్పుకోసం ఓటు వేసే పరిస్థితి కన్పించటం లేదు. దిల్లీ మహానగరమే ఓ రాష్ట్రం. కాబట్టి కొంత మార్పు వచ్చింది. కానీ మన హైదరాబాద్, విజయవాడ, చెన్నై...ఇలాంటివి పేరుకే నగరాలు. ఇక్కడ మార్పు అంత సులభంగా వచ్చేలా కన్పించటం లేదు. కులాలు, మతాలు, పార్టీలు, వర్గాలు... రకరకాల ప్రభావాలకు లోనవుతున్నారు. కాబట్టి ఈ ప్రజాస్వామ్యంలో ఆలోచించి అనుకున్నదానికి ఓటేయటానికి కాస్త సమయం పడుతుంది. కాబట్టి ఎప్పుడైతే ఈ గతుకుల రోడ్డుపై ఈ వాహనం పనికి రావటం లేదో మరో మార్గాన్ని, వాహనాన్ని ఎంచుకుంటాం. లక్ష్యం మారటం లేదనే సంగతి గుర్తించాలి. ఎలాగోలా అధికారంలోకి వచ్చి మార్పు సాధించడానికి నేను సిద్ధంగా లేను. ధర్మాన్ని అతిక్రమించను!

ఇదే ఎన్నికల ప్రక్రియలో మీరూ గెలిచారు కదా!

కూకట్‌పల్లి, దిల్లీ, ముంబైలాంటి కొన్నిచోట్ల మనం ఆశిస్తున్న మార్పు మిణుకుల్లా కనిపిస్తుంది. అలాంటి పరిస్థితులు దేశవ్యాప్తంగా, రాష్ట్రవ్యాప్తంగా లేవు. ఎవరో ఒకరు ఒకచోట గెలిస్తే చాలదు. ప్రజల్లో వివేకం పెరిగితేనే భవిష్యత్ బాగుపడుతుంది. ఓటు వేసేది ఎన్నికల్లో నిలబడ్డవారికి కాదు... తన భవిష్యత్‌కు వేస్తున్నాననే స్పృహ ప్రతి ఒక్కరిలోనూ రావాలి.

ప్రజలింకా మార్పునకు సిద్ధంగా లేరంటారా?

ప్రజలు మారటానికి సిద్ధంగా లేరని నేనటం లేదు. సంక్లిష్టమైన ప్రజాస్వామ్య వ్యవస్థలో మార్పులకు దశాబ్దాలు, శతాబ్దాలు పడుతాయి. కాకుంటే వాటిని వేగవంతం చేయటానికి మనం కృషి చేయాలి. అందుకే ప్రజాస్వామ్య సంస్కరణల గురించి నేను మొదట్నుంచీ మాట్లాడుతున్నాను. 'నిర్ణయాధికారం నాకుంది... నా ఓటువల్ల నా బతుకు బాగుపడుతుంది. లేదంటే చెడిపోతుం'దనే స్పృహ ప్రజల్లో కలిగితే దేశం బాగుపడుతుంది. కానీ అలాంటి పరిస్థితిని దేశంలో మనం కల్పించలేదు. ప్రజల తప్పు కాదిది. రాజకీయ నాయకులది! నిజానికి స్థానిక ప్రభుత్వాలు ప్రజాస్వామ్య పాఠశాలలు. వాటినే నిర్వీర్యం చేసి ప్రజల్ని ప్రజాస్వామ్యంలో మనం పీహెచ్‌డీ చేయమంటున్నాం. మన పిల్లల్ని స్కూలుకు పంపించకుండా పీహెచ్‌డీ చేయమంటే చేస్తారా? ఇదీ అలాంటిదే! ఎన్నికైనవారు కావచ్చు. ఎన్నిక కానివారు కావచ్చు... దేశంలో ప్రజాభిప్రాయాన్ని మలిచే శక్తి ఉన్న నాయకులమంతా కూడా విఫలమయ్యాం. 70 ఏళ్లలో మనదేశ రాజకీయ వ్యవస్థ విఫలమైంది. అది గుర్తించకుంటే ఆత్మవంచన చేసుకున్నట్లే!

ఆర్థిక స్వేచ్ఛ ప్రదాత పీవీ

నిజానికి మనదేశ ఆర్థిక స్వేచ్ఛకు ప్రధాన కారకుడు పీవీ నరసింహారావు. ఆయన హయాం కచ్చితంగా మన జాతి నిర్మాణంలో కీలక ఘట్టం! సంక్షోభ సమయంలో... ఓ నిరుపేద సమాజంలో... సోషలిజం, సామ్యవాదాలకు పిచ్చి అర్థాన్నిచ్చిన సమాజంలో... అసమానతలు, కులాలు మతాలున్న సమాజంలో... ఏరకమైన అస్థిరత్వం లేకుండా ప్రజలందరిలోనూ ఏకాభిప్రాయాన్ని అలవోకగా నింపాదిగా... సాధించి ఇంత శాంతియుతంగా ఇంతపెద్ద మార్పును తెచ్చే ప్రయత్నం ప్రపంచంలో ఎక్కడా జరగలేదు. పీవీ గొప్పతనం అది! నాపేరు కన్పించాలని తపించకుండా నా దేశం కోసం కొన్ని లక్ష్యాలు నెరవేరాలనే ఉద్దేశంతో నిరాడంబరంగా వెనకాల ఉంటూ సంయమనాన్నిపాటించి కీర్తిని వేరేవారికిచ్చి... సమాజంలో భయాందోళనలు లేకుండా చేసి... అద్భుతమైన చాతుర్యాన్ని, దూరదృష్టిని, దేశభక్తిని ప్రదర్శించారాయన! అలాంటి గొప్పవ్యక్తిని ఆయన పార్టీకంటే ఇతర పార్టీలెక్కువగా గౌరవించాయి. ఆయనను స్వరాష్ట్రంకంటే దేశమంతా గౌరవించింది. దేశంకంటే ప్రపంచం ఆయన్ను ఎక్కువగా గుర్తించింది. కొంతమందికి ఆ దురదృష్టం ఉంటుంది. వాళ్లు చేసేపని చుట్టూ ఉన్నవాళ్లకంటే దూరంగా ఉన్నవాళ్లు గుర్తిస్తారు. దేశచరిత్రలో ఆయన స్థానం చాలా కీలకమైంది. పదిలమైంది. స్వాతంత్ర్యం తొలినాళ్లలోనూ ఇలాంటి నాయకులు లేరని కాదు. కానీ వారి మాట చెల్లలేదు. వారందరినీ పక్కనబెట్టారు.

ప్రజాస్వామ్యం లేని చైనాతో మనల్ని పోల్చుకొని చూడటం సబబేనా?

చైనాను అందుకునేంత సామర్థ్యం, శక్తి మనకు నిగూఢంగా ఉంది. కానీ చైనా ముందుచూపుతో చేసుకున్న మౌలిక సదుపాయాలు మనం చేసుకోలేదు. అక్కడ నియంతృత్వమున్నా బలమైన స్థానిక ప్రభుత్వాలున్నాయి. ఈ విషయం చాలామందికి తెలియదు. ఈ విషయంలో చైనాలో ఉన్నంత ప్రజాస్వామ్యం మనదేశంలో లేదు. మన దగ్గరున్న ఓటు హక్కును, అరిచే స్వేచ్ఛనూ చూసి అదే ప్రజాస్వామ్యమనుకుంటే ఎలా? నా ఊర్లో నిర్ణయాలు నేను తీసుకోగలగటం అసలైన ప్రజాస్వామ్యం. చైనాలోని ఏదైనా పట్టణానికి వెళ్లి మనం పెట్టుబడి పెట్టాలంటే అక్కడి అధ్యక్షుడు, ప్రధాని, ఆ రాష్ట్ర నేతలను కలవాల్సిన పన్లేదు. ఆ పట్టణ అధికారులు, నేతలను కలిస్తే పనైపోతుంది. అదే మన విజయవాడో, హైదరాబాదో, కరీంనగర్లోనో... ఎవరైనా పెట్టుబడి పెట్టడానికి వచ్చి అక్కడి మేయర్‌తో చర్చించే పరిస్థితి మనం ఊహించగలమా? మరి మనం ప్రజాస్వామికమా? చైనానా? ఇక చదువుల విషయానికొస్తే... 8వ తరగతి దాకా ప్రపంచంలో అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్య నయాపైసా ఖర్చు లేకుండా తమ దేశంలోని ప్రతి బిడ్డకూ అందే ఏర్పాట్లను చైనా ప్రభుత్వం చేసింది! అదీపిల్లలకు అర్థమైన భాషలో! ఇది నా కళ్లతో చూశా! వైద్యం కూడా బాగుంది. అందుకే దేశంలోని కోట్లమంది ఉత్పత్తిలో పాలుపంచుకుంటున్నారు. మనదేశంలోనైనా ప్రతి ఒక్కరూ దేశ ఉత్పత్తిలో భాగస్వాములు కావాలంటే ఈ మౌలిక సదుపాయాలే కల్పించాలి. మావో పిడివాదం వల్ల లక్షలమంది చైనాలో దెబ్బతిన్నారు. కానీ తర్వాత మారి తమ తలరాత మార్చుకున్నారు. ఓటు, భావస్వేచ్ఛ విషయం తప్పిస్తే... చైనా చాలావిషయాల్లో మనకంటే మెరుగ్గానే, ప్రజాస్వామ్యయుతంగానే ఉంది.

– రేగళ్ల సంతోష్‌కుమార్, ఈనాడు, హైదరాబాద్

లోక్‌సత్తా నా కోసం కాదు...

లోక్‌సత్తా రాజకీయపార్టీగా సాగుతుందా? లేక స్వచ్ఛంద సంస్థగానా?

రాజకీయ పార్టీ స్వచ్ఛంద సంస్థే! దోపిడీ ముఠా కాదు. కాబట్టి లోక్‌సత్తా స్వచ్ఛంద సంస్థ రూపంలోనే పార్టీగా నడుస్తుంది.

మరి లోక్‌సత్తా–1, లోక్‌సత్తా–2 అనే పేర్లెందుకు? తేడా ఏంటి?

సాఫ్ట్‌వేర్‌లో 1.0, 2.0 అని కొత్త వర్షన్లు వచ్చినట్లు... కొన్ని మార్పులంతే! ఆధునిక అవసరాలకు అనుగుణంగా కొత్త రూపమంతే! అంతేగాని లక్ష్యాల్లో, ఉద్దేశాల్లో మార్పుల్లేవు. లోక్‌సత్తా నా కోసం కాదు. జాతికోసం. సమాజం కచ్చితంగా ఎన్నటికైనా తమకు మంచి ఏమిటో అర్థం చేసుకుంటుంది. లోక్‌సత్తా మార్గంలో నడుస్తుంది. అప్పటిదాకా ప్రయోగాల్ని, ప్రయత్నాల్ని అపకుండా నడపాలంతే!

అంటే లోక్‌సత్తా విఫలప్రయోగం కాదంటారు!

కచ్చితంగా కాదు. అసలు విజయాల్నే చూసినప్పుడు... ఈ దేశంలో ఏ ప్రధానమంత్రీ సాధించనివి సాధించాను. మూడు రాజ్యాంగ సవరణలు నా వల్ల సాధ్యమయ్యాయి. ఏడెనిమిది పెద్దపెద్ద చట్టాలు జాతీయస్థాయిలో నా పట్టుదల వల్ల వచ్చాయి. చాలా ప్రభుత్వ విధానాల్లో మార్పులకు కారణమయ్యాను. నా పోరాటం వల్లే 2జీ స్పెక్ట్రమ్ లైసెన్స్‌లు రద్దయి పోటీ బిడ్డింగ్ జరిగింది. ఆ రంగంలో అవినీతికి ఆస్కారం లేకుండా చేశాను. రుబెల్లా వాక్సిన్ లక్షల మందికి చేరటానికి కారణమయ్యాను. ఇన్నింటిని ఎవరు సాధించారీ దేశంలో? ఆс... పదవులు రాలేదు. నిజానికి నేను పదవుల్ని కోరుకోలేదు కూడా! విజయం అంటే ఏమిటి? మార్పును సాధించటమా? పదవుల్లో ఉండి దండ వేయించుకోవటమా? దేశంలో మార్పు కోసమనే ఉన్నత పదవిని వదులుకొని బయటికొచ్చానుగదా! కానీ ఈ మార్పు సరిపోదు. కొండంత జరగాల్సి ఉంటే గోరంత జరిగింది. కచ్చితంగా దేశపౌరుడిగా నాకా బాధ ఉంది. నేను చేస్తున్నదానితో సంతృప్తి చెందుతున్నాను. కానీ సాధించిన మార్పుతో మాత్రం కాదు. ఇంకా ఎక్కువ మార్పు కోరుకుంటున్నాను. ఇది నా సమస్య కాదు. మొత్తం జాతి సమస్య. ఇంతకంటే ఎక్కువ ఏం చేయాలో చెప్పండి చేస్తాను.

ఇంతకూ వచ్చే ఎన్నికల్లో లోక్‌సత్తా పోటీ చేస్తుందా?

పోటీ చేయటం చేయకపోవటం నైతికమైన విషయం కాదు. ప్రాక్టికల్ విషయం. నా అంచనా ఏంటంటే... దేశంలో 10-15శాతం ఓట్లు మార్పుకోసం స్థిరంగా పడితే కచ్చితంగా అది వేదిక. ఆ కాలం, స్థలం వచ్చే దాకా మన శ్రమ వృథా అవుతుంది. కాబట్టి ప్రాక్టికల్‌గా పనిచేస్తుందా లేదా... ఫలితం వస్తుందా లేదా అని చూసుకోవాలి. ఫలితం వస్తుందంటే తప్పకుండా చేస్తాం! ఆ విషయంలో నేను స్పష్టంగా, నిర్దాక్షిణ్యంగా ఉంటాను. అందుకే నన్ను అరాచకవాది అనేవాళ్లూ ఉన్నారు. మార్గాలు లక్ష్యం కోసమే తప్ప... మార్గం కోసం లక్ష్యాన్ని తాకట్టు పెట్టకూడదు. పదవులకు కొరత లేదు. పదవుల కోసం లక్ష్యాన్ని తాకట్టు పెట్టకూడదన్నది నా సిద్ధాంతం!

ఉద్యోగుల్లోని ఐక్యత ప్రజల్లో రావాలి

ప్రజలు ఎదురు తిరుగుతారనే భయం కంటే... ఉద్యోగులు ఉమ్మడిగా ఎదురు తిరుగుతారనే భయం ప్రభుత్వాల్లో, పార్టీల్లో ఎక్కువైపోయింది. ప్రజలు కూడా తిరుగుబాటు చేస్తారనే భయం కల్పించటమే దీనికున్న ఏకైక పరిష్కారం. అటు పార్టీగానీ, ఇటు ఉద్యోగులుగానీ ప్రజలకు సేవ చేయటానికున్నాయే తప్ప మరెందుకూ కాదు. ఉద్యోగులకిస్తున్న జీతభత్యాలు ప్రజల కష్టార్జితం! అలాంటప్పుడు ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజల పనుల్ని ఎందుకని చేయరు? నీటి కనెక్షన్ కావాలన్నా... పట్టాదారు పాసుపుస్తకం కావాలన్నా లంచం ఇవ్వాల్సిన అవసరం ఏంటి? జీతం తీసుకుంటున్నప్పుడు పనెందుకు చేయరని నిలదీసే ధైర్యం, చైతన్యం ప్రజల్లో రావాలి. ఇలాంటి చైతన్యం ప్రజల్లో వస్తే, సంఘటితమైతే ప్రభుత్వం, పార్టీలు ప్రజలకు భయపడటం మొదలెడతాయి. ఉద్యోగులూ జవాబుదారీతనంతో పనిచేస్తారు. ఉద్యోగులంతా చెడ్డవాళ్లేమీ కాదు. ప్రజల్లో చైతన్యం వస్తే వారిలోని మంచితనం పనుల్ని వేగవంతం చేస్తుంది. మనదేశంలో సామాన్య ప్రభుత్వ ఉద్యోగి చాలామంది కంటే ఎంతో సంపన్నుడు.




అదే మన బలం...

కుటుంబ వ్యవస్థ మన బలం. అదే సమాజంలో శాంతిని కాపాడుతోంది. కులమతాలకు అతీతంగా ఉందిది. దీనివల్ల మన దేశంలో ఎవరైనా కూడా ఓ గీతదాటి తప్పు చేయరు. అమెరికాలో జనాభా ఎంతుందో అన్ని తుపాకులున్నాయి. భయంభయంగా బతకాల్సిందే అక్కడ. మనకా పరిస్థితి లేదు. బలాల్ని పెంచి, బలహీనతల్ని తగ్గించటం మంచి నాయకత్వం చేయాల్సింది. ఆ పని నాయకత్వం ఇన్నాళ్లలో చేయలేదు.

నా తప్పు మీరు చేయకండి

నాదీ సాధారణ కుటుంబమే. నాకు ఇద్దరు పిల్లలు. అబ్బాయి విదేశాల్లో చదువుకొని ఇక్కడే తనకాళ్లపై తాను నిలబడే ప్రయత్నం చేస్తున్నాడు. అమ్మాయి గాంధీ కాలేజీలో ఎంబీబీఎస్ చివరి సంవత్సరం చదువుతోంది. మా కుటుంబంలోనూ మల్లగుల్లాలుంటాయి. నా జీవితంలో ఏదైనా తప్పు చేసి ఉంటే అది నా కుటుంబానికి సమయం కేటాయించకపోవటం. ఆ తప్పు చేయొద్దని అందరికీ చెబుతుంటాను. ఎందుకంటే నేను పనిలో పడి కుటుంబాన్ని ఏమాత్రం పట్టించుకోలేదు. దానివల్ల ఇబ్బందులుంటాయి. ఇప్పుడు ఎంతోకొంత సవరించే ప్రయత్నం చేస్తున్నాను.

- శాకాహారం ఇష్టం. మాంసాహారం మానేయాలనుకున్నా కుదరటం లేదు. పరిమితంగా తింటాను. బీరకాయ పప్పు చాలా ఇష్టం.
- పుస్తకాలు విపరీతంగా చదువుతాను. గతంలో రెండ్రోజులకో పుస్తకం చదివేసేవాణ్ణి. కాల్పనిక సాహిత్యం కూడా! కానీ ఇప్పుడది లేదు. చరిత్ర, ఆర్థిక వ్యవస్థ, శాస్త్ర సాంకేతిక విజ్ఞానం, ఆంత్రోపాలజీ... చదువుతాను.
- బెట్రండ్ రసెల్ రచనలు నాపై ఎక్కువ ప్రభావం చూపించాయి. తార్కికంగా ఆలోచించేలా నాపై ముద్ర వేశారాయన. తర్వాత గౌతమ బుద్ధుడు, మహాత్మాగాంధీల ప్రభావమూ ఉంది. గాంధీ నా దృష్టిలో మహోన్నతుడు. నూటికి నూరుపాళ్లు కల్మషం, మాలిన్యం లేని వ్యక్తి ఆయన. ఆయన రచనలు కొన్ని చదువుతుంటే ఇప్పటికీ కళ్లు చెమర్చుతుంటాయి. మనం అనుకున్న స్వాతంత్ర్యం, దేశం రావటం లేదని ముందే గుర్తించిన వాడాయన. అలాగే దేశాన్ని సంఘటితం చేసిన సర్దార్ వల్లభాయ్ పటేల్, దార్శనికుడు రాజగోపాలచారి కూడా నాకిష్టం.



దేవుడు నన్ను పట్టించుకోకుంటే నేనూ దేవుణ్ణి పట్టించుకోను. ఎవరైనా రమ్మంటే గుడికి వెళతాను. వెళ్లాలని లేదు. వెళ్లకూడదని లేదు. దేవుడున్నాడో లేదో తెలియదుగాని మనిషైతే ఉన్నాడు.

మానసికంగా ఇంకా బానిసలమే

స్వాతంత్ర్యం వచ్చినా మానసిక బానిసత్వం ఇంకా మనలో కొనసాగుతోంది. నేను ఆంగ్లానికి వ్యతిరేకమేమీ కాదు. ప్రజలకు తెలిసిన భాషలో పరిపాలన సాగకుంటే అది సరైన పాలనే కాదని నమ్ముతాను. స్వాతంత్ర్యం వచ్చాక మన భాషల్ని ఆధునిక అవసరాలకు తగ్గట్లు విస్తరించుకోలేదు. పాఠశాల విద్యలో తల్లిదండ్రులు పిల్లలతో ఏ భాషలో మాట్లాడతారో ఆ భాషలోనే పాఠశాల విద్య నేర్పాలి. కానీ ఇప్పుడు ఇంగ్లిష్ తెలియని ఉపాధ్యాయులు... ఇంగ్లిష్ తెలియని పిల్లలకు ఇంగ్లిష్‌లో పాఠాలు చెబుతున్నారు. తెలుగు మాధ్యమంలో పాఠాలు బాగా చెప్పుకొని... ఇంగ్లిష్ కూడా నేర్పుతారని నమ్మకాన్ని మన బడుల్లో ఇవ్వగలిగితే పిల్లలు తెలుగు మాధ్యమంలోనే చదువుతారు. కానీ ఆ పని చేయలేకపోతున్నాం. మన బిడ్డల్లోని తెలివి తేటల్ని వికసింపజేయలేకపోతున్నాం. అందుకే ముందు బడుల్లో విద్యాప్రమాణాలు పెంచి మాధ్యమం గురించి మాట్లాడితే మేలు. అర్థంగాని చదువులు ఎన్ని చదివినా ఏం లాభం? ఆంగ్లమా? తెలుగా? అని కాకుండా వారికి అర్థమయ్యే భాషలో, అర్థమయ్యే రీతిలో బోధించటం ప్రధానం.

ఆ రెండింటినీ బాగు చేస్తేనే..

అభివృద్ధి చెందటానికి 70 సంవత్సరాల స్వాతంత్ర్యం సరిపోదా?

100 సంవత్సరాల కిందైతే అభివృద్ధికి 70 ఏళ్లు సరిపోయేవి కావనే వాడిని. ఇప్పుడు మాత్రం అలాకాదు. అభివృద్ధికి మనకున్న వనరులు సరిపోతాయి. మన తర్వాత స్వాతంత్ర్యం సంపాదించుకున్న దేశాలు చైనా, కొరియా, సింగపూర్, మలేషియా, తైవాన్... చివరకు ఇండోనేషియాలాంటివీ శరవేగంగా అభివృద్ధి చెందాయి. ఆధునిక యుగంలో మనకూ టెక్నాలజీ, వనరులు గతంలో ఎన్నడూ లేనంతగా ఉన్నాయి. ఈ మధ్య 49 దేశాలపై (అన్నీ 200 బిలియన్ డాలర్లకంటే ఎక్కువ జాతీయోత్పత్తి ఉన్న పెద్దదేశాలే) అధ్యయనం చేస్తే... మన భారతదేశం దాదాపు ప్రతిరంగంలోనూ చివరి 4 స్థానాల్లో ఉంది. మన సరసన ఉన్న దేశాలు పాకిస్థాన్, బంగ్లాదేశ్, నైజీరియాలు! అదేనా మనం కోరుకునేది? అంతకంటే ఎంతో ఘనత సాధించే అవకాశం మన దేశానికుంది. గొప్ప వనరులు, సంస్కృతి, సాహిత్యం, చరిత్ర, నాయకులు, అన్నింటికంటే ముఖ్యంగా బలమైన కుటుంబ వ్యవస్థ, మతతత్వంలేని ప్రభుత్వం.... ఉగ్రవాదాన్ని ప్రోత్సహించని సమాజం... ఇవన్నీ మన బలం! ఇన్ని ఉండి కూడా ఎదగలేకపోయామెందుకు? చైనా 30 సంవత్సరాల్లోనే ప్రపంచంలో ఎవ్వరూ పోటీపడనంతగా అభివృద్ధి సాధించింది. అందుకే... ఈ 70 ఏళ్లలో కచ్చితంగా మనం బాగా ఎదగ గలిగేవాళ్లమే. కానీ మన విధానాల్లో తప్పిదాలు, ప్రజాస్వామ్య నిర్మాణంలో తప్పిదాలవల్ల తీవ్రంగా నష్టపోయాం. ఇంకా నష్టపోతున్నాం.

ఎలాంటి తప్పిదాలు?

మూడు దశల్లో దెబ్బతిన్నాం. మన ప్రభుత్వ వ్యవస్థ నిర్మాణంలోనే లోపాలున్నాయి. రాజ్యాంగ నిర్మాణమప్పుడే బలమైన స్థానిక ప్రభుత్వాలు, నిజమైన సమైఖ్య వ్యవస్థను ఏర్పాటు చేసి ఏ రాష్ట్రానికా రాష్ట్రం స్వయంపాలనకు అవకాశం ఇవ్వాల్సింది. ఇక్కడ స్వయంపాలనంటే దేశం నుంచి వేరవటమని కాదు. దేశ ఐక్యతకు, ప్రాథమిక హక్కుకు లోబడే అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, జర్మనీలలో మాదిరిగా రాష్ట్రాలు తమనుతాము పరిపాలించుకునే ఏర్పాట్లు కల్పించాల్సింది.

ఇప్పుడు మూడోదశలోనూ తప్పు చేస్తున్నాం. ప్రపంచాన్ని చూశాం... మన పాత తప్పులూ చూసుకున్నాం. అన్నీ చూసీ... కూడా అలాగే చేస్తున్నాం. ప్రపంచాన్ని అందుకోవాలంటే స్థానిక సంస్థలను, పాలనను బలోపేతం చేసి... విద్య, వైద్యాలను బాగు చేయొచ్చుగదా! మరెందుకు చేయటం లేదు? తప్పులు జరిగాయి... జరుగుతున్నాయి కూడా!

విద్య, వైద్యానికి పెద్దపీట వేయాల్సింది. ఈ విషయాల్లో రాజ్యాంగ నిర్మాణంలోనే విఫలమయ్యాం. గొప్పనాయకులు, గొప్ప ఆశయాలతో రాజ్యాంగాన్ని రచించారు. కానీ నిరుపేదలు, కులవ్యవస్థ, అసమానతలు ఉన్న సమాజంలో ప్రజాస్వామ్య నిర్మాణం కేవలం ఓటుతో రాదు... దానికి ప్రజల్ని సమాయత్తం చేయాలంటే ఈ వ్యవస్థల్ని నిర్మించాలనే సంగతి విస్మరించారు.

ఇక రెండో దశ తప్పిదాలు నెహ్రూ, ఇందిరాగాంధీ కాలంలో జరిగాయి. సోషలిజాన్ని అపార్థం చేసుకొన్నారు. నాణ్యమైన విద్య, ఆరోగ్యం, మౌలిక సదుపాయాల్ని ప్రజలకు కల్పించటం అసలైన సోషలిజం. కానీ మనదగ్గర వాటిని పక్కనబెట్టి ప్రభుత్వ నియంత్రణకు పెద్దపీట వేశారు. మీరు తుమ్మాలన్నా, దగ్గాలన్నా ప్రభుత్వ అనుమతి కావాలి. శివుడాజ్ఞ లేనిదే చీమైనా కుట్టదన్నట్లు ప్రతిదాంట్లో ప్రభుత్వ పెత్తనం ఎక్కువైంది. దీంతో ఉద్యోగుల్లో అవినీతి, ప్రజలు ప్రతిదానికీ ప్రభుత్వంపై ఆధారపడాల్సిన పరిస్థితి, వాటిని చూడటానికి అధికారయంత్రాంగం... అవినీతి.... ఇలా ఓ విషవలయం తయారైంది. ఆర్థిక స్వేచ్ఛ ఎప్పుడైతే లేకుండా పోయిందో.... ఉత్పత్తి చేసే శక్తి ఉన్నా, తపన ఉన్నా అవన్నీ వృథా అయ్యాయి. కాబట్టి దేశం ఆర్థికంగా ఎదగలేకపోయింది.


ఈనాడు సినిమా



సి.కల్యాణ్, వి.వి.వినాయక్, బాలకృష్ణ, సాయిధరమ్‌తేజ్

ధర్మభాయ్ డాట్ కామ్

ఇక మీదట పేదోడికి ప్లాట్‌ఫామ్... ధర్మభాయ్ డాట్ కామ్ అంటూ సందడి చేస్తున్నారు సాయి ధరమ్ తేజ్. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'ఇంటెలిజెంట్'. లావణ్య త్రిపాఠి కథానాయిక. వి.వి.వినాయక్ దర్శకుడు. సి.కల్యాణ్ నిర్మాత. శనివారం హైదరాబాద్‌లో ప్రముఖ కథానాయకుడు బాలకృష్ణ టీజర్‌ని విడుదల చేశారు. 'ధర్మాన్ని... ధర్మ భాయ్‌ని' అంటూ సాయిధరమ్ తేజ్ చేసిన పోరాట ఘట్టాలు టీజర్‌కి ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. బాలకృష్ణ మాట్లాడుతూ "వి.వి.వినాయక్‌తో కలిసి ఇంతకు ముందు 'చెన్నకేశవరెడ్డి' చేశా. పరిశ్రమ గర్వించదగ్గ దర్శకుడాయన. సాయిధరమ్ తేజ్ నటించిన 'ఇంటెలిజెంట్' టీజర్ నా చేతుల మీదుగా విడుదల కావడం ఆనందంగా ఉంది. సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ నా సొంత నిర్మాణ సంస్థతో సమానం. ఈ సినిమా టీజర్ చాలా బాగుంది. సినిమా ఎప్పుడెప్పుడు చూడాలా అనే ఉత్సుకత రేకెత్తిస్తోంది. యువతకి ఈ సినిమా చేరువవుతుందనే నమ్మకం నాకుంది" అన్నారు. సాయిధరమ్ తేజ్ మాట్లాడుతూ "కొత్త ప్రతిభని ప్రోత్సహించడంలో బాలకృష్ణ ముందుంటారని అందరూ అంటారు. ఆ విషయం మరోసారి రుజువైంది" అన్నారు. వినాయక్ మాట్లాడుతూ "బాలకృష్ణ వేడుకకి రావడంతో మా సినిమా ఘన విజయం సాధించిందనే అనుభూతి, ఆనందంలో ఉన్నాం" అన్నారు. "కొత్త యేడాది ఆరంభంలోనే నాకు పెద్ద విజయాన్ని అందించారు బాలకృష్ణ. 'ఇంటెలిజెంట్' వేడుకకి రావాలని అడగ్గానే సమయం కూడా ఆయనే ఖరారు చేశారు. సినిమా కచ్చితంగా విజయం సాధిస్తుందని చెప్పారు. వచ్చే నెలలో ఈ చిత్రంతో మరో విజయాన్ని సొంతం చేసుకోబోతున్నాం" అన్నారు. ఈ కార్యక్రమంలో రచయిత ఆకుల శివతో పాటు చిత్రబృందం పాల్గొంది.



నా గాత్రమే సెపరేటు

మోహన్‌బాబు అంటే.. ఛమక్కుమనే డైలాగులే గుర్తొస్తాయి. ఆయన మాటలో విరుపు భలే బాగుంటుంది. అలాంటి మోహన్‌బాబు పాట పాడితే ఎలా ఉంటుంది? అదిరిపోతుంది కదూ. అందుకే మోహన్‌బాబు గొంతు సవరించుకున్నారు... 'గాయత్రి' కోసం. ఆయన కథానాయకుడిగా నటిస్తూ నిర్మించిన చిత్రం 'గాయత్రి'. మదన్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో 'అండ పిండ బ్రహ్మాండ భాండముల...' అనే హనుమాన్ గీతం ఉంది. సుద్దాల అశోక్‌తేజ రచించారు. ఈ పాటని శంకర్ మహదేవన్, మోహన్‌బాబు ఆలపించారు. పాటంతా శంకర్ మహదేవన్ పాడారు. మధ్యలో మోహన్‌బాబు గాత్రం కూడా వినిపిస్తుంది. విష్ణు, శ్రియ కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రం ఫిబ్రవరి 9న విడుదల అవుతుంది. తమన్ ఈ చిత్రానికి సంగీతం అందించారు.



వల్లభనేని వంశీ, రవితేజ, సీరత్ కపూర్, రాశీ ఖన్నా, నల్లమలుపు శ్రీనివాస్, విక్రమ్

పాటలు వచ్చాయి చూడు!

రవితేజ కథానాయకుడిగా నటించిన చిత్రం 'టచ్ చేసి చూడు'. రాశీఖన్నా, సీరత్‌కపూర్ కథానాయికలు. విక్రమ్ సిరికొండ దర్శకుడు. నల్లమలుపు శ్రీనివాస్, వల్లభనేని వంశీ నిర్మాతలు. ఫిబ్రవరి 2న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. శనివారం హైదరాబాద్‌లో పాటల్ని విడుదల చేశారు. తొలి సీడీని వి.వి.వినాయక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవితేజ మాట్లాడుతూ "జామ్ 8 ఇచ్చిన సౌండ్, సంగీతం చాలా బాగున్నాయి. చాలా మంచి టెక్నీషియన్లు పనిచేశారు. రాశీఖన్నా, సీరత్‌ల రూపంలో అందమైన కథానాయికలు దొరికారు. ఈ సినిమా మంచి హిట్ అయి నిర్మాతలు బుజ్జి, వంశీలకు మంచి పేరు, గౌరవం, డబ్బు తీసుకురావాలి. 'మిరపకాయ్' నుంచి విక్రమ్ బాగా తెలుసు. క్లారిటీ ఉన్న దర్శకుడు. నేను ఆశించిన దానికంటే బాగా తీశాడు. మన తెలుగు చిత్రసీమకు మరో మంచి దర్శకుడు రాబోతున్నాడు. ఈ సినిమా బాగా ఆడితే క్రెడిట్ అంతా తనకే దక్కుతుంద"న్నారు. "ఓ దర్శకుడ్ని రవితేజ నమ్మినట్టుగా ఎవ్వరూ నమ్మరు. ఆయన కెరీర్‌లో 'టచ్ చేసి చూడు' ప్రత్యేక చిత్రంగా మిగిలిపోతుంద"న్నారు హరీష్ శంకర్. రాశీఖన్నా మాట్లాడుతూ "రవితేజ అంటేనే ఉత్సాహం. ఆయనతో మళ్లీ పనిచేయడం అదృష్టం. మా ఇద్దరి మధ్య వచ్చే హాస్య సన్నివేశాలు అందరికీ నచ్చుతాయి" అంది. "రవితేజ చాలా స్ఫూర్తినిచ్చార"ని సీరత్ తెలిపింది. "దర్శకుడు బాగా తీశాడు. ఈ సినిమా సూపర్ హిట్ అనిపించింది. సినిమా సినిమాకీ వయసు పెరుగుతుంటుంది. కానీ రవితేజకు మాత్రం తగ్గుతుంది. విక్రమార్కుడులో పోలీస్‌గా ఎంతగా అలరించాడో ఈ చిత్రంలోనూ అంతగా ఆకట్టుకుంటాడ"న్నారు వినాయక్. దర్శకుడు మాట్లాడుతూ "నా ప్రయత్నం, కృషి, పట్టుదలతో పాటు చాలా మంది వ్యక్తుల ప్రోత్సాహం ఈ చిత్రం వెనుక ఉంది. వక్కంతం మంచి కథ ఇచ్చాడు. జామ్ 8 టీమ్ చక్కటి సంగీతం అందించింది. తక్కువ సమయంలో మణిశర్మ నేపథ్య సంగీతం అందించారు. రవితేజ ఎనర్జీ గురించి అందరూ చెబుతారు. కానీ ఆ హుషారుని అందరికీ పంచిస్తారు. నా జీవితంలో జరిగిన అద్భుతం.. రవితేజతో సినిమా చేయడమ"న్నారు. "రవితేజతో 'కృష్ణ' చేయాల్సింది. కానీ కుదర్లేదు. పదేళ్ల తరవాత తనతో సినిమా చేసే అవకాశం వచ్చింది. సాంకేతిక నిపుణులంతా కష్టపడ్డార"న్నారు వల్లభనేని వంశీ. ఈ కార్యక్రమంలో రఘురామరాజు, వక్కంతం వంశీ, జీవా, రామ్ లక్ష్మణ్, చోటా కె.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెద్దారెడ్డి గీతాలు



సతీష్ రెడ్డి, మౌర్యాని

సతీష్ రెడ్డి, మౌర్యాని, ముంతాజ్ ప్రధానపాత్రల్లో నటించిన చిత్రం 'నెల్లూరి పెద్దారెడ్డి'. వి.జె.రెడ్డి దర్శకుడు. సిహెచ్. రఘునాథరెడ్డి నిర్మాత. గురురాజ్ స్వరకర్త. శనివారం హైదరాబాద్‌లో పాటల విడుదల కార్యక్రమం జరిగింది. వి.సాగర్, రేలంగి నరసింహారావు ముఖ్య అతిథులుగా హాజరై తొలి సీడీని ఆవిష్కరించారు. చిత్ర దర్శకుడు మాట్లాడుతూ "ఓ సినిమాలో నెల్లూరి పెద్దారెడ్డి పేరును ఉపయోగిస్తూ హాస్యనటుడు బ్రహ్మానందం ప్రేక్షకుల్ని నవ్వించారు. కథ రీత్యా ఆ పేరునే మా సినిమాకి టైటిల్‌గా నిర్ణయించాం. నెల్లూరుకి చెందిన పెద్దారెడ్డి ఖమ్మం జిల్లా సీతారామపురానికి వెళ్లి స్థిరపడతాడు. అక్కడ ఓ అమ్మాయి కారణంగా అతని జీవితంలో చోటు చేసుకొన్న పరిణామాలతో ఈ సినిమా ఆసక్తికరంగా సాగుతుంది. జబర్దస్త్ బృందంపై సాగే చింతామణి నాటకం రిహార్సల్స్ సన్నివేశాలు కడుపుబ్బా నవ్విస్తాయి. ఫిబ్రవరి మూడోవారంలో చిత్రాన్ని విడుదల చేస్తామ"న్నారు. "పాటలు, ప్రచార చిత్రం బాగున్నాయ"న్నారు అతిథులు సాగర్, రేలంగి నరసింహారావు, సాయివెంకట్, రామసత్యనారాయణ. ఈ కార్యక్రమంలో కమలాకర కామేశ్వరరావు, సంజీవ్ మేగోటి, మేనగ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మార్పు తెచ్చేలా సినిమాలు రావాలి



అలివేలు, శ్యామల, కృష్ణంరాజు, శ్రీకాంత్, కరణం బాబ్జీ

"రాజకీయాల్లోకి వ్యాపారవేత్తలు ప్రవేశించి ఓట్లు కొనడం ప్రారంభించారు. ప్రజలకి కూడా డబ్బుపై ఆశ పెరిగింది. వాళ్ల ఆలోచనల్లో మార్పుని తీసుకొస్తూ, చైతన్యం నింపేలా సినిమాలు రావాలి" అన్నారు ప్రముఖ నటుడు కృష్ణంరాజు. ఆయన హైదరాబాద్‌లో జరిగిన 'ఆపరేషన్ 2019' టీజర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శ్రీకాంత్, యజ్ఞశెట్టి జంటగా నటిస్తున్న చిత్రమిది. కరణం బాబ్జి దర్శకత్వం వహిస్తున్నారు. అలివేలు నిర్మాత. టీజర్ ఆవిష్కరించిన అనంతరం కృష్ణంరాజు మాట్లాడుతూ "శ్రీకాంత్ మంచి నటుడే కాదు, మంచి మనసున్న వ్యక్తి కూడా. 'బివేర్ ఆఫ్ పబ్లిక్' అనే ఉపశీర్షికతో వస్తున్న ఈ చిత్రం మంచి కాన్సెప్ట్‌తో తెరకెక్కినట్టు అర్థమవుతోంది. ఈ చిత్రం అందరికీ మంచి పేరు తీసుకురావాలని కోరుకొంటున్నా" అన్నారు. శ్రీకాంత్ మాట్లాడుతూ "కృష్ణంరాజుతో కలిసి నటించిన దగ్గర్నుంచి నాకు ఆయనతో అనుబంధం ఏర్పడింది. ఆయన చేతుల మీదుగా టీజర్ విడుదల కావడం ఆనందంగా ఉంది. గతంలో కరణం బాబ్జి దర్శకత్వంలో 'మెంటల్ పోలీస్' చేశా. వివాదాలతో పాటు విడుదల విషయంలో ఆలస్యం వల్ల ఆ సినిమాకి అనుకొన్నంత పేరు రాలేదు. ఇందులోనూ కొన్ని వివాదాస్పదమైన అంశాలున్నా కథ చాలా బాగుంది. కచ్చితంగా అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "శ్రీకాంత్‌తో పాటు మరో ఇద్దరు యువ తారలు ఇందులో నటించారు. వాళ్లెవరన్నది త్వరలోనే ప్రకటిస్తాం" అన్నారు. "ఫిబ్రవరి 6 వరకు జరిగే షెడ్యూల్‌తో చిత్రీకరణ మొత్తం పూర్తవుతుంది" అన్నారు నిర్మాత. ఈ కార్యక్రమంలో శ్యామల, శివకృష్ణ, నాగినీడు, దీక్షా పంత్, హరితేజ తదితరులు పాల్గొన్నారు.



అనుష్క

అతి పెద్ద అనుకూలత అదే!

కథ ఒక్కసారి మనసుకి ఎక్కిందంటే చాలు... నటిగా నా వంతు పని పూర్తైనట్టుగానే భావిస్తుంటా అంటోంది అనుష్క. సినిమా ప్రయాణం పరంగా నేను గమనించిన అతి పెద్ద అనుకూలతల్లో అదొకటని చెబుతోందామె. ప్రస్తుతం 'భాగమతి'గా సందడి చేస్తున్న అనుష్క లార్జర్ దేన్ లైఫ్ తరహా కథలు, పాత్రలకి కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోంది. కానీ ఆమె మాత్రం కథల విషయంలో నాకు తారతమ్యాలే లేవంటోంది. "విన్న కథ ఎలా ఉందన్నది మాత్రమే కొలమానం. ఇక అందులో పాత్ర పరిధి ఎంత? నా చుట్టూనే తిరుగుతుందా లేదా? ఇలాంటి విషయాలేవీ పట్టించుకోను. ఒక మంచి కథని ఎంచుకొన్నాక ఆ సినిమా ప్రయాణం నాకు నల్లేరుపై నడకలాగే ఉంటుంది. సెట్లో ఎంత కష్టం ఎదురైనా అదేదీ గుర్తుండదు. అందుకే కథ ఎంచుకొనేటప్పుడే ఎక్కువగా ఆలోచిస్తాను తప్ప, చేసేటప్పుడు మాత్రం దర్శకుడి ఆలోచనలతో మమేకమవడమే తెలుసు. నటిగా పదమూడేళ్లుగా ప్రయాణం చేస్తున్నా, ఇప్పటికీ ధైర్యంగా నన్ను నేను తెరపై చూసుకోలేకపోతున్నా. అది సిగ్గో లేక భయమో తెలియదు" అంటూ నవ్వేస్తోంది అనుష్క.

అప్పటి ముచ్చట!

ఎమ్జీఆర్ తమ్ముడు... శివాజీ కొడుకు



ఎమ్జీఆర్



శివాజీ గణేశన్

భారతదేశ రాజకీయాల్లో దక్షిణ భారత సినిమా రంగం సంచలనం సృష్టించిన రోజు 1977, జూన్ 30. ఆరోజే 'మక్కళ్ తిలకం' ఎం.జి.ఆర్ తమిళనాడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆ సందర్భంగా సౌత్ ఇండియా ఫిల్మ్ ఛాంబర్ ఓ సన్మాన సభ ఏర్పాటు చేసింది. దక్షిణ భారత చలనచిత్ర పరిశ్రమ 'డాడీ' అని ఆప్యాయంగా పిలుచుకొనే ప్రముఖ నిర్మాత, దర్శకుడు పి.పుల్లయ్య ఆధ్వర్యంలో సభ ఏర్పాటు చేశారు. శివాజీ గణేషన్‌కి, ఎం.జి.ఆర్‌కీ మధ్య పొసగని రోజులవి. కానీ ఆ ఇద్దరూ పుల్లయ్య, శాంతకుమారి దంపతులకు కావలసిన వారే! పుల్లయ్యని ఎం.జి.ఆర్ ఎప్పుడూ 'అన్నా' అని పిలిచేవాడు. శివాజీ గణేశన్ 'డాడీ' అంటూ కన్న కొడుకులాగా పుల్లయ్య ఇంట్లో తిరిగేవారు. సమావేశం రోజు శివాజీ పుల్లయ్య గారితో, 'డాడీ మీకో మాట.. ఇవాళ సన్మాన కార్యక్రమంలో మీరు ఎం.జి.ఆర్‌ని ఎంతైనా పొగుడుకోండి.. అభ్యంతరం లేదు గానీ, నన్ను తక్కువ చేసి మాట్లాడితే మాత్రం మర్యాద దక్కదు' అంటూ చనువుతో కూడిన హెచ్చరికలాంటిది చేశారట. అది విన్న పుల్లయ్య 'పోరా' అని గట్టిగా నవ్వుతూ శివాజీ వీపు మీద చరిచారట. ఆనాటి సన్మాన సభలో ఎం.జి.ఆర్ గురించి పుల్లయ్య గొప్పగా చెబుతూ, చివర్లో 'మా అమ్మ, నాన్నలకు నేనొక్కడినే సంతానం. ఆ లోటును భర్తీ చేస్తూ ఎం.జి.ఆర్ నాకు తమ్ముడయ్యారు. అలాగే నాకు ఇద్దరు కుమార్తెలే తప్ప కొడుకులు లేరు. ఆ వెలితిని తీరుస్తూ శివాజీ నాకు కొడుకయ్యారు' అన్నారట! దాంతో సభ చప్పట్లతో దద్దరిల్లింది. ఆ తర్వాత పుల్లయ్యకి ఫోన్ చేసి 'శభాష్ డాడీ' అని అభినందించడం శివాజీ వంతయింది.

చెప్పండి... నేర్చుకుంటాం



దుక్కిపాటి మధుసూదనరావు

అన్నపూర్ణ వారి 'చదువుకున్న అమ్మాయిలు' 1963 ఏప్రిల్ 10న విడుదలైంది. ఆ చిత్రం గురించి గౌరవ డాక్టరేట్ పొందిన ఓ ప్రముఖ విమర్శకుడు ఓ పత్రికలో రాస్తూ ఇందులో ఫోటోగ్రఫీ బాగా లేదు అని ఓ ముక్కలో తేల్చేశాడట. పత్రికల వారి సమీక్షలకు విలువనిచ్చే ఆ చిత్ర నిర్మాత దుక్కిపాటి మధుసూదనరావు అది చదివి విస్తుపోయారు. ఆ చిత్ర దర్శకుడు ఆదుర్తి సుబ్బారావుకున్న సాంకేతిక పరిజ్ఞానం అపారం. అలాగే దుక్కిపాటి మధుసూదనరావు గాని, హీరో ఏయన్నార్‌గాని టెక్నికల్ విషయాల్లో రాజీపడే మనుషులు కాదు. ఇకపోతే ఆ సినిమా కెమెరామెన్ సెల్వరాజ్ అద్భుతమైన సాంకేతిక నిపుణుడు. అంతకు ముందు అన్నపూర్ణా వారి 'ఇద్దరు మిత్రులు' సినిమాలో ఇద్దరు ఏయన్నార్‌లని అద్భుతంగా చూపించిన ప్రతిభావంతుడు. ఆ చిత్రం కోసం అప్పటి లేటెస్ట్ కెమెరాను ఉపయోగించారు. సినిమా ఆద్యంతం ప్రతి ఫ్రేం నిండుగా వచ్చింది. అలాంటి వర్క్‌ని ఒక్క మాటలో ఫొటోగ్రఫీ బాగా లేదు అని ఓ విమర్శకుడు రాసాడంటే ఈ భూ ప్రపంచం మీద ఉన్న కెమెరామెన్‌ల కన్నా గొప్ప నాలెడ్జ్ ఉండితీరాలి కదా! అందుకే ఆ మహానుభావుడి దగ్గర సలహాలు, సూచనలు, అవసరమైతే పాఠాలు కూడా నేర్చుకోవాలని దుక్కిపాటి మధుసూదనరావు భావించి ఆ పత్రికా కార్యాలయానికి ఫోన్ చేశారట. లైన్‌లోకి సదరు విమర్శక శిఖామణి రాగానే 'అయ్యా... తమరి ఇంటి అడ్రస్ చెప్పండి. మేం వచ్చి తమ వద్ద ఫొటోగ్రఫీ పాఠాలు నేర్చుకుంటాం' అన్నారట. అంతే... ఆ మర్నాటి నుంచి ఆ విమర్శక రత్న దుక్కిపాటి వారి కంటబడితే ఒట్టు!

– శ్రీవత్స

ఆశాభోంస్లేకు యశ్‌చోప్రా పురస్కారం



ప్రముఖ దర్శకనిర్మాత యశ్‌చోప్రా పేరుతో సుబ్బిరామిరెడ్డి ఫౌండేషన్ ఏర్పాటు చేసిన నేషనల్ యశ్‌చోప్రా మెమోరియల్ అవార్డును 2017కి గానూ ప్రముఖ నేపథ్యగాయని ఆశాభోంస్లేకు ప్రదానం చేయనున్నారు. పదేళ్లప్రాయంలో నేపథ్య గాయనిగా కెరీర్‌ను ప్రారంభించిన ఆశాభోంస్లే వందలాది చిత్రాల్లో వేలాది పాటలు పాడి చిత్ర పరిశ్రమకి సేవ చేశారు. ముంబయిలో ఫిబ్రవరి 16న జరిగే వేడుకలో మహారాష్ట్ర గవర్నర్ సీహెచ్. విద్యాసాగర్‌రావు, ప్రముఖ గాయని లతామంగేష్కర్ చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని ఆశాభోంస్లే స్వీకరిస్తారు. యశ్‌చోప్రాతో ఉన్న అనుబంధంతో ఆయన జ్ఞాపకంగా టి.సుబ్బిరామిరెడ్డి 2013 నుంచి సినీ ప్రముఖులకి ఈ పురస్కారాన్ని అందిస్తున్నారు. అమితాబ్ బచ్చన్, షారుఖ్ ఖాన్, లతామంగేష్కర్, రేఖ ఈ పురస్కారాన్ని అందుకొన్నవారిలో ఉన్నారు.



సాగర్ మహతి

ఆయనలా పేరు తెచ్చుకోవాలి

"ప్రేక్షకులు మళ్లీ మళ్లీ పాడుకునే పాటల్ని అందించాలనేదే నా తపన. ఆ ధ్యేయంతోనే 'ఛలో' పాటల్ని స్వరపరిచాను" అన్నారు సాగర్ మహతి. నాగశౌర్య కథానాయకుడిగా నటించిన 'ఛలో' చిత్రానికి సంగీత దర్శకుడిగా వ్యవహరించారాయన. వెంకీ కుడుముల దర్శకత్వం వహించారు. ఉషా ముల్పూరి నిర్మాత. ఫిబ్రవరి 2న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా సాగర్ మహతి శనివారం హైదరాబాద్‌లో విలేకర్లతో మాట్లాడారు.

■ "నాన్నగారు మణిశర్మ మెలోడీలకు పెట్టింది పేరు. అలా అని నేనూ ఆయన శైలినే అనుసరించకూడదు. 'ఈడు గోల్డ్ ఎహె', 'జాదూగాడు' చిత్రాలకి సంగీతాన్ని సమకూర్చాను. ఎవరికయినా విజయం ఉన్నప్పుడే అవకాశాలు వస్తాయి. నేను ఎక్కువ చిత్రాలు చేయలేకపోవడానికి ఇదొక కారణం కావచ్చు. 'ఛలో'లో 'చూసీ చూడంగానే..' పాట బాగుందంటున్నారు. మిగిలిన పాటలకూ మంచి స్పందన వస్తోంది".

■ "నాకు ప్రేమకథలంటే ఇష్టం. కానీ అన్ని రకాల జోనర్‌లలో సినిమాలు చేయాలి. నాన్న గారికి నేపథ్య సంగీతంలో మంచి పేరుంది. నేనూ ఆయనలానే అందులో పేరు తెచ్చుకోవాలి. ఇళయరాజా తనయుడు యువన్ శంకర్ రాజా సంగీతమంటే నాకు చాలా ఇష్టం. ఆయన తనదైన శైలిలో పయనిస్తూ ప్రత్యేక గుర్తింపుని తెచ్చుకున్నారు. నేనూ ఆయనను మార్గదర్శకుడిగా తీసుకుని నాదైన బాటలో ప్రయాణిస్తా. ప్రస్తుతం 'కుమారి 21 ఎఫ్' కన్నడ చిత్రానికి స్వరాల్ని అందిస్తున్నాను".

‘మా అబ్బాయి గణితంలో కొట్టిన పిండి. భవిష్యత్తులో ప్రపంచం అబ్బురపడే విజేత కావాలంటే ఏం చేయాలి?’

‘ఏ విజ్ఞానానికైనా ఒక పరిమితంటూ ఉంటుంది. కానీ, ఊహాత్మకశక్తి (ఇమాజినేషన్)కి అవధులు ఉండవు. మీ పిల్లవాడికి అలాంటి సృజనాత్మక శక్తిని ఇవ్వండి. అన్నిటికంటే అదే పెద్ద గెలుపు’

‘మరి, ఏం చేయమంటారు?’

“ఆ కుర్రాడికి రోజుకొక కథ చెప్పండి చాలు..”



కథ చెప్పమ్మా ప్లీజ్!

అంత క్లిష్టమైన సమస్యకు చిటికెలో పరిష్కారం చూపిన ఆ మేధావి వంక ఆశ్చర్యంగా చూసింది ఆ తల్లి. పిల్లలకు కథలు చెప్పమన్న ఆయన ఎవరో కాదు. ప్రఖ్యాత శాస్త్రవేత్త ఐన్‌స్టీన్!

అంతర్జాలానికి అతుక్కుపోయే నేటి పిల్లలు కథలను వింటారా? ఒకవేళ వింటే ప్రయోజనమేంటి? తల్లిదండ్రులు, పిల్లల మధ్య అనుబంధాన్ని పదిలం చేసే శక్తి కథలకు ఉందా? పిల్లల్లో సృజనాత్మకతను పెంచాలంటే ఏం చేయాలి? కొత్త ఆలోచనలకు పట్టం కడుతున్న పోటీప్రపంచంలో మన పిల్లలు నెగ్గుకురావాలంటే.. కథలు ఎంతవరకు అవసరం? ఒకసారి చూద్దాం.

ఇప్పుడు.. పిల్లలకు వందకు వంద మార్కులొస్తే వింతేమీ కాదు! కొందర్నికైతే పట్టుమని పదేళ్లు ఉండవు. బొమ్మలతో కంటే.. కంప్యూటర్ లాంగ్వేజీలతో చెడుగుడు ఆడేస్తారు. ఇక, వీడియోగేమ్స్ పాత మాట. గంటల్లో యాప్స్ రూపొందించి.. గూగుల్‌ప్లేలో చకచకా అప్‌లోడ్ చేసేస్తున్నారు. పదిహేనేళ్లలోపే డిగ్రీ పూర్తి చేస్తున్న బుడతలకైతే కొదవ లేదు. పెళ్లీడుకు రాకమునుపే బుల్లి సీఈవోలై.. వయసుకు మించిన పాత్ర పోషిస్తున్నారు. ఇదంతా ఒక వైపు కనిపిస్తున్న పరిణామం. మరోవైపు- ఇంటర్నేషనల్ స్కూళ్లలో చదివినా ఎక్కాలు చెప్పలేని పిల్లలున్నారు. తేలికైన పొడుపు కథలు విప్పండర్రా అనడిగితే దిక్కులు చూసేవాళ్లున్నారు. జీవననైపుణ్యాల మాటకొస్తే.. సున్నాకు సున్నా. విహారయాత్రలకు వెళ్లి ఈత రాక చనిపోతున్నారు. అమ్మ ఓ సరుకుల చీటీ చేతికిచ్చి కిరాణాకొట్టుకెళ్లి సరుకులు తెమ్మన్నా చేతకాని వాళ్లున్నారు. ఎందుకీ వైరుధ్యం.. ఎక్కడుంది లోపం? పూలు వికసిస్తేనే కదా పరిమళం. పిల్లలు కూడా అంతే! రాత్రింబవళ్లు బట్టీ పట్టి మార్కులు తెచ్చుకుంటే సరిపోదు. చిట్టి బుర్రలకు రెక్కలు తొడగాలి. ఎగిరే స్వేచ్ఛనివ్వాలి. ఊహల ఆకాశం ఆటస్థలం కావాలి. అందులో నుంచే సృజనాత్మకత వెల్లివిరుస్తుంది. రేపొద్దున ఆవిష్కరణల ప్రపంచంలో సులువుగా నెట్టుకొస్తారు. ఆ వికాస నైపుణ్యాన్ని చేతికి అందించే మ్యాజిక్ స్టిక్.. ‘కథ’! అప్పట్లో అమ్మమ్మ ఒడే.. మన కథల బడి. ఇప్పుడా అనుభవం పిల్లలకు ఇవ్వకపోతే ఎలా చెప్పండి. మన దేశం కథలకు ఖార్ఖానా. పురాణాలూ, ఇతిహాసాలూ, ప్రబంధాలూ, బాల సాహిత్యం.. లెక్కలేనంత కథా సంపద మనకుంది. అమ్మానాన్నలు కథలు మొదలెట్టడమే ఆలస్యం. పిల్లలు బుద్ధిగా కూర్చుని మీగడపెరుగన్నం తిన్నంత హాయిగా కథలు వింటారు.

రోజుకొక కథ వింటే లాభమేంటి?

- కథ ఒక శక్తివంతమైన విజువల్ ఎఫెక్ట్. హ్యారీపోటర్, జంగిల్‌బుక్‌లను మించిన సినిమా దృశ్యాలకు కథారూపం ఇవ్వొచ్చు. కథలోని పాత్రలూ, వేషధారణా, ప్రదేశాలూ, వాతావరణంతో మమేకమై తమదైన లోకాన్ని సృష్టించుకుంటారు పిల్లలు. ఆ సన్నివేశాల్లో నుంచే సృజనాత్మకత పుడుతుంది.
- పదబంధాలూ, పలుకుబళ్లూ, సామెతలూ, వాక్పటిమ.. కథలు వింటే అలవోకగా అలవడతాయి. భాషా సామర్థ్యం పెరుగుతుంది. పిల్లల్లో కమ్యూనికేషన్ స్కిల్స్‌కు ఢోకా ఉండదు.
- ఒకప్పటిలా తరగతి గదిలో మన పిల్లాడి పక్కన.. అందరూ మన ఊరి పిల్లలే కూర్చోరు. భిన్న ప్రాంతాలూ, మతాలూ, సంస్కృతులకు చెందిన పిల్లలతో కలిసి చదువుకోవాల్సి వస్తుంది. పర భాషల కథలను పిల్లలకు చెప్పినప్పుడు.. ప్రపంచంలోని ఆ వైవిధ్యం పసితనంలోనే అర్థమవుతుంది. కొత్తవ్యక్తులతో కలిసిపోయే స్వభావం అబ్బుతుంది.
- పోటీ ప్రపంచంలో వేగం తప్పనిసరి. గంటల తరబడి పుస్తకాలతో కుస్తీ పడతానంటే కుదరదు. ఒక్కసారి చదివితే గుర్తుండిపోవాలి. సూక్ష్మగ్రాహకశక్తి ఉంటే అది సాధ్యం అవుతుంది. ఆ లక్షణం కథలను వినడం వల్ల వస్తుంది.
- పరీక్షలంటే ఆందోళనా, మార్కులు తక్కువొస్తే కంగారు. ఆటల్లో ఓడిపోతే కన్నీళ్లు. కథల్లోనూ అడ్డంకులను అధిగమించిన ఇలాంటి ఎన్నో పాత్రలు తారసపడతాయి. అవి పిల్లల్లో స్ఫూర్తినింపి.. ఉత్తేజం కలిగిస్తాయి.

ప్రపంచమంతా మన పంచతంత్రమే!

అమెరికా, ఆస్ట్రేలియాలలో స్టోరీటెల్లింగ్ గౌరవప్రదమైన వృత్తి. కెనడా ప్రభుత్వం అయితే పిల్లల పాఠ్యపుస్తకాల్లో స్టోరీటెల్లింగ్‌ను తప్పనిసరి చేసేందుకు ప్రయత్నిస్తోంది. ఇరాన్ ప్రభుత్వం కనూన్ కేంద్రాలలో స్టోరీటెల్లర్‌లను నియమించింది. విభిన్న కళలను మేళవించి పిల్లల కథకు కొత్త రూపం ఇస్తోంది. ఆస్ట్రియా, జర్మనీలకు చెందిన తల్లిదండ్రులు తమ పిల్లలకు కథలు చెప్పడం జీవితంలో ఓ భాగం. ఇండోనేషియా, సింగపూర్‌లలో మహాభారతం, రామాయణం, ఆస్ట్రియాలో కథాసరిత్సాగరం వంటి భారతీయ పుస్తకాల నుంచి పిల్లలకు కథలు చెబుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా నేను అనేక స్టోరీటెల్లింగ్ వేడుకల్లో పాల్గొన్నాను. ఎక్కడికెళ్లినా మన ‘పంచతంత్ర’మే బాల సాహిత్యానికి భగవద్గీతలా అనిపించింది.

- **దీపాకిరణ్,** స్టోరీ టెల్లర్, హైదరాబాద్

కథలను ఎలా మొదలెట్టాలి..



– **చిట్టి విష్ణుప్రియ,** పేరెంట్ ఎడ్యుకేషనిస్ట్

మీ అమ్మాయి ఇల్లు పీకి పందిరి వేస్తోందనుకోండి. ‘అబ్బబ్బా.. నీ అరుపులతో బుర్ర బద్ధలవుతోందే. నోరు మూస్తావా లేదా?’ అని గద్దిస్తే ఫలితం ఉండదు. ‘అదిగో పులి..’ అంటూ ఓ కథను సంధించి చూడండి. గమ్మున అయిపోతుంది. పిల్లల అల్లరిని దృష్టి మళ్లించడానికి అమ్మలకు కథకంటే గొప్ప ఆయుధం ఇంకేముంటుంది..

ఎలాంటివి పిల్లలకు ఆసక్తి...

పిల్లల వయసును బట్టి కథలు ఎంచుకోవాలి. చిన్న పిల్లలు సహజంగా మనుషుల తరువాత జంతువులనే చూస్తారు కాబట్టి.. వాటి కథలతోనే ప్రారంభించండి. మాటలు రాని వయసు పిల్లలకు కూడా కథలు చెప్పొచ్చు. వయసు పెరిగేకొద్దీ కథల స్థాయిని పెంచండి. సంక్లిష్టమైన ఇతివృత్తాలను మాత్రం ఎంచుకోవద్దు.

కాలం మారింది.. కథ కూడా మారాలా..

పాత కథల మీదే కొత్త మీగడ అద్దండి. నేటికి తగ్గట్టు.. విలువల్ని ఎలా అనుసరించాలో కథల్లో చొప్పించండి. వర్ధమానానికి అవసరమైన జీవననైపుణ్యాలనూ జత చేయొచ్చు. మనం చిన్నప్పటి నుంచి వింటున్న ‘ఆవు..పులి’ కథ ఎప్పటికీ అదే నీతిని బోధిస్తుంది. కాలం మారేకొద్దీ ఆ నీతి మారుతుందా? నిజ జీవితంలోనూ అలాంటి నీతిని పాటించడం సాధ్యమా? వంటి అంశాలను పిల్లల ముందు విశ్లేషించాలి.

కథలను స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్‌లలో చూడొచ్చు కదా..

ట్యాబ్‌లో కథలు వింటే మానవీయస్పర్శ ఉండదు. అదే అమ్మ కథ చెప్పిందనుకోండి. కథ చెప్పేటప్పుడు పిల్లలు ఏ సంఘటనకు ఎలా స్పందిస్తున్నారు.. ఎలాంటి సందేహాలు వస్తున్నాయి.. ఇవన్నీ అమ్మకు తెలుస్తాయి.

కథలు చెప్పడంలో తల్లిదండ్రుల లోపం ఎక్కడుంది..

కథలు చెప్పే పెద్దలకు నిజాయతీ అవసరం. ఫోన్‌లో వాట్సాప్ చూస్తూనో, టీవీ తిలకిస్తూనో అర మనసుతో కథలు చెప్పొద్దు. మీ పిల్లల కోసం నిజాయతీగా పది నిమిషాలు కేటాయించినా చాలు.

హడావిడిలో ఉన్నప్పుడు చెప్పమని విసిగిస్తే..

ఒక తండ్రి ఆఫీసుకు బయలుదేరే బిజీలో ఉన్నాడనుకోండి. అప్పుడు పిల్లవాడు వచ్చి.. ‘నాన్నా.. కథ చెప్పవా’ అని పట్టు పడితే ఏం చేయాలి. అప్పుడు ఆ నాన్న కథను రెండు వాక్యాలతో మొదలు పెట్టి.. ‘మిగిలింది సాయంత్రం చెబుతా కన్నా’ అని బుజ్జగించవచ్చు. ఇలాంటి సమయాల్లో.. కథను ధారావాహికలా చెప్పడం తెలివైన పని.

పిల్లల కథల్లో ఊహలకు, వాస్తవాలకు పొంతన ఉండదు కదా..

అమ్మ చెప్పే చందమామ కథ ఒక ఊహ. ఆ కథను విన్న పిల్లలు ‘చందమామ మన భూమికి ఎంత దూరం’, ‘అక్కడికి వెళ్లినా ఈ వెలుగే ఉంటుందా’, ‘చందమామ మీద నడవొచ్చా’.. ఇలాంటి ప్రశ్నలన్నీ చిట్టి బుర్రల్లో పుడతాయి. అంటే.. ఊహలతో అల్లిన కథ.. సైన్సును తెలుసుకునేందుకు ప్రేరణ అవుతుంది.

– మల్లెంపూటి ఆదినారాయణ

వీడ్కోలు వేడుక్కి ఎలా...

? మా స్నేహితుల బృందంలో ఒకరికి విదేశంలో ఉద్యోగం దొరికింది. ఆఫీస్‌లో వీడ్కోలు పార్టీ ఏర్పాటు చేశాం. అయితే మిగిలిన అయిదుగురం ఒకే గ్రూపులా అనిపిస్తూనే, ఆ పార్టీలో ప్రత్యేకంగా కనిపించాలనుకుంటున్నాం. మా స్నేహితులందరం ఎలాంటి దుస్తులు ఎంచుకుంటే బాగుంటుందో చెబుతారా..


– ఓ సోదరి

✔ మీకు వెస్ట్రన్ క్యాజువల్స్ అయితే బాగుంటాయి. జీన్స్ పై కుర్తా వేసుకుంటే మంచి లుక్ వస్తుంది. సాదా పలాజోపై పూలడిజైను ఉన్న క్రాప్‌టాప్ చక్కగా నప్పుతుంది. అలాగే మోకాలి వరకు వచ్చే ముదురు రంగు షార్ట్ స్కర్టుపై లేత వర్ణంలో ఆఫ్ షోల్డర్ లేదా కోల్డ్ షోల్డర్ టాప్‌ను వేసుకుంటే చూడటానికి చక్కగా ఉంటుంది. రఫెల్ బెల్‌బాటం ప్యాంటుపై థ్రెడ్‌వర్క్ ఉన్న టాప్ లేదా స్లీవ్‌లెస్ కుర్తా అమరుతుంది. అలాగే లెగ్గింగ్స్ లేదా లేదా పెన్సిల్ కట్ జీన్స్ ప్యాంటుపైన లేత రంగు బెనారస్ బ్రొకేడ్ టాపు అందంగా కనిపిస్తుంది. అయితే అది టీ షర్ట్‌లా ఉండేలా చూసుకోవాలి. కుదిరితే మీ ఐదుగురూ టాప్స్ అన్నీ లేత రంగుల్లో ఉండేలా చూసుకుంటే ప్రత్యేకంగా కనిపిస్తారు. దాంతోపాటూ జుట్టును వదిలేసి చెవులకు పొడుగ్గా ఉండే లోలాకులు పెట్టుకుంటే ఆ అందమే వేరు. ప్రస్తుతం చెప్పులు కూడా దుస్తులకు తగ్గట్టు వస్తున్నాయి కాబట్టి వాటినీ ప్రయత్నించొచ్చు. ఆ వీడ్కోలు పార్టీలో మీ స్నేహితుల బృందమే అందరి కన్నా ఆకర్షణీయంగా కనిపిస్తారు. అలంకరణ కూడా చాలా తక్కువగా ఉండేలా చూసుకుంటే చాలు.

డియర్ వసుంధర



ధన్యా గుత్తా
డిజైనర్



బంగారం వెండి

27న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	31,500	-------	31,300	-------
ఆర్నమెంట్	29,420	-------	29,100	-------
వెండి (కిలో)	41,100	-------	41,500	-------
	ప్రొద్దుటూరు		రాజమండ్రి	
బంగారం(24క్యా)	30,750	-------	31,350	31,250
ఆర్నమెంట్	28,480	-------	29,320	29,220
వెండి (కిలో)	39,900	-------	40,400	40,300
	విశాఖపట్నం		తమిళనాడు	
బంగారం(24క్యా)	31,420	31,420	-------	-------
ఆర్నమెంట్	29,220	29,220	2,922	2,922 గ్రా
వెండి (కిలో)	41,500	41,500	43.10	43.11గ్రా

నజరానా

తరచూ అల్లాన్ని మీ ఆహారంతో పాటు తీసుకుంటూ ఉంటే రక్తంలో చక్కెరస్థాయిలు అదుపులో ఉంటాయి. అంతేకాదు ఎముకల ఆరోగ్యానికీ చాలా మంచిది.

email: vasundhara@eenadu.net

కాళ్ల ఆరోగ్యానికి నిచ్చెన

చిన్న నిచ్చెన సాయంతో చేసే వ్యాయామాలు ఇవి. వీటివల్ల కాళ్లూ, పిరుదుల వద్ద ఉండే కొవ్వు సులువుగా కరుగుతుంది. ప్రతి వ్యాయామాన్ని పది నుంచి పన్నెండుసార్లు చేసినప్పుడు మాత్రమే ఆ ఫలితం అందుతుంది. ఒకవేళ నిపుణుల పర్యవేక్షణలో చేస్తుంటే చీలమండల దగ్గర బరువైన పట్టీని కడతారు. ఇంట్లో అయితే పట్టీ అవసరంలేదు. నిచ్చెనకు బదులు కుర్చీని ఎంచుకోవచ్చు.



నిచ్చెనను ఎడమ చేత్తో పట్టుకుని మీ ఎడమకాలిని అలాగే ఉంచాలి. కుడిచేతిని నడుముపై ఉంచి.. కుడికాలిని చిత్రంలో చూపిన విధంగా గాలి పీలుస్తూ వీలైనంతవరకూ పైకి లేపే ప్రయత్నం చేయాలి. తిరిగి గాలిని వదులుతూ నెమ్మదిగా పూర్వపు స్థితికి రావాలి. ఇది మీ తొడలకూ, పిరుదులకూ, గ్లూట్స్‌కి చక్కటి వ్యాయామాన్ని అందిస్తుంది. ఇలా పది నుంచి పన్నెండు సార్లు చేయాలి. ఆ తరువాత కాళ్లు మార్చి మళ్లీ చేయాలి.




నిచ్చెనను రెండు చేతులతో పట్టుకుని రెండుకాళ్లను నిటారుగా ఉంచాలి. ఇప్పుడు గాలి పీలుస్తూ నెమ్మదిగా ఎడమకాలిని చిత్రంలో చూపిన విధంగా పైకి ఎత్తాలి. ఆ తరువాత గాలి వదులుతూ మామూలు స్థితికి రావాలి. కుడికాలితో కూడా ఇదే విధంగా చేయాలి. ఇలా చేయడం వల్ల కాలి కండరాలు దృఢంగా మారతాయి.



మీ కాళ్లను నేలపై పెట్టాలి. ఆ తరువాత కుడికాలిని మోకాలి వరకు మడిచి స్థిరంగా ఉండాలి. పాదాన్ని చిత్రంలో చూపిన విధంగా పెట్టాలి. అలా పెట్టడం వల్ల మీ మోకాలిలోని టెండాన్లు బాగా పనిచేస్తాయి. ఇప్పుడు నెమ్మదిగా పాదాన్ని నేలపై ఆనించాలి. ఇలానే రెండో కాలితోనూ చేయాలి. ఇలా కాళ్లు మారుస్తూ దీన్ని పూర్తిచేయాల్సి ఉంటుంది. దీనివల్ల కాళ్లూ తీరైన ఆకృతిలోకి వస్తాయి.





డా॥ మణిపవిత్ర
ఫిట్‌నెస్ నిపుణురాలు
7702491110



ఆమె చిన్నతనంలో తండ్రి నాటిన ‘సేవా బీజం’ మొలకెత్తి ఆమెతోపాటు పెరిగింది. తన ‘సేవా వెలుగుల’తో ప్రపంచంలోని అభాగ్యుల జీవితాల్లో చీకటిని తరిమేయాలని సంకల్పించుకుంది. దానికోసం అహర్నిశలు కష్టపడింది. అదే ఇప్పుడామెకు గుర్తింపు తెచ్చింది. ‘అంతర్జాతీయ ఆహార పథకం (వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్) ప్రతినిధిగా ఎంపికైంది. అంతే కాదు 90 దేశాల అభ్యర్థులను వెనక్కి తోసి ప్రపంచ ఆరోగ్య సంస్థ డిప్యూటీ చీఫ్ ఆఫ్ బిజినెస్ అండ్ ఇన్నోవేషన్‌కు భారతదేశం నుంచి ఎంపికైన తొలి మహిళా ప్రతినిధిగా గుర్తింపు తెచ్చుకుంది. ఆమే కర్నూలుకు చెందిన అనితా నరహరి.

నా ఉద్యోగం వాళ్లకు భోజనం పెట్టడమే!

‘కర్నూలుకు చెందిన ప్రముఖ ఆర్థో వైద్యులు నరహరి వెంకట నారాయణ శెట్టి మా నాన్నగారు. అమ్మ ఝాన్సీరాణి గృహిణి. నేను మచిలీపట్నంలో పుట్టా. తొమ్మిదో తరగతి వరకూ అక్కడే చదువుకున్నా. కర్నూలులోని మిషనరీ స్కూలులో పదోతరగతి, ఇంటర్ నెల్లూరు నారాయణ, ఇంజినీరింగ్ కర్నూలు పుల్లారెడ్డి కళాశాలల్లో పూర్తి చేశా. మా ఇంట్లో దేవుడి చిత్రపటాలు ఉండవు. మేం పూజలు చేయం. సాయం కోసం వచ్చిన వారికి అండగా, సాటి మనుషుల్లో దేవుడిని చూడాలని నాన్న చెప్పేవారు. దాన్నే పాటిస్తున్నా.

ఐసీఎస్‌గా గుర్తింపు...
ఇంజినీరింగ్ అయ్యాక 2004 నుంచి 2013 వరకు పలు ఐటీ కంపెనీల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిగా చేశా. రూ.లక్షల్లో జీతం అందుకున్నా. అమెరికా, జర్మనీ, ఆఫ్రికా లాంటి దేశాల్లో ఐటీ ఎక్స్‌పర్ట్‌గా కూడా పనిచేసిన అనుభవం ఉంది. అయినా నాలో ఏదో అసంతృప్తి. అలాంటి సమయంలోనే ఆన్‌లైన్‌లో ఐక్యరాజ్యసమితి సేవలు చూసి ఆశ్చర్యపోయా. అక్కడ పనిచేస్తే గనుక అన్నార్తుల ఆకలి తీర్చడంలో నా వంతుగా సాయం చేయొచ్చని అనిపించింది. అలా ఐక్యరాజ్య సమితిలో కన్సల్టెంట్‌గా పని చేశా. ఐక్యరాజ్యసమితి ప్రకటించిన వరల్డ్ ఫుడ్ ప్రోగ్రాంలో పనిచేసేందుకు మూడేళ్లక్రితమే దరఖాస్తు చేసుకున్నా. రోమ్‌లో వివిధ దశల్లో ఇంటర్వ్యూలకు హాజరై ఈ ఏడాది జనవరి 11న ఐసీఎస్ (ఇంటర్నేషనల్ సివిల్ సర్వెంట్)గా ఎంపికై ఐక్యరాజ్యసమితిలో డిప్యూటీ చీఫ్ ఆఫ్ బిజినెస్ అండ్ ఇన్నోవేషన్‌గా అర్హత సాధించా. ప్రస్తుతం సుడాన్ రాజధాని కార్టూమ్‌లో పనిచేస్తున్నా.

సేవే లక్ష్యంగా... వరదలూ, భూకంపాలు వంటి ప్రకృతి ప్రకోపాలతో సర్వస్వం కోల్పోయి వలస వచ్చే బాధితుల వద్ద ఎలాంటి ఆధారాలుండవు. అలాంటి వారికోసం ఐక్యరాజ్యసమితి కన్సల్టెంట్‌గా ఉన్నప్పుడు ప్రత్యేకంగా బయోమెట్రిక్‌ను ఏర్పాటు చేశా. వేలిముద్రలు, ఐరిష్‌తో నిజమైన లబ్ధిదారులకు పోషకాహారం అందించగలిగా. ఎందరో శరణార్థులకు ఎలా ఆహారం అందించాలి అనే విషయాలపై పని చేశా. ప్రస్తుతం ఐసీఎస్‌గా ఏ దేశానికైనా నేను వెళ్లొచ్చు. యుద్ధం, కరవులు, సునామీ లాంటి పరిస్థితుల్లో ఆ ప్రతినిధిగా సేవ చేయాలి. ఇప్పుడు సూడాన్‌లో ఉన్న ప్రపంచ ఆహార పథకం కార్యాలయం నుంచి పిల్లల సంరక్షణా, అన్నార్తులకు అన్నం పెట్టే సేవలు అందించాల్సి ఉంది. అంటే ఆకలి మంటలు తీర్చాలి.


అమ్మానాన్నా ఆయన...



నాన్న 10,500 వరకూ ఉచితంగా పోలియో చికిత్సలు చేశారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి సత్కారం పొందారు. మా వారు ఇల్లూరు హరికృష్ణ. నైజీరియాలో 26 దేశాలకు ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ మార్కెటింగ్ హెడ్‌గా పనిచేస్తున్నారు. సంపద ఉంది, కూర్చొని తింటే సరిపోతుందని ఆయన ఎప్పుడూ చెప్పలేదు. ‘నీ లక్ష్యం కోసం పనిచేయ’మని ప్రోత్సహించేవారు. పెళ్లైన 11 ఏళ్లలో కలిసి ఒకే ఇంటిలో ఉంది రెండేళ్లే. నా కూతురు మేధాకృష్ణ అయిదో తరగతి చదువుతోంది. తను అమ్మానాన్నల వద్దే పెరుగుతోంది.

– **యడ్లపాటి బసవ సురేంద్ర,**
ఈనాడు డిజిటల్ - కర్నూలు

ముఖం కడుగుతున్నారా



‘ఈరోజు అలసటగా ఉంది రేపు ఉదయం చూద్దాం లే...’ అనుకుని చాలామంది రాత్రిపూట ముఖాన్ని శుభ్రం చేసుకోకుండానే నిద్రపోతారు. కానీ ఎంత అలసిపోయినా ముఖం శుభ్రం చేసుకోవడం మంచిది. ఎందుకంటే...

- రాత్రి ముఖాన్ని శుభ్రం చేసుకోవడం వల్ల చర్మంపై ఉండే దుమ్మూ, ధూళీ తుడిచిపెట్టుకుపోతాయి. అంతేకాదు మేకప్ వల్ల మీ చర్మ రంధ్రాల్లో నిండి ఉన్న వ్యర్థాలు కూడా బయటకు వెళ్లిపోతాయి. ముఖ్యంగా అలంకరణ వేసుకున్నవారు దీన్ని నిర్లక్ష్యం చేస్తే... మొటిమలూ, పొక్కులూ, చర్మంపై ఎర్రటి దద్దుర్లు రావడం మొదలవుతాయి. అదే కొనసాగితే కొంత కాలానికి చర్మం నిర్జీవంగా, గరుకుగా తయారవుతుంది.
- కళ్లకు ఉండే మస్కారా, ఐలైనర్‌ను పడుకోబోయే ముందర తొలగించుకోవడంలేదా... నిద్రలో మీ చేతులు తగిలి అవి కంట్లోకి వెళ్లే ప్రమాదం ఉంది. ఫలితంగా కంటి జబ్బులూ రావొచ్చు.
- మన చర్మానికి సహజంగానే మృతకణాలను తొలగించుకునే గుణం ఉంటుంది. అయితే ముఖంపై మేకప్ ఉన్నప్పుడు ఇది సాధ్యం కాదు. దానికి మేకప్ అడ్డంకిగా మారుతుంది. అలా ముఖం వెలవెలబోతుంది. చర్మం ఎండిపోయి నిర్జీవంగా మారిపోతుంది.
- మనం పడుకున్నప్పుడు కూడా చర్మం తన పని తాను చేసుకుంటూనే ఉంటుంది. ఈ సమయంలోని చర్మం తనకు తానుగా రిపేర్ చేసుకుంటుంది. మృతకణాలను తొలగించడంతోపాటు చర్మ పోషణకుకావాల్సిన తేమను బయటి నుంచి గ్రహిస్తుంది. అందుకే రాత్రి పడుకోబోయే ముందు ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. ఆ తరువాత చర్మానికి తేమనందించే మాయిశ్చరైజర్‌ను రాసుకోవడం మరిచిపోవద్దు.



స్టార్‌హోటళ్ల మెనులో రోటిపచ్చడి ఇప్పుడు నయా ట్రెండ్! అప్పుడెప్పుడో గుడ్‌బై చెప్పేసిన రోలు, రోకలి, కల్వం ఆధునిక వంటింట్లో ఇప్పుడు గర్వంగా వచ్చి చేరుతున్నాయి.. కారణం.. అమ్మమ్మల కాలం నాటి రుచి కావాలని కోరుకోవడమే!

పచ్చళ్ల హారం

'ఎన్నైనా చెప్పు... మాఅమ్మ చేతివంట రుచి ఎవ్వరికీ రాదు'... అనగానే శ్రీమతిగారికి ఎక్కడలేని కోపం చివ్వున వస్తుంది! 'మీరెప్పుడూ.. ఇంతే' అంటూ రుసరుసలాడుతుంది. నిజానికి ఆమె మాత్రం ఏం చేస్తుంది? రుచిని గాలికి విసిరేసి క్షణాల్లో వంటని 'మమ' అనిపించేసే మిక్సీలు, గ్రైండర్‌లు ఉండగా! వంటరుచి వాటిల్లో వేసే ఉప్పుకారాల్లోనే కాదు... వాడే పాత్రల్లోనూ, చేసే చేతిలోనే ఎక్కువగా ఉంటుంది అంటారు పాకశాస్త్ర నిపుణులు. అద్భుతమైన వంటకాలని చేసే మాస్టర్ చెఫ్ పంకజ్ బదౌరియా... తన వంటింట్లో సిల్‌బట్టా(సన్నికలు) తప్పని సరి అంటుంది. 'మిక్సీలు సౌకర్యాన్నివ్వొచ్చు. కానీ సన్నికలులో నూరినప్పుడు ఉండే రుచీ, పరిమళాన్ని వంటకి ఇవ్వలేవంటారామె'. కాస్తంత సమయం, మరికాస్త ఓపిక కేటాయిస్తే రోటిపచ్చళ్లు రుబ్బుకోవడం కష్టమేమికాదు. అన్నింటికి మించి ఆరోగ్యదాయకం కూడా! ఎలానో తెలుసుకుందాం.



పోషకాలు పోకుండా...

గమనించారా? రోట్లో వేసి రుబ్బినప్పుడు ఇడ్లీపిండి ఎక్కువవుతుంది. పట్టుకుంటే దూదిలా ఉంటుంది. ఇడ్లీలు, దోసెలు మృదువుగా వస్తాయి. అదే మిక్సీలో వేసి చూడండి. మనం ఎంత పప్పు వేస్తామో అంతే ఉంటుంది. గారెల పిండిలా గట్టిగా ఉంటుంది. ఆ ఒక్క మార్పే కాదు... విద్యుత్ పరికరాలు కావడం వల్ల పిండి కూడా క్రమంగా వేడెక్కుతుంది. దాంతో పిండిలోని సూక్ష్మపోషకాలు నశిస్తాయి. మాంసాహార వంటకాల కోసం మసాలాలు నూరినప్పుడు కూడా వాటిల్లోని ఆవిరి అయ్యే గుణం ఉన్న నూనెలు(ఓలటైల్ ఆయిల్స్) బయటకు పోయి వాటి సహజ సిద్ధ పరిమళం తగ్గిపోతుంది. దాంతో వంటకం కమ్మటి వాసన కోల్పోయి సగం రుచిని కోల్పోతుంది. 'ఇడ్లీ పిండినీ, పచ్చళ్లని రోట్లో రుబ్బుతున్నప్పుడు... అవి వేడెక్కడానికి ఆస్కారం ఉండదు. మధ్యమధ్యలో నీళ్లు చిలకరిస్తూ, అప్పుడప్పుడు చేత్తో నెడుతూ రుబ్బడం వల్ల పదార్థానికి ఓ ప్రత్యేకమైన రుచి వస్తుంది. కారణం.. పిండిని చేత్తో రుబ్బుతున్న సమయంలో ఫెర్మెంటేషన్‌కి(పులియడం) గురవుతుంది. ఒకే వేగంతో రుబ్బడం కాకుండా ఆగాగి రుబ్బడం వల్ల పిండిలోకి గాలివెళ్లి పదార్థాలకు మృదుత్వం వస్తుంది. ముఖ్యంగా కొబ్బరి వంటి వాటిని మిక్సీలో వేస్తే ఆ రుచి, ఆకృతి రెండూ పోతాయి' అంటారు పోషకాహార నిపుణురాలు లతాశశి. మిక్సీలో ఉండే వేగం వల్ల వేడి ఉత్పన్నమయి పదార్థం ఉడుకుతుంది. దాంతో రుచి, రంగు మారిపోతాయి. అందుకే పచ్చిఉల్లిపాయ వేసి చేసే గోంగూర వంటి వాటిని రోట్లోచేస్తే ఆ రుచే వేరు.

ఎండుమిర్చి, మిరియాలు, అల్లం, వెల్లుల్లి వేసి చేసే కాశ్మీరి మాంసాహార వంటకం రోగన్ జోష్‌కి ఆ రుచి ఎలా వస్తుందో తెలుసా? ఎండుమిర్చిని పదినిమిషాల ముందు నీటిలో నానబెట్టి దాన్ని కల్వం మీద నూరతారట. మిరియాలు, అల్లం, వెల్లుల్లి, కొబ్బరిని రోట్లో వేసి దంచితే ఆ రుచి ప్రత్యేకం అంటాడు చెఫ్.. రాహుల్

ముల్లంగితో...



కావల్సినవి: ముల్లంగి ముక్కలు- కప్పు, పచ్చిమిర్చి- మూడు, నువ్వులు- చెంచా, వెల్లుల్లి రేకలు- నాలుగు, చింతపండు గుజ్జు- అరచెంచా, తాలింపు గింజలు- ఎండుమిర్చి, మినపప్పు, సెనగపప్పు, కరివేపాకు, ఆవాలు, జీలకర్ర, ఉప్పు, నూనె- తగినంత, కొబ్బరి- చెంచా

తయారీ: పాన్‌లో నూనె వేసి ముల్లంగి ముక్కలు, పచ్చిమిర్చి, వెల్లుల్లి, నువ్వులు వేసి.. అవి వేగిన తర్వాత చింతపండు కూడా వేసుకుని పొయ్యి కట్టేయ్యాలి. రోట్లో వీటితోపాటూ కొబ్బరి ముక్కలు, ఉప్పు వేసి మెత్తగా రుబ్బుకోవాలి. చివరిగా పైతాలింపు వేసుకుంటే సరి.

బీట్‌రూట్‌తో..



కావల్సినవి: బీట్‌రూట్ ముక్కలు- కప్పు, పచ్చిమిర్చి- రెండు, ఎండుమిర్చి- రెండు, వెల్లుల్లిరేకలు- మూడు, జీలకర్ర- పావుచెంచా, చింతపండు గుజ్జు- అరచెంచా, మినపప్పు- చెంచా, సెనగపప్పు- చెంచా, ఉప్పు- తగినంత, నూనె- తగినంత

తయారీ: ఒక పాన్‌లో నూనె వేసుకుని అందులో బీట్‌రూట్, చింతపండుగుజ్జు తప్పించి అన్నింటిని వేయించుకోవాలి. చివరిగా చింతపండు కూడా వేసి పక్కనపెట్టుకోవాలి. బీట్‌రూట్‌ని రంగు మారేంతవరకూ వేయించి అన్నింటిని కలిపి రోట్లో రుబ్బుకోవాలి. చివరిగా తాలింపు వేసుకోవాలి.

కరివేపాకుతో..



కావల్సినవి: కరివేపాకు- కప్పు, నూనె- తగినంత, ఎండుమిర్చి- నాలుగు, మినపప్పు- చెంచా, ఇంగువ- చిటికెడు, కొబ్బరి తురుము- రెండు చెంచాలు, చింతపండు పేస్ట్- పావుచెంచా, ఉప్పు- తగినంత, తాలింపు కోసం- ఆవాలు, జీలకర్ర, నూనె- తగినంత

తయారీ: కరివేపాకుని కడిగి శుభ్రం చేసుకుని ఆరబెట్టుకోవాలి. ఒక కడాయిలో నూనె వేసి అందులో ఎండుమిర్చి, మినపప్పు, ఇంగువ వేసి దోరగా వేయించుకోవాలి. దీనికి కరివేపాకు, జీలకర్ర కూడా జోడించి మరో రెండు నిమిషాల పాటూ వేయించుకోవాలి. వీటిని ఉప్పు వేసి రోట్లో నీళ్లు చిలకరించుకుంటూ రుబ్బుకోవాలి. నీళ్లు మరీ ఎక్కువయితే జారుగా అయిపోతుంది. కావల్సినంతే వేసుకోవాలి.

టమాటాతో...

కావాల్సినవి: టమాటాలు- నాలుగు, సాంబార్ పొడి- చెంచా, చింతపండు గుజ్జు- పావుచెంచా, ఉప్పు- తగినంత, పచ్చిమిర్చి- మూడు

తాలింపు కోసం: నూనె- తగినంత, ఆవాలు- కొద్దిగా, మినపప్పు- అరచెంచా, ఎండుమిర్చి- ఒకటి, కరివేపాకు- రెమ్మ.

తయారీ: టమాటాలని ముక్కలుగా తరిగి ఉప్పు, సాంబారుపొడి, చింతపండు గుజ్జు వేసి రోట్లో మెత్తగా రుబ్బుకోవాలి. ఒక కడాయిలో నూనె వేసి అందులో ఆవాలు, మినపప్పు, మిర్చి, కరివేపాకు వేసి వేయించి తాలింపు వేసుకోవాలి.



ఉల్లిపచ్చడి..

కావల్సినవి: ఉల్లిపాయ- ఒకటి, వెల్లుల్లి రేకలు- ఐదు, ఎండుమిర్చి- ఐదు, చింతపండు- అరచెంచా, నూనె- రెండు చెంచాలు, ఉప్పు- తగినంత, ఆవాలు, జీలకర్ర, కరివేపాకు- తాలింపు కోసం

తయారీ: కళాయిలో కొద్దిగా నూనె వేసుకుని అందులో ఉల్లిపాయముక్కలు, దంచిన వెల్లుల్లితో సహా అన్నింటిని వేసుకుని పచ్చివాసన పోయి కమ్మని వాసన వచ్చేంతవరకూ వేయించుకోవాలి. వీటిని రోట్లో రుబ్బుకుని తాలింపు వేసుకుంటే సరి.



గోరుచిక్కుళ్లతో...



కావల్సినవి: గోరుచిక్కుళ్లు – కప్పున్నర, నువ్వులు- రెండు చెంచాలు, పచ్చిమిర్చి- నాలుగు, చింతపండు- కొద్దిగా, తాలింపు గింజలు- కరివేపాకు, ఎండుమిర్చి, మినపప్పు, ఆవాలు, జీలకర్ర, నూనె- రెండు చెంచాలు

తయారీ: ముందుగా నువ్వులని నూనె లేకుండా పొడిగా దోరగా వేయించుకుని పక్కన పెట్టుకోవాలి. ఒక పాత్రలో నూనె తీసుకుని అందులో శుభ్రం చేసిన గోరుచిక్కుళ్లు వేసుకుని మెత్తగా అయ్యేంత వరకూ మూతపెట్టేయాలి. పచ్చిమిర్చి కూడా వేసి అవి రంగుమారేంత వరకూ వేయించి రెండింటినీ రోట్లో వేసుకోవాలి. వీటితోపాటే చింతపండు, నువ్వులు కూడా వేసుకుని రుబ్బుకోవాలి. ఒక కడాయిలో వేసి తాలింపు వేసి వాటిని కూడా రోట్లో వేసి కచ్చాపచ్చాగా రుబ్బుకోవాలి.

క్యాబేజీతో...

కావల్సినవి: క్యాబేజీ తురుము- కప్పున్నర, చింతపండు గుజ్జు- రెండు చెంచాలు, పచ్చిమిర్చి- నాలుగు, జీలకర్ర- పావుచెంచా, తాలింపు కోసం- ఎండుమిర్చి, మినపప్పు, సెనగపప్పు, ఆవాలు, జీలకర్ర, ఉప్పు, నూనె- తగినంత, వెల్లుల్లి రేకలు- మూడు

తయారీ: ఒక కడాయిలో కొద్దిగా నూనె వేసి అందులో క్యాబేజీ తురుము, పచ్చిమిర్చి, పసుపు వేసి మెత్తబడేంతవరకూ మూతపెట్టేయాలి. పొయ్యి కట్టేసి చింతపండు, ఉప్పు, జీలకర్ర అందులో వేసి చల్లారేంతవరకూ ఆగాలి. దీనిని రోట్లో రుబ్బి తాలింపు వేసుకోవాలి.



పనీర్ ముక్కలవ్వకుండా ....

ప్ర&జ

నాకు పనీర్ వంటకాలంటే చాలా ఇష్టం. కానీ నేనెప్పుడు పనీర్ వండినా ముక్కముక్కలు అయిపోతుంది. అలా కాకపోతే సాగుతూ రబ్బరులా ఉంటుంది. కొంతమంది చేస్తే తినడానికే కాదు.. చూడ్డానికి కూడా బాగుంటుంది. పనీర్ వాడకంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

– నదియా, హైదరాబాద్



శాకాహారులకు, మాంసాహారులకు కూడా ఇష్టమైన వంటకం ఇది. పనీర్ పులావ్, పనీర్‌తో చేసిన గ్రేవీలు, వేపుడు, టిక్కాలు చేయాల్సిన విధంగా చేస్తే చాలా రుచిగా ఉంటాయి. అయితే ఇందుకు కొన్ని ప్రాథమిక జాగ్రత్తలు అవసరం. ఎప్పుడైనా సరే పనీర్‌ని గ్రేవీల్లో ముందే వేసేసుకోకూడదు. ఆఖర్న వేయాలి. ఎందుకంటే పనీర్ రెండు నిమిషాల కంటే ఎక్కువసేపు ఉడికితే గట్టిగా, రబ్బరులా తయారవుతుంది. తిన్నా ఆ రుచి ఉండదు. అలాగే దాచిపెట్టేటప్పుడు కూడా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. పనీర్‌ని బజారులో క్యూబ్స్ మాదిరిగా ఫ్రిజ్‌లో ఉంచి అమ్ముతారు. మనం కూడా కొన్న తర్వాత ఫ్రిజ్‌లోనే పెట్టాలి. బయటపెడితే వేగంగా పాడవుతుంది. పుల్లటి వాసన వస్తుంది. కవర్ ఉబ్బిపోతుంది. ఒకసారి తెరిస్తే 24 గంటల్లోపు వాడేసుకోవాలి. అందుకే దీనిని కేజీల లెక్కన కొనుక్కోకూడదు. చిన్నప్యాకెట్లలో కొని తెచ్చుకోవాలి.

ఎప్పుడైనా సరే పనీర్‌ని ఫ్రిజ్‌లోంచి తీసి ముందుగా గోరువెచ్చని నీళ్లలో వేసి ఐదునిమిషాలు ఉంచాలి. అది గది ఉష్ణోగ్రతకు వచ్చిన తర్వాత అప్పుడు కూరలో వేయాలి. చల్లగా తీసింది తీసినట్టుగా కూరలో వేస్తే అది పాన్‌కి అతుక్కుపోతుంది. గరిటెతో కదిపితే ముక్కలు అయిపోతుంది. అలాగే మరిగే నూనెలో వేసినా పనీర్ పాడవుతుంది. నూనె వేడి మధ్యస్థంగా ఉన్నప్పుడు వేసుకుంటే మంచిది. అలాంటప్పుడు వేసిన పనీర్ బంగారు రంగులోకి మారి చక్కగా వేగుతాయి. పనీర్‌ని నేతిలోకానీ, బట్టర్‌లో కానీ వేయిస్తే రుచి పెరుగుతుంది. కానీ కెలొరీల ప్రమాదం లేకపోలేదు. బదులుగా వాటిని మరుగుతున్న నీళ్లలో వేసి అప్పుడు కూరల్లో వాడుకోవచ్చు. పాలక్‌పనీర్ వంటి వాటికి ఇది మంచి పద్ధతి.

- పనీర్ క్రంబ్స్ అంటారు... పనీర్‌ని చేత్తో చిదిమి వీటిని తయారుచేస్తారు. వీటిని సమోసాల్లో, పాయసం, కజ్జికాయల్లో వాడుకోవచ్చు.
- పనీర్‌ని ఫ్రీజర్‌లో ఉంచి గ్రేటర్‌తో తురిమి పనీర్‌బుర్జీ చేసుకోవచ్చు.
- పనీర్‌లో కెలొరీలు ఎక్కువ అనుకుంటే సోయాపాలతో చేసిన టోఫు తినొచ్చు. టోఫుని బటర్, నెయ్యిలో వేయించుకుని తీసుకుంటే దీని రుచి పెరుగుతుంది.



శ్రీదేవి
హోటల్ మేనేజ్‌మెంట్ నిపుణురాలు

ఈ ఉల్లి ఏడిపించదు!

కొత్తకొత్తగా...



సునియన్స్.. ఉల్లిపాయల్లోనే ఇదొక రకం. ఉల్లిపాయలంటే మనందరికీ ముందుగా గుర్తొచ్చేవి కన్నీళ్లే కదా. కానీ ఇక నుంచి కన్నీళ్ల బాధ లేకుండా ఉల్లిపాయలని అందించే ప్రయత్నం చేశారు శాస్త్రవేత్తలు. ఈ ప్రయత్నంలో సఫలం అయ్యారు కూడా. ఇప్పటికే మొదటి పంట చేతికి రావడం.. వాటిని సూపర్‌మార్కెట్లో పెట్టి అమ్మేయడం కూడా జరిగింది. తినేటప్పుడు రుచిలో ఘాటుకానీ, కోసేటప్పుడు కళ్ల నుంచి కన్నీళ్లు కానీ రాకపోవడంతో హాట్‌కేకుల్లా అమ్ముడుపోయాయివి. రెండో పంట చేతికొస్తే మనక్కూడా దొరకొచ్చేమో చూద్దాం!

పని తేలిక!

అస్త్రం



పాత్రలు శుభ్రం చేసేటప్పుడు.... స్క్రబ్బర్‌ని పదేపదే సబ్బునీటిలో ముంచి తీయడం అంటే ఇబ్బందే! అలా కాకుండా స్క్రబ్బర్‌పై నుంచి సబ్బునీరు దానంతట అదే వచ్చే అవకాశం ఉంటే? ఈ వాష్‌టూల్ అటువంటి సదుపాయాన్నే కల్పిస్తోంది. స్క్రబ్బర్ పైనున్న మూత తీసి అందులో సబ్బునీళ్లు పోసి మూతపెట్టేస్తే సరి. అవసరం అయినప్పుడు పైన ఒత్తితే చాలు. పాత్రలు శుభ్రం పరచడం తేలిక... తక్కువ సమయంలోనే కూడా పని పూర్తవుతుంది.

పక్కాలోకల్

23 కూరలు... ఇంకాస్త ఆప్యాయత!

భోజనంలోని రుచంతా.. బహుశా వడ్డించే వాళ్ల చేతుల్లోనే ఉంటుందేమో! అందుకే.. నాగన్న కొసరి కొసరి వడ్డించే భోజనంలోని రుచి ఏ స్టార్ హోటల్‌కీ రాదు అంటారు అక్కడ తిన్న సామాన్యులు, ప్రముఖులు కూడా! ఖమ్మం జిల్లా కూసుమంచిలోని నాగన్న హోటల్ అతని వడ్డనకే కాదు.. 23 రకాల వంటకాలున్న రుచికరమైన భోజనానికీ ప్రసిద్ధి...

ఇంట్లో అయితే అన్నం, పప్పు, సాంబారు, పెరుగు... బస్. ఏదైనా హోటల్‌కు వెళితే మరో రెండు కూరలు అదనంగా వడ్డిస్తారు. రూ. 100కు తగ్గకుండా వసూలు చేస్తారు. నగరాల్లో, స్టార్ హోటళ్లలో అయితే వేలల్లోనే ఉంటుంది బిల్లు. కానీ ఈ వ్యాపార ఫార్ములాలేవి పట్టన్నట్టుగా ఉంటుంది... ఖమ్మం జిల్లా కూసుమంచిలో ఉన్న 'నాగన్న' హోటల్. ఎప్పుడూ 23 రకాల పదార్థాలు తగ్గకుండా విస్తరి నిండుగా వంటకాలు.... అవి ఇంకా తినకముందే కడుపు నింపేసే యజమాని నాగన్న ఆప్యాయత. అందుకే ఈ భోజనానికి దర్శకుడు వంశీ దగ్గర నుంచి రాఘవేంద్రరావు, తనికెళ్ల భరణి, రవితేజ, వేణు వంటి వారు ఫిదా అయిపోయారు. చంద్రబాబు అయితే నాగన్న చిక్కగా పెట్టే టీ ఇష్టంగా తాగి వెళ్లారట.



పెరుగు ప్రత్యేకం..

పప్పు, బెండకాయ, వంకాయ, బీరకాయ, చిక్కుడుకాయ, దొండకాయ, సొరకాయ, క్యారెట్, క్యాలీఫ్లవర్, బీట్‌రూట్, పాలకూర, తోటకూర, బచ్చలికూర, గోంగూర కూరలతోపాటూ.. పలు రకాల చట్నీలు, ఊరగాయలు, సాంబారు, పెరుగు, అప్పడం ఉంటాయి. ఇన్ని వడ్డిస్తే ధర వందల్లో ఉంటుందేమో అనుకోవచ్చు. కానీ కాదు... రూ. 80లు మాత్రమే. హోటల్ యజమాని బెల్లంకొండ నాగన్నే స్వయంగా భోజనం వడ్డిస్తారు. ఇన్ని కూరలు, ఆప్యాయత ఒక ఎత్తైతే.. అన్నంతో ఇచ్చే పెరుగు ఆయన స్వయంగా పెంచిన పాడి గేదెల పాలతో తోడు పెట్టింది. ఆ గడ్డ పెరుగు ఒక్కటీ వడ్డించినా చాలు అనిపిస్తుందంటారు భోజనప్రియులు.



28 సంవత్సరాలుగా...

నాగన్నది వ్యవసాయ కుటుంబం. చదువు అబ్బలేదు. కానీ 28 సంవత్సరాలుగా హోటల్ నిర్వహణతో కోట్ల రూపాయలు కాదు కానీ అందరి అభిమానాన్ని సంపాదించుకున్నారీయన. మొదట్లో రూ. 25కి... 20 కూరలతో భోజనం వడ్డించేవారు. 'నేను ఏనాడు లాభ నష్టాల గురించి ఆలోచించలేదు. కూరగాయల ధరలు ఆకాశాన్నంటినా సరే ఇన్ని కూరలూ వడ్డిస్తాను. తక్కువ ధరలకు లభ్యమైనా.. ఇంతే. అలా చేయడం వల్ల నాకు ఆత్మసంతృప్తి లభిస్తోంది. నా శ్రమ వృథా కాలేదులెండి. ఒక్కసారి ఇక్కడ తిన్నవాళ్లు.. మళ్లీ ఇక్కడికే వస్తారు. లేదంటే తెలిసిన వాళ్లను పంపిస్తారు. నాకు ఇద్దరు ఆడపిల్లలు. వాళ్లకు పెళ్లిళ్లు అయిపోయాయి. అబ్బాయి ఇంజినీరింగ్ చదువుతున్నాడు. నా భార్య మణెమ్మ కనీసం విసుక్కున్నా నేనీ పని చేయలేను' అంటారు నాగన్న. ఈ హోటల్ ఖమ్మం- హైదరాబాద్ రహదార్లో కూసుమంచి కూడలి ప్రాంతానికి సమీపంలో ఉంటుంది. కార్లల్లో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, ఉభయ గోదావరి జిల్లాల్లోని పలు ప్రాంతాల నుంచి హైదరాబాద్ వెళ్లే వారంతా ఈ హోటల్లో భోజనం చేస్తుంటారు.

– బచ్చలకూర వెంకన్న, ఎండీ రజాక్, ఖమ్మం, ఈనాడు

విద్యార్థులే రేపటి ఆవిష్కర్తలు

- చాలా ఆవిష్కరణలు యాదృచ్ఛికంగా జరిగినవే
- పరిశోధనలకు ప్రభుత్వాలు నిధులివ్వాలి
- జీవకణశాస్త్ర అంతర్జాతీయ సదస్సులో నోబెల్ పురస్కార గ్రహీత మార్టిన్ చాల్ఫీ

ఈనాడు - హైదరాబాద్




శనివారం హైదరాబాద్‌లో జరిగిన జీవకణశాస్త్ర అంతర్జాతీయ సదస్సులో ప్రసంగిస్తున్న నోబెల్ పురస్కార గ్రహీత మార్టిన్ చాల్ఫీ. హాజరైన వివిధ దేశాల శాస్త్రవేత్తలు, పరిశోధక విద్యార్థులు

విద్యార్థులే రేపటి ప్రయోగశాల ఆవిష్కర్తలు (ల్యాబ్ ఇన్నోవేటర్స్) అని నోబెల్ పురస్కార గ్రహీత మార్టిన్ చాల్ఫీ అన్నారు. విద్యార్థుల్లో ప్రాథమిక పరిశోధన చాలా అవసరమని స్పష్టం చేశారు. విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వాల నుంచి మద్దతు తప్పనిసరిగా ఉండాలన్నారు. పరిశోధనలకు నిధులు కేటాయించాలన్నారు. శాస్త్ర పరిశోధన విజయాలకు అనేక అంశాలు దోహదం చేస్తాయన్నారు. చాలా ఆవిష్కరణలు యాదృచ్ఛికంగా జరిగినవే అని గుర్తు చేశారు. అజ్ఞానం, మొండితనం, ప్రయత్నాన్ని ఆపకపోవడంవంటివి కూడా ఒక్కోసారి శాస్త్ర విజయాలకు దోహదం చేస్తాయని అనుభవం ద్వారా తెలుసుకున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌లో శనివారం ప్రారంభమైన 'జీవకణశాస్త్రం' అంతర్జాతీయ సదస్సు-2018లో ఆయన 'హైదరాబాద్ సైన్స్ లెక్చర్' పేరిట ప్రారంభోపన్యాసం చేశారు. అమెరికాకు చెందిన మార్టిన్ చాల్ఫీ కనిపెట్టిన గ్రీన్ ఫ్లోరోసెంట్ ప్రొటీన్ (జీఎఫ్‌పీ)కి 2012లో నోబెల్ పురస్కారం దక్కింది. వైద్య, జీవకణశాస్త్రం, పరిశోధనల్లో జీఎఫ్‌పీ కీలకంగా మారింది. పరిశోధన చేయాలనుకున్న ప్రొటీన్‌లోకి జీఎఫ్‌పీ మార్కర్‌ను పంపడం ద్వారా ఆకుపచ్చ రంగులో ఉండే ఈ ప్రొటీన్ పనితీరును మైక్రోస్కోప్ ద్వారా చూస్తూ విశ్లేషించడం తేలికైందని తెలిపారు. జీఎఫ్‌సీ జీవకణశాస్త్ర రంగంలో తీసుకువచ్చిన విప్లవాత్మక పురోగతిని కనిపెట్టే క్రమంలో అనుభవాలను చాల్ఫీ పంచుకున్నారు. కణాలను అన్వేషించే నూతన విధానాలను, వాటి ఉపయోగాలను చర్చించారు. కణాల్లో వ్యాధి వృద్ధికి గల కారణాలు, వ్యాధి చికిత్సకు దోహదపడే నూతన మార్గాలపై చర్చించారు. వ్యాధి నిర్ధారణ, చికిత్సలకు శాస్త్రీయ పరిశోధనలు దోహద పడే లక్ష్యంగా శాస్త్రవేత్తలు, వైద్య నిపుణులు చర్చించారు. ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఫర్ సెల్ బయాలజీ (ఐఎఫ్‌సీబీ) అధ్యక్షుడు హిరోకవా మాట్లాడుతూ.. భారతీయ, విదేశీ పరిశోధకుల మధ్య ఈ సమావేశం సహాయ సహకారాలు పెంపొందిస్తుందని అన్నారు. జీవకణ శాస్త్ర పరిశోధనను వేగవంతం చేసి, ప్రజారోగ్య సవాళ్లను పరిష్కరించడానికి, నూతన ఆలోచనలు, ఆవిష్కరణలు, విధానాలకు సమావేశం దోహదం చేస్తుందని ఏషియన్ ఫసిఫిక్ ఆర్గనైజేషన్ ఫర్ సెల్ బయాలజీ (ఏపీఓసీబీ) అధ్యక్షుడు సత్యజిత్ మేయర్ అన్నారు. జీవకణ శాస్త్రంలో పరిశోధనలు, బోధనలు, శిక్షణ, చర్చలను ప్రోత్సహించే లక్ష్యంతో 1976లో భారత్‌లో ఇండియన్ సొసైటీ ఆఫ్ సెల్ బయాలజీ ఏర్పాటైందని అధ్యక్షుడు జగత్ కుమార్ రాయ్ అన్నారు. ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఫర్ సెల్ బయాలజీకిది 13వ సమావేశం కాగా.. ఏషియన్ ఫసిఫిక్ ఆర్గనైజేషన్ ఫర్ సెల్ బయాలజీ(ఏపీఓసీబీ)కి 8వ, ఇండియన్ సొసైటీ ఆఫ్ సెల్ బయాలజీకి 41వ సమావేశమని.. ఈ మూడు సంఘాలు ఒకే వేదికపై సమావేశమవడం ఇదే మొదటిసారి అని అన్నారు. మన దేశంలో ఈ సదస్సు నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో సీసీఎంబీ డైరెక్టర్ డాక్టర్ రాకేశ్ మిశ్రా, పలు దేశాల నుంచి శాస్త్రవేత్తలు, పరిశోధక విద్యార్థులు హాజరయ్యారు.

పరిశోధనలు పట్టా కోసం కాదు..!

- సమాజానికి మార్గ నిర్దేశకాలు
- సైన్స్ పట్ల పాలకుల ఆలోచన తీరు మారాలి
- ప్రభుత్వాలే ముందుకొచ్చి.. సవాలు విసరాలి
- బీజం పడాల్సింది విశ్వవిద్యాలయాల్లోనే
- 'ఈనాడు'తో పలువురు అంతర్జాతీయ శాస్త్రవేత్తలు

ఈనాడు - హైదరాబాద్

'పరిశోధనలంటే పీహెచ్‌డీ పట్టా కోసం కాదు.. సమాజం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపాలి. ప్రజల జీవితాల్లో మార్పు తేవాలి. సైన్స్ అంటే అదేదో తమకు సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్న పాలకుల్లో మార్పు రావాలి. ఇదిగో మన దగ్గరున్న సమస్య. మీరేమైనా చేయగలరా అంటూ ప్రభుత్వమే.. పరిశోధకులకు సవాలు విసరాలి. పరిశోధనల వైపు విద్యార్థుల్ని నడిపించేలా నేటి పరిస్థితులకు అనుగుణంగా విశ్వ విద్యాలయాలు మార్పును అందిపుచ్చుకోవాలి' అని జీవకణ అంతర్జాతీయ సదస్సులో పాల్గొనేందుకు విచ్చేసిన ప్రముఖ శాస్త్రవేత్తలు అభిప్రాయపడ్డారు. వివిధ దేశాలకు చెందిన పలువురు పరిశోధకులు శనివారం 'ఈనాడు'తో ప్రత్యేకంగా ముచ్చటించారు..!

విశ్వవిద్యాలయాల్లోనే బీజం పడాలి



'పరిశోధనలకు బీజం పడాల్సింది విశ్వ విద్యాలయాల్లోనే. అయితే అలా జరగడం లేదు. పెద్దగా ప్రాధాన్యం ఇవ్వడం లేదు. ఏదో నామమాత్రంగానే జరుగుతున్నాయి. నిధుల లేమి కూడా ప్రధాన కారణమే. ఇది సమాజానికి మంచిది కాదు' అని జర్మనీకి చెందిన మ్యాక్స్ ప్లాంక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బయోకెమిస్ట్రీ డైరెక్టర్, ప్రముఖ శాస్త్రవేత్త ప్రొఫెసర్ వోల్ఫ్‌గ్యాంగ్ బామిస్టర్ పేర్కొన్నారు.

- 'పరిశోధనపరంగా ఏ దేశమైనా అడుగు ముందుకేయాలంటే.. అక్కడ విశ్వ విద్యాలయాలు చురుకైన పాత్ర పోషించాలి. పరిశోధనలకు అంకుర్పారణ జరగాల్సింది కూడా అక్కడే. అయితే దురదృష్టవశాత్తూ నేటితరం పరిశోధనలకు సుముఖత చూపడంలేదు. ఎందుకని కొందర్ని అడిగితే ఎంత కష్టపడినా ఫలితం వస్తుందో రాదో తెలియదంటూ సమాధానమిచ్చారు. పరిశోధన అంటే ఓపిక అవసరం.
- పరిశోధనల వైపు విద్యార్థుల్ని నడిపించాల్సిన బృహత్తర బాధ్యత అధ్యాపకులపైనే ఉంది. సైన్స్‌పై ఒక్క రోజులో ఇష్టాన్ని పెంచలేం. ఆసక్తి పెరిగేలా రకరకాల కార్యక్రమాలను నిర్వహించాలి. ఒక్కసారి ఇందులో ఉన్న మజా ఏంటో తెలిస్తే.. వాళ్లే వస్తారు. విశ్వవిద్యాలయాల రూపురేఖలు కూడా మారాలి. కేవలం పరిశోధనల కోసమే కొంత నిధుల్ని కేటాయించాలి'

సమాజానికి ఉపయోగపడితేనే..



'పరిశోధన అంటే ఆషామాషీ వ్యవహారం కాదు.. ఆ ఫలాలు సమాజానికి ఉపయోగపడాలి.. అలా జరిగినప్పుడే ఏళ్ల తరబడి పడిన కష్టానికి సార్థకత చేకూరుతుంది.. పేరు రావాలనో.. పీహెచ్‌డీ పట్టా కోసమో పరిశోధనలు చేయకూడదు. అలాంటి ఆలోచనతో ఉంటే అటువైపు వెళ్లొద్దు' అని నేటితరానికి ప్రముఖ జీవకణ శాస్త్రవేత్త, నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్‌కు చెందిన మెకానోబయాలజీ ఇన్‌స్టిట్యూట్ వ్యవస్థాపక డైరెక్టర్ ప్రొఫెసర్ మైఖేల్ షీట్జ్ సూచించారు. తన అభిప్రాయాలను ఇలా వెల్లడించారు.

- 'నన్ను శాస్త్రవేత్త అంటే ఒప్పుకోను. నిత్య విద్యార్థిని. ప్రొఫెసర్‌గా విద్యార్థులకు పాఠాలు చెబుతూనే వాళ్ల నుంచి ఎప్పటికప్పుడు కొత్త విషయాలను నేర్చుకుంటున్నా. 1972లో కాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందాను. కణాలపై ప్రత్యేకంగా పరిశోధన చేసేందుకు మెకానోబయాలజీ ఇన్‌స్టిట్యూట్‌ను ప్రారంభించా.. 'సెల్ మైగ్రేషన్, సెల్-సెల్ అండ్ సెల్-సబ్‌స్ట్రేట్ ఇంటరాక్షన్' అనే అంశాలపై పరిశోధన చేస్తున్నా.
- మల్టీకలర్ సూపర్ రెజల్యూషన్ ఇమేజింగ్, ఏ సెల్యులార్ షాక్ అబ్జార్బర్, డెసిషన్స్ ఇన్ ఏ పించ్, ఏ మూవింగ్ స్టోరీ ఆఫ్ ఎఫ్‌హెచ్ఎల్ 2' తదితర కొత్త అంశాలను కనుక్కున్నా. అయినా.. తృప్తి కలగలేదు. ఇంకా ఏదో సాధించాలనే తపనతో ముందుకెళ్తున్నా. నేటితరానికి మాత్రం ప్రతిదీ క్షణాల్లో కావాలి. చేస్తున్న పని మీద నూటికి నూరు శాతం మనసు పెడితే. ఫలితం దానంతట అదే వస్తుంది.
- ఏ రంగమైనా సరే.. పరిశోధనల సంఖ్య పెరగాల్సిన అవసరముంది. పరిశోధనాంశాన్ని ఎంచుకునేటప్పుడు దానివల్ల సమాజానికి మేలు జరుగుతుందా? అని మిమ్మల్ని మీరే ప్రశ్నించుకోండి. అవును.. అని సమాధానం వస్తే ముందుకెళ్లండి. లేదంటే సమస్యలపై అధ్యయనం చేసి.. పరిశోధనాంశాన్ని ఎంపిక చేసుకోండి'

ప్రోత్సాహం లేకపోవడంవల్లే..



'సమాజానికి ఏదో ఒకటి చేయాలనే సంకల్పంతోనే పరిశోధనలు చేస్తాం. డబ్బు సంపాదన యావ శాస్త్రవేత్తల్లో తక్కువే. అది అన్ని దేశాల ప్రభుత్వాలు గుర్తించాలి. పాలకులే ముందుకొచ్చి ఇదిగో మన దగ్గర ఈ సమస్య ఉంది.. మీరు పరిష్కారాన్ని కనుక్కోండి అంటూ ప్రోత్సహించాలి' అని యూనివర్సిటీ ఆఫ్ లీసెస్టర్ (యూకే)కు చెందిన ప్రొఫెసర్ లాన్ సి ఎప్రాన్ పేర్కొన్నారు.

- 'నేను 20 ఏళ్ల నుంచి కణాలపై పరిశోధన చేస్తున్నా. ఇన్నేళ్ల కాలంలోనూ గమనించిన ముఖ్యమైన విషయం.. పరిశోధన అంటే ఖర్చుతో కూడుకున్నది. ఏదీ ఊరికే రాదు. సొంత డబ్బు ఖర్చు పెట్టినా మనం అనుకున్న ఫలితం వస్తుందో రాదో చెప్పలేం. సమాజానికి ఏదో ఒకటి చేయాలనే ఉద్దేశంతో కష్టాన్ని ఇష్టంతో చేస్తున్నాం.
- ప్రపంచవ్యాప్తంగా ఏ ప్రభుత్వం కూడా పరిశోధకులకు ప్రాధాన్యం ఇవ్వడం లేదు. ప్రోత్సాహం లేకపోవడం వల్లే ఎక్కువ మంది ఇటువైపు రావడం లేదు. ఇప్పటికైనా పాలకులు అడుగు ముందుకేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా.
- విశ్వవిద్యాలయాల్లోనే పరిశోధనలు ఎక్కువగా జరగాలి. అయితే.. దురదృష్టవశాత్తూ అదీ జరగడం లేదు. పైగా ఆ సంఖ్య రోజురోజుకీ తగ్గిపోతోంది. మొక్కుబడి పోకడ సమాజానికి మంచిది కాదు. చిన్నతనం నుంచే సైన్స్ పట్ల విద్యార్థుల్లో ఇష్టాన్ని పెంచాలి. వీలైనన్ని ఎక్కువ సైన్స్‌ఫెయిర్లను నిర్వహించాలి.'

మా అధ్యక్షుడికి సైన్స్ అంటేనే ఇష్టం ఉండదు..



'మా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు అసలు సైన్స్ అంటేనే ఇష్టముండదు. గ్లోబల్ వార్మింగ్ వల్ల జరుగుతున్న నష్టం గురించి పెద్దగా పట్టించుకోరు. ఇలాంటి పరిస్థితుల్లో పరిశోధకులు ఎంత కష్టపడ్డా ఉపయోగం ఉండదు. ఆ ఫలాలు ప్రజలకు చేరాలంటే పాలకులదే కీలక పాత్ర. అయితే.. ఆ దిశగా అడుగు పడటం లేదు' అని యూఎస్ఏలోని నార్త్‌వెస్టర్న్ యూనివర్సిటీకి చెందిన ప్రముఖ శాస్త్రవేత్త ప్రొఫెసర్ రాబర్ట్ డేవిడ్ గోల్డ్‌మ్యాన్ వాపోయారు.

- 'మాతరంతో పోలిస్తే నేటితరంవాళ్లు చాలా అదృష్టవంతులు. మేం పీహెచ్‌డీ పూర్తి చేసేందుకు పడ్డ కష్టం అంతా ఇంతా కాదు. పరిశోధన చేసేందుకు ఏదీ అందుబాటులో ఉండేది కాదు. ఇంత సాంకేతిక పరిజ్ఞానం అప్పుడు లేదు. ప్రతిదీ మేమే సమకూర్చుకోవాలి. స్వయంగా తయారు చేసుకునేందుకు చాలా కష్టపడాల్సి వచ్చేది. సైన్స్ మీదున్న ఇష్టం మమ్మల్ని ముందుకు నడిపించింది. ప్రస్తుతం కొందరైతే ఏకంగా ఎక్కడో కాపీ కొట్టి.. థీసిస్‌లు సమర్పిస్తూ 'మమ' అనిపించేస్తున్నారు. ఇది సమాజానికి చాలా ప్రమాదకరం.
- పాలకులు ప్రోత్సహించినప్పుడే పరిశోధనల పరంగా దేశం అడుగు ముందుకేస్తుంది. సైన్స్ అనగానే అదేదో తమకు సంబంధం లేదన్నట్లుగా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయి.. పరిశోధనలకు నామమాత్రపు నిధులు కేటాయిస్తున్నాయి. ఈ పరిస్థితి మారాలి. పాలకుల్లో మార్పు రావాలి.'


బిల్లుల నిలిపివేత

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో ఖజానా కార్యాలయాల్లో గత కొద్ది రోజులుగా బిల్లుల మంజూరు ప్రక్రియ నిలిచిపోయింది. బ్యాంకింగ్ కార్యకలాపాలకు అవసరమయ్యే సర్వర్లలోని ప్రధాన విభాగాన్ని రాజధానిలో నిలిపివేయడంతో గ్రామ పంచాయతీలతో సహా వివిధ శాఖలవారు బ్యాంకుల నుంచి నిధులను పొందేందుకు వీలుకాని పరిస్థితి ఏర్పడుతోంది. నిధులను సర్దుబాటు చేసుకోవటంలో భాగంగానే ప్రభుత్వం ఇలా గత రెండు నెలల వ్యవధిలో పలుసార్లు ఖజానా సర్వర్‌ను నిలిపివేసినట్లు సమాచారం. దీనివల్ల ముఖ్యంగా గ్రామపంచాయతీలు తీవ్ర సమస్యలను ఎదుర్కొంటున్నాయి. 14వ ఆర్థిక సంఘం ద్వారా వచ్చిన నిధులు పంచాయతీల ఖాతాల్లో ఉన్నప్పటికీ ఆ సొమ్మును బ్యాంకుల నుంచి తీసుకోవాలంటే ఇప్పుడు ఖజానా వారి ఆమోదముద్ర లభించటం లేదు. దీంతో పంచాయతీల్లో పారిశుద్ధ్యం పనులకు చెల్లించాల్సిన సొమ్ముకు కటకటలాడాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని సర్పంచులు వాపోతున్నారు.

బ్రెజిల్‌లో క్లబ్‌పై కాల్పులు 14 మంది మృతి

రియో డి జనేరియో: బ్రెజిల్‌లోని సియేరా రాష్ట్రం రాజధాని ఫోర్టాలెజాలోని ఓ నైట్‌క్లబ్‌పై శుక్రవారం రాత్రి జరిగిన కాల్పుల్లో కనీసం 14 మంది మరణించారు. గాయపడిన వారిని అధికారులు ఆసుపత్రిలో చేర్పించారు. గాయపడినవారి సంఖ్య, కాల్పులకు కారణాలు తెలియరాలేదు.

ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త గురుచరణ్ సింగ్ కల్కట్ మృతి



చండీగఢ్: ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త గురుచరణ్ సింగ్ కల్కట్(92) శనివారం నాడిక్కడ మరణించారు. పంజాబ్ హరిత విప్లవంలో కీలక పాత్ర పోషించిన వ్యక్తిగా ఆయన పేరుగాంచారు. రైతుల సంక్షేమం కోసం అహర్నిశలు పాటుపడిన కల్కట్ సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం ఆయనను పద్మశ్రీ, పద్మభూషణ్‌లతో సత్కరించింది. పంజాబ్ ముఖ్యమంత్రి కెప్టెన్ అమరీందర్ సింగ్ శనివారం కల్కట్ మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

పంట రకాలపై మేధో సంపత్తి హక్కుల నమోదుకు కృషి

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: తెలంగాణ నుంచి అధిక సంఖ్యలో రైతులు ఏళ్ల తరబడి సాగు చేస్తున్న పంట రకాల మేధోసంపత్తి హక్కుల నమోదుకు వ్యవసాయ, ఉద్యాన వర్సిటీల శాస్త్రవేత్తలు కృషి చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి సి.పార్థసారథి అన్నారు. 'రైతుల హక్కులు, వ్యవసాయ జీవవైవిధ్యంపై' ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, పంట రకాల సంరక్షణ, రైతుల హక్కుల సాధికారత సంస్థ(పీపీవీ అండ్ ఎఫ్ఆర్), భారత వ్యవసాయ పరిశోధన మండలి ఆధ్వర్యంలోని అటారి జోన్-10, జోన్-11 ఆధ్వర్యంలో సంయుక్తంగా రాజేంద్రనగర్‌లో నిర్వహించిన ప్రాంతీయ సదస్సును శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఎన్నో ఏళ్లుగా రైతులు తమ పొలాల్లో సాగు చేస్తున్న పంటలపై హక్కుల కోసం పీపీవీ అండ్‌ఎఫ్ఆర్‌లో నమోదు చేసుకోవడానికి ఉన్న నిబంధనలు, దరఖాస్తు నింపడం వంటి అంశాలపై రైతుల్లో అవగాహన పెంచాలన్నారు.

వెల్లువెత్తిన గణతంత్ర ట్వీట్లు!

వాషింగ్టన్: భారత గణతంత్ర దినోత్సవాల నేపథ్యంలో ఈ ఏడాది భారీ సంఖ్యలో ట్వీట్లు వెల్లువెత్తాయి. పదిలక్షల పదివేలకు పైగా ట్వీట్‌లు ముంచెత్తాయని సిలికాన్ వ్యాలీ కేంద్రంగా పనిచేస్తున్న ఆ సంస్థ ప్రతినిధి ఒకరు తెలిపారు. ఈ మేరకు ట్విటర్‌లో ఒక ప్రకటన చేశారు. శుక్రవారం మొత్తం గణతంత్ర దినోత్సవానికి సంబంధించిన ట్వీట్లే రాజ్యమేలాయి. గతేడాది వీటి సంఖ్య తొమ్మిది లక్షలుగా ఉన్న విషయం గమనార్హం. ఈ ఏడాది ట్వీట్లలో అత్యధిక ప్రజాభిమానాన్ని చూరగొన్న ట్వీట్ ...ప్రధాని మోదీ ప్రజలకు హిందీలో తెలిపిన గణతంత్రదినోత్సవ సందేశమే.

బీటీతోనే రైతు ఆత్మహత్యలు!

- పశ్చిమ దేశాల నూలు యంత్రాలు మన పంటలకు పనికిరావు
- యంత్రాల అభివృద్ధికి నిధులివ్వని ప్రభుత్వాలు
- సాహితీ సదస్సులో వక్తలు

ఈనాడు, హైదరాబాద్: దేశీయ పత్తి నుంచి నూలును ఉత్పత్తి చేసేలా స్వదేశీ యంత్రాలను అభివృద్ధి చేయడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని రచయితలు మీనా మీనన్, ఉజ్‌రమ్మలు పేర్కొన్నారు. రైతు ఆత్మహత్యలకు బీటీ పత్తి ప్రధాన కారణమని స్పష్టంచేశారు. పత్తి పంట, జౌళి రంగాలు వేర్వేరు శాఖల పరిధిలో ఉన్నాయని, స్థానిక చేనేత కార్మికులకు నూలు అందుబాటులో లేకుండా పోవడం ప్రధాన సంక్షోభంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇక్కడి పరిస్థితులను తట్టుకుని, అధిగ దిగుబడి ఇచ్చే దేశీయ వంగడాలను సంరక్షించాల్సిన అవసరముందన్నారు. శనివారమిక్కడ రెండో రోజు హైదరాబాద్ సాహితీ ఉత్సవాల్లో 'భారతదేశంలో పత్తి ప్రయాణం' అనే పుస్తకంపై జరిగిన చర్చలో పుస్తక రచయితలు మీనా మీనన్, ఉజ్‌రమ్మలతోపాటు సామాజిక కార్యకర్త మోహన్‌రావు, ఆర్థికవేత్త, ఫ్యాషన్ డిజైనర్ అనాకా నారాయణన్, ప్రొఫెసర్ రమా మెల్కొటే తదితరులు పాల్గొన్నారు. బ్రిటిష్ ఇండియా నుంచి ఇప్పటి దాకా పత్తి పంట, చేనేత పరిశ్రమ ఎదుర్కొన్న కష్టాలు, కారణాల గురించి చర్చించారు. "పత్తి సాగు, చేనేత దేశానికి ప్రధానమైన పరిశ్రమ. ఈ రంగానికి ప్రభుత్వ సహకారం అవసరం. జౌళి శాఖ నూలు ఎగుమతిపై దృష్టిపెట్టడంతో నేత కార్మికులకు నూలు దొరకడం కష్టంగా మారింది. నూలును తీసే యంత్రాలన్నీ పశ్చిమదేశాల్లో తయారైనవే. ఆ యంత్రాలు మన వంగడాలకు పనికిరావు. దీంతో ఇక్కడి రైతులు బీటీ, హైబ్రీడ్ వంగడాలను వేయడం మొదలుపెట్టారు. వాటికి ఎక్కువగా పురుగు మందులు, సాగునీరు అవసరం. గిట్టుబాటు ధర రాక రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారు. దేశీయ వంగడాలు వరదలు, కరవును తట్టుకుని అధిగ దిగుబడులు ఇస్తాయి" అని ఉజ్‌రమ్మ తెలిపారు. "దేశీయ వంగడాలను పక్కనపెట్టేలా బ్రిటిష్ ఇండియాలోనే యంత్రాల దిగుమతి జరిగింది. అప్పటి నుంచి పశ్చిమ దేశీ వంగడాలను పండించడం ద్వారా వ్యవసాయ సంక్షోభం తలెత్తింది. అప్పట్లో 3 శాతం విదేశీ వంగడాలను పండిస్తే. ఇప్పుడు ఆ వాటా 97 శాతానికి పెరిగింది. పత్తి సాగు, నూలు పరిశ్రమను ప్రైవేటు సంస్థలు, వ్యక్తులు శాసిస్తున్నారు" అని మీనా మీనన్ పేర్కొన్నారు. "బీటీ కారణంగా 3.7 లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. పంజాబ్‌లో ఓగ్రామం క్యాన్సర్ బారినపడింది. దేశీయ పత్తి వంగడాలనుంచి నూలును తీసేందుకు అవసరమైన యంత్రాల అభివృద్ధికి ఐఐటీలకు రూ.5లక్షల గ్రాంటు ఇవ్వాలన్నా..ప్రభుత్వం స్పందించలేదు"ని మోహన్‌రావుతెలిపారు.

మహిళలకు రక్షణ లేదు

ప్రపంచంలో ఏ మూలన చూసినా మహిళా సమాజానికి రక్షణ లేకుండా పోయిందని వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. పురుషులతో సమానంగా మహిళల ఆలోచనలకు గౌరవమివ్వాలని డిమాండ్ చేశారు. ' 'దేశంలో మహిళలపై అత్యాచారాలు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. ముస్లిం వివాహాల ఒప్పందంలో విడాకులు, రెండో వివాహానికి అర్హత లేదన్న విషయాలను చేర్చేందుకు పోరాటం చేయాల్సి ఉంది" అని జర్నలిస్టు సీమా ముస్తఫా పేర్కొన్నారు. వివక్షను ఎదుర్కొనడంలో మహిళలు ధైర్యాన్ని కోల్పోవద్దని హైదరాబాద్ సీఎస్‌డీ డైరెక్టర్ కల్పనా కన్నబిరన్ సూచించారు. కుటుంబం, సమాజం, రాజకీయాల చర్చల్లో మహిళలను భాగస్వాములను చేయాలని కొలంబియా రచయిత లారా రెస్ట్రెపో అన్నారు.

పగడాలను నాశనం చేస్తున్న ప్లాస్టిక్

★ 4 దేశాల్లోని 159 పగడపుదిబ్బలపై పరిశోధన



న్యూయార్క్: సముద్రాల్లో నిండిపోతున్న ప్లాస్టిక్ చెత్త కారణంగా పగడాల్లో వ్యాధులు ప్రబలుతున్నాయని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ప్లాస్టిక్‌పై ఉండే బ్యాక్టీరియా వల్ల పగడాల్లోని కణజాలం దెబ్బతింటోందని చెబుతున్నారు. మానవుని శరీరంపై కుళ్లిపోయే పుండు (గ్యాంగ్రెనె) ఏర్పడితే ఎలా అవుతుందో, పగడాల్లో కూడా ప్లాస్టిక్ కారణంగా కణజాలం పాడైపోతోందంటున్నారు. గతంలో నాలుగు శాతంగా ఉండే ఇలాంటి వ్యాధులు ఇటీవల 89 శాతానికి పెరిగినట్లు అమెరికాలోని కార్నెల్ విశ్వవిద్యాలయానికి చెందిన జోలియా లాంబ్ పేర్కొన్నారు. ఇండోనేసియా, ఆస్ట్రేలియా, మయన్మార్, థాయిలాండ్ దేశాల్లోని 159 పగడపు దిబ్బల్లోని 1,20,000 పగడాలపై పరిశోధన జరిపినట్లు తెలిపారు. పగడపు దిబ్బలను నమ్ముకుని ఆహారం, తీరరక్షణ, పర్యటకం, సాంస్కృతిక ఉత్సవాల పేరిట 27.5 కోట్ల మంది జీవిస్తున్నారని ఆస్ట్రేలియాలోని జేమ్స్‌కుక్ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసరు బెట్టీ విల్లిస్ పేర్కొన్నారు. పరిశోధన పూర్తి వివరాలు 'సైన్స్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

సాగే గుణమున్న సజల బ్యాటరీ

★ తయారు చేసిన దక్షిణకొరియా శాస్త్రవేత్తలు

సియోల్: సజల ఎలక్ట్రోలైట్స్‌ను ఉపయోగించి బాగా సాగే గుణమున్న, రీఛార్జి చేసుకునే అవకాశం ఉన్న లిథియం అయాన్ బ్యాటరీలను శాస్త్రవేత్తలు తయారుచేశారు. ఆధునికయుగంలో ధరించగలిగే ఎలక్ట్రానిక్స్ వస్తువుల తయారీలో ఈ సాంకేతికత విప్లవాన్ని సృష్టిస్తుందని దక్షిణకొరియాలోని ఉల్సన్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రొఫెసరు క్యాన్‌యోంగ్ సియో పేర్కొన్నారు. ఎలక్ట్రోరసాయనాలను ఉపయోగించి సాగే గుణమున్న నానోమిశ్రమాలు, యంత్రసామగ్రిలో ఉపకరించే రకరకాల ఉత్పత్తుల తయారీలో ఇదో గొప్ప ముందడుగు కాగలదని ఆయన చెప్పారు. తాజాగా తయారుచేసిన 'హెచ్‌సీపీ' మిశ్రమం వల్ల అత్యధిక ఒత్తిడిలోనూ బ్యాటరీ విద్యుత్తు వాహకతను కోల్పోవడం లేదు. ఫలితంగా ఎలక్ట్రానిక్స్ వస్తువులు కచ్చితంగా పనిచేస్తాయి. పరిశోధన వివరాలు 'అడ్వాన్స్‌డ్ ఎనర్జీ మెటీరియల్స్'లో ప్రచురితమయ్యాయి.

ఇంగ్లాండ్‌లో పదివేల ఏళ్లనాటి రంగుబలపం



లండన్: దాదాపు పదివేల ఏళ్ల క్రితం ఉపయోగించిన రంగుబలపం ఒకటి ఇంగ్లాండ్‌లోని ఉత్తర యార్క్‌షైర్‌లో పురాతత్వశాస్త్రజ్ఞులకు లభ్యమైంది. పురాతన సరస్సుకు సమీపాన దొరికిన ఈ ఎరుపు రంగుబలపం 22 మిమీ పొడవు, ఏడు మిమీ వెడల్పు ఉంది. ఈ సుద్ద ముక్క దొరికిన ప్రాంతంలోనే జేగురురంగు గులకరాయి కూడా దొరికింది. ఈ రాయి ఉపరితలంపై గరుకుదనం ఎక్కువగా ఉంది. బలపంతో రాపిడి కలిగించి పొడిగా మార్చడానికి దీన్ని ఉపయోగించి ఉండవచ్చని యూకేలోని యార్క్ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసరు ఆండీ నీధమ్ అభిప్రాయపడ్డారు. జంతు చర్మాలపై గుర్తుగా రంగు వేయడానికి, కళాత్మక వస్తువులను అలంకరించడానికి కూడా ఈ బలపాన్ని వాడి ఉండవచ్చని ఆయన చెబుతున్నారు. పూర్వ చారిత్రక యుగంలో ప్రపంచవ్యాప్తంగా దాదాపు అందరు వేటగాళ్లు జేగురురంగును ఎక్కువగా వాడేవారు. పరిశోధన వివరాలు 'ఆర్కియాలాజికల్ సైన్స్' అనే జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

అల్జీమర్స్‌ను ఆపాలంటే ఏరోబిక్స్ చేయండి



అల్జీమర్స్‌ను అడ్డుకోవడంలో ఇతర వ్యాయామాలతో పోలిస్తే ఏరోబిక్ వ్యాయామం మూడురెట్లు సమర్థవంతంగా పనిచేస్తుందని తాజా అధ్యయనంలో తేలింది. వృద్ధుల్లో జ్ఞాపకశక్తి పెంపొందడానికి, అవగాహన శక్తి పెరగడానికి, భాషానైపుణ్యాల పెంపునకు కూడా చక్కగా ఉపయోగపడుతుందట. ఇతర వ్యాయామాలు చేసేవారితో పోలిస్తే.. చక్కగా ఆలోచించడం, మంచి నిర్ణయాలు తీసుకోవడం మూడురెట్లు మెరుగ్గా ఉంటాయని రుజువైంది. జ్ఞాపకశక్తి పెరగడానికి ఆహారంలో మార్పుచేర్పులు చేయడం ద్వారానూ ఫలితం కనిపిస్తుందని 'అమెరికన్ గెరియాట్రిక్స్ సొసైటీ' అనే జర్నల్‌లో ప్రచురితమైన వ్యాసం చెబుతోంది. పసుపు; విటమిన్-సి ఎక్కువగా ఉండే స్ట్రాబెర్రీ, బ్రకోలి, నిమ్మవంటి సిట్రస్ జాతి ఫలాలు; విటమిన్-కె, ఫోలిక్ ఆమ్లాలు ఎక్కువగా ఉండే పచ్చటి ఆకులు గల శాకాహారం; ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు ఉండే అవిసె గింజలు, పెద్ద చేపలు, అక్రోట్లు తినడం ద్వారా మెదడు బాగా పనిచేస్తుందని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.



శ్రీనివాస్ హత్య కేసు నిందితులతో ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకటరెడ్డి కలిసి ఉన్న ఫొటో చూపుతున్న ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, ఎమ్మెల్యే గాదరి కిశోర్

బొడ్డుపల్లి హత్య కేసులో నిందితులు కాంగ్రెస్‌వారే

తెరాసకు సంబంధం లేదు: కర్నె ప్రభాకర్, గాదరి కిశోర్

ఈనాడు, హైదరాబాద్: నల్గొండ పురపాలక సంఘం ఛైర్‌పర్సన్ లక్ష్మి భర్త బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్య కేసులో నిందితులంతా కాంగ్రెస్‌వారేనని తెరాస శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు కర్నె ప్రభాకర్, గాదరి కిశోర్‌లు అన్నారు. దోషులను కఠినంగా శిక్షించాలని, అవసరమయితే న్యాయ విచారణ జరిపించి వాస్తవాలను వెలుగులోకి తేవాలని డిమాండ్ చేశారు. ఈ హత్యతో తెరాసకు సంబంధం లేదన్నారు. కాంగ్రెస్ నేతలు నిజాలు బయటపడకుండా, రాజకీయ లబ్ధి కోసం తమ పార్టీపై ఆరోపణలు చేస్తూ నీచబుద్ధిని చాటుకుంటున్నారని పేర్కొన్నారు. శనివారం తెరాస ఎల్పీ కార్యాలయంలో వారు విలేకర్లతో మాట్లాడారు. "కాంగ్రెస్ పార్టీ అరాచకాలకు మారుపేరు. నేరచరితులను చేరదీసి దారుణాలు చేయించడం ఆ పార్టీలో మొదటి నుంచి ఆనవాయితీ. హత్యలతో రాజకీయాలను భ్రష్టు పట్టిస్తోన్న చరిత్ర ఆ పార్టీదే. నల్గొండ ఉదంతంలోనూ అలాగే చేస్తోంది. బొడ్డుపల్లి శ్రీనివాస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకటరెడ్డి శిష్యుడు. శ్రీనివాస్ హత్యకేసులో నిందితులు కూడా కోమటిరెడ్డి అనుచరులే. నేరచరితులను కోమటిరెడ్డి వెంటేసుకొని తిరుగుతున్నారు. గతంలో ఇలాంటి దాడులు అనేకం జరిగినా వారిపై చర్యలు తీసుకోలేదు. ప్రత్యర్థులను నిర్మూలించడానికి కాంగ్రెస్.. నేరగాళ్లను చేరదీస్తుంటే వారు పాములై ఆ పార్టీ వారినే కాటేస్తున్నారు. తెరాస ఎమ్మెల్యే వేముల వీరేశంపై కాంగ్రెస్ నేతలు అభియోగాలు మోపుతూ ఆయన ఫోన్‌కాల్స్ జాబితాను బయటపెట్టాలంటున్నారు. వీరేశంతో పాటు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఏడాదిపాటు ఎవరెవరితో సంభాషించారో ఆ జాబితాను బయటపెట్టాలి. హత్యలను, శవరాజకీయాలను తెరాస సహించేదు. దోషులను ప్రభుత్వం కఠినంగా శిక్షిస్తుంది' అని ప్రభాకర్, కిశోర్‌లు పేర్కొన్నారు.

పాక్ నోట మళ్లీ కశ్మీర్ పాట

ఐరాస: భారత్-పాకిస్థాన్ వివాదాల్లో తాము మధ్యవర్తిత్వం వహించబోమని ఐక్యరాజ్య సమితి సెక్రెటరీ జనరల్ ఆంటోనియో గుటెరెస్ స్పష్టం చేసిన కొద్ది రోజుల్లోనే అదే అంశాన్ని అంతర్జాతీయ వేదికపై ప్రస్తావించేందుకు పాకిస్థాన్ యత్నించింది. భద్రతామండలిలో మధ్య ప్రాచ్యంపై చర్చ జరుగుతున్న సమయంలో ఐరాసలో పాక్ శాశ్వత ప్రతినిధి మలేహా లోధి కశ్మీర్ అంశాన్ని గుర్తు చేశారు. పాలస్తీనా సమస్యను కశ్మీర్‌తో పోల్చారు.



పన్ను శ్లాబులు

గత బడ్జెట్లో రూ.2.5 లక్షలు- 5 లక్షల వరకు వార్షికాదాయం ఉన్న వారికి పన్ను రేటును 5 శాతానికి ప్రభుత్వం తగ్గించింది. అయితే రూ.5 లక్షలకు పైగా ఆదాయం ఉన్న వారు కూడా ఈసారి పన్ను రేట్లలో తగ్గింపును ఆశిస్తున్నారు. 5 శాతం పన్ను రేటుకు వార్షికాదాయ శ్లాబ్‌ను రూ.3 - 7 లక్షలకు పెంచొచ్చనే అభిప్రాయం వినిపిస్తోంది. అలాగే రూ.12 లక్షలకు పైగా ఆదాయం ఉన్న వారికి 30%, రూ.7 లక్షలు- 12 లక్షల మధ్య ఆదాయం ఉన్నవారికి 20% పన్ను శ్లాబ్‌లను వర్తింప చేయొచ్చని భావిస్తున్నారు. ఇక రూ.3 లక్షల లోపు ఆదాయం ఉన్నవారికి పన్ను రిటర్న్‌ల నుంచి మినహాయింపు లభించే అవకాశం ఉంది.

ఆదాయపు పన్ను పరిమితి

ధరలు పెరుగుతుండటం, జీఎస్‌టీ అమలు తదితరాల దృష్ట్యా చాలా ఏళ్లుగా కొనసాగుతోన్న ప్రస్తుత పన్ను మినహాయింపు పరిమితిని ప్రభుత్వం పునఃసమీక్షించాలని కోరుతున్నారు. ప్రస్తుతం రూ.2.5 లక్షల్లోపు వార్షికాదాయం ఉన్న వారికి పన్ను మినహాయింపు ఉంది. ఈ పరిమితిని రూ.3- 3.5 లక్షలకు పెంచే అవకాశం ఉంది. ఇదే జరిగితే పన్ను మినహాయింపుతో మిగిలే డబ్బులను ఇతరత్రా పెట్టుబడి మార్గాలకు వెచ్చించే అవకాశం ఉంటుంది. అంతేకాక ఎగవేతలకు కొంతలో కొంతైనా అడ్డుకట్ట వేయొచ్చని భావిస్తున్నారు.





జాతీయ పింఛను పథకం

జాతీయ పింఛను పథకం (ఎన్‌పీఎస్)తో పోలిస్తే ప్రజా భవిష్యనిధి (పీపీఎఫ్‌లు) వైపు ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. దానికి కారణం పీపీఎఫ్ ఉపసంహరణ సమయంలో ఎలాంటి పన్నులు వర్తించవు. అదే ఎన్‌పీఎస్‌లో నిధుల ఉపసంహరణకు వర్తిస్తుంది. అందుకే ఎన్‌పీఎస్ లోనూ మరిన్ని పెట్టుబడులు రావాలంటే ఈ పథకంలో నిధుల ఉపసంహరణకు కూడా పన్ను మినహాయింపు ఇవ్వాలని కోరుతున్నారు. ఎంతో కొంత ప్రతిఫలం వస్తుందన్న ఆశతోనే కదా ఎవరైనా మదుపు చేసేది. ఆ వచ్చే ప్రతిఫలంలో కొంత మొత్తం పన్ను చెల్లింపులకు పోతే, గిట్టుబాటు అయ్యేది పెద్దగా ఉండదు.

వైద్యం.. ఖర్చులు..

ప్రస్తుతం వైద్యానికి అవుతోన్న ఖర్చులు మామూలు స్థాయిలో లేవు. ఏ చిన్నపాటి రోగానికైనా ఆస్పత్రుల్లో అడుగుపెట్టారంటే బిల్లు మోత మోగాల్సిందే. వైద్యానికి అయిన ఖర్చును రీయింబర్స్‌మెంట్ కింద తిరిగి పొందిన (రీయింబర్స్‌మెంట్) కూడా పెద్దగా ప్రయోజనం ఉండటం లేదు. ఇలా పొందిన మొత్తం రూ.15,000 కంటే ఎక్కువగా ఉంటే పన్ను చెల్లించాల్సి వస్తుంది. అందుకే పెరుగుతున్న ఖర్చులను దృష్టిలో ఉంచుకొని ఈ పన్ను మినహాయింపు పరిమితిని రూ.15000 నుంచి రూ.45,000కు పెంచమని కోరుతున్నారు.





తొలిసారి ఇల్లు కొంటే..

అందరికీ గృహ కల్పనపై ప్రభుత్వం ప్రస్తుతం దృష్టి సారిస్తోంది. అయితే ఓ వైపు పెరుగుతోన్న జనాబా, మరోవైపు డిమాండు- సరఫరా మధ్య వ్యత్యాసం కారణంగా ఇది సవాలుతో కూడుకున్నదే. ఆదాయపు పన్ను చట్టం సెక్షన్ 80 ఈఈ ప్రకారం తొలిసారి ఇంటిని కొనుగోలు చేసిన వాళ్లు 2016 ఏప్రిల్ 1 నుంచి 2017 మార్చి 31 మధ్య రుణాన్ని పొంది ఉంటే అదనంగా రూ.50,000 వరకు పన్ను కోతకు వీలుంది. ఈ వెసులుబాటును 2017 మార్చి తర్వాత రుణం పొందిన వారికి కూడా కల్పించే అవకాశం ఉంది.


చూడండీ సారూ.. ఓ మారూ



బడ్జెట్ విన్నపాలు

ఆదాయపు పన్ను పరిమితి పెంచాలని ఎక్కువ మంది పాఠకులు అభిప్రాయపడ్డారు. దీంతో పాటు 80సీ పరిమితి పెంచడం, జీఎస్‌టీ హేతుబద్ధీకరణ చేపట్టాలని సూచించారు. ఆ సూచనలు ఇలా..



- ఆదాయపు పన్ను పరిమితిని రూ. 2.5 లక్షల నుంచి రూ. 5 లక్షలకు పెంచాలి. దీని వల్ల వేతన జీవులకు లబ్ధి కలుగుతుంది.
- రూ. 5-10 లక్షల ఆదాయంపై పన్ను రేట్లను 5 శాతానికి తగ్గించాలి.
- 80సీ పరిమితిని రూ. 3 లక్షలు చేయాలి.
- రూ. 5 లక్షల లోపు సంవత్సర ఆదాయం గలవారికి సెక్షన్ 87ఏ కింద ప్రస్తుతం ఇస్తున్న రూ. 2500 ప్రత్యేక రిబేటును రూ. 10000కు పెంచాలి.
- ఈఎల్ఎస్ఎస్, పీపీఎఫ్ వంటి పథకాలను ప్రత్యేక సెక్షన్‌లో చేర్చాలి.
- గృహ రుణంలో అసలును సైతం 80సీ నుంచి బయటకు తీసుకురావాలి.
- బీమా పాలసీలపై జీఎస్‌టీ రేటును 5 శాతం దిగువకు తేవాలి.

- ఎన్.సతీశ్ కుమార్ వరంగల్, తండ ప్రభాకర్ గౌడ్, మహబూబాబాద్, చిలుముల బాల్‌రెడ్డి, చిట్యాల, పెండెం రాజు, వరంగల్



మెడికల్ రీఎంబర్స్‌మెంట్ మినహాయింపు 1999 నుంచి రూ. 15,000గా మాత్రమే ఉంది. దీన్ని ఏడాదికి రూ. 50000కు పెంచాల్సిన అవసరం ఉంది. వయోవృద్ధులకు ఆసుపత్రి వ్యయాలు, ఆరోగ్య బీమా పాలసీల ప్రీమియంలకు మినహాయింపు ఇవ్వాలి. జన్ ఔషధి మాదిరిగానే ప్రభుత్వ డయాగ్నోస్టిక్ కేంద్రాలను ప్రభుత్వం అందుబాటు ధరలకే తీసుకురావాలి. ఫిక్స్‌డ్ డిపాజిట్ వడ్డీ రేట్లను పెంచాలి.

- జేవీ హరిప్రసాద్, హైదరాబాద్

బడ్జెట్ నుంచి ఏమి ఆశిస్తున్నారో మీ ఫొటోతో సహా మాకు పంపండి
businessdesk@eenadu.net,
eenadubusinessdesk@gmail.com
పాఠకుల మరిన్ని వినతులు
www.eenadu.net బడ్జెట్-2018 స్పెషల్ విభాగంలో

సిరి రేపటి సంచికలో



కావాలి సులభ రుణాలు

ఆన్‌లైన్ పోర్టళ్ల నుంచి తీవ్ర పోటీని ఎదుర్కొంటున్న రిటైల్ రంగం కూడా 'పరిశ్రమ' హోదా ఇవ్వాలని ఆర్థిక శాఖకు విజ్ఞప్తి చేసింది. ఇందువల్ల రుణాలు సులభతరం కావడంతో పాటు మరిన్ని పెట్టుబడులను ఆకర్షించవచ్చన్నది ఈ రంగం భావన. జీఎస్‌టీ వ్యవస్థను సరళీకరించాలని, బహుళ రిటైలింగ్‌లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను సరళతరం చేయాలని అభ్యర్థిస్తోంది.

రిటైల్ రంగం

ఆకాంక్షలివీ

- ఇతర రంగాల తరహాలోనే సహకారం, ప్రోత్సాహకాలు అందుకునేందుకు వీలు కల్పించాలి.
- డిజిటల్, కార్డ్ చెల్లింపుల స్వీకరణకు అవసరమైన పరికరాలు, సాఫ్ట్‌వేర్‌ను చిన్న వ్యాపారులకు అందుబాటు ధరలో అందించాలి
- అంతర్జాతీయ పర్యాటకులకు జీఎస్‌టీ రిఫండ్‌లు సత్వరం మంజూరు చేయడం ద్వారా, పర్యాటకంతో పాటు రిటైల్ రంగాన్ని ప్రోత్సహించాలి.
- వ్యక్తిగత వినియోగం పెరిగేలా, ప్రజలకు ఆదాయపు పన్ను మినహాయింపులు ఇవ్వాలి. వినియోగం అధికమైతే, ఆర్థిక వ్యవస్థకు బహువిధాలా మేలు జరుగుతుంది. భారత్‌లో తయారీ ఇనుమడిస్తుంది.
- వాణిజ్య సముదాయాలు, మాల్స్ యజమానులకు ఏకగవాక్ష విధానంలో అనుమతులివ్వాలి. వీటి నిర్మాణం, నిర్వహణలో స్థిరాస్తి, రిటైల్, ఆతిథ్య రంగాలు కలిసి ఉంటాయి కనుక, లైసెన్సుల కోసం వేర్వేరు విభాగాల చుట్టూ ప్రదక్షిణలు నివారించాలి.

ఇదీ లెక్క

- 2016లో 641 బి.డాలర్ల (సుమారు రూ. 41.66 లక్షల కోట్ల) స్థాయిలోని ఈ రంగం 2026కు 1.6 లక్షల కోట్ల డాలర్ల (రూ. 104 లక్షల కోట్ల) స్థాయికి చేరుతుందని అంచనా. ప్రస్తుతం సంఘటిత రిటైలింగ్ వాటా 10 శాతమే కాగా, ఇది 20 శాతం వృద్ధితో సాగనుందని అంచనా.
- రాబోయే అయిదేళ్లలో ఆన్‌లైన్ వ్యాపారం కూడా సాధారణ విక్రయాలతో సమాన స్థాయికి చేరుతుందనే అంచనాలున్నాయి.
- ఈ రంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 2000 నుంచి గతేడాది వరకు 1.04 బిలియన్ డాలర్లు (సుమారు రూ. 6,700 కోట్ల) వరకు వచ్చాయని అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి.



పరిశోధనకు ప్రోత్సాహమివ్వాలి

కార్పొరేట్ పన్నును తగ్గిస్తామని చెబుతూ గతేడాది పరిశోధన-అభివృద్ధి (ఆర్ అండ్ డీ)పై ప్రోత్సాహకాల్లో ప్రభుత్వం కోత వేసింది. ఆర్ అండ్ డీపై భారీ పెట్టుబడులు పెడుతున్న నేపథ్యంలో తిరిగి ప్రోత్సాహకాలను ఇవ్వాలని వాహన రంగం కోరుకుంటోంది. అదే విధంగా 2030 కల్లా 100 శాతం విద్యుత్ వాహనాలను లక్ష్యంగా ప్రభుత్వం పెట్టుకున్న నేపథ్యంలో ఆరేళ్ల పాటు ఫేమ్ పథకాన్ని(రెండో విడత) తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తోంది. అదే విధంగా ప్రస్తుతమున్న పన్ను విధానాలను సరళీకరించాలనీ అంటోంది.

వాహన రంగం

ఏం కోరుకుంటున్నారంటే..

- వెయిటెడ్ పన్ను తగ్గింపు రూపంలో పరిశోధన-అభివృద్ధి (ఆర్ అండ్ డీ)కి ప్రోత్సాహకాలను తిరిగి ఇవ్వాలి.
- ఆర్ అండ్ డీపై భారీ పెట్టుబడులు పెడుతున్న నేపథ్యంలో కార్పొరేట్ పన్నును తగ్గించని పక్షంలో కనీసం ప్రోత్సాహకాలైనా ఇవ్వాలి.
- విద్యుత్ వాహన విడిభాగాల దిగుమతి విషయంలో పన్నులపై స్పష్టతనివ్వాలి. ఒక్కసారి దిగుమతి చేసుకున్న తర్వాత తప్పటడుగు పడకుండా చూడాలి.
- రవాణా వ్యయాలను తగ్గించాలి. అందు కోసం నదీ రవాణాను ప్రవేశపెట్టాలి. ఆధునిక రైలు రవాణాను మెరుగుపరచాలి.
- ప్రస్తుతమున్న బహుళ పన్ను రేట్ల విధానం స్థానంలో రెండు పన్ను రేట్ల విధానాన్ని తీసుకురావాలి.
- ఫేమ్(ఫాస్టర్ అడాప్షన్ అండ్ మాన్యుఫాక్చరింగ్ ఆఫ్ హైబ్రిడ్ అండ్ ఎలక్ట్రికల్ వెహికల్స్) పథకంలో మలి విడతను ప్రవేశపెట్టాలి.
- ప్రస్తుతమున్న 28 శాతం జీఎస్‌టీని 20 శాతానికి తగ్గించాలని వాహన విడి భాగాల రంగం కోరుకుంటోంది.

ఈనాడు బిజినెస్ వారాంతం

బడ్జెట్ రూపకల్పనలో పరిగణనలోకి తీసుకునే అంశాలు

14.9 బిలియన్ డాలర్లు	వాణిజ్య లోటు (డిసెంబరు 2017)
411 బిలియన్ డాలర్లు	విదేశీ మారక నిల్వలు (జనవరి 5 నాటికి)
6.3 శాతం	వృద్ధిరేటు (జులై-సెప్టెంబరు 2017)
3.2 శాతం	ద్రవ్యలోటు అంచనా (2017-2018)
55 లక్షలు	కొత్త ఉద్యోగాలు (2017-2018లో లక్ష్యం)
6.89 లక్షల కోట్లు	ప్రత్యక్ష పన్నులు (జనవరి 15, 2018 వరకు)
4.2 శాతం	అంతర్జాతీయ వాణిజ్యంలో వృద్ధి
5.21 శాతం	రిటైల్ ద్రవ్యోల్బణం (డిసెంబరు 2017)




విద్యా రుణాలు

ప్రస్తుతం నర్సరీ నుంచే ఫీజుల మోత మోగుతోంది. ఇక ఉన్నత విద్య గురించి చెప్పనక్కర్లేదు. భారీ మొత్తంలో డబ్బులు అవసరం పడుతుండటంతో చాలా మంది రుణాల బాట పడుతున్నారు. అందుకే ఇటీవల విద్యా రుణాలకు గిరాకీ అధికంగా ఉంటోంది. విద్యా రుణాలపై చెల్లించిన వడ్డీని 80ఈ సెక్షన్ ప్రకారం పన్ను కోత రూపేణా క్లెయిమ్ చేసుకోవచ్చు. ఈ ప్రయోజనాన్ని కేవలం ఎనిమిదేళ్లు మాత్రమే పొందే వీలుంది. అయితే ఈ ఎనిమిదేళ్ల గడువు ఏమాత్రం సరిపోదనే అభిప్రాయం వినిపిస్తోంది. అందుకే ఈ ప్రయోజనాన్ని రుణ కాల పరిమితి పూర్తయ్యే వరకు కొనసాగించాలని కోరుకుంటున్నారు.

బీమాకు ప్రత్యేక మినహాయింపు

దేశంలో బీమా సేవల విస్తరణను అంతంతమాత్రంగానే ఉంది. ప్రజల్లో అవగాహన పెంచడం ద్వారా బీమా సేవల విస్తరణను వేగవంతం చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించాలి. ప్రస్తుతం బీమా పథకాల్లో పెట్టుబడులపై ఆదాయపు పన్ను చట్టం 80సి సెక్షన్ కింద పన్ను మినహాయింపు పరిమితి గరిష్ఠంగా రూ.1.5 లక్షలుగా ఉంది. మరింత మంది బీమా పథకాల వైపు మొగ్గు చూపాలంటే ఈ పరిమితిని పెంచాలని కోరుతున్నారు. ముఖ్యంగా ప్రీమియం తక్కువగా ఉండే టర్మ్ పాలసీలకు ప్రత్యేక మినహాయింపు పరిమితిని బడ్జెట్‌లో ప్రతిపాదించాలని అడుగుతున్నారు.





బ్యాంక్ వడ్డీపై..

బ్యాంకుల్లో వివిధ కాలావధులకు అనుగుణంగా డిపాజిట్లు చేస్తూ ఉంటారు. కాలపరిమితి పూర్తి అయిన తరువాత వచ్చే వడ్డీ మీద మూలం వద్ద పన్ను కోత పరిమితి రూ.10,000గా ఉంది. దాదాపు 20 ఏళ్లుగా ఈ పరిమితినే కొనసాగిస్తున్నారు. అయితే అప్పటికీ.. ఇప్పటికీ ప్రజల ఆదాయాల్లో గణనీయ వ్యత్యాసం వచ్చింది. సంపద పెరిగింది. పొదుపు చేసే విధానంలోనూ మార్పులు వచ్చాయి. వీటన్నింటినీ పరిగణనలకి తీసుకొని పై పరిమితిని పునస్సమీక్షించాల్సిన అవసరం ఉందని భావిస్తున్నారు.

డిపాజిట్లు.. వడ్డీ.. పన్ను..

చాలా మందికి మదుపు అంటే ముందుగా కనిపించే మార్గం డిపాజిట్లే. నోట్ల రద్దు అనంతరం డిపాజిట్లు రేట్లు బాగా తగ్గాయి. మరోవైపు డిపాజిట్ల ద్వారా పొందే వడ్డీకి పన్ను వర్తిస్తుండటంతో గిట్టుబాటు అవుతున్న ప్రతిఫలం కూడా తక్కువగానే ఉంటుంది. ఉదాహరణకు ఒక వ్యక్తి 30 శాతం పన్ను శ్లాబులో ఉన్నాడనుకుందాం. డిపాజిట్లపై కనీసం 7-8% వడ్డీని పొందినా కూడా ఆయనకు పన్నులు పోగా గిట్టుబాటు అయ్యేది 5% లోపే ఉంటోంది. అందుకే డెట్ మ్యూచువల్ ఫండ్‌ల విషయంలో ఏదైతే పన్ను విధానాన్ని అమలు చేస్తున్నారో.. ఆ తరహాలోనే డిపాజిట్లకు వర్తింపజేయాలని కోరుతున్నారు.





ఇంటి బీమా

ప్రస్తుతం ఇంటి నిర్మాణ వ్యయం భారీగా ఉంటోంది. ఇళ్లు కొనడంతోనే అయిపోదు కదా.. గృహ ఫర్నిచర్, ఇతరత్రా అలంకరణ సామగ్రి కోసం పెద్ద మొత్తంలోనే ఖర్చవుతోంది. మరి ఇంత విలువైన సామాన్లు ఉన్నప్పుడు ఇంటికి బీమా చేయడం కూడా ఎంతో అవసరం. అయితే ప్రస్తుతం గృహ బీమాకు పన్ను మినహాయింపు లేదు. ఇంటి బీమాకు ప్రత్యేక సెక్షన్ కింద పన్ను మినహాయింపు ఇవ్వాలన్న ప్రతిపాదన చాన్నాళ్లుగానే ఉంది. ఈ బడ్జెట్లోనైనా పన్ను మినహాయింపు విషయంలో నిర్ణయం తీసుకుంటే మరింత మంది గృహ బీమా వైపు మొగ్గు చూపే అవకాశం ఉంటుంది. ఈ పరిణామం బీమా సేవల విస్తరణకు కూడా దోహదం చేస్తుంది.

చదువులమ్మ.. కంట చెమ్మ!

- ఓ పూజారి ప్రైవేట్ పూజలతో అపఖ్యాతి

ఈనాడు - హైదరాబాద్

చదువుల తల్లి కొలువుదీరిన బాసరలో కొంతమంది అక్రమార్జనను నిరాటంకంగా సాగిస్తున్నారు. దీంతో దినదిన ప్రవర్ధమానంగా వెలుగొందాల్సిన జ్ఞానసరస్వతి క్షేత్రం కొంతమంది వ్యక్తులకు ఇష్టారాజ్యంగా మారిందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నిశిత దృష్టి లేకపోవడం కూడా అక్రమాలు గుట్టలుగా పేరుకుపోతుండటానికి కారణమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఆలయ భూముల్లో ఇన్నాళ్లూ సాగిన దందాను కదిలిస్తుంటే ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయి.

ఇనాం భూమిని విక్రయించేశారు

గోదావరి ఒడ్డున 438 సర్వే నంబర్‌లో ఉన్న రూ.కోట్లు విలువచేసే విఠలేశ్వర స్వామి భూములను కబ్జా చేయడం ఒకెత్తయితే దాని వెనుక ఇంకా ఎన్నో కోణాలు ఉన్నాయి. ఓ రెండు ఎకరాల స్థలాన్ని గిఫ్ట్‌డీడ్ డాక్యుమెంటు నం. 498/1982 కింద దశరథ మహరాజ్ అనే స్వామికి అప్పగించారు. ఈ భూమి తిరిగి క్రయవిక్రయాలతో చేతులు మారడం చర్చనీయాంశంగా మారింది. ఓ పెద్దమనిషి విఠలేశ్వర స్వామి భూమినంతా తన చేతుల్లోకి తీసుకునే క్రమంలో క్రయవిక్రయాలకు తెరతీసినట్లు తెలుస్తోంది.

మంగళవారం పూజ చేయాల్సిందేనంటూ..

ఆలయంలో పూజలు నిర్వహించే ఓ అర్చకుడు ప్రత్యేక పూజల పేరిట భక్తులను దోచుకుంటున్న తీరుపై సర్వత్రా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆలయానికి వచ్చే భక్తుల సమస్యలను ప్రత్యేకంగా తెలుసుకుని దోష పరిహారం చేయించుకోవాలని ముందుగా సూచిస్తారని స్థానికులు చెబుతున్నారు. ఇలా వారంపాటు పోగైన భక్తులను మంగళవారం గోదావరి ఒడ్డుకు రావాలని చెప్పి వారితో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. ప్రతి మంగళవారం దాదాపు వందమందికి పైగా భక్తులను గోదావరి ఒడ్డున ఓ సత్రంలోకి రప్పించి వారి సమస్యలకు పరిష్కార పూజల పేరిట రూ.రెండున్నర వేల నుంచి రూ.ఐదు వేల వరకు వసూలు చేస్తున్నట్లు బహిరంగంగానే చెబుతున్నారు. గతంలో ఏకంగా ఆలయానికి చెందిన స్నానఘట్టాల వద్దే పూజలు చేస్తుంటే స్థానికులు అడ్డుకోవడంతో సత్రంలోకి మకాం మార్చారని తెలిపారు. గర్భగుడిలో పూజలకు వచ్చే భక్తులను ప్రైవేట్ పూజల పేరిట మోసం చేస్తున్న ఆ పూజారికి అండదండలు పుష్కలంగా ఉండటంతో ఎవరూ అడ్డుచెప్పే పరిస్థితి లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

వారిపై ఎందుకంత ప్రేమ

ఆదాయ పరంగా చూస్తే ప్రభుత్వ పర్యవేక్షణలో ఉండాల్సిన బాసర ఆలయంపై నిర్లక్ష్యం కమ్ముకోవడం గమనార్హం. ఆలయంలో పూజారులకు ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ కొందరు ధర్మకర్తలు వసూళ్లకు దిగడం, దీనిపై రచ్చ జరగడం బాసరలో అందరికీ తెలిసిన విషయమే. పత్రికా ప్రకటనలు లేకుండానే సామగ్రి, వస్తువుల కొనుగోళ్లు చేపడుతున్నారంటూ ఆరోపణలు వస్తున్నాయి. ఆధ్యాత్మిక వాతావరణం, భక్తి చింతన పెంచేచోట ఆదాయార్జనే లక్ష్యంగా అనేక వ్యవహారాలు చోటు చేసుకుంటుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రైవేటు వ్యక్తులు ఆలయంలోని సేవలను, బిల్లులను ప్రభావితం చేస్తుండటంపై ఫిర్యాదులు ఉన్నాయి. ఇంత జరుగుతున్నా ఇన్నేళ్లుగా దేవాదాయశాఖ మిన్నకుండిపోవడం భక్తులను తొలిచివేస్తోంది. ఓ అధికారి అన్నీ తానై వ్యవహరిస్తున్న తీరు జిల్లా నుంచి రాజధాని వరకు అధికారులకు తెలిసినా ఎవరూ చర్యలకు ఉపక్రమించడం లేదని దేవాదాయ శాఖ సిబ్బందే బాహాటంగా పేర్కొంటున్నారు. ఏళ్ల తరబడి పాతుకుపోయిన అధికారులు, సిబ్బందిని బాసర నుంచి బదిలీ చేయడం, శాఖాపరమైన విచారణలు చేపట్టడం, కొందరి బ్యాంకు ఖాతాలపై నిఘావేసి ఆలయ ఖజానాకు కన్నం వేసిన వారిపై చర్యలు తీసుకోవడం వంటి కఠిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.




438 సర్వే నెంబర్‌లోని ఇనాం భూమిలో నిర్మాణాలు ★ లైఫ్‌జాకెట్లు లేకుండా గోదావరిలో తెప్పపై భక్తులు

లైఫ్ జాకెట్లు లేకుండానే..

బాసర అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు అతి ప్రమాదకరమైన పరిస్థితిలో గోదావరిలో తెప్పలపై ప్రయాణం చేస్తున్నారు. స్నానఘట్టాల వద్ద కొందరు యువకులు నాటు తెప్పలు ఏర్పాటు చేసి నదిలో తిప్పుతున్నారు. నదిలో స్నానం చేసిన భక్తులు గోదావరి మధ్యలో ఉన్న అమ్మవారి విగ్రహం చుట్టూ ప్రదక్షిణ చేసేందుకు నాటు తెప్పలో వెళ్తున్నారు. ఈ సమయంలో భక్తులకు లైఫ్‌జాకెట్లను అందుబాటులో ఉంచడం లేదు. పైగా ఒక్కో తెప్పపై 15 నుంచి ఇరవై మంది వరకు ప్రయాణం చేస్తున్నారు. విజయవాడలో కొన్నాళ్ల క్రితం పడవ బోల్తాపడిన దుర్ఘటన నుంచి అధికారులెవరూ గుణపాఠం నేర్వకపోవడం గమనార్హం. దీనిపై తెప్పలను నడుపుతున్న యువకులను పలకరించగా లైఫ్‌జాకెట్లు తెప్పిస్తున్నామని పేర్కొన్నారు.

వ్యవసాయానికి 12 గంటల విద్యుత్తు చాలు

కరీంనగర్ జడ్పీ సమావేశంలో తీర్మానం

కరీంనగర్ పట్టణం, న్యూస్‌టుడే: వ్యవసాయానికి ప్రభుత్వం 12 గంటల ఉచిత విద్యుత్ సరఫరా ఇస్తే సరిపోతుందని కరీంనగర్ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం తీర్మానించింది. శనివారం జడ్పీ ఛైర్‌పర్సన్ తుల ఉమ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్, సభ్యులు పాల్గొన్నారు. 24 గంటల విద్యుత్తు సరఫరాతో సమస్యలు తలెత్తుతున్నాయని, ఇష్టారీతిగా నీటిని తోడడంతో భూగర్భజలాలు పడిపోయే ప్రమాదం ఉందని ముస్తాబాద్ జడ్పీటీసీ సభ్యుడు శరత్‌రావు అన్నారు. 12 గంటల విద్యుత్తు సరఫరా ఇస్తే సరిపోతుందని ఆయనతో పాటు బోయినపల్లి జడ్పీటీసీ లచ్చిరెడ్డి కూడా చెప్పారు. ఈ విషయంలో జిల్లా పరిషత్ తీర్మానం చేయాలని మంత్రి ఈటల సూచించారు. వెంటనే శరత్‌రావు తీర్మానం ప్రవేశపెట్టారు. సమావేశం ఏకగ్రీవంగా చప్పట్లతో ఆమోదం తెలిపింది. కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ రైతుల కోసం స్వయంగా 12 గంటలు సరిపోతుందని తీర్మానం చేయడం గొప్ప విషయమన్నారు. 14వ ఆర్థిక సంఘం ద్వారా రాష్ట్రంలోని స్థానిక సంస్థలకు రూ.450 కోట్ల నిధులు విడుదల చేసినట్లు ఈ సందర్భంగా మంత్రి ఈటల ప్రకటించారు.

జడ్పీ సమావేశానికి అధికార పార్టీ సభ్యుల గైర్హాజరు

మంత్రి జూపల్లి బుజ్జగింపులతో ఆలస్యంగా హాజరు

మహబూబ్‌నగర్, ఈనాడు డిజిటల్: జిల్లా పరిషత్తు సర్వసభ్య సమావేశాన్ని జడ్పీటీసీలు గైర్హాజరైన ఘటన మహబూబ్‌నగర్ జిల్లాలో శనివారం చర్చనీయాంశమైంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 64 మంది సభ్యులుండగా.. వారిలో అధికార తెరాసకు చెందినవారే 53 మంది. ఉదయం జరగాల్సిన సమావేశానికి కోరానికి సరిపడా 22 మంది కూడా హాజరుకాలేదు. అభివృద్ధి నిధులు ఇవ్వడం లేదన్న కారణంతో వీరంతా సమావేశానికి గైర్హాజరైనట్లు సమాచారం. ఈ పరిణామాలతో ఒక దశలో సమావేశం జరుగుతుందా? లేదా? అన్న సందిగ్ధం నెలకొంది. మంత్రి జూపల్లి కృష్ణారావు, జడ్పీ ఛైర్మన్, ఎమ్మెల్యేలు జోక్యం చేసుకుని. .చరవాణి ద్వారా బుజ్జగించి కోరానికి సరిపడా సభ్యులను రప్పించి మధ్యాహ్నం 1.05 గంటలకు సమావేశాన్ని ప్రారంభించారు. సభ్యులు నామమాత్రంగానే ఉండటంతో సమావేశం కూడా మొక్కుబడిగా సాగింది.

పెరిగిన సదర్ మాట్ బ్యారేజి అంచనా వ్యయం

ఈనాడు, హైదరాబాద్: గోదావరి నదిపై ఎస్సారెస్పీ కింద నిర్మిస్తున్న సదర్ మాట్ బ్యారేజి అంచనా వ్యయం రూ.4.15 కోట్లు పెరిగింది. గతంలో రూ.516.23 కోట్లున్న అంచనా వ్యయాన్ని రూ.520.39 కోట్లు పెంచుతూ ప్రభుత్వం శనివారం పరిపాలన ఉత్తర్వులు జారీచేసింది. 1.58 టీఎంసీల సామర్థ్యమున్న ఈ బ్యారేజి కింద నిర్మల్ జిల్లా మామడ మండలం పొంకల్ గ్రామ ఆయకట్టు సాగులోకి రానుంది.

కేంద్ర ఆర్థికమంత్రే ఆశ్చర్యపోయారు..

- మే ఒకటి నుంచి ఎకరానికి రూ.4 వేలు చెక్కుల పంపిణీ
- వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్
- డీఏఓల సమావేశంలో మంత్రి పోచారం



ఈనాడు, హైదరాబాద్: ఎకరానికి రూ.4 వేల చొప్పున ప్రతి పంట సీజన్‌లో రైతుకు నేరుగా నగదు పంపిణీ చేయనున్నామని చెబితే కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ ఆశ్చర్యపోయారని వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి చెప్పారు. శనివారం వ్యవసాయ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా వ్యవసాయాధికారుల(డీఏఓ) సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రూ.4 వేల చెక్కులను మే ఒకటి నుంచి 15కల్లా పంపిణీ చేస్తామన్నారు. వీటికి అవసరమైన నగదు కోసం రూ.6 వేల కోట్లను ఇవ్వాలని దిల్లీలో ఆర్థికమంత్రిని అడిగిన సందర్భంలో ఆయన పైవిధంగా స్పందించారని వివరించారు. పంటల సాగు విస్తీర్ణం లెక్కలను సరిగా ఇవ్వనందున వ్యవసాయశాఖ సరిగా పని చేయడం లేదనే కథనాలు వస్తున్నాయని, వీటిని ఇకనుంచి పక్కాగా ఇవ్వాలని చెప్పారు. లెక్కలు ఎందుకు సరిగా లేవనే అంశాలను కామారెడ్డి, నిజామాబాద్ సాగు విస్తీర్ణం లెక్కలపై ఆయా డీఏఓలను అడిగి మరీ ఉదాహరణలతో సహా మంత్రి వివరించారు. ఈ యాసంగిలో సాగు విస్తీర్ణం 40 లక్షల ఎకరాలు దాటే అవకాశముందని, సాగుకు అనుకూల వాతావరణమున్నట్లు తెలిపారు. సాగు విస్తీర్ణం లెక్కల ఆధారంగానే రూ.4 వేల చెక్కుల పంపిణీ ఉంటుందన్నారు. రైతుకు ఎంత భూమి ఉన్నా అందులో పక్కాగా పంటలు సాగు చేసే విస్తీర్ణం వరకే రూ.4 వేల చొప్పున ఇస్తామని, రాళ్లతో బీడుగా ఉండేదానికి ఇవ్వబోమని చెప్పారు. వచ్చే నెల మొదటి వారంలోగా మరో 851 'వ్యవసాయ విస్తరణ అధికారి'(ఏఈఓ) పోస్టులను భర్తీకి పబ్లిక్ సర్వీసు కమిషన్ నియామక ఉత్తర్వులు ఇవ్వనుందని వెల్లడించారు. వీరిని నియమించేలోగా ప్రస్తుతమున్న వారిని బదిలీ చేయాలని ఆదేశించారు. వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్‌ను తానే శాసనసభలో ప్రవేశపెడతానన్నారు. రాష్ట్రమంతా సాగుకు సరిపోయినన్ని ట్రాక్టర్లను రాయితీపై పంపిణీకి ఏర్పాట్లు చేస్తామన్నారు.

మొక్కలు ఎండితే సర్పంచి పదవి గోవిందా...: వచ్చే ఎన్నికల్లో సర్పంచిగా ఎన్నికయ్యే వారికి అనేక బాధ్యతలుండేలా కొత్త పంచాయతీ రాజ్ చట్టంలో నిబంధనలు పెడుతున్నట్లు మంత్రి పోచారం తెలిపారు. హరితహారం పథకం కింద నాటే మొక్కల్లో 25 శాతానికి పైగా ఎండిపోయినా, వీధి దీపాలు వెలగకపోయినా, మురుగు కాల్వలు సరిగా లేకున్నా సర్పంచిని పదవి నుంచి తొలగించేలా నిబంధనలు పెడుతున్నట్లు చెప్పారు.

శ్రీనివాస్ హత్య వెనక తెరాస కార్యకర్తలు

- టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ ఆరోపణ
- కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి తూటారక్షక వాహనం, అదనపు భద్రత కల్పించాలి
- డీజీపీ మహేందర్‌రెడ్డికి వినతి

హైదరాబాద్, న్యూస్‌టుడే: నల్గొండ పట్టణ మున్సిపల్ ఛైర్మన్ లక్ష్మీ భర్త బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్య వెనక తెరాస కార్యకర్తలు ఉన్నారని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. హత్యోదంతంపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో వీహెచ్, గీతారెడ్డి, షబ్బీర్‌అలీ, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి తదితరులతో కూడిన బృందం సీఎల్పీ కార్యాలయం నుంచి పాదయాత్రగా వెళ్లి డీజీపీ మహేందర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించింది. అనంతరం ఉత్తమ్ విలేకరులతో మాట్లాడుతూ.. ఉమ్మడి నల్గొండ జిల్లాలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అనేక నేరపూరిత చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని మృతుడు శ్రీనివాస్ అనేక సార్లు సీఎం, మంత్రులు, పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. పార్టీ మారకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని పలుమార్లు ఎమ్మెల్యే వీరేశం శ్రీనివాస్‌ను బెదిరించారని, ఇందుకు సంబంధించిన ఆధారాలను డీజీపీకి అందజేసినట్లు తెలిపారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపిస్తామని డీజీపీ హామీ ఇచ్చారని.. ఒకవేళ పోలీసులు స్పందించకపోతే సీబీఐ విచారణ కోరుతూ కేంద్ర హోంశాఖను, న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ప్రాణహాని ఉన్న నేపథ్యంలో తూటారక్షక(బుల్లెట్ ప్రూఫ్) వాహనంతోపాటు అదనపు భద్రత(4+4 గన్‌మెన్స్) కల్పించాలని, నకిరేకల్‌లో వీరేశం మీద పోటీ చేసిన కాంగ్రెస్ నాయకుడు చిరుమర్తి లింగయ్యకు రక్షణ కల్పించాలని డీజీపీని కోరామన్నారు. వీహెచ్ మాట్లాడుతూ.. వెంకట్‌రెడ్డికి ఏమైనా జరిగితే రాష్ట్రం అగ్నిగుండం అవుతుందని, సీఎం క్యాంపు కార్యాలయం కూడా మిగలదని హెచ్చరించారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం, మంత్రి జగదీష్‌రెడ్డి అండ చూసుకొని ఎమ్మెల్యే వీరేశం బెదిరింపులకు పాల్పడుతున్నారని, శ్రీనివాస్ హత్య వెనక వీరేశం ఉన్నారన్నారు. తనకు, లింగయ్యకు గుర్తు తెలియని వ్యక్తుల నుంచి, గుర్తించని నంబర్ల నుంచి బెదిరింపు ఫోన్‌కాల్స్ వస్తున్నాయన్నారు.



డీజీపీని కలిసి వినతిపత్రం అందజేస్తున్న ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి సోదరులు, వీహెచ్. చిత్రంలో గీతారెడ్డి, షబ్బీర్‌అలీ తదితరులు

కాంగ్రెస్‌లో చేరిన సిద్దిపేట తెజకాస నాయకులు

తెలంగాణలో పోలీసు జులుం నడుస్తోందని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. సిద్దిపేటకు చెందిన తెజకాస నాయకుడు సింబుల భూపతిరెడ్డి అనుచరులతో కలిసి శనివారం గాంధీభవన్‌లో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఆయన పార్టీ కండువా కప్పి స్వాగతం పలికారు. తెలంగాణలో తెరాస సర్కారు తీరుతో ప్రజలు విసిగిపోయారని... కాంగ్రెస్ అధికారంలోకి రావాలని అన్ని వర్గాల ప్రజలు కోరుకుంటున్నారని ఉత్తమ్ చెప్పారు.

ఫిబ్రవరిలో పింఛనుదారుల సమస్యల పరిష్కారానికి ప్రార్థనలు

- పింఛనుదారుల ఐకాస నిర్ణయం

ఈనాడు, హైదరాబాద్: పింఛనుదారుల సమస్యలపై స్పందించనందుకు నిరసనగా ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలని కుటుంబ సభ్యులతో రాష్ట్రవ్యాప్తంగా ఫిబ్రవరి మొదటివారంలో ప్రత్యేక ప్రార్థనలు చేయాలని తెలంగాణ ప్రభుత్వ పింఛనుదారుల ఐకాస నిర్ణయించింది. సంఘం కార్యవర్గ సమావేశం శనివారం హైదరాబాద్‌లో జరిగింది. పలు సమస్యలపై చర్చించి తీర్మానాలు చేశారు. ఫిబ్రవరి 2న ముస్లిం.. 3న హిందు.. 4న క్రైస్తవ పింఛనుదార్లు ప్రార్థనలు చేయాలని తీర్మానించారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే శివరాత్రి తరువాత 119 మంది వేదపండితులచే హైదరాబాద్‌లో మహాయాగం నిర్వహించాలని తీర్మానించారు. సమావేశంలో ఐకాస ఛైర్మన్ కె.లక్ష్మయ్య, సెక్రటరీ జనరల్ టి.సుభాకర్‌రావుతో పాటు సూర్యనారాయణ, రాజమల్లయ్య పాల్గొన్నారు.

పార్టీ పెట్టం.. సమస్యలపై ఉద్యమిస్తాం: కోదండరాం

సంగారెడ్డి, న్యూస్‌టుడే: తెలంగాణ ఐకాస పార్టీగా మారదని.. ప్రజాసమస్యలపై ఉద్యమిస్తామని ఐకాస ఛైర్మన్ ఆచార్య కోదండరాం స్పష్టంచేశారు. ఫిబ్రవరి 4న హైదరాబాద్‌లో జరిగే ఐకాస రాష్ట్ర స్థాయి సమావేశంలో చర్చించి కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. సమగ్ర వ్యవసాయం విధానం కోసం ఉద్యమిస్తామని చెప్పారు. శనివారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలో రైతులు, నిరుద్యోగులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల అనేక సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తమ పర్యటనల్లో తేలిందన్నారు. 2016 తరువాత వర్షాల వల్ల పంటలు నష్టపోయిన వారికి ఇప్పటికీ పరిహారం అందలేదని పేర్కొన్నారు. రైతు సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తామన్నారు.

గతేడాది హిందీ పదం 'ఆధార్'కు ఆక్స్‌ఫర్డ్ నిఘంటువులో చోటు!

జైపుర్: 'ఆధార్'ను 2017 సంవత్సరపు పదంగా ఆక్స్‌ఫర్డ్ హిందీ నిఘంటువు ఎంపిక చేసుకుంది. ఇక్కడ జరుగుతున్న జైపుర్ సాహితీ ఉత్సవాల్లో ఈ మేరకు ఒక ప్రకటన వెలువడింది. ఆక్స్‌ఫర్డ్ నిఘంటువుల 'ఈ ఏడాది హిందీ పదం'గా 'ఆధార్'ను ఎంపిక చేసినట్లు ఆ ప్రకటన వివరించింది. తొలుత ఈ ఏడాది హిందీ పదంగా ఎంపిక చేసుకునేందుకు 'మిత్రోం', 'నోట్‌బందీ', 'గౌరక్షక్' వంటి పదాలను కూడా పరిశీలనలోకి తీసుకున్నారు. అయితే, 'ఆధార్' కార్డుపై జరిగిన విస్తృత చర్చలు, వార్తల్లో ఆ అంశం నిలిచిన తీరు... ఇవన్నీ కలగలిసి అదే పదాన్ని ఎంపిక చేసుకునేందుకు దారి తీసినట్లు సౌరభ్ ద్వివేది అనే పాత్రికేయుడు వెల్లడించారు.

బడ్జెట్‌లో వ్యవసాయానికి కేటాయింపులు పెంచాలి

- ఖర్చుకు ఒకటిన్నర రెట్ల ధర వచ్చేలా కేంద్రం చట్టం చేయాలి: రాఘవులు

ఈనాడు, హైదరాబాద్: కేంద్రంలో ఎన్డీయే సర్కారు తీసుకున్న జీఎస్టీ, పెద్దనోట్ల రద్దు వంటి నిర్ణయాలతో ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నదని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. రానున్న కేంద్ర బడ్జెట్‌లోనైనా సంస్కరణల జోలికి వెళ్లకుండా ఉంటే బాగుంటుందని, ముఖ్యంగా గిట్టుబాటు ధరల్లేక నష్టాల్లో ఉన్న రైతులకు న్యాయం చేసేలా వ్యవసాయానికి కేటాయింపులు పెంచాలని సూచించారు. సేద్యంలో పెట్టుబడి వ్యయానికి ఒకటిన్నర రెట్ల ధర వచ్చేలా చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. సీపీఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశాలు రెండోరోజు శనివారం హైదరాబాద్‌లో జరిగాయి. రాష్ట్రంలో తెరాస ప్రభుత్వం ప్రజాప్రయోజనాలను విస్మరిస్తూ ఏకపక్షంగా వ్యవహరిస్తోందని సీపీఎం రాష్ట్ర కమిటీ విమర్శించింది. పెట్టుబడి సాయం కౌలుదారులకూ అందించాలని కోరింది. అనంతరం రాఘవులు మాట్లాడుతూ.. రాష్ట్రాభివృద్ధిలో కీలకమైన మౌలికరంగాన్ని తెరాస ప్రభుత్వం విస్మరిస్తోందన్నారు. జహీరాబాద్, జడ్చర్ల, భువనగిరి, దామరచర్ల డ్రైపోర్టుల ప్రతిపాదనలను కేంద్రం అడిగిన తర్వాతగానీ రాష్ట్రం పంపలేదన్నారు. అప్పుడే బంగారు తెలంగాణ వచ్చినట్లుగా గవర్నర్ ప్రసంగం ఉందని, డ్రైపోర్టుల వంటి వాటిని ప్రభుత్వం విస్మరిస్తుంటే బంగారు తెలంగాణ ఎలా వస్తుందో గవర్నర్ చెప్పాలన్నారు.



రాష్ట్ర మహాసభల గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న బీవీ రాఘవులు, తమ్మినేని వీరభద్రం తదితరులు

ప్రత్యక్ష పద్ధతిలోనే ఎన్నికలు: తమ్మినేని

పార్టీ రాష్ట్రకార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ. . రాష్ట్ర ప్రభుత్వం పాలనలో అనేక తప్పటడుగులు వేస్తోందని విమర్శించారు. పంచాయతీలకు ప్రత్యక్ష పద్ధతిలోనే ఎన్నికలు జరపాలని డిమాండ్ చేశారు.

4 నుంచి నల్గొండలో సీపీఎం రాష్ట్ర మహాసభలు

సీపీఎం తెలంగాణ రాష్ట్ర రెండో మహాసభలకు నల్గొండ వేదిక కానుంది. ఫిబ్రవరి 4 నుంచి 7 వరకు నాలుగురోజులపాటు జరిగే సభలకు రావాల్సిందిగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, మాజీ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్‌కరాట్‌లను ఆహ్వానించింది. తమ్మినేని వీరభద్రం ప్రస్తుతం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా వ్యవహరిస్తుండగా. . మరోసారీ ఆయనకే అవకాశం దక్కనున్నట్లు తెలుస్తోంది. 2019లో సార్వత్రిక ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఈ మహాసభలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. పార్టీ ఎత్తుగడలు, రాజకీయ విధానంపై చర్చకు వచ్చే వీలుంది.

కందుల కొను 'గోల్‌మాల్'పై విచారణ

'ఈనాడు' కథనాలకు మంత్రి హరీశ్‌రావు స్పందన

ఈనాడు, హైదరాబాద్: కందులు, మినుములను బోగస్ రైతుల పేర్లతో తెచ్చి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరలకు అమ్మి సొమ్ముచేసుకుంటున్న వ్యాపారులపై ఇటీవల 'ఈనాడు'లో వచ్చిన కథనాలకు మార్కెటింగ్ శాఖ మంత్రి హరీశ్‌రావు స్పందించి సమగ్ర విచారణకు ఆదేశించారు. జనగామ మార్కెట్‌కు అక్రమంగా తెచ్చి అమ్మిన 88 బస్తాల కందులను అధికారులతో వేలం వేయించగా రూ.2.09 లక్షలు వచ్చాయి. వీటిని మార్కెట్ కమిటీ ఖాతాలో జమచేశారు. వికారాబాద్ జిల్లా తాండూరులో రైతులనుంచి కందులను కొనుగోలు చేసి వాటిని జనగామ మార్కెట్‌లోని ప్రభుత్వ కొనుగోలు కేంద్రానికి తెచ్చి విక్రయించినట్లు 'ఈనాడు' వెలుగులోకి తీసుకురాగా అధికారుల విచారణలో అది నిజమేనని తేలింది. ఇలాగే ఆదిలాబాద్ పాత జిల్లా పరిధిలో మినుములను అక్రమంగా తెచ్చి అమ్ముతున్నట్లు 'ఈనాడు'లో వచ్చిన కథనంపై సమగ్ర విచారణ జరపాలని, తక్షణం తనిఖీలు చేయాలని అక్కడి కలెక్టర్లను ఆదేశించారు. వీటి కోసం ప్రత్యేకంగా తనిఖీ బృందాలను ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. రైతుల పేరుతో అక్రమ అమ్మకాలకు పాల్పడే వారిపై క్రిమినల్ కేసులు పెట్టి వారి పంటలను స్వాధీనం చేసుకోవాలని జిల్లాల కలెక్టర్లను ఆదేశించినట్లు ఆయన 'ఈనాడు'కు తెలిపారు. రైతుల నుంచి మాత్రమే పంటలను మద్దతు ధరలకు కొనాలని వ్యాపారులకు ఎవరైనా సహకరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఒక్క లారీ ఉన్నవారికి కార్మిక లైసెన్సు అవసరం లేదు

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఒక్క లారీ ఉన్న యజమాని కార్మిక(లేబర్) లైసెన్సు తీసుకోవాల్సిన అవసరం లేదని తెలంగాణ లారీ యజమానుల సంఘం ప్రకటించింది. కార్మికశాఖ కార్యాలయానికి వెళ్లి తన లారీ ఆర్.సి, పర్మిట్ లైసెన్సు చూపించి యజమాని కమ్ డ్రైవర్‌గా నమోదు చేయించుకోవడంతోపాటు లారీ టాక్స్ చెల్లించి రశీదు పొందాలని సూచించింది. ఒకటి కంటే ఎక్కువ లారీలు ఉన్న యజమానులు హైకోర్టు ఆదేశాల ప్రకారం కార్మిక లైసెన్సులు తప్పకుండా తీసుకోవాలన్నారు.

బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ విచారణ వాయిదా

ఈనాడు, హైదరాబాద్: బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ ఈ నెల 31 నుంచి మూడు రోజుల పాటు జరపాల్సిన విచారణను వాయిదా వేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలు ఇంజనీరింగ్, వ్యవసాయ రంగాలపై దాఖలు చేసిన వాదనలు, ఈ అంశాలకు సంబంధించిన సాక్షుల విచారణ (క్రాస్ ఎగ్జామినేషన్) జరుగుతుంది. ఈ నెల 31న ఆంధ్రప్రదేశ్ తరపున సాక్షిగా ఉన్న విశ్రాంత చీఫ్ ఇంజినీర్ సుబ్బారావును తెలంగాణ తరపు న్యాయవాది విచారణ (క్రాస్ ఎగ్జామినేషన్) చేయాల్సి ఉంది. దీనికి కొనసాగింపుగా ఫిబ్రవరి ఒకటి, రెండో తేదీల్లోనూ ఇతర అంశాలపై ట్రైబ్యునల్‌లో విచారణ జరగాల్సి ఉంది. వ్యక్తిగత కారణాల వల్ల ఈ నెల 31న హాజరుకాలేకపోతున్నానని, మరో రోజుకు దీనిని వాయిదా వేయాలని సుబ్బారావు కోరారు. దీనిని పరిగణనలోకి తీసుకొన్న ట్రైబ్యునల్ ఫిబ్రవరి 21, 22వ తేదీలకు తదుపరి విచారణను వాయిదా వేసింది.

గొర్రెల వైద్యానికి ప్రాధాన్యం: మంత్రి తలసాని

ఈనాడు, హైదరాబాద్: గొర్రెలను రోగాల నుంచి కాపాడేందుకు శ్రద్ధ చూపాలని పశువైద్యాధికారులను మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ ఆదేశించారు. శనివారం సచివాలయంలో ఆ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష జరిపారు. ఇప్పటికే రాయితీపై 40 లక్షల గొర్రెలను పంపిణీ చేశామన్నారు. వీటిని కాపాడేందుకు 100 సంచార పశువైద్యశాలలను, 1962 నెంబర్‌తో కాల్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ నెంబరుకు పెద్దఎత్తున ఫోన్‌కాల్స్ వస్తున్నాయని, ప్రధాన పశువైద్యశాలలకు ఫోన్‌లను అనుసంధానం చేసి తక్షణ వైద్యసేవలు అందించేలా చూడాలని ఆదేశించారు. వచ్చే వేసవిలో గ్రాసం కొరత రాకుండా ఖాళీగా ఉన్న భూముల్లో పెంచేందుకు ఇప్పటినుంచే చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి గొర్రెకు బీమా తప్పనిసరిగా ఉండాలన్నారు. గోపాలమిత్రలకు కనీస భృతి ఇచ్చేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. గొర్రెలకు పందిరి నిర్మించుకునేందుకు ఎవరైనా ముందుకొస్తే రూ.లక్ష సాయం చేస్తామని, 10 శాతం వాటాగా లబ్ధిదారుడు భరించాలన్నారు. చెరువులు, కుంటల్లో 50 కోట్ల చేపపిల్లలు, మరో 11 రిజర్వాయర్లలో 1.89 లక్షల రొయ్య పిల్లలు వదిలామన్నారు. మరో వెయ్యి విజయ డెయిరీ పాల ఉత్పత్తుల కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఉత్తమ సేవలకు పురస్కారం



విద్యుత్ ప్రమాదాల నివారణకు పరికరాల ఏర్పాటు, ఈ రంగంలో పెట్టుబడులకు సంబంధించిన దరఖాస్తులను వేగంగా పరిష్కరించడంలో ఉత్తమ సేవలు అందించినందుకుగాను రాష్ట్ర విద్యుత్ ప్రధాన ఇన్‌స్పెక్టర్ ఎ.జి.రమణ ప్రసాద్‌కు ఉత్తమ పురస్కారాన్ని గణతంత్ర దినోత్సవం సందర్భంగా అందజేస్తున్న గవర్నర్ నరసింహన్

సామాజిక మాధ్యమంపై ఆంక్షలా?: శ్రవణ్

హైదరాబాద్, న్యూస్‌టుడే: సామాజిక మాధ్యమంపై ఆంక్షలు విధిస్తూ చట్టంలో మార్పులు చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని టీపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్ తెలిపారు. ప్రభుత్వ దాష్టీకాల్ని సామాజిక మాధ్యమాల ద్వారా ఎండగడతామనీ, ఎంతమందిని జైల్లో పెట్టినా పోరాడటానికి సిద్ధంగా ఉన్నట్లు స్పష్టంచేశారు. శనివారం టీపీసీసీ అధికార ప్రతినిధి ఇందిరా శోభన్‌తో కలిసి శ్రవణ్ గాంధీభవన్‌లో మాట్లాడారు.

మేడారం జాతరకు 16 ప్రత్యేక రైళ్లు

ఈనాడు, హైదరాబాద్: మేడారంలో సమ్మక్క, సారలమ్మ జాతరకు వెళ్లే భక్తులను దృష్టిలో పెట్టుకుని 16 ప్రత్యేకరైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. సికింద్రాబాద్-వరంగల్-హైదరాబాద్ మధ్య ఎనిమిది ప్రత్యేకరైళ్లు, కాజీపేట-సిర్పూర్‌కాగజ్‌నగర్-కాజీపేట మధ్య రెండు, సిర్పూర్‌కాగజ్‌నగర్-ఖమ్మం-సిర్పూర్ కాగజ్‌నగర్ మధ్య ఆరు రైళ్లు రాకపోకలు సాగిస్తాయని పేర్కొంది. జనవరి 31 నుంచి ఫిబ్రవరి 4 వరకు ఈ రైళ్లు అందుబాటులో ఉంటాయి. ఈ ప్రత్యేకరైళ్లలో అన్ని సాధారణ సెకండ్ సిట్టింగ్ బోగీలే అని సీపీఆర్వో ఎం.ఉమాశంకర్‌కుమార్ తెలిపారు.

సీపీఎస్‌కు వ్యతిరేకంగా 11న వరంగల్‌లో మహాధర్నా

సోమాజిగూడ, న్యూస్‌టుడే: ఉద్యోగులకు పదవీ విరమణ తర్వాత ప్రభుత్వం ఇచ్చే పింఛను భిక్ష కాదని.. అది ప్రభుత్వ బాధ్యత అని రాష్ట్రోపాధ్యాయ సంఘం తెలంగాణ అధ్యక్షులు బి.భుజంగరావు పేర్కొన్నారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చినా ప్రభుత్వాలు తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నాయన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 11న వరంగల్ లష్కర్ బజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయి మహాధర్నా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. సంబంధించిన గోడపత్రికను శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమిళనాడు ఇప్పటికే సీపీఎస్ రద్దుకు సిద్ధమైందని, రాష్ట్రంలోనూ రద్దుచేయాలని కోరారు. అనంతరం సంఘం ప్రధానకార్యదర్శి సదానందంగౌడ్‌తదితరులు మాట్లాడారు.



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న నాయకులు

అదే సరైన నిర్ణయం

"ఈ సిరీస్‌లో భారత్‌కు పెద్ద సానుకూలాంశం బౌలర్ల ప్రదర్శనే. గతంలో విదేశాల్లో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఎప్పుడూ మన బౌలర్లు 60 వికెట్లు తీయలేదు. కానీ కొన్ని తప్పులు మేం దిద్దుకోవాలి. లోయర్ ఆర్డర్ చక్కగా రాణించింది. ఈ విజయంతో ఎంతో గొప్పగా అనిపిస్తోంది. ఇలాంటి పిచ్‌పై ఆడాలంటే ఎంతో తెగువ కావాలి. మా బ్యాట్స్‌మెన్ అదే ప్రదర్శించారు. సిరీస్ కోల్పోయినా.. అద్భుతంగా ఆడిన భారత బ్యాట్స్‌మెన్‌కు నా హ్యాట్సాఫ్. ఇలాంటి పిచ్‌పై ఆడడమే పెద్ద సవాల్. నాలుగు రోజుల నుంచి మా ఆటగాళ్లు ఎంతో గొప్పగా ఆడారు. మొదట బ్యాటింగ్ చేయడం చాలా మంది తప్పన్నారు. కానీ మాకు తెలుసు అదే సరైన నిర్ణయమని. తొలి రెండు టెస్టుల్లో కొద్దిలో అవకాశాన్ని పోగొట్టుకున్నాం. సన్నాహకం బాగుంటే విదేశాల్లోనూ గెలవగలం"

– కోహ్లి

ఛాంపియన్స్


షమి (5/28)

1 మూడు లేదా అంతకంటే ఎక్కువ మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో ప్రతి టెస్టులోనూ మొత్తం 40 వికెట్లూ పడిపోవడం ఇదే తొలిసారి

2 వాండరర్స్‌లో అజేయ రికార్డును భారత్ నిలబెట్టుకుంది. ఇక్కడ ఆడిన ఐదు టెస్టుల్లో భారత్ రెండు విజయాలు సాధించింది. మూడు మ్యాచ్‌లను డ్రా చేసుకుంది

3 విదేశాల్లో మూడు లేదా అంతకన్నా ఎక్కువ టెస్టుల సిరీస్‌లో ప్రతి మ్యాచ్‌లో అన్ని వికెట్లూ పడగొట్టడం భారత్‌కు ఇది మూడోసారి మాత్రమే

21 విరాట్ కోహ్లి నేతృత్వంలో భారత్ గెలిచిన టెస్టు మ్యాచ్‌ల సంఖ్య

ఎంత ఒత్తిడి?

రెండు వరుస ఓటములతో విమర్శలు వెల్లువ! సిరీసూ పోయింది. ఆటగాళ్లలో అస్థిరత్వం! జోరు మీద ఆతిథ్య జట్టు.

ఎంత కఠినం!

ఒత్తిడిని తీవ్రం చేస్తూ, జొహానెస్‌బర్గ్‌లో జీవం ఉట్టిపడుతున్న పచ్చని పిచ్ స్వాగతం పలికింది. దక్షిణాఫ్రికా పేసర్లు నిప్పులు చెరుగుతుంటే.. మీదికి దూసుకొచ్చిన బంతులు బెంబేలెత్తించాయి. బ్యాట్స్‌మెన్‌కు అగ్ని పరీక్షే పెట్టాయి.

ఎంత కష్టం!

ఎంతో దృఢ సంకల్పంతో బ్యాటింగ్ చేసినా తొలి ఇన్నింగ్స్‌లో చేసింది 187 పరుగులే. అన్ని దారులూ వైట్‌వాష్‌కే!

కానీ టీమ్‌ఇండియా అద్భుతమే చేసింది. అన్ని అడ్డంకులనూ, అన్ని ఒత్తిళ్లనూ.. పరీక్షలనూ అధిగమించింది. అన్ని విమర్శలనూ తిప్పి కొడుతూ, అన్ని అంచనాలనూ తోసిరాజంటూ అద్వితీయ పోరాటంతో చిరస్మరణీయ విజయం సాధించింది. ఆతిథ్య జట్టును పిచ్ కాస్త కరుణించినా.. షమి నేతృత్వంలోని పేస్ దళం కసితో చెలరేగిన వేళ జొహానెస్‌బర్గ్‌లో ఓటమెరుగని రికార్డును టీమ్‌ఇండియా నిలబెట్టుకుంది. వైట్‌వాష్‌నూ తప్పించుకుంది.

నిజంగా, నిస్సందేహంగా ఇది గొప్ప విజయమే. ఆటగాళ్లకు గొప్ప జ్ఞాపకమే! నాలుగో రోజు చేజారుతున్న దశలో.. సఫారీల చేతుల్లోంచి భారత్ మ్యాచ్‌ను లాగేసుకుంది మరి!

అనూహ్యంగా స్పందిస్తూ మూడో రోజు భారత బ్యాట్స్‌మెన్‌ను భయంకరంగా పరీక్షించిన పిచ్ కాస్త కుదురుకుంది. అస్థిరమైన బౌన్స్ కాస్త కుదుట పడింది. దక్షిణాఫ్రికా 124/1. కానీ ఆశలు కోల్పోకుండా.. సహనంతో, పట్టుదలతో బౌలింగ్ చేసిన భారత పేసర్లు మ్యాచ్‌ను అనూహ్యంగా మలుపు తిప్పేశారు.

ఒక్క ఆమ్లా ఔట్‌తో మ్యాచ్ కథే మారిపోయింది. ఒత్తిడిని కొనసాగించిన భారత్ చూస్తుండగానే మ్యాచ్‌ను తన వైపు తిప్పుకుంది. భారత పేస్‌ను తాళలేకపోయిన దక్షిణాఫ్రికా, 63 పరుగుల దూరంలో ఆగిపోయింది. ఐదు వికెట్లతో షమి హీరోగా అవతరించినా.. అతి ముఖ్యమైన వికెట్లు పడగొట్టిన మిగతా పేసర్ల ప్రదర్శనా అంతే కీలకం.

సిరీస్ 1-2తో పోతేనేం.. కథ సుఖాంతం! విజయమిచ్చిన సంతృప్తితో.. పోరాటమిచ్చిన ఆత్మవిశ్వాసంతో, తామూ పచ్చని పిచ్‌లపై ఆడగలమన్న ధీమాతో ముగించింది భారత్. బౌలర్లు ఆరు ఇన్నింగ్స్‌ల్లోనూ ఆతిథ్య జట్టును ఆలౌట్ చేయడం, బ్యాట్స్‌మెన్ అత్యంత కఠినమైన పిచ్‌పై అత్యంత భీకర పేసర్లను ఎదుర్కొని నిలవడం శుభ పరిణామాలే కదా!





విజయాన్ని గుంజుకున్నారు..

జొహానెస్‌బర్గ్‌లో భారత్ చిరస్మరణీయ విజయం ● 124/1 నుంచి 177కు దక్షిణాఫ్రికా

నిప్పులు చెరిగిన షమి ● రాణించిన బుమ్రా, ఇషాంత్

జొహానెస్‌బర్గ్

అద్భుతంగా పోరాడిన టీమ్‌ఇండియా అపురూప విజయంతో టెస్టు సిరీస్‌ను ముగించింది. శనివారం, నాలుగో రోజు నాటకీయంగా ముగిసిన మూడో టెస్టులో భారత్ 63 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాపై సంచలన విజయం సాధించింది. 241 పరుగుల లక్ష్యఛేదనలో ఓవర్‌నైట్ స్కోరు 17/1తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన దక్షిణాఫ్రికా.. 124/1తో ఓ దశలో విజయం ఖాయం చేసుకున్నట్లే కనిపించింది. మహ్మద్ షమి (5/28), బుమ్రా (2/57), ఇషాంత్ (2/31) పదునైన పేస్ విజృంభించడంతో 177 పరుగులకే ఆలౌటైంది. ఎల్గర్ (86 నాటౌట్; 240 బంతుల్లో 9×4, 1×6) ఒంటరి పోరాటం చేశాడు. హషీమ్ ఆమ్లా (52; 140 బంతుల్లో 5×4) రాణించాడు. బంతితో విలువైన వికెట్లు తీయడమే కాదు.. బ్యాటుతో అమూల్యమైన పరుగులు కూడా చేసిన భువనేశ్వర్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. ఫిలాండర్ 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' అవార్డును అందుకున్నాడు.

అక్కడే మలుపు: మొన్న మ్యాచ్ ఆఖరికి పిచ్ చూస్తే.. విజయానికి దక్షిణాఫ్రికా అద్భుతమే చేయాలనిపించింది. కానీ నిన్న ఓ దశలో ఆ అద్భుతం చేయాల్సిన స్థితిలో టీమ్‌ఇండియా నిలిచింది. ఎల్గర్, ఆమ్లాల పట్టుదల ఫలితమది. భారత బౌలర్లు ఎంత శ్రమించినా ఉదయం సెషన్లో మరో వికెట్ దక్కలేదు. లంచ్‌కు స్కోరు 69/1. కఠినమైన బంతులు ఎదుర్కొన్నా.. ఎల్గర్, ఆమ్లాలు స్టంపుల్లా అలా పాతుకుపోయారే తప్ప భాగస్వామ్యాన్ని విడిపోనివ్వలేదు. టీ కూడా సమీపిస్తోంది. క్రీజులో వాళ్లిద్దరే. దక్షిణాఫ్రికా గెలుపు బాటలో పయనిస్తోంది. స్కోరు 124. చేతిలో 9 వికెట్లు. కావాల్సినంత సమయం! ఇక భారత్‌కు కష్టమే అనిపించింది. కానీ ఆశలు అడుగంటుతున్న వేళ భారత పేస్ బృందం అనూహ్యంగా విజృంభించింది. 53 పరుగుల తేడాలో దక్షిణాఫ్రికా చివరి తొమ్మిది వికెట్లు పడగొట్టి జట్టుకు విజయాన్నందించింది.

53వ ఓవర్లో మలుపు తిరిగింది మ్యాచ్. ఇషాంత్ బంతిని ఫ్లిక్ చేయబోయిన ఆమ్లా.. పాండ్య అందుకున్న చక్కని క్యాచ్‌కు నిష్క్రమించాడు. దీంతో 119 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. అంతే.. భారత బౌలర్లు ఒత్తిడి కొనసాగించడంతో దక్షిణాఫ్రికా పతనాన్ని ఆపడం ఎవరి తరమూ కాలేదు. మూడు ఓవర్ల తర్వాత డివిలియర్స్ (6)ను ఔట్ చేసి భారత్‌లో బుమ్రా ఆశలు రేపాడు. ఏబీ గల్లీలో రహానెకు చిక్కాడు. టీ తర్వాత సెషన్లో పిచ్ బౌలర్లకు మరింత సహకరించడం మొదలు పెట్టింది. ఇషాంత్ ఇన్‌స్వింగర్‌కు డుప్లెసిస్ (2) బౌల్డ్ కాగా.. బుమ్రాకు డికాక్ (0) వికెట్ల ముందు అడ్డంగా దొరికిపోయాడు. అక్కడి నుంచి షమి జోరు మొదలైంది. ఒకే ఓవర్లో అతడు ఫిలాండర్, ఫెలుక్వాయోలను ఔట్ చేశాడు. ఎదురుదాడికి దిగబోయిన ఫిలాండర్ (10) షమి బంతిని వికెట్ల మీదికి ఆడుకోగా.. ఫెలుక్వాయో కూడా అదే దృశ్యాన్ని పునరావృతం చేశాడు. అప్పటికి స్కోరు 157. ఆ తర్వాత భారత్ విజయం లాంఛనమే అయింది. మిగతా లోయర్ ఆర్డర్ పని పట్టడానికి షమికి ఎంతో సమయం పట్టలేదు. చేతి వేలికి గాయం కావడంతో టీ తర్వాత పార్థివ్ పటేల్ మైదానంలో అడుగుపెట్టలేదు. అతడి స్థానంలో సబ్‌స్టిట్యూట్ దినేశ్ కార్తీక్ వికెట్ కీపింగ్ చేశాడు.

వాళ్లిద్దరు నిలిచారు..: రాత్రి కురిసిన వర్షం కారణంగా నాలుగో రోజు ఆట అరగంట ఆలస్యమైంది. మూడో రోజు ప్రమాదకర రీతిలో బౌన్స్‌కు సహకరించిన పిచ్‌పై నాలుగో రోజు ఉదయం భారత బౌలర్లు చెలరేగిపోతారని అంతా భావించారు. కానీ ఆశ్చర్యకరంగా పిచ్ నుంచి వారికి ఊహించినంత సహకారం లభించలేదు. అస్థిర బౌన్స్ కాస్త తగ్గడంతో బ్యాట్స్‌మెన్ పని కాస్త తేలికైంది. ఐతే వికెట్లు తీయకపోయినా భారత పేసర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. ఆమ్లా, ఎల్గర్ కూడా పట్టుదలగా బ్యాటింగ్ చేశారు. శరీరానికి అప్పుడప్పుడు బంతులు తగిలినా ఎల్గర్ దృఢ సంకల్పంతో బ్యాటింగ్ చేశాడు. బంతులను చక్కగా వదిలేశాడు. దూరంగా వెళ్తున్న బంతులను వెంటాడలేదు. మరోవైపు ఆమ్లా కూడా కొన్ని సార్లు బంతిని తాకలేకపోయినా.. చాలా వరకు నియంత్రణతో ఆడాడు. ఎల్గర్‌తో కలిసి జాగ్రత్తగా, నెమ్మదిగా జట్టును లక్ష్యం దిశగా తీసుకెళ్లాడు. ఎల్గర్ 153 బంతుల్లో, ఆమ్లా 134 బంతుల్లో అర్ధశతకాలు పూర్తి చేశారు. వికెట్లు రాకపోయినా, అత్యంత పొదుపుగా బౌలింగ్ చేయడం తర్వాత భారత బౌలర్లకు ఉపయోగపడింది.


'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' భువనేశ్వర్

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: 187

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 194

భారత్ రెండో ఇన్నింగ్స్: 247

దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: మార్‌క్రమ్ (సి) పార్థివ్ (బి) షమి 4; ఎల్గర్ నాటౌట్ 86; ఆమ్లా (సి) పాండ్య (బి) ఇషాంత్ 52; డివిలియర్స్ (సి) రహానె (బి) బుమ్రా 6; డుప్లెసిస్ (బి) ఇషాంత్ 2; డికాక్ ఎల్బీ (బి) బుమ్రా 0; ఫిలాండర్ (బి) షమి 10; ఫెలుక్వాయో (బి) షమి 0; రబాడ (సి) పుజారా (బి) భువనేశ్వర్ 0; మోర్కెల్ (బి) షమి 0; ఎంగిడి (సి) కార్తీక్ (బి) షమి 4; ఎక్స్‌ట్రాలు 13 **మొత్తం:** (77.3 ఓవర్లలో ఆలౌట్) 177

వికెట్ల పతనం: 1-5, 2-124, 3-131, 4-144, 5-145, 6-157, 7-157, 8-160, 9-161

బౌలింగ్: భువనేశ్వర్ 18-4-39-1; షమి 12.3-2-28-5; బుమ్రా 21-3-57-2; ఇషాంత్ శర్మ 16-3-31-2; హార్దిక్ పాండ్య 6-1-15-0

వాళ్ల పిచ్‌లో వాళ్లనే...!

వాండరర్స్ మూడో టెస్టులో భారత్ చేతిలో దక్షిణాఫ్రికా ఓటమిని చూస్తే ఎవరి తీసుకున్న గోతిలో వాళ్లే పడతారనే మాట మరోసారి రుజువైంది. భారత పర్యటనకు వచ్చినప్పుడు ఇక్కడ పూర్తిగా స్పిన్ పిచ్‌లు తయారు చేసి తమను ఓడించారనే భావనతో దక్షిణాఫ్రికా వాళ్లు ఫాస్ట్, బౌన్సీ పిచ్‌లు తయారు చేశారు. అందుకే మూడు టెస్టుల్లో పిచ్‌లు పచ్చికతో కళకళలాడాయి. అయితే భారత పేస్ అటాక్ మీద వారికి అంతగా అవగాహన ఉన్నట్లు కనిపించలేదు. అంతర్జాతీయ స్థాయి పేస్ బౌలింగ్ దళం టీమ్‌ఇండియాకు ఉంది. భువనేశ్వర్, షమి, బుమ్రాలు ప్రస్తుత ప్రపంచ క్రికెట్లో ఉన్న ఏ పేసర్లకు తక్కువ కాదు. ఆఖరి టెస్టులో స్పిన్నర్‌ను తుది జట్టులోకి తీసుకోకుండా ఐదుగురు పేసర్లను బరిలో దించడం భారత ఆత్మవిశ్వాసానికి సూచిక. విదేశాల్లో తుది జట్టులో ఒక్క స్పిన్నర్ కూడా లేకుండా బరిలో దిగడాన్ని ఊహించలేం. ఫాస్ట్ బౌలింగ్‌లో టీమ్‌ఇండియా ఈ స్థాయికి ఎదిగిందంటే ఆనాడు కపిల్‌దేవ్ చేసిన కృషే కారణం. ఈ పర్యటనలో పేసర్లే రెండుసార్లు భారత్‌కు గెలిచే అవకాశాలను సృష్టించారు. మూడో టెస్టులో ప్రత్యర్థిని రెండుసార్లు 200లోపు స్కోరుకే ఆలౌట్ చేశారంటేనే భారత బౌలర్ల సత్తా తెలుస్తుంది. ముఖ్యంగా భువనేశ్వర్ అటు బంతితోనే కాదు బ్యాట్‌తోనూ మెరిశాడు. ఆఖరి టెస్టులో తొలి ఇన్నింగ్స్‌లో 30, రెండో ఇన్నింగ్స్‌లో 33 పరుగులు చేసి భారత్ పోరాడే స్కోరు చేయడం కీలక పాత్ర పోషించాడు. దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు తీసి జట్టును గెలిపించిన షమి కూడా రెండో ఇన్నింగ్స్‌లో వేగంగా 27 పరుగులు చేశాడు. అయితే పేసర్లు ఎంతగా రాణించినా తొలి రెండు టెస్టుల్లో బ్యాట్స్‌మెన్ ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోవడంతో సిరీస్ కోల్పోవాల్సి వచ్చింది. అయితే జొహానెస్‌బర్గ్ మూడో టెస్టులో బ్యాట్స్‌మెన్ వీరోచితంగా పోరాడారు. అనూహ్యమైన బౌన్స్, పేస్ ఉన్న పిచ్‌పై దెబ్బలను కాచుకుంటూనే నిలబడి ఆడారు. ముఖ్యంగా జొహానెస్‌బర్గ్ టెస్టు భారత ఆటగాళ్లకు సిసలైన పరీక్షలా నిలిచింది.

> తొలి రెండు టెస్టుల్లాగా చెత్త షాట్లకు పోలేదు. బంతి ఇష్టం వచ్చినట్లు దూసుకొస్తున్నా చాలా సహనాన్ని ప్రదర్శించారు. ఇదే ఓర్పు, పోరాటం తొలి రెండు టెస్టుల్లో చూపించి ఉంటే ఫలితం వేరేలా ఉండేది.

మనవాళ్లు సవాల్‌గా తీసుకుని ఈ పరీక్షలో నెగ్గారు. రెండో ఇన్నింగ్స్ ఆరంభంలో కోహ్లి, మధ్యలో రహానె, భువనేశ్వర్, చివర్లో షమి మెరుపుల వల్ల భారత్.. ప్రత్యర్థికి సవాల్ విసిరే లక్ష్యాన్ని ముందుంచగలిగింది. ముఖ్యంగా రహానె విలువైన ఇన్నింగ్స్ ఆడాడు. తనను తుది జట్టులోకి తీసుకోవడాన్ని ప్రశ్నిస్తున్న వారికి అతను అద్భుతమైన ఇన్నింగ్స్‌తో సమాధానం చెప్పాడు. మూడోరోజు ఆఖర్లో బంతి అనూహ్యంగా లేచి దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మెన్‌ను ఇబ్బంది పెట్టింది. ఎల్గర్ హెల్మెట్‌కు బంతి బలంగా తాకడంతో అంపైర్లు ముందుగానే మ్యాచ్ ముగించారు. అయితే రాత్రి వర్షం కురియడంతో నాలుగోరోజు పిచ్‌లో మార్పొచ్చింది. మందకొడిగా మారింది. మూడోరోజు ఉన్నంత అనూహ్యమైన బౌన్స్ లేదు. దీంతో సఫారీ బ్యాట్స్‌మెన్ ఇబ్బంది పడకుండా ఆడారు. కానీ పిచ్‌పై తేమ ఆరిన తర్వాత మళ్లీ బౌన్స్ మొదలైంది. ఆమ్లా వెనుదిరిగాక.. దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ ఒక్కసారిగా పతనమైంది. జొహానెస్‌బర్గ్ పిచ్ అంతర్జాతీయ మ్యాచ్‌లకు అనుకూలంగా లేదని సౌరభ్ గంగూలీ లాంటి వాళ్లు మ్యాచ్ తొలిరోజే చెప్పారు. కెప్టెన్ విరాట్ కోహ్లి ఈ పిచ్ స్వభావాన్ని మ్యాచ్ ఆరంభానికి ముందే గ్రహించాడు. అందుకే బ్యాటింగ్ ఎంచుకున్నాడు. నాలుగో ఇన్నింగ్స్‌లో ఆడడం చాలా కష్టమని అతనికి తెలుసు. చివరికి విరాట్ ఊహే నిజమైంది. ఇలాంటి పిచ్‌లపై మ్యాచ్‌లు జరగడం వల్ల ఆటలో ఉండే మజా దెబ్బ తింటుంది. తయారు చేసే పిచ్ రెండు జట్లకు అవకాశాన్ని ఇచ్చే విధంగా ఉండాలి. ఈ మ్యాచ్‌ను చూసైనా పిచ్‌ల తయారీ గురించి అన్ని దేశాల బోర్డులు ఆలోచించాలి. పిచ్ తయారీపై ఐసీసీ ఒక ప్రమాణాన్ని రూపొందించాలి. ప్రతి జట్టు స్వదేశంలో తమకు అనుకూలంగా పిచ్‌లను తయారు చేయడం కాకుండా.. ఆట భవిష్యత్‌ను, అభిమానులకు వినోదాన్ని దృష్టిలో ఉంచుకుని తయారు చేయాలి.

– థర్డ్ అంపైర్



ఫైనల్లో సైనా

ఇండోనేషియా ఓపెన్

జకార్తా: సూపర్ ఫామ్‌లో ఉన్న సైనా నెహ్వాల్ ఇండోనేషియా ఓపెన్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. శనివారం హోరాహోరీగా జరిగిన మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో సైనా 21-19, 21-19తో ప్రపంచ నంబర్-4 రచనోక్ (థాయ్‌లాండ్)పై విజయం సాధించింది. మ్యాచ్‌లో వెనుకబడ్డా సైనా పుంజుకున్న తీరు అద్భుతం. సైనా ఓ ఇంటర్నేషనల్ టోర్నీ ఫైనల్ చేరడం ఏడాది తర్వాత ఇదే తొలిసారి. ఫైనల్లో ఆమె ప్రపంచ నంబర్‌వన్ తై జు యింగ్‌తో తలపడుతుంది.

సెమీఫైనల్ ఆరంభంలో రచనోక్‌దే ఆధిపత్యం. ముందు 3-1తో ఆధిక్యంలోకి వెళ్లింది. సైనా పుంజుకుని 5-5తో స్కోరు సమం చేసింది. కానీ ఆమె తప్పులతో రచనోక్ మళ్లీ 8-5 ఆధిక్యం సంపాదించింది. నువ్వా నేనా అన్నట్లు సాగిన పోరులో ఆధిక్యాన్ని కొనసాగించిన రచనోక్ ఓ దశలో 16-15తో నిలిచింది. 18 పాయింట్ల వద్ద స్కోరు సమమైంది. ఓ క్రాస్ కోర్ట్ రిటర్న్ దూరంగా వెళ్లడంతో సైనా 18-19తో నిలిచింది. కానీ ఆ తర్వాత రచనోక్ తప్పులతో గేమ్ సైనా సొంతమైంది. రెండో గేమ్‌ను సైనా ఘనంగా ఆరంభించింది. 6-1తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఆ తర్వాత 9-2తో నిలిచింది. పుంజుకున్న రచనోక్ వరుసగా నాలుగు పాయింట్లు సంపాదించింది. ఐతే ఆధిపత్యాన్ని కొనసాగించిన సైనా ఆధిక్యాన్ని 17-11కు పెంచుకుంది. కానీ సైనా విజయం లాంఛనమే అనుకున్న దశలో రచనోక్ పోరాటపటిమను ప్రదర్శించింది. 17-17తో స్కోరు సమం చేసింది. ఆ దశలో సైనా పుంజుకుని గేమ్‌ను గెలుచుకుంది. మరో సెమీఫైనల్లో తై జు యింగ్ (చైనీస్ తైపీ) 21-19, 21-15, 21-15తో హి బింగ్‌జియావో (చైనా)పై గెలిచింది. డబుల్స్‌లో చిరాగ్ షెట్టి, సాత్విక్‌సాయిరాజ్ జంట పోరాటం సెమీస్‌లో ముగిసింది. ఈ జోడీ 14-21, 11-21తో మార్కస్ ఫెర్నాల్డి గిడియన్- కెవిన్ సంజయ సుకముల్జో (ఇండోనేషియా) ద్వయం చేతిలో ఓడిపోయింది. పురుషుల సింగిల్స్‌లో కజుమస సకాయ్ (జపాన్), సన్ వాన్‌హో (దక్షిణ కొరియా) ఫైనల్ చేరుకున్నారు.

ముక్కోణపు టోర్నీ విజేత లంక

ఢాకా: పేసర్ షెహాన్ మదుశంక (3/26) అరంగేట్రంలోనే హ్యాట్రిక్‌తో అదరగొట్టడంతో ముక్కోణపు వన్డే సిరీస్‌లో శ్రీలంక టైటిల్ గెలిచింది. శనివారం జరిగిన ఫైనల్లో ఆ జట్టు 79 పరుగుల తేడాతో ఆతిథ్య బంగ్లాను ఓడించింది. మొదట బ్యాటింగ్ చేసిన లంక.. 50 ఓవర్లలో 221 పరుగులు చేసింది. రుబెల్ హుస్సేన్ (4/46) ప్రత్యర్థిని కట్టడి చేశాడు. ఛేదనలో మదుశంక, ధనంజయ (2/30) ధాటికి బంగ్లా.. 41.1 ఓవర్లలో 142 పరుగులకే ఆలౌటైంది. మహ్మదుల్లా (76) టాప్ స్కోరర్. 40వ ఓవర్లో చివరి రెండు బంతులకు మొర్తజా, రుబెల్ హుస్సేన్‌లను ఔట్ చేసిన మదుశంక.. 42వ ఓవర్ తొలి బంతికి మహ్మదుల్లాను పెవిలియన్ చేర్చి హ్యాట్రిక్ సాధించాడు. అరంగేట్రంలోనే హ్యాట్రిక్ సాధించిన నాలుగో బౌలర్ అతను.

ఛాంపియన్స్



ప్రీతిజింటా

స్టోక్స్ మళ్లీ కుమ్మేశాడు..!

Vivo IPL AUCTION

● ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్‌కు అత్యధిక మొత్తం ● రూ. 12.5 కోట్లకు రాజస్థాన్ సొంతం
● రాహుల్, మనీష్ పాండేలకు రూ. 11 కోట్లు ● అమ్ముడుపోని గేల్ ● తక్కువ ధరకే గంభీర్, యువీ











వెస్టిండీస్ దిగ్గజం క్రిస్ గేల్ విధ్వంసకర ఇన్నింగ్స్ గురించి తెలియనివారెవరు! అలాంటి ఆటగాడు ఒక్కడుంటే చాలనుకున్న ఐపీఎల్ ఫ్రాంఛైజీలు.. ఇప్పుడు ఆ ఒక్కడి కోసం అసలు పోటీనే పడలేదు! ఎప్పుడూ విదేశీ స్టార్ల కోసం వెంపర్లాడే జట్లన్నీ అనూహ్యంగా స్వదేశీ మెరుపుల కోసం ఎగబడ్డాయి.. దిగ్గజాల కోసం ఎంతైనా వెచ్చించే ఫ్రాంఛైజీలు ఆశ్చర్యకరంగా కుర్రాళ్ల కోసం కోట్ల రూపాయలు కుమ్మరించేశాయి..! పదేళ్ల అనుభవం పనిచేసిందో.. పేరు కాదు ఆటే ముఖ్యమన్న జ్ఞానం బోధపడిందో ఏమో.. ఐపీఎల్ జట్లన్నీ వ్యూహాత్మకంగా అడుగులు వేశాయి..!

సీనియర్లకు తక్కువ ధరతో సరిపెట్టేసి.. ఆల్‌రౌండర్లకు అత్యధిక మొత్తం పోసేసి.. స్పిన్నర్ల కోసం పోటాపోటీగా తలపడ్డ ఫ్రాంఛైజీలు దేశీ మెరుపుల కోసం ఎన్ని కోట్లైనా ఖర్చు చేసేందుకు వెనుకాడలేదు. అనూహ్యాలకు పెట్టింది పేరైన ఐపీఎల్ వేలంలో ఆశ్చర్యకర నిర్ణయాలెన్నో! ఐతే ఒక్కడి విషయంలో మాత్రం అంచనా తప్పలేదు. ఈసారీ ఐపీఎల్ వేలంలో అత్యధిక ధర బెన్ స్టోక్స్‌దే. రెండేళ్ల తర్వాత పునరాగమనం చేసిన రాజస్థాన్ రాయల్స్ రూ. 12.5 కోట్లతో అతడని సొంతం చేసుకుంది.

బెంగళూరు

ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ పంట పండింది. ఐపీఎల్ వేలంలో అత్యధిక ధర మళ్లీ అతడిదే. తప్పతాగి దాడికి పాల్పడి విచారణ ఎదుర్కొంటున్న అతడి కోసం పంజాబ్, చెన్నై జట్లు నువ్వా నేనా అన్నట్టుగా పోటీపడ్డాయి. ఎప్పుడూ తక్కువ ధరలతో ఆటగాళ్లను కొనేందుకు ఆసక్తి ప్రదర్శించే రాజస్థాన్ రాయల్స్ అతడిని భారీ మొత్తానికి దక్కించుకుంది. ఐపీఎల్ పదేళ్లు పూర్తయిన నేపథ్యంలో.. దాదాపుగా ఆటగాళ్లందరూ కొత్తగా ఈసారి వేలానికి అందుబాటులోకి వచ్చారు. రెండు రోజుల వేలంలో భాగంగా శనివారం తొలి రోజు అన్ని జట్లలో ఆటగాళ్లు అటుఇటూ మారారు. పొట్టి క్రికెట్లో విశేషంగా రాణిస్తున్న రషీద్ ఖాన్ కోసం సన్‌రైజర్స్ రూ. 9 కోట్లు ఖర్చు చేసింది. మరోవైపు బెంగళూరు, కోల్‌కతా రైట్ టు మ్యాచ్ కార్డులను అసలు ఉపయోగించనేలేదు.

దేశీ ధమాకా

వేలం తొలి రోజు మొత్తం 27 మంది ఆటగాళ్లు రూ. 5 కోట్లు అంత కంటే ఎక్కువ ధర దక్కించుకోగా.. అందులో 15 మంది భారత ఆటగాళ్లుండటం విశేషం. కేఎల్ రాహుల్ కోసం పంజాబ్ రూ. 11 కోట్లు వెచ్చించగా.. మనీష్ పాండే కోసం సన్‌రైజర్స్ హైదరాబాద్ అంతే మొత్తం ఖర్చు చేయడం విశేషం. హార్దిక్ పాండ్య అన్న కృనాల్ పాండ్య (రూ. 8.8 కోట్లు)ను భారీ మొత్తం పోసి కొనుక్కొంది ముంబయి. జాదవ్ (రూ. 7.8 కోట్లు; చెన్నై), అశ్విన్ (రూ. 7.6 కోట్లు; పంజాబ్), దినేశ్ కార్తీక్ (రూ. 7.4 కోట్లు; కోల్‌కతా)లు రూ. 7 కోట్లకు పైగా పలికారు.

కుర్ర కోటీశ్వరులు



ఇంకా టీనేజీ కూడా దాటలేదు. ఐతేనేం వారిప్పుడు కోటీశ్వరులు. ఐపీఎల్ పుణ్యమా అని వారి బ్యాంకు ఖాతాల్లో కోట్ల రూపాయలు పడిపోనున్నాయి. అండర్-19 ప్రపంచకప్‌లో నిలకడగా 140 కిలోమీటర్ల వేగంతో బౌలింగ్ చేస్తున్న కమ్లేశ్ నాగర్‌కోటిని రూ. 3.2 కోట్లు పోసి కొనుక్కొంది కోల్‌కతా. శుభ్‌మన్ గిల్‌నూ ఆ జట్టు 1.8 కోట్లకు దక్కించుకుంది. కెప్టెన్ పృథ్వీ షా రూ. 1.2 కోట్లతో దిల్లీ సొంతమయ్యాడు.



భలే మంచి చౌక బేరం



ఒకప్పుడు భారీ ధరకు అమ్ముడుపోయిన సీనియర్లు ఈసారి తక్కువ ధరకు ఫ్రాంఛైజీల సొంతమయ్యారు. రూ. 16 కోట్లతో ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక ధర పలికిన యువరాజ్ విలువ రూ. 2 కోట్లు మాత్రమే. చాలా కాలం తర్వాత యువీ తిరిగి పంజాబ్ గూటికి చేరాడు. గంభీర్‌కు పలికిన ధర రూ. 2.8 కోట్లు మాత్రమే. కోల్‌కతా వదిలేయడంతో దిల్లీ అతడిని దక్కించుకుంది. టీమ్‌ఇండియాలో చోటు కోల్పోయిన హర్భజన్‌ను (రూ. 2 కోట్లు), దక్షిణాఫ్రికా కెప్టెన్ డుప్లెసిస్ (రూ. 1.6 కోట్లు)లను చెన్నై సూపర్ కింగ్స్ సొంతం చేసుకుంది. ఐపీఎల్ స్టార్ యూసుఫ్ పఠాన్ (రూ. 1.9 కోట్లు) బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ షకిబ్ (రూ. 2 కోట్లు)లను తక్కువ మొత్తానికే దక్కించుకుంది హైదరాబాద్.

గేల్‌కు లేదు గిరాకీ..



వయసు పైబడటం, ఫిట్‌నెస్ కోల్పోవడం, సుడిగేల్ ఇన్నింగ్స్ కనుమరుగవటమే కారణమేమో.. ఫ్రాంఛైజీలు వెస్టిండీస్ దిగ్గజం క్రిస్ గేల్‌ను విస్మరించాయి! ఆదివారం కూడా అతడిపై ఫ్రాంఛైజీలు ఆసక్తి ప్రదర్శించే అవకాశాలు తక్కువే. గేల్ ఒక్కడే కాదు.. అమ్ముడవని స్టార్ క్రికెటర్ల జాబితా ఈసారి పెద్దదే. ఇషాంత్‌కు మరోసారి మొండిచేయి ఎదురైంది. మురళీ విజయ్, మలింగ, ఫాల్క్‌నర్, మిచెల్ జాన్సన్, ఆమ్లా, జో రూట్, పార్థివ్ పటేల్, గప్తిల్, హాజిల్‌వుడ్, బెయిర్‌స్టో అమ్ముడవని ఆటగాళ్ల జాబితాలో ఉన్నారు.

ఇంకా అయిపోలేదు..


తొలి రోజు స్టార్ ఆటగాళ్లు, అంతర్జాతీయ ఆటగాళ్లతో పాటు దేశవాళీ క్రికెటర్ల కోసం వేలం నిర్వహించారు. మొత్తం 578 మంది క్రికెటర్లలో 110 మందిని వేలం వేయగా.. 78 మంది అమ్ముడుపోయారు. ఇందులో 49 మంది భారత క్రికెటర్లున్నారు. 78లో 51 మంది అంతర్జాతీయ క్రికెటర్లు. మిగతా 27 మంది దేశవాళీ క్రికెటర్లు. మిగతావారికి ఆదివారం వేలం నిర్వహిస్తారు. తొలి రోజు అమ్ముడుపోని ఆటగాళ్లపై ఏవైనా ఫ్రాంఛైజీలు ఆసక్తి ప్రదర్శిస్తే వారిని రెండో రోజు తిరిగి వేలానికి తెస్తారు.

ఎవరీ ఆర్చర్



జోఫ్రా ఆర్చర్.. ఈ పేరును భారతీయుల్లో ఎక్కువ శాతం మంది ఇప్పటివరకు ఒక్కసారి కూడా వినివుండరు. ఐతే ఈ వెస్టిండీస్ యువ కెరటం ఐపీఎల్ వేలంలో రూ. 7.2 కోట్లు పలికి అందరినీ ఆశ్చర్యపరిచాడు. బార్బడోస్‌లో జన్మించిన ఈ 22 ఏళ్ల కుర్రాడు కౌంటీల్లో ఆల్‌రౌండ్ ప్రతిభతో విశేషంగా ఆకట్టుకున్నాడు. 140 కిలోమీటర్ల వేగంతో బౌలింగ్ చేయడమే కాదు.. ధాటిగా పరుగులూ సాధించగలడు. ప్రస్తుతం బిగ్‌బాష్ లీగ్‌లో అసాధారణంగా ఆడుతున్నాడు. ఇప్పటివరకు 18.1 స్ట్రైక్‌రేట్‌తో 30 వికెట్లు తీశాడు. బ్యాటింగ్‌లో అతడి స్ట్రైక్‌రేట్ 145పైనే.

నేనేనా.. గెలిచానా!




● ఫైనల్లో హాలెప్‌పై విజయం
● ఆస్ట్రేలియన్ ఓపెన్ వోజ్నియాకి సొంతం

67 వారాలు ప్రపంచ నంబర్‌వన్.. డబ్ల్యూటీఏ ఫైనల్ విజేత.. కెరీర్ మొత్తం మీద 27 డబ్ల్యూటీఏ ట్రోఫీలు.. ఇవేమీ ఇవ్వలేని ఆనందం ఒకే ఒక్క టైటిల్ ఇచ్చింది.. డెన్మార్క్ భామ కరోలినా వోజ్నియాకి చిరకాల వాంఛ తీరిపోయింది. గ్రాండ్‌స్లామ్ కొట్టకుండానే కెరీర్ ముగిస్తానేమో అనుకున్న ఆమెకు చరమాంకంలో అందని ద్రాక్ష అందింది. హాలెప్‌ను ఓడించిన ఆమె ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. అంతేకాదు నంబర్‌వన్ ర్యాంకూ సొంతం చేసుకుంది.

మెల్‌బోర్న్

కరోలినా వోజ్నియాకి.. ఒక్క గ్రాండ్‌స్లామ్ టైటిలైనా కొట్టకపోతానా అని ఆడ గజనీలా ప్రయత్నించిందామె. 11 ఏళ్లు.. 43 గ్రాండ్‌స్లామ్ టోర్నీలు.. విమర్శలు.. గాయాలు.. కన్నీళ్లు..! చివరికి ఆమె కల తీరింది. ఆస్ట్రేలియన్ ఓపెన్ రూపంలో గ్రాండ్‌స్లామ్ టైటిల్ కరోలినా ఖాతాలో చేరింది. శనివారం హోరాహోరీ సాగిన జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో రెండో సీడ్ వోజ్నియాకి 7-6 (7-2), 3-6, 6-4తో టాప్‌సీడ్ హాలెప్ (రుమేనియా)ను ఓడించింది. ఫైనల్లో గెలవడానికి వోజ్నియాకి, హాలెప్‌కు సమాన అవకాశాలు లభించాయి. కానీ కీలక సమయంలో ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న కరోలినా టైటిల్ సొంతం చేసుకుంది. తొలి సెట్లో మొదట్లోనే హాలెప్ సర్వీస్ బ్రేక్ చేసిన వోజ్నియాకి 3-0తో తిరుగులేని ఆధిక్యంలో నిలిచింది. ఒక దశలో ఆమె 5-3తో సెట్ గెలవడానికి సిద్ధమైంది. ఈ స్థితిలో వోజ్నియాకి సర్వీసు బ్రేక్ చేసిన హాలెప్.. ఆ తర్వాత తన సర్వీసు నిలబెట్టుకుని 5-5తో స్కోరు సమం చేయడమే కాక.. సెట్‌ను టైబ్రేకర్‌కు మళ్లించింది. టైబ్రేకర్‌లో సర్వీసులతో ఆకట్టుకున్న వోజ్నియాకి.. 7-6 (7-2)తో సెట్‌ను గెలుచుకుంది. రెండో సెట్ ఆరంభంలో నాలుగు బ్రేక్ పాయింట్లు కాచుకున్న హాలెప్.. ఆ తర్వాత ప్రత్యర్థి సర్వీసు బ్రేక్ చేసి 6-3తో సెట్ గెలిచి మ్యాచ్‌లో నిలిచింది. అయితే ఈ సెట్ జరుగుతుండగా హాలెప్ అస్వస్థతకు గురైంది. కోర్టులో కుంటుతూ కూలబడిపోయింది. వైద్య విరామం తర్వాత ఆమె మ్యాచ్‌ను కొనసాగించింది. మూడో సెట్ రెండో గేమ్‌లోనే ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేసిన వోజ్నియాకి 2-1తో ఆధిక్యంలో నిలిచింది. అయితే హాలెప్ పుంజుకుని వోజ్నియాకి సర్వీసు బ్రేక్ చేసి 3-3తో స్కోరు సమం చేసింది. ఆ తర్వాత ఇద్దరు సర్వీసు నిలబెట్టుకుంటూ ముందుకెళ్లడంతో ఒక దశలో వోజ్నియాకి 5-4తో నిలిచింది. మ్యాచ్‌లో ఆశలు ఉండాలంటే హాలెప్‌కు కచ్చితంగా సర్వీస్ నిలబెట్టుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. పదో గేమ్‌లో 30-40తో వెనకబడిన దశలో ఒత్తిడికి గురైన ఆమె.. బంతిని నెట్‌కు కొట్టడంతో వోజ్నియాకి ఒక్కసారిగా కోర్టులో పడిపోయి సంబరాలు చేసుకుంది. కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్ కొట్టడంతో కన్నీట పర్యంతం అయింది. 2009, 2014లో యుఎస్ ఓపెన్లో ఫైనల్ చేరినా.. ఆమెకు రిక్తహస్తమే మిగిలింది. తాజా విజయంతో గ్రాండ్‌స్లామ్ టైటిల్ కొట్టిన తొలి డెన్మార్క్ క్రీడాకారిణిగా వోజ్నియాకి చరిత్ర సృష్టించింది.

పవిచ్ జోడీకి డబుల్స్ టైటిల్: ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల డబుల్స్ టైటిల్‌ను మాట్ పవిచ్ (క్రొయేషియా)-ఒలివర్ మరాచ్ (ఆస్ట్రియా) జోడీ గెలుచుకుంది. ఫైనల్లో ఏడోసీడ్ పవిచ్-మరాచ్ 6-4, 6-4తో వరుస సెట్లలో పదకొండోసీడ్ కబాల్-ఫరా (కొలంబియా)ను ఓడించారు.



"ఈ క్షణం కోసం ఏళ్ల తరబడి ఎదురు చూశా. ఇన్నాళ్లకు నా కల నిజమైంది. మాట్లాడుతుంటే మాట తడబడుతోంది. ఉద్విగ్నంగా ఉంది. హాలెప్ చివరివరకు పోరాడింది.. కానీ ఈరోజు నాది"
– వోజ్నియాకి

వోజ్నియాకి		హాలెప్
2	ఏస్‌లు	6
6	డబుల్‌ఫాల్ట్స్	1
5/14	బ్రేక్ పాయింట్లు	5/12
25	విన్నర్లు	40
110	మొత్తం పాయింట్లు	108

టాప్ లేపారు..

ఆటగాడు	రూ. కోట్లలో
స్టోక్స్ (రాజస్థాన్)	- 12.5
మనీశ్ పాండే (హైదరాబాద్)	- 11.0
కేఎల్ రాహుల్ (పంజాబ్)	- 11.0
క్రిస్ లిన్ (కోల్‌కతా)	- 9.6
మిచెల్ స్టార్క్ (కోల్‌కతా)	- 9.4
గ్లెన్ మాక్స్‌వెల్ (దిల్లీ)	- 9.0
రషీద్ ఖాన్ (హైదరాబాద్)	- 9.0
కృనాల్ పాండ్య (ముంబయి)	- 8.8

321 78 మంది ఆటగాళ్లను కొనుగోలు చేసేందుకు తొలిరోజు ఫ్రాంఛైజీలు ఖర్చు చేసిన మొత్తం రూ. 321.1 కోట్లు.

ఏ జట్టులో ఎవరు.. (రూ. కోట్లలో)

చెన్నై: జాదవ్ (7.8), డ్వేన్ బ్రావో (6.4), కర్ణ్ శర్మ (5.0), వాట్సన్ (4.0), రాయుడు (2.2), హర్భజన్ (2.0), డుప్లెసిస్ (1.6), తాహిర్ (1.0)

దిల్లీ: మాక్స్‌వెల్ (9.0), రబాడ (4.2), అమిత్ మిశ్రా (4.0), విజయ్ శంకర్ (3.2), రాహుల్ తెవాటియా (3.0), షమి (3.0), గంభీర్ (2.8), కొలిన్ మన్రో (1.9), జేసన్ రాయ్ (1.5), పృథ్వీషా (1.2), ఆవేశ్ ఖాన్ (0.7), హర్షల్ పటేల్ (0.20)

పంజాబ్: కేఎల్ రాహుల్ (11.0), అశ్విన్ (7.6), ఫించ్ (6.2), మార్కస్ స్టాయినిస్ (6.2), కరుణ్ నాయర్ (5.6), అంకిత్ సింగ్ (3.0), మిల్లర్ (3.0), యువరాజ్ (2.0), మయాంక్ అగర్వాల్ (1.0)

కోల్‌కతా: క్రిస్ లిన్ (9.6), స్టార్క్ (9.4), దినేశ్ కార్తీక్ (7.4), ఉతప్ప (6.4), కుల్దీప్ (5.8), చావ్లా (4.2), నితీశ్ (3.4), కమ్లేశ్ నాగర్ కోటి (3.2), శుభ్‌మన్ గిల్ (1.8), ఇషాంక్ జగ్గి (0.20)

ముంబయి: కృనాల్ పాండ్య (8.8), ఇషాన్ కిషన్ (6.2), పొలార్డ్ (5.4), ప్యాట్ కమిన్స్ (5.4), సూర్యకుమార్ యాదవ్ (3.2), ముస్తాఫిజుర్ రెహ్మాన్ (2.2)

రాజస్థాన్: బెన్ స్టోక్స్ (12.5), సంజు శాంసన్ (8.0), జోఫ్రా ఆర్చర్ (7.2), జోస్ బట్లర్ (4.4), రహానె (4.0), డార్సి షార్ట్ (4.0), రాహుల్ త్రిపాఠి (3.4), స్టువార్ట్ బిన్నీ (0.50)

బెంగళూరు: క్రిస్ వోక్స్ (7.4), చాహల్ (6.0), ఉమేశ్ యాదవ్ (4.2), బ్రెండన్ మెక్‌కలమ్ (3.6), నవదీప్ సైని (3.0), క్వింటన్ డికాక్ (2.8), కొలిన్ డి గ్రాండ్‌హోమ్ (2.2), మొయీన్ అలీ (1.7), మనన్ వోహ్రా (1.1), కుల్వంత్ కేజ్రోలియా (0.85), అనికేత్ చౌదరి (0.30)

హైదరాబాద్: మనీష్ పాండే (11.0), రషీద్ ఖాన్ (9.0), ధావన్ (5.2), వృద్ధిమాన్ సాహా (5.0), సిద్ధార్థ్ కౌల్ (3.8), దీపక్ హుడా (3.6), సయ్యద్ ఖలీల్ అహ్మద్ (3.0), కేన్ విలియమ్సన్ (3.0), కార్లోస్ బ్రాత్‌వైట్ (2.0), షకిబ్ అల్ హసన్ (2.0), యూసుఫ్ పఠాన్ (1.9), బాసిల్ థంపి (0.95), నటరాజన్ (0.40), రికీ భుయి (0.20)


16 రైట్ టు మ్యాచ్ కార్డును ప్రయోగించి ఫ్రాంఛైజీలు తిరిగి దక్కించుకున్న క్రికెటర్ల సంఖ్య.

రూ. 8.8 కోట్లు కృనాల్ పాండ్య కోసం ముంబయి ఇండియన్స్ వెచ్చించిన డబ్బు. దేశవాళీ ఆటగాళ్లలో కృనాల్‌దే అత్యధిక ధర.


గంభీరే వద్దన్నాడు!



బెంగళూరు: వేలంలో రూ. 2.8 కోట్లే పలికినా.. కోల్‌కతా నైట్ రైడర్స్ రైట్ టు మ్యాచ్ కార్డును ప్రయోగించి అతడిని తిరిగి తీసుకునేందుకు ఆసక్తి ప్రదర్శించలేదు. ఐతే ఆ జట్టు అలా చేయడానికి కారణం గంభీరేనట. తనను వేలంలో కొనుక్కోవద్దని గంభీర్ తమని కోరాడని కోల్‌కతా ఫ్రాంఛైజీ స్పష్టం చేసింది. దిల్లీ డేర్‌డెవిల్స్‌కు గంభీరే కెప్టెన్‌గా ఉంటాడని ఆ జట్టు కోచ్ రికీ పాంటింగ్ చెప్పాడు.



పురుషుల ఫైనల్ నేడు
ఫెదరర్ × సిలిచ్
మధ్యాహ్నం 2 నుంచి సోనీ సిక్స్‌లో..



నేటి నుంచి వసతిగృహాల్లో నిద్ర

దివ్యాంగుల కార్పొరేషన్ ఛైర్మన్ వాసుదేవరెడ్డి వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని దివ్యాంగుల సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు వీలుగా ఆదివారం నుంచి వసతి గృహాల్లో నిద్ర కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలంగాణ దివ్యాంగుల కార్పొరేషన్ ఛైర్మన్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి తెలిపారు. ఆదివారం చంపాపేట, 29న సాగర్ రింగురోడ్డు, 30న కొత్తపేట, 31న వనస్థలిపురం, ఫిబ్రవరి 1 నుంచి 5 వరకు హైదరాబాద్ జిల్లాలోని వసతిగృహాలు, 5 నుంచి 15 వరకు మిగిలిన జిల్లాల్లో పర్యటిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా తమ దృష్టికి వచ్చిన అంశాలతో నివేదిక రూపొందించి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అందజేస్తామని చెప్పారు. శనివారం విలేకరులతో మాట్లాడారు. దివ్యాంగుల సంక్షేమానికి దేశంలో ఎక్కడాలేని విధంగా సీఎం కేసీఆర్ చర్యలు తీసుకున్నారన్నారు.

టీజీవో జిల్లాల సమన్వయకర్తల నియామకం

అధికారుల సమస్యల పరిష్కారానికి పది ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికగా తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం సమన్వయకర్తలను నియమించింది. శనివారం టీజీవో భవన్‌లో సమన్వయకర్తలను సంఘం ఛైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, అధ్యక్షురాలు మమత, కార్యదర్శి సత్యనారాయణలు నియామక పత్రాలను అందజేశారు. వరంగల్ గ్రామీణ, నగర, జనగాం, భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాలకు ఎ.జగన్మోహన్‌రావు, ఆదిలాబాద్, నిర్మల్, అసిఫాబాద్, మంచిర్యాలలకు ఎ.శ్యాంనాయక్, కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్లలకు పి.పద్మయ్య, ఖమ్మం, కొత్తగూడెంలకు ఖాజామియా, మహబూబ్‌నగర్, గద్వాల, వనపర్తి, నాగర్ కర్నూలులకు కె.శ్రీనివాస్ రెడ్డి, నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాలకు జి.మోహన్‌రావు, నిజామాబాద్, కామారెడ్డిలకు బాబురాం నాయక్, మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాలకు బి.వీర ప్రతాప్‌ను నియమించామని శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు.

కాబూల్‌లో ఉగ్రఘాతుకం

- అంబులెన్స్ బాంబు పేలుడు
- 95 మంది బలి.. 158 మందికి గాయాలు

కాబూల్

అఫ్గానిస్థాన్‌లో ఉగ్రవాదులు మరోసారి పేట్రేగిపోయారు. ప్రాణాలు కాపాడటానికి అత్యవసరంగా ఉపయోగించే అంబులెన్స్‌నే విధ్వంస రచనకు వాడుకున్నారు. పేలుడు పదార్థాలు నిండిన ఒక అంబులెన్స్‌ను రాజధాని కాబూల్‌లో బాగా రద్దీ ఉన్న ప్రాంతంలో పేల్చి, 95 మందిని బలిగొన్నారు. ఈ ఘాతుకంలో మరో 158 మంది గాయపడ్డారు. గత కొన్నేళ్లలో ఈ నగరంలో జరిగిన అతిపెద్ద బాంబు దాడుల్లో ఇదొకటి. వారం వ్యవధిలో జరిగిన రెండో ఘాతుకమిది. ఈ దాడికి తామే పాల్పడ్డామని తాలిబన్ ముష్కర ముఠా ప్రకటించింది. అంబులెన్స్‌లో భారీగా పేలుడు పదార్థాలను నింపుకొన్న ఆత్మాహుతి బాంబర్.. మార్గమధ్యంలో ఒక చెక్‌పోస్ట్‌ను ఏమార్చగలిగాడు. రోగిని జమురియాత్ ఆసుపత్రికి తీసుకెళుతున్నానని నమ్మించాడు. రెండో చెక్‌పోస్ట్ వద్ద ఉన్న సిబ్బంది నిజస్వరూపాన్ని పసిగట్టేశారు. దీంతో అతడు అప్పటికప్పుడు వాహనాన్ని పేల్చేశాడు.

మరుభూమి..: ఈ భారీ పేలుడు తీవ్రతకు సమీపంలోని వారంతా ఎగిరిపడ్డారు. రక్తపు మడుగులో పడి ఉన్న క్షతగాత్రులు, తెగిపడ్డ అవయవాలు, ఇతర శకలాలతో ఆ ప్రాంతమంతా మరుభూమిని తలపించింది. క్షతగాత్రులను కొందరు మానవతావాదులు తమ వీపులపై మోసుకుంటూ ఆసుపత్రికి తరలించారు. భారీగా ఉన్న క్షతగాత్రులకు చికిత్స చేయడానికి ఆసుపత్రి సిబ్బంది ఇబ్బంది పడ్డారు. నెత్తురోడుతూ మహిళలు, చిన్నారులు ఆసుపత్రి వరండాల్లో చికిత్స కోసం ఎదురు చూస్తున్నారు. మృతులంతా సాధారణ పౌరులే.



శనివారం కాబూల్‌లో ఆత్మాహుతి కారు బాంబు దాడిలో తన వాళ్లు మృతి చెందడంతో రోదిస్తున్న ఓ వ్యక్తి ★ బాంబు దాడిలో గాయపడిన చిన్నారి

కూలిన భవనాలు..: పేలుడు తీవ్రతకు దగ్గర్లోని నిర్మాణాలు కుప్పకూలాయి. రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న భవనాలూ కంపించిపోయాయి.

బాంబుదాడి కోసం అంబులెన్స్‌లను ఉపయోగించడాన్ని అఫ్గానిస్థాన్‌లోని అంతర్జాతీయ రెడ్‌క్రాస్ కమిటీ ఖండించింది. ఇది మానవత్వానికి వ్యతిరేకంగా జరిగిన నేరమని అఫ్గాన్ అధ్యక్ష భవనం వ్యాఖ్యానించింది.

వారంలో రెండోసారి..: ఇటీవల వేర్పాటువాదులు, ఐసిస్ ఉగ్రవాదులు కాబూల్‌లో దాడులను పెంచారు. గత ఏడాది మే 31న దౌత్య ప్రాంతంలో ట్రక్కు బాంబు ఘటన తర్వాత కాబూల్‌లో చోటుచేసుకున్న అతిపెద్ద విస్ఫోట ఘటన ఇదే. వారం కిందట కాబూల్‌లో ఒక హోటల్‌పై జరిగిన దాడిలో పలువురు విదేశీయులు సహా 22 మంది మరణించారు.

మృతులకు నివాళిగా చీకట్లో ఈఫిల్ టవర్: పారిస్: అఫ్గాన్ మారణహోమ మృతులకు నివాళిగా ప్రపంచ ప్రఖ్యాత ఈఫిల్ టవర్‌ను శనివారం చీకట్లో ఉంచారు.

ఉగ్రదాడి ఆటవికం.. భారత్ : ఉగ్రదాడిని భారత్ తీవ్రంగా ఖండించింది. ఇది ఆటవిక చర్యని పేర్కొంది. 'ఇలాంటి దారుణ చర్యలు ఏ విధంగానూ సమర్థనీయం కాదు. ఈ ఘాతుకం వెనుక సూత్రధారులను, వారికి తోడ్పడిన వారిని న్యాయస్థానం ముందు నిలబెట్టాలి' అని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. సంక్లిష్ట సమయంలో అఫ్గాన్ ప్రజలకు, ప్రభుత్వానికి భారత్ బాసటగా నిలుస్తుందని పేర్కొంది. ఘటనను ఐరాస, అమెరికా ఖండించాయి.



మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో నదిలో పడిన మినీ బస్సు

నదిలో పడిన మినీబస్సు

మహారాష్ట్రలో 13 మంది మృతి

ముంబయి, పుణె: పశ్చిమ మహారాష్ట్రలోని కొల్హాపూర్ నగర శివార్లలో ఓ మినీబస్సు అదుపుతప్పి పంచ్‌గంగా నదిలో పడింది. దీంతో ఏడుగురు చిన్నారులు సహా 13 మంది మరణించారు. శుక్రవారం రాత్రి 11.45కు ఈ ప్రమాదం జరిగింది. ఈ బస్సులో మూడు కుటుంబాలకు చెందిన 16 మంది కొంకణ్ తీరానికి విహారయాత్ర కోసం వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. వీరు తిరిగి వస్తుండగా శివాజీ వంతెనపై ఈ ప్రమాదం జరిగిందని వివరించారు. వేగంగా వస్తుండటంతో డ్రైవర్ బస్సుపై నియంత్రణ కోల్పోయినట్లు తెలిపారు. దీన్ని గమనించిన చుట్టుపక్కలవారు పోలీసులకు సమాచారం అందించారని, గంటలోపే సహాయక బృందాలు గాలింపు చర్యలు మొదలుపెట్టాయని వివరించారు. 16 మంది ఆచూకీని కనిపెట్టగా.. వీరిలో 13 మంది మరణించారని, ముగ్గురు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని వెల్లడించారు. మృతుల్లో డ్రైవర్‌తోపాటు ముగ్గురు పురుషులు, ముగ్గురు మహిళలు, తొమ్మిది నెలల పాపాయి సహా ఏడుగురు చిన్నారులు ఉన్నట్లు తెలిపారు. మృతులు ఒక్కొక్కరికీ రూ.5 లక్షలు చొప్పున వారి కుటుంబాలకు పరిహారం అందిస్తామని రెవెన్యూమంత్రి చంద్రకాంత్ పాటిల్ ప్రకటించారు.

యూపీ కాస్‌గంజ్‌లో ఉద్రిక్తత

కాస్‌గంజ్ (యూపీ): పశ్చిమ ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాస్‌గంజ్‌లో హింస, ఉద్రిక్తతలు కొనసాగాయి. గణతంత్ర ఉత్సవాల ర్యాలీలో వాహనాలపై రాళ్లు రువ్విన తర్వాత చోటు చేసుకున్న ఘర్షణలో శుక్రవారం ఒక యువకుడు ప్రాణాలు కోల్పోవడంతో హింస మొదలయింది. త్రివర్ణ పతాకాలు చేతపట్టి, వందేమాతరం... భారత్ మాతా కీ జై అనే నినాదాలు చేసుకుంటూ వెళ్తున్నవారు మైనారిటీల ఆధిక్యమున్న ప్రాంతానికి చేరుకున్నప్పుడు సంఘ వ్యతిరేక శక్తులు రాళ్లు రువ్వి, కాల్పులకు తెగబడ్డాయని పోలీసులు తెలిపారు. దీనిలో ఒక యువకుడు చనిపోగా, పలువురు గాయపడ్డారని చెప్పారు. చనిపోయిన యువకుని అంత్యక్రియల తర్వాత హింస కొనసాగింది. కర్ఫ్యూ అమల్లో ఉన్నా కాస్‌గంజ్ నగరంలో శనివారం ఒక బస్సును ఆందోళనకారులు దహనం చేశారు. కొన్ని దుకాణాలకు నిప్పుపెట్టారు. 49 మంది ఆందోళనకారుల్ని అరెస్టు చేసి, మిగిలినవారి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాస్‌గంజ్‌ను సందర్శించడానికి ప్రయత్నించిన సాధ్వీ ప్రాచీని పోలీసులు అడ్డుకున్నారు. కాస్‌గంజ్ హింస దురదృష్టకరమనీ, దోషులెవరినీ విడిచిపెట్టేది లేదని ఉప ముఖ్యమంత్రి కేశవ్‌ప్రసాద్ మౌర్య తెలిపారు.

కశ్మీర్‌లో నిరసనకారులపై సైన్యం కాల్పులు

ఇద్దరు పౌరుల మృతి

శ్రీనగర్: జమ్ముకశ్మీర్‌లో హింసాత్మక ఆందోళనలు చేపడుతున్నవారిపై శనివారం సైన్యం కాల్పులు జరిపింది. దీంతో ఇద్దరు పౌరులు మరణించారు. షోపియాన్ జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. దీనిపై ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ విచారణకు ఆదేశించారు. 'గావోంపురా ప్రాంతంలో భద్రతా బలగాల వాహన శ్రేణిపై నిరసనకారులు రాళ్లు రువ్వారు. వారిని చెదరగొట్టేందుకు బలగాలు కాల్పులు జరిపాయి. వీటిలో పలువురికి గాయాలయ్యాయి'అని ఉన్నత పోలీసు అధికారి తెలిపారు. అయితే ఓ అధికారి ఆయుధాన్ని నిరసనకారులు తస్కరించి, ఆయనపై గుంపులుగా దాడిచేసేందుకు ప్రయత్నించడంతోనే కాల్పులు జరిపామని రక్షణ శాఖ అధికార ప్రతినిధి వివరించారు. మరణించిన వారిని జావెద్ అహ్మద్ భట్, సుహైల్ జావెద్‌గా గుర్తించారు. మరో యువకుడు కాల్పుల్లో గాయపడ్డాడనీ, అతడి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. గావోంపురా పరిసర ప్రాంతాల్లో పరిస్థితులు ఉద్రిక్తంగా మారినట్లు చెప్పారు. ఘటనపై మెహబూబా విచారం వ్యక్తంచేశారు. రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్‌తో ఆమె ఫోన్లో మాట్లాడారు. సవివర నివేదిక సమర్పించాలని సైన్యానికి సూచించినట్లు మెహబూబాకు నిర్మల తెలిపారు.

సరిహద్దుల్లో మళ్లీ చెలరేగిన పాక్ సైన్యం

జమ్ము: నియంత్రణ రేఖ వెంట పాకిస్థాన్ సైన్యం మరోసారి కాల్పుల విరమణ ఒప్పందానికి తూట్లు పొడిచింది. జమ్ముకశ్మీర్‌లోని కృష్ణా ఘటి, మన్‌కోట్ సెక్టార్లలో శనివారం సాయంత్రం ఎలాంటి కవ్వింపు చర్యలు లేకుండానే భారత భూభాగం, సైనికులపైకి విచక్షణా రహితంగా కాల్పులు జరిపిందని పోలీసు అధికారులు తెలిపారు. అయితే, ఈ ఘటనల్లో భారత సైనికులు కానీ, సరిహద్దు గ్రామాల్లోని ప్రజలు కానీ ఎవరూ గాయపడలేదని వెల్లడించారు. ఈనెల 18వ తేదీ నుంచి 22వ తేదీ వరకు పలుమార్లు పాక్ సైనికులు కాల్పులకు తెగించారు.

ఉగ్రవాదానికి సహకరించే వారిని శిక్షించాలి

- భారత్, కాంబోడియా ప్రధానుల పిలుపు

ఈనాడు, దిల్లీ: ఉగ్రవాదంపై పోరాటానికి ప్రపంచ దేశాలన్నీ సహకరించుకోవాలని భారత్, కాంబోడియా దేశాల ప్రధానులు నరేంద్ర మోదీ, హున్ సెన్‌లు పిలుపునిచ్చారు. ఉగ్రవాదానికి మద్దతిచ్చేవారిని శిక్షించాలని కోరారు. శనివారం ఉగ్రవాదం నిర్మూలన, రక్షణ రంగం సహా నాలుగు అంశాలపై ఒప్పందాలు కుదిరిన అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. అంతర్జాతీయ ఉగ్రవాదంపై సమగ్ర ఒప్పందం (కాంప్రహెన్సివ్ కన్వెన్షన్ ఆన్ ఇంటర్నేషనల్ టెర్రరిజం-సీసీఐటీ) వెంటనే అమల్లోకి వచ్చేలా ఐక్యరాజ్య సమితి చర్యలు తీసుకోవాలని కోరారు. భారత్-మయన్మార్-థాయిలాండ్ ప్రాంతీయ రహదారిని కాంబోడియా వరకు పొడిగించడాన్ని పరిశీలించాలని నిర్ణయించారు. నేరాల అదుపు, దర్యాప్తులో సహకరించుకోవడం; నేరాల విచారణలో న్యాయసహాయం పొందడం; కాంబోడియాలోని స్టుంగ్ స్వా హాబ్ జలనవరుల అభివృద్ధి ప్రాజెక్టుకు రూ.247 కోట్లు సహాయం అందించడంపై ఒప్పందాలు కుదిరాయి. రక్షణ రంగంలో ద్వైపాక్షిక సంబంధాలు పెంచుకోవాలని, వాణిజ్యం, పెట్టుబడులు, మత్స్య సంపద, నౌకాయానం, మానవ అక్రమ రవాణా నిరోధం, సాంస్కృతిక, పర్యాటకం, ఇంధన పొదుపు, వ్యవసాయ రంగాల్లో సహకరించుకోవాలని నిర్ణయించారు.



దిల్లీలో కాంబోడియా ప్రధాని హున్‌సెన్‌తో మోదీ

కాంబోడియాకు వ్యవ'సాయం' చేస్తాం: వెంకయ్యనాయుడు: కాంబోడియాలో వ్యవసాయరంగానికి భారతదేశం సంపూర్ణ సహకారం అందిస్తుందని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు తెలిపారు. తన నివాసానికి వచ్చిన హున్‌సెన్‌తో వెంకయ్యనాయుడు చర్చలు జరిపారు. హున్‌సెన్‌కు, భారత ప్రభుత్వం నుంచి పద్మశ్రీ అందుకొన్న ఆయన కుమారుడు హున్‌మనీకి అభినందనలు తెలిపారు.

★ హున్‌సెన్‌తో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ భేటీ అయ్యారు.

భిన్నాభిప్రాయాలు సహజం.. ఐక్యత అవసరం

- ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడి

దిల్లీ: ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలు ఉండడం సహజమేననీ, అయితే ఐక్యతను సాధించే దిశగా ప్రతిఒక్కరూ పాటుపడాల్సిన అవసరం ఉందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో పాటు గణతంత్ర కవాతులో శకటాలపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించినవారితో శనివారం ఆయన భేటీ అయ్యారు. ఆనవాయితీని పక్కనపెట్టి వారితో కాసేపు ముచ్చటించారు. సామాజిక పరివర్తన తీసుకువచ్చే బాధ్యతను చేపట్టి, అంధ విశ్వాసాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. ఇది సొంత ఇంటి నుంచే ప్రారంభం కావాలన్నారు. 'భారతదేశాన్ని బలమైనదిగా తీర్చిదిద్ది, పురోగమన పథాన నడిపించడానికి ప్రతిఒక్కరూ ఐక్యతతో పథం కలపాలి. ఐక్యతే మనకున్న అతిపెద్ద బలం. మనకు వాడుకలో అనేక సామెతలున్నాయి. వాటిలో కొన్ని నిర్దిష్ట కులాలకు ఆపాదించినవై ఉంటాయి. ఈ పోకడని యువత ప్రశ్నించాలి. అలాంటివాటిని పారదోలాలి. ప్రభుత్వమే అన్నీ చేయాలని యువత ఆశించకుండా సామాజిక పరివర్తనను తీసుకువచ్చే బాధ్యత చేపట్టాలి. మహాత్మాగాంధీ 150వ జయంతి జరిగే 2019 నాటికి పరిశుభ్ర దేశాన్ని సాధించడానికి దోహదపడాలి' అని ప్రధాని ఉద్బోధించారు. పౌర, సైనిక పురస్కారాలు సాధించినవారి గురించి ఎక్కువ వివరాలు తెలుసుకునేందుకు యువత ప్రయత్నించాలన్నారు. ముఖ్యంగా దేశం కోసం త్యాగాలు చేసిన అమరుల గురించి తెలుసుకోవాలని చెప్పారు. ప్రజల్ని పరిరక్షించే క్రమంలో స్వాతంత్ర్యానంతరం 33 వేల మంది పోలీసులు ప్రాణత్యాగం చేసిన విషయం కొద్దిమందికే తెలుసునన్నారు. పోలీసు, భద్రత బలగాలను గౌరవించాలని నొక్కిచెప్పారు.



గణతంత్ర దినోత్సవ పెరేడ్‌లో పాల్గొన్న ఎన్‌సీసీ క్యాడెట్లతో శనివారం దిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ముచ్చటిస్తున్న ప్రధాని మోదీ

అప్పట్లో మీరూ వెనుక సీట్లే కేటాయించారు: భాజపా

దిల్లీ: గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాహుల్‌గాంధీకి ఆరో వరుసలో సీటు కేటాయించడంపై కాంగ్రెస్ లేవనెత్తిన అభ్యంతరాలను భాజపా తోసిపుచ్చింది. గతంలో మా నాయకులను కూడా మీరు ఇలాగే చూశారని గుర్తుచేసింది. తనో వీవీఐపీనని, అందరి కంటే ముందర కూర్చోబెట్టాలని రాహుల్‌గాంధీ భావిస్తున్నారని ఎద్దేవా చేసింది. భాజపా జాతీయ అధికార ప్రతినిధి జీవీఎల్ నరసింహారావు మాట్లాడుతూ 133 ఏళ్ల చరిత్ర తమదని చెప్పుకుంటున్న పార్టీ వ్యవహరించే పద్ధతి ఇది కాదన్నారు. ప్రోటోకాల్ ప్రకారమే తాము వ్యవహరించినా కాంగ్రెస్ చవకబారు రాజకీయాలు చేస్తోందన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు భాజపా జాతీయాధ్యక్షులతో ఇలాగే ప్రవర్తించిందని, రాజ్‌నాథ్‌సింగ్‌కు వెనుకసీటు కేటాయించారని ఆయన గుర్తు చేశారు. అప్పట్లో మేం ప్రజాస్వామ్యస్ఫూర్తితో వ్యవహరించామని, రాద్ధాంతం చేయలేదన్నారు.

రాష్ట్రపతిని కలిసి రాహుల్: కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మొదటిసారిగా రాహుల్ గాంధీ శనివారం రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్‌ను కలిశారు.

డాలస్‌లో భారత గణతంత్ర సంబరాలు

డాలస్: భారత గణతంత్ర దినోత్సవ సంబరాలను అమెరికాలోని డాలస్‌లో ఘనంగా జరుపుకొన్నారు. దేశంలోనే అతిపెద్ద గాంధీ స్మారకస్థలంలో శుక్రవారం మహాత్మాగాంధీ మెమోరియల్ ఆఫ్ నార్త్ టెక్సాస్ (ఎమ్‌జీఎమ్ఎన్‌టీ) ఈ వేడుకలను నిర్వహించింది. ఆ సంస్థ ఛైర్మన్ తోటకూర ప్రసాద్ భారత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యదర్శి కాల్వల రావు, డైరెక్టర్లు కమల్ కౌశల్, శబ్నం మోడ్గిల్ తదితరులు పాల్గొన్నారు. ఐరాస ప్రధాన కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుక అట్టహాసంగా జరిగింది. అమెరికా వ్యాప్తంగా వివిధ నగరాల్లో.. దక్షిణాఫ్రికా, ఈజిప్ట్ తదితర దేశాల్లోను గణతంత్ర దినోత్సవ కార్యక్రమాలు జరిగాయి. నెదర్లాండ్స్‌లో ఆమ్‌స్టర్‌డామ్‌లోనిరాయల్ చర్చి.. భారత పతాక రంగుల్లోని విద్యుద్దీప వెలుగులతో మెరిసిపోయింది.

భారత్– జపాన్ సంబంధాల్లో పురోగతి

టోక్యో: భారత్‌తో ఉన్న వ్యూహాత్మక సంబంధాలు గత ఏడాది గణనీయంగా పెరిగాయని జపాన్ విదేశాంగశాఖ మంత్రి టారో కోనో అన్నారు. భారత్-జపాన్‌ల ఉమ్మడి ప్రయాణంలో 2017 'ఘనమైన సంవత్సరమ'ని అభివర్ణించారు. శుక్రవారం జపాన్‌లో భారత రాయబారి సుజన్ ఆర్ చినోయ్ ఆధ్వర్యంలో జరిగిన గణతంత్ర దినోత్సవంలో ఆయన మాట్లాడారు. 'చినోయ్ చక్కని జపాన్ భాష మాట్లాడారు. ఆయన ప్రసంగం విన్న తరువాత నేను కూడా హిందీలో మాట్లాడుంటే బాగుండేదని అనిపించింది. హిందీ రానందుకు క్షమాపణలు చెబుతున్నాన'ని అన్నారు. జపాన్‌కు చెందిన 1400 కంపెనీలు భారత్‌లో 4,800 సంస్థలను ఏర్పాటు చేశాయని, ఇది రెండు దేశాల మధ్య ఉన్న ఆర్థిక సంబంధాలకు నిదర్శనమని చెప్పారు. సాంస్కృతిక మార్పిడి కింద రెండు దేశాల్లో 200 కార్యక్రమాలు జరిగాయని వివరించారు. జపాన్ ప్రధాని షింజో అబే గుజరాత్‌లో పర్యటించిన విషయాన్ని గుర్తుచేశారు.

అవినీతి ఆగాలంటే.. అలవాట్లు మారాలి: రాజ్‌నాథ్

దిల్లీ: అవినీతిని నిర్మూలించాలంటే సంస్కరణలు ఒక్కటే సరిపోవని.. ప్రజలు కూడా తమ అలవాట్లను మార్చుకోవాలని కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ శనివారం పేర్కొన్నారు. 'ఆన్ ది ట్రైల్ ఆఫ్ ది బ్లాక్' పుస్తకావిష్కరణ సందర్భంగా ఆయన శనివారం మాట్లాడారు. దేశంలో అవినీతి నిర్మూలనకు ప్రధాని మోదీ చిత్తశుద్ధితో తీవ్రంగా కృషి చేస్తున్నట్లు వివరించారు. అవినీతి ఉన్నంతవరకూ లక్ష్యాలమేరకు అభివృద్ధిని సాధించడం సాధ్యంకాదని.. ఆదాయల్లో వ్యత్యాసాలు పెరిగితే అది సామాజిక అశాంతికి దారితీస్తుందన్న వాస్తవాన్ని మనం అంగీకరించాలన్నారు. అవినీతి నిర్మూలనకు మోదీ ప్రభుత్వం చేస్తున్న కృషిని ఈ సందర్భంగా మంత్రి వివరించారు. అవినీతిని కనిష్ఠస్థాయికి తగ్గించేందుకు వీలయినన్ని సంస్కరణలు చేపడతామన్నారు. చైతన్యం కల్పించడం ద్వారా ప్రజల ఆలోచన దృక్పథంలో మార్పు తేవచ్చని.. ఈమేరకు ప్రజల అలవాట్లను మార్చేందుకు కృషి చేయాలని ఈ కార్యక్రమానికి హాజరైన నీతి ఆయోగ్ సీఈవో అమితాబ్ కాంత్‌ను కోరారు.

ప్రపంచంలోనే శక్తిమంతమైన రాకెట్ పరీక్ష

- విజయవంతంగా పూర్తిచేసిన స్పేస్‌ఎక్స్
- రోదసి పయనానికి మార్గం సుగమం


వాషింగ్టన్: ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన రాకెట్ 'ఫాల్కన్ హెవీ'కి అమెరికాకు చెందిన స్పేస్ ఎక్స్ సంస్థ.. భూతల పరీక్ష నిర్వహించింది. సుదీర్ఘ జాప్యం తర్వాత జరిగిన ఈ పరీక్షతో.. ఈ రాకెట్‌ను అంతరిక్షంలోకి ప్రయోగించడానికి మార్గం సుగమమైంది. తాజా పరీక్షలో రాకెట్‌కు సంబంధించిన తొలి దశలోని 27 ఇంజిన్లను దాదాపు 10 సెకన్లపాటు మండించారు. అది ప్రయోగానికి సిద్ధంగా ఉందా అన్నది పరిశీలించారు. మరో రెండు వారాల్లో ఫాల్కన్ హెవీని రోదసిలోకి తొలిసారిగా ప్రయోగించే వీలుంది. ఆ సందర్భంగా స్పేస్‌ఎక్స్‌కు చెందిన టెస్లా రోడ్‌స్టర్ కారును కక్ష్యలోకి పంపనున్నట్లు ఆ సంస్థ సీఈవో ఎలాన్ మస్క్ లోగడ చెప్పారు.

ఫాల్కన్ హెవీ అనేది పునర్వినియోగ వాహకనౌక. దీని మొదటి దశలోని 27 ఇంజిన్లు ఏకంగా 23వేల కిలో న్యూటన్ల శక్తిని వెలువరిస్తాయి. ప్రస్తుతమున్న శక్తిమంతమైన డెల్టా-4 హెవీతో పోలిస్తే ఇది రెట్టింపు శక్తి కావడం గమనార్హం. ఇది.. పద్దెనిమిది బోయింగ్-747 విమానాల పూర్తిస్థాయి శక్తితో సమానం. ఈ రాకెట్‌తో చంద్రుడు, అంగారకుడి వద్దకు పర్యాటకులను తీసుకెళ్లాలని స్పేస్‌ఎక్స్ భావిస్తోంది. తద్వారా భవిష్యత్‌లో అంతరిక్ష పర్యాటకాన్ని సాకారం చేయాలనుకుంటోంది.



చిత్రాలు తీసిన ఐఎన్ఎస్-1సి ఉపగ్రహం

శ్రీహరికోట, న్యూస్‌టుడే: భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రమైన శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని సతీశ్ ధవన్ అంతరిక్ష కేంద్రం నుంచి ఈ నెల 12న ప్రయోగించిన ఐఎన్ఎస్-1సి ఉపగ్రహం చిత్రాలు తీసి పంపింది. ఐఎన్ఎస్-1సి ఉపగ్రహాన్ని పీఎస్ఎల్‌వీ-సి40 వాహకనౌక ద్వారా కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. ఇది మనదేశానికి చెందిన నానో శాటిలైట్. ఈ ఉపగ్రహంలో ఉపయోగించిన మైనారిసిస్ మల్టీసెక్ట్రాల్ టెక్నాలజీని అహ్మదాబాద్‌లోని స్పేస్ అప్లికేషన్ సెంటర్ రూపొందించింది. ఈ కెమెరా ద్వారా పంపిన సమాచారం స్థలాకృతి మ్యాపింగ్, వృక్ష సంపద పర్యవేక్షణ, ఏరోసోల్ పరిక్షేప అధ్యయనాలకు ఉపయోగపడుతుందని చెబుతున్నారు.



ఐఎన్ఎస్–1సి తీసిన చిత్రాలు

ప్రజాకాంక్షలు ప్రతిబింబించేలా కర్ణాటక ఎన్నికల ప్రణాళిక

కాంగ్రెస్ నేతలకు రాహుల్ పిలుపు

దిల్లీ: కర్ణాటక శాసనసభ ఎన్నికల కోసం ప్రజాకాంక్షలు ప్రతిబింబించేలా 'జన ప్రణాళిక (పీపుల్స్ మేనిఫెస్టో)'ను సిద్ధం చేయాలని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ తమ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గుజరాత్ ఎన్నికల అనుభవాల నుంచి కొత్త పాఠాలు నేర్చుకొని ప్రజలకు మరింత చేరువయ్యేందుకు భారీ స్థాయిలో కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. ఈ విషయాన్ని కర్ణాటక వ్యవహారాల బాధ్యునిగా ఉన్న ఏఐసీసీ కార్యదర్శి మధుయాస్కీ గౌడ్ శనివారం ఒక వార్తాసంస్థకు తెలిపారు. 'కర్ణాటక ఎన్నికల కోసం పార్టీ సీనియర్ నేత వీరప్ప మొయిలీ నేతృత్వంలో బృందం ఇప్పటికే కసరత్తు మొదలుపెట్టింది. వీరు అన్ని వర్గాలనూ సంప్రదించి త్వరలో సమగ్ర జన ప్రణాళికను సిద్ధం చేస్తారు. ముఖ్యంగా విద్య, ఆరోగ్యం, చిన్న-మధ్యతరహా పరిశ్రమలు, ఉద్యోగ కల్పన, పర్యావరణ పరిరక్షణ లాంటి అంశాలపై దృష్టి కేంద్రీకరిస్తారు'అని తెలిపారు.

కర్ణాటక ఎన్నికల ప్రచారం కోసం 70 మంది నేతలతో కమిటీని ఏర్పాటు చేయడానికి రాహుల్‌గాంధీ ఆమోదం తెలిపారు. కర్ణాటక రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి డి.కె.శివకుమార్ దీనికి నేతృత్వం వహిస్తారు. సీఎం సిద్ధరామయ్య, లోక్‌సభలో కాంగ్రెస్ పక్షనేత మల్లికార్జున్ ఖర్గేలతో పాటు రాష్ట్ర పార్టీ అగ్రనేతలంతా దీనిలో సభ్యులు.

రైస్‌బీర్ తాగి ముగ్గురు గిరిజనులు మృతి

రాయ్‌పుర్: స్థానికంగా తయారు చేసిన హదియా (రైస్ బీర్-పులియబెట్టిన అన్నంతో చేసిన మద్యం) తాగిన ముగ్గురు మృత్యువాత పడగా మరో 12 మంది అనారోగ్యానికి గురయ్యారు. అస్వస్థతకు గురైన వారిలో ఆరుగురు మహిళలు ఉన్నారు. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్‌లోని జోస్‌పుర్ జిల్లా గిరిజన గ్రామమైన సాహిదాద్‌లో శుక్రవారం జరిగింది. ఈ ఘటనపై ఆ రాష్ట్ర ప్రభుత్వం దర్యాప్తునకు ఆదేశించింది.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications. a division of Ushodaya Enterprises Private Limited and Printed at Eenadu Press, Plot No. 95 & 96. Phase-II, CIE, Gandhinagar, Quthubullapur Village & Mandal, Medchal District- 500 037, Telangana. Published at Eenadu Corporate Office, Ramoji filmcity, Anajpur Village, Abdullapurmet Mandal, Ranga Reddy Dist. 501512, Telangana State, Phone : 040 - 22232223, RNI No. 27656/75. Regd No. HSE/1009/2018-20, Eenadu, Hyderabad. Licensed to Post without Pre-payment. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00.